

Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com
Journalism first!



సంపుటి: 60 • సంచిక: 232 • ఆదివారం 27 ఆగస్టు 2017 • విజయవాడ * పేజీలు: 14 • వెల: 6.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, తిథి: శుద్ధ షష్ఠి రా. 11.07 వరకు, అనంతరం సప్తమి; నక్షత్రం: స్వాతి రా. 7.21 వరకు, అనంతరం విశాఖ; అమృతకాలం: ఉ. 10.00 నుండి 11.40 వరకు; వర్జ్యం: రా. 1.25 నుండి 3.09 వరకు; దుర్ముహూర్తం: సా. 4.47 నుండి 5.38 వరకు; రాహుకాలం: సా. 4.30 నుండి 6.00 వరకు; యమగండం: మ. 12.00 నుండి 1.30 వరకు



చర్చలతోనే ప్రగతి



• కొట్లాడుకోవద్దు... మాట్లాడుకోండి • తెలుగు రాష్ట్రాల సీఎంలకు వెంకయ్య హితవు • నేనెక్కడున్నా అభివృద్ధికి సహకరిస్తా • అమ్మ భాషను బతికించుకుందాం • పాలనలో తెలుగుకు తొలి స్థానం ఇవ్వండి • అవినీతి, అశాంతి, అరాచకాలు పెరగడం దురదృష్టకరం • పౌర సన్మాన కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు 8

వెంకయ్య సేవలు మరువలేం : సీఎం చంద్రబాబు - 2లో

రేప్ కేసులో డేరా గురువు దోషే

పేట్రేగిన హింస



అత్యాచారం కేసులో డేరా సచ్చా సౌధా గురువు గుర్మీందర్ సింగ్ దోషేనని పంజాబ్-హర్యానా హైకోర్టు ప్రకటించిన అనంతరం జరిగిన హింసాకాండ, గుర్మీందర్ సింగ్‌ను హెలికాప్టర్‌లో రోహ్‌తక్ జైలుకు తరలిస్తున్న దృశ్యం

• 37 మంది మృతి • యథేచ్ఛగా విధ్వంసం • చేతులెత్తేసిన హర్యానా ప్రభుత్వం • రోహ్‌తక్ జైలుకు డేరా గురువు గుర్మీందర్ రామ్ రహీమ్ సింగ్ • 28న శిక్ష ప్రకటన • జైలు వద్దకే జడ్జి • కనీసం ఏడేళ్లు శిక్ష పడే అవకాశం 9

డేరా సచ్చా సౌధాపై కథనాలు - 9లో

దేశానికే ప్రధాని.. బీజేపీకి కాదు!

డేరా సచ్చాకు లొంగిన ఖట్టర్

ప్రధాని మోడీ, సీఎం ఖట్టర్‌లపై హైకోర్టు వ్యాఖ్యలు 8



జమ్ము కాశ్మీర్‌లో ఉగ్ర దాడి

• 8 మంది జవాన్ల మృతి • ఎదురు కాల్పుల్లో ముగ్గురు మిలిటెంట్లు, సరిహద్దుల్లో ముగ్గురు పాక్ రేంజర్ల హతం

జమ్ము కశ్మీర్ : జమ్ముకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. శనివారం తెల్లవారుజామున4 గంటలకు పోలీస్ కాంప్లెక్స్‌లో కాపాలాగా ఉన్న భద్రతా సిబ్బందిపై ఉగ్రవాదులు మెరుపుదాడి చేశారు. ఈ ఘటనలో 8మంది జవాన్ల ప్రాణాలు కోల్పోగా. మరికొంత మంది గాయపడ్డారు. వెంటనే తేరు కున్న భద్రతా బలగాలు మిలిటెంట్లపై కాల్పుల మోత మోగించాయి. భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతి చెందిన ఉగ్రవాదుల్లో ఒకడైన ఫిదాయిన్ పుల్వామా జిల్లా పోలీస్ కాంప్లెక్స్‌పై దాడి చేసినట్లు తెలుస్తోంది. పుల్వామా ప్రభుత్వ క్వార్టర్స్‌లో ముందుగానే చొరబడిన ఉగ్రవాదులు.. భద్రతా 8వ పేజీలో...

కొత్త పొత్తుల్లేవ్

• టీడీపీతో బంధం బాగానే ఉంది • తెలంగాణలో ఒంటరి పోరాటమే • ఇష్టాగోష్టిలో బీజేపీ అధినేత అమిత్ షా



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్త భాగస్వామ్యాలు ఉండబోవని భారతీయ జనతా పార్టీ అధినేత అమిత్ షా స్పష్టం చేశారు. ఈ మేరకు ఢిల్లీలో విలేకరులతో జరిగిన ఇష్టాగోష్టిలో వెల్లడించారు. ప్రస్తుత భాగస్వామ్య పార్టీ తెలుగుదేశంతో సంబంధాలు బాగానే ఉన్నాయని అన్నారు. అమిత్ షా వ్యాఖ్యలతో ఇంతకాలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో కొత్త కూటములు, కొత్త పొత్తులపై జరుగుతున్న చర్చకు ఫుల్‌స్టాప్ పడినట్టయింది. బీజేపీ తన మిత్రపక్షం తెలుగుదేశం పార్టీని దూరం చేస్తుందని, అదే సమయంలో వైకాపాతో దగ్గరవుతుందని ఏపీలో విస్తృతంగా చర్చ జరిగింది. ప్రస్తుతానికి రెండు పార్టీలతోనూ సమానదూరం పాటిస్తూ, 2019 ఎన్నికల నాటికి ఏ పార్టీకి ఎక్కువ బలం ఉంటే ఆ పార్టీతో జట్టు కడుతుందనే ప్రచారం కూడా జరిగింది. అయితే అమిత్ షా తాజా వ్యాఖ్యలు ఇందుకు పూర్తి భిన్నంగా ఉండడంతో ఇప్పటి వరకు జరిగిన చర్చంతా కేవలం ఊహాజనితమేనని స్పష్టమవుతోంది. అయితే కొత్తగా తమతో పొత్తు కోసం దేశవ్యాప్తంగా అనేక ప్రాంతీయ పార్టీలు తహతహలాడుతున్నాయని షా అన్నారు.

ఇక తెలంగాణ గురించి ప్రస్తావిస్తూ.. సొంత బలంతోనే ఎన్నికల్లో పోటీ చేస్తామని అమిత్ షా స్పష్టం చేశారు. రాష్ట్రంలో తమ బలాన్ని ఇంకా పెంచుకుంటామని, అంతే తప్ప తాము ఏ ఇతర పార్టీ నేతలతోనూ సంప్రదింపులు జరపడం లేదని తేల్చి చెప్పారు. తెలంగాణాతో పాటు ఒడిషా, బెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో ఎవరితోనూ పొత్తులు లేకుండా సొంత బలాన్ని పెంచుకునే ప్రయత్నాల్లో ఉన్నామని ఆయనన్నారు. ఈ రాష్ట్రాల్లో అధికారమే లక్ష్యంగా ఇప్పటికే పావులు కదుపుతున్న బీజేపీ, పొత్తులతో సొంత బలం పెరగదన్న అభిప్రాయంలో ఉంది. అందుకే ఆయా రాష్ట్రాల్లోని అధికార పార్టీలతో నువ్వా నేనా అన్న రీతిలో ఢీ అంటే ఢీ అంటూ ముందుకెళ్తోంది.

కేబినెట్ కసరత్తు వల్లనే ఏపీ టూర్ రద్దు

పార్టీని బలోపేతం చేసే క్రమంలో బలహీనంగా ఉన్న రాష్ట్రాల్లో పర్యటిస్తున్న అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ పర్యటనను రద్దు చేసుకున్నారు. నిజానికి ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యటించాలని నిర్ణయించుకున్నారు. అయితే కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ కోసం చేపట్టిన కసరత్తులో భాగంగా ఆయన ఢిల్లీలోనే ఉండాల్సి వస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీతో తరచుగా భేటీలు జరపడంతో పాటు, పార్టీ నేతలు, ప్రభుత్వంలోని మంత్రులతోనూ ఆయన మంతనాలు సాగిస్తున్నారు. అందుకే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యటనను రద్దు చేసుకున్నట్టు తెలుస్తోంది. అయితే కేబినెట్ కసరత్తు పూర్తయిన తర్వాత ఆయన ఆంధ్రప్రదేశ్‌తో పాటు దక్షిణాదిన తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో పర్యటించే అవకాశాలున్నాయి.

బెట్టింగ్ ముఠాలను

నిర్మూలిస్తాం

• కాకినాడ కేంద్రంగా పనిచేస్తున్న నకిలీ నోట్ల ముఠాలను కూడా... • వీరందర్నీ ఆదరిస్తోంది ఒకే రాజకీయ పార్టీ • ఎన్నికల్లో వీరి మద్దతుదార్లను ఓడించాలి • విశాఖ, తిరుపతిని మించి అభివృద్ధి చేస్తా : కాకినాడలో సీఎం చంద్రబాబు రోడ్ షో



కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి: రాష్ట్రంలో క్రికెట్ బెట్టింగ్ ముఠాల్ని కఠినంగా అణిచేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. వారే పార్టీకి చెందిన వారైనా వారి పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తామన్నారు. క్రికెట్ బెట్టింగ్ ముఠాలు, ఏటీఎమ్‌లో నకిలీ నోట్ల చలామణి బృందాలన్నీ కాకినాడ కేంద్రంగానే పని చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పైగా వీరందర్నీ ఒకే రాజకీయ పార్టీ ఆదరిస్తోందన్నారు. ఇలాంటి వారికి సభ్య రాజకీయాల్లో అవకాశం కల్పిస్తే వ్యవస్థనే బెట్టింగ్‌ల మయంగా మార్చేస్తారన్నారు. కాకినాడ మున్సిపల్ ఎన్నికల్లో వీరి మద్దతుదార్లందర్నీ ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం కాకినాడలో చంద్ర బాబు రోడ్‌షో 8వ పేజీలో...

జ్వరంతో జగన్.. కాకినాడ పర్యటన వాయిదా - 2లో



సీఐఏ చేతిలో ఆధార్ డేటా!

• వికీలీక్స్ ఆరోపణలు • కాదంటున్న భారత్ • ప్రైవేటు కంపెనీలకు ఆధార్ చేరిన నేపథ్యంలో అనుమానాలు

చెన్నై: మన వ్యక్తిగత గోప్యత గురించి ఎంతగా మొత్తుకున్నా ప్రయోజనం లేదా? సుప్రీం కోర్టు తీర్పు వచ్చేటప్పటికే ఆలస్యమైపోయిందా? ఆధార్ కార్డు తీసుకునేందుకు మనమిచ్చిన డేటా పరుల చేతుల్లో పడిపోయిందా? ఇప్పటికే టెలికాం కంపెనీలకు ఉపయోగపడుతున్న ఆ సమాచారం ఇక విదేశీయులకూ పనికొస్తుందా? అంటే అవుననే అంటోంది వికీలీక్స్. ప్రపంచంలో చాలా దేశాల రాజకీయ నాయకులు, పారిశ్రామిక వేత్తల ఆస్తుల వివరాలను బయటపెట్టిన ఈ సంస్థ ఇప్పుడు తాజాగా భారత్ దేశంలోని ఆధార్ డేటా అంతా అమెరికా గూఢచారి సంస్థ సీఐఏ చేతుల్లో పడిందని చెబుతోంది. క్రాస్ మ్యాచ్ టెక్నాలజీస్ అనే సంస్థ సహకారంతో ఆధార్ డేటాను సీఐఏ పొందిందని, వారికి సాయం చేసిన వారి పేర్లు కూడా చెబుతోంది. వికీలీక్స్ చేసిన ఈ ఆరోపణను భారత్ తోసిపుచ్చినా, దేశంలో ఆధార్ సంస్థ అయిన యూనిక్ ఐడెంటిఫికేసన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ)కి క్రాస్ మ్యాచ్ టెక్నాలజీస్ బయోమెట్రిక్ సాంకేతికతను సరఫరా చేయడం వల్ల అనుమానాలు తలెత్తుతున్నాయి. క్రాస్ మ్యాచ్ టెక్నాలజీస్‌కు భారత్‌లో స్మార్ట్ ఐడెంటిటీ డివైసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ భాగస్వామిగా ఉంది. ఈ సంస్థ ద్వారా 12 లక్షల మంది భారతీయులు ఆధార్ డేటాబేస్‌లో తమ వివరాలు నమోదు చేయించుకున్నారు. దీంతో భారత అధికారులను సంప్రదించగా, క్రాస్ మ్యాచ్ అనేది అంతర్జాతీయంగా బయో మెట్రిక్ పరికరాలను సరఫరా చేసే సంస్థ అని, అయితే వాటి ద్వారా సేకరించిన సమాచారాన్ని ఆ 8వ పేజీలో...

మరో రెండు రోజులు

కుండపోతే!

• కోస్తా జిల్లాలపై తీవ్ర ప్రభావం • అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



అమరావతి, ఆంధ్రప్రభ: రానున్న రెండురోజులు భారీ వర్షాలు పడే ప్రమాదం ఉందని వాతావరణశాఖ వెల్లడించింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలపై ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించింది. భారీ నుంచి అతి భారీ వర్షాలు పలు చోట్ల కురిసే ప్రమాదం ఉందని ప్రజలు అప్రమత్తంగా 8వ పేజీలో...

ప్రజా ప్రతినిధులకు మానవతా దృక్పథం ఉండాలి



అమరావతి, ఆంధ్రప్రభ: గన్నవరం విమానాశ్రయం నుండి ప్రకాశం బ్యారేజ్ వరకూ సాగిన మానవహారంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలు 'మా వెంకయ్యనాయుడు'గా పిలవడాన్ని గమనించానని రాష్ట్రగవర్నర్ నర్సింహన్ అన్నారు. ఉపరాష్ట్రపతి హోదాలో తొలిసారి రాష్ట్రానికి వచ్చిన వెంకయ్య నాయుడుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పౌర సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ క్లుప్తంగా తెలుగులో ప్రసంగించిన అందిరినీ ఆశ్చర్య పరిచారు. ఇదే విజయవాడ వీధిల్లో మీరు 'జై ఆంధ్రా అంటూ ఆనాడు చేసిన సింహగర్జన.. ఇప్పుడు మీరు అదే వీధుల్లో ఉపరాష్ట్రపతిగా అత్యున్నత హోదాలో రావడం ఇక్కడి ప్రజలు చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థి నాయకుడిగా మీరు వేసిన విత్తనాలు మహావృక్షాలై ఇప్పుడు మీకు సంతోషంతో స్వాగతం పలుకుతున్నాయన్నారు. మీ సుదీర్ఘ రాజకీయ యాత్రలో 1972 ఇప్పటి వరకూ మీరు పడ్డ శ్రమకు తగిన ఫలితమే ఉపరాష్ట్రపతి పదవి అన్నారు. నూతన పదవిని చేపట్టిన వెంకయ్య నాయుడుగారికి అభినందనలను తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో ఆయన ఢిల్లీలో పడ్డ శ్రమంతా నాకు తెలుసు. రాజకీయాల్లో ఉన్నవారికి మానవతావాదం కూడా ఎంతో అవసరమని గవర్నర్ నర్సింహన్ అన్నారు. ప్రజాప్రతినిధులకు అటువంటి లక్షణాలు ఉండాలన్నారు. ఉపరాష్ట్రపతిని దేవుడు చల్లగాచడాలని ఇటువంటి వారికి మంచి ఆరోగ్యం భగవంతుడు ప్రసాదించా లంటూ.. నేను వయస్సులో పెద్దవాడిని కనుకు.. దీవిస్తున్నానంటూ.. 'శతమానం.. భవతి..' అంటూ ఉపరాష్ట్రపతిని ఆశీర్వదించారు.

తెలుగులో ప్రసంగించిన గవర్నర్: సీఎస్ దినేష్ కుమార్

వెలగపూడి సచివాలయం వద్ద ఏర్పాటైన పౌర సన్మాన కార్యక్రమంలో ముఖ్యంగా అత్యున్నత పదవుల్లో ఉన్న వ్యక్తులు ఆంగ్లంలోనే ఉన్నతాధికారుల ప్రసంగించడం జరుగుతూ వచ్చింది. అయితే శనివారం ఉపరాష్ట్రపతి సన్మాన కార్యక్రమంలో ప్రసంగించిన గవర్నర్ నరసింహన్ అచ్చ తెలుగులో సామెతలు చెబుతూ.. ఆశీస్సులతో ముగించారు. అలాగే ప్రధానకార్యదర్శి దినేష్‌కుమార్ కూడా తెలుగులోనే ప్రసంగించి సభికులను ఆశ్చర్యపరిచారు.

వెంకయ్య సేవలు మరువలేం

• భావి తరాలకు ముప్పవరపు జీవితం ఆదర్శం • పౌర సన్మాన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌పై ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడికి ఎనలేని ప్రేమాభిమానాలున్నాయని, ఆయన ఏ రాష్ట్రం నుంచి రాజ్యసభ్యుడిగా ఎన్నికైనా, తెలుగు రాష్ట్రంపై ఆయనకు ఏమాత్రం మక్కువ తగ్గలేదని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు అన్నారు. శనివారం వెలగపూడిలోని సచివాలయ ప్రాంగణంలో ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు పౌరసన్మానసభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. తెలుగుజాతి గర్వించతగ్గ, అభినందనలు అందుకోవలసిన వ్యక్తి వెంకయ్యనాయుడేనని అన్నారు. ఆయన ఏ పదవిని చేపట్టినా ఆ పదవికే వన్నె వస్తుందని అన్నారు. పుట్టింది సింహపురిలో అయినా ఉత్తర భారతదేశ భాషల్లో ప్రావీణ్యం సంపాదించి, తన మాటల వాగ్ధాటితో అందరినీ ఆకట్టుకుంటున్నారని సీఎం ప్రశంసించారు. దక్షిణ భారత్‌లో పుట్టినవారు హిందీ భాష మాట్లాడలేరు, అయినా వెంకయ్యనాయుడు ఇతర భాషలపై శ్రద్ధ కనబరచి, సాధన చేసి భాషపై పట్టును సాధించారన్నారు. రాష్ట్ర విభజన బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందిన తరువాత రాజ్యసభ ఆమోదానికి వెళ్లిన సమయంలో వెంకయ్యనాయుడు బిల్లు పాస్ కావడానికి ముందు సభలో ఏపీకి పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేసిన వారిలో ఏకైక వ్యక్తి అని కొనియాడారు. రాష్ట్ర సమస్యలు అన్నీ తెలిసిన వ్యక్తి అని, వాటి పరిష్కారానికి ఉప రాష్ట్రపతి సహకరిస్తారన్న నమ్మకం తనకు ఉందన్నారు. రాష్ట్రంలో మూడు నగరాలను, తిరుపతి, కాకినాడ, విశాఖపట్నంను స్మార్ట్ సిటీలుగా ప్రకటించారని, అలాగే ఇటీవల అమరావతిని కూడా స్మార్ట్ సిటీల జాబితాలో చేర్చినందుకు ఆయనకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రగృహ నిర్మాణశాఖ మంత్రిగా పనిచేసిన ఆయన, రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మొత్తం 5,29,286 ఇళ్లు కేటాయించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. దేశవ్యాప్తంగా మొత్తం 26 లక్షల ఇళ్లు కేటాయిస్తే, వాటిలో మన రాష్ట్రానికి 5.29 లక్షల మంజూరు చేశారన్నారు. వెంకయ్య నాయుడు చేసిన కృషిని తాను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు చెప్పారు. ''మీరు చూపించిన చొరవతో రాష్ట్రంలోని పేదలకు ఎనలేని లబ్ధి చేకూరిందని, పట్టణ ప్రాంతాల్లో ఉచితంగా భూములిచ్చిన వారికి ఇళ్లు నిర్మించి ఇస్తున్నామన్నారు. గృహ నిర్మాణాల కోసం రాష్ట్రంలోని 100 మున్సిపాల్టీల్లో 33 వేల కోట్లతో ఈ పథకాన్ని చేపట్టామని తెలిపారు. ఇందుకోసం మొత్తం రూ. 8,089 కోట్లు కేంద్ర ప్రభుత్వం, రూ.15,000 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోందని, దీనిలో రూ.7200 సబ్సిడీ కాగా, రూ. 15వేల కోట్లు ఏపీ ఖర్చుచేస్తుండగా, లబ్ధిదారుల నుండి వసూళ్లు చేసినవి మరో రూ.10 వేల కోట్లు ఉన్నాయన్నారు. కేంద్ర మంత్రిగా రాష్ట్రానికి 2.15 లక్షల ఇళ్ల మంజూరు ఫైలుపై చివరి సంతకం చేసి ఒక చరిత్రకు నాంది పలికారని చంద్రబాబు కొనియాడారు. రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన ప్రజలు, విద్యార్థులు భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన తెలుగు వ్యక్తి వెంకయ్యనాయుడుకు ఘన స్వాగతం పలికారని, రాష్ట్ర ప్రజలందరి తరపున సన్మానం చేయడం ఎంతో సంతోషంగా, గర్వంగా ఉందని వ్యాఖ్యానించారు. ఇది ఒక అరుదైన అవకాశం..ఎందుకంటే ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లోనూ ఆనాడు నీలం సంజీవిరెడ్డి రాష్ట్రపతిగా, పీవీ నర్సింహారావు ప్రధాన మంత్రిగా పనిచేశారు. నవ్యాంధ్రలో వెంకయ్యనాయుడు 13వ ఉపరాష్ట్రపతిగా అమరావతిలో పర్యటించటం గర్వంగా ఉందన్నారు. 1978లో తాను, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఇద్దరం ఒకేసారి రాజకీయాల్లోకి ప్రవేశించామన్నారు. గతంలో టీడీపీలో ఏర్పడిన రాజకీయ సంక్షోభ సమయంలో ఎన్టీఆర్ పదవీచ్యుతుడు కాగా, తిరిగి ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యేవరకూ పోరాడిన వ్యక్తి వెంకయ్యనాయుడని గుర్తుచేశారు. 1978, 83లో ఎమ్మెల్యేగా, రెండు సార్లు రాజ్యసభసభ్యుడిగా పనిచేశారన్నారు. వాజ్‌పేయి ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా, బీజేపీ ప్రధాన కార్యదర్శిగా, బీజేపీ అధ్యక్షుడిగా 2002-04లో బాధ్యతలు నిర్వహించారన్నారు. స్వచ్ఛ భారత్‌కు శ్రీకారం చుట్టడం, దానికి ఎన్నో అవార్డులు రావడం గర్వకారణమన్నారు. దేశంలో పట్టణాభివృద్ధిలో ఎన్నో ప్రణాళికలు రూపొందించి అమలు చేశారని చంద్రబాబు ప్రశంసించారు. పరిపాలనలో వెంకయ్య నాయుడు నిబద్ధతతో నడుస్తూ నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తారని, తాను ఇప్పటికీ భయపడే వ్యక్తుల్లో వెంకయ్య నాయుడు తొలిస్థానంలో ఉన్నారన్నారు. ఎందుకంటే వెంకయ్యనాయుడు ఇప్పటి వరకూ పరిపాలనను ఉల్లంఘించని వ్యక్తి అని అన్నారు. ప్రజలకు సేవ చేసే వ్యక్తిత్వం



కలిగి రాజకీయాలకు స్వస్తి పలికి స్వర్ణభారత ట్రస్టు ద్వారా ఎనలేని సేవలందిస్తున్నారన్నారు. అమరావతిలో సన్మానం చేయడం చరిత్ర. సొంత గడ్డపైన పౌర సన్మానం చేయడం ఎంతో సంతోషంగా ఉందని, అలాగే బాధ కూడా ఉందని.. పెద్దదిక్కుగా ఉన్న ఆయన రాజకీయాలను విడిచి రాజ్యాంగ పదవిని చేపట్టారని, ఇకపై ఆయనతో నేరుగా మాట్లాడే అవకాశం ఉండదని చంద్రబాబు అన్నారు. విభజన తరువాత ఇప్పుడే రాష్ట్రం కోలుకుంటోందని, భవిష్యత్తులో ఉపరాష్ట్రపతి ఆశీస్సులు ఉంటాయన్న విశ్వాసం తనకు ఉందని చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. రాజకీయ సుదీర్ఘ చరిత్ర కలిగిన వెంకయ్య ఒక్క తప్పు చేయకుండా, ఏ ఒక్కరూ వేలెత్తి చూపకుండా ఉప రాష్ట్రపతి పదవికి ఎన్నికైన వ్యక్తిగా అభివర్ణించారు. జై ఆంధ్రా ఉద్యమంలో ఆయన జయప్రకాష్‌నారాయణ స్ఫూర్తితో విశాఖపట్టణం జైలుకు వెళ్లారు. అక్కడే చదువుకుని విజ్ఞానాన్ని సంపాదించి, ఒక్కొక్క పదవిని అలంకరిస్తూ నేడు ఉపరాష్ట్రపతి పదవిని చేపట్టారని కొనియాడారు.

తెలుగుతేజానికి ఘన స్వాగతం



• జాతీయ జెండాలతో విద్యార్థులు • ఆత్మీయ పలకరింపులతో మహిళలు • ఉపరాష్ట్రపతికి తరలివచ్చిన వ్యాపార, వాణిజ్య వర్గాలు

అమరావతి, ఆంధ్రప్రభ: భారత ఉప రాష్ట్రపతి హోదాలో తొలిసారిగా రాష్ట్ర పర్యటనకు వచ్చిన ముప్పవరపు వెంకయ్య నాయుడికి రాజధానివాసులు ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి గన్నవరం చేరుకున్న వెంకయ్యకి రాష్ట్ర గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రులు అశోక్‌గజపతి రాజు, వై.సత్యనారాయణ చౌదరి(సృజనా చౌదరి). రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు ప్రత్యేకంగా అలంకరించిన ఓపెన్ టాపు జీపులో గవర్నర్, ముఖ్యమంత్రితో కలిసి రోడ్డు షోలో పాల్గొన్నారు. విద్యార్థులు మొదలు రైతులు, కళాకారులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు ఒకరేమిటి..విజయవాడ ప్రజానీకం తరలివచ్చి పర్యటన ఆద్యంతం వెంకయ్యకు సాదర స్వాగతం పలికింది. అన్ని వర్గాల ప్రజలు గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రకాశం బ్యారేజీకి వరకు రోడ్లకు ఇరువైపులా నిలబడి ఆత్మీయ అభినందనలు తెలిపారు. జాతీయ జెండాలు పట్టుకొని లక్షమంది వరకు విద్యార్థులు, మహిళలు స్వాగతం పలకగా జానపద కళాకారులు, సాంప్రదాయ వాద్యకారులు తమదైనరీతిలో వెంకయ్యకు స్వాగతం పలికారు. దాదాపు 23 కిలో మీటర్ల మేర సాగిన వెంకయ్య రోడ్‌షో ఆద్యంతం అట్టహాసంగా, నగరవాసులు, జిల్లావాసుల అభినందనల మధ్య సాగింది. రాష్ట్ర విభజన సమయంలో రాజ్యసభ సభ్యుడిగా విభజన చట్టంలో నవ్యాంధ్ర అభివృద్ధికి అనేక ప్రణాళికలు పొందుపరిచేందుకు కృషి చేసిన ముప్పవరపు వెంకయ్య నాయుడు కేంద్రమంత్రిగా రాష్ట్రాభివృద్ధికి అనేక పథకాలు తీసుకొచ్చారు. రాష్ట్రాభివృద్ధికి వెంకయ్య సేవలకు గుర్తుగా ప్రభుత్వం శనివారం రాజధాని అమరావతిలో పౌర సన్మానం చేసింది. రాష్ట్ర పండుగగా నిర్వహించిన వెంకయ్య నాయుడు పౌర సన్మానానికి ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. వివిధ ప్రభుత్వ శాఖలు కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఏ విధమైన అసౌకర్యం లేకుండా మూడు రోజులుగా అవసరమైన ఏర్పాట్లు చేశాయి.

ప్రత్యేక విమానంలో..

న్యూఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 9.20గంటలకు గన్నవరం చేరుకున్నారు. అంతకు ముందే గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రులు అశోక్‌గజపతి రాజు, సృజనా చౌదరి, పార్లమెంటు సభ్యులు, రాష్ట్ర మంత్రులు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఉప రాష్ట్రపతి వచ్చిన వెంటనే పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ప్రత్యేక వాహనంలో ర్యాలీగా గన్నవరం నుంచి జాతీయ రహదారి మీదుగా రామవరప్పాడు రింగ్, బెంజిసర్కిల్, బందరు రోడ్డు గుండా బ్యారేజీ వరకు సాగింది.

వందలాది కళాకారులు

ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు విమానాశ్రయం నుంచి బయలుదేరిన వెంటనే వివిధ రకాల కళాకారులు తమ తమ సాంప్రదాయ నృత్యాలు, వేషధారణలతో విన్యాసాలు ప్రదర్శించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా కళాకారులు, జానపద నృత్యాలు, గిరిజన సంస్కృతికి చిహ్నంగా ధింసా నృత్యాలతో వెంకయ్యకు ఘనంగా స్వాగతం పలికారు. తప్పెట గుళ్లు, డబ్బు వాయిద్యాలతో జాతీయ రహదారి హోరెత్తింది. పాశ్చాత్య నృత్యాలతో సైతం పలువురు స్వాగతం పలికారు.

రెపరెపలాడిన జాతీయ పతాకాలు

జాతీయ రహదారిపై గన్నవరం విమానాశ్రయం నుంచి కిలో మీటరు వరకు అతి భారీ జాతీయ పతాకం చేబూని విద్యార్థులు హర్షధ్వానాలు చేశారు. అక్కడ మొదలు ప్రకాశం బ్యారేజీ వరకు నగరం నుంచే కాక జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు జాతీయ జెండాలు పట్టుకొని వెంకయ్య నాయుడుకు స్వాగతం పలికారు. అన్ని చోట్లా విద్యార్థులు క్రమ శిక్షణతో వ్యవహరించి పర్యటన సజావుగా సాగే విధంగా వ్యవహరించారు.

గట్టి బందోబస్తు

పోలీసులు ఉప రాష్ట్రపతి రాకను దృష్టిలో ఉంచుకొని గట్టి భద్రతా చర్యలను చేపట్టింది. జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆటంకాలు లేకుండా ఉదయం నుంచే వివిధ మార్గాల్లో ట్రాఫిక్‌ను మళ్లించారు. ఇదే సమయంలో ఉప రాష్ట్రపతి భద్రతను దృష్టిలో ఉంచుకొని డ్రోన్ కెమెరాలతో అధికారులు భద్రతను పర్యవేక్షించారు. ఇదే సమయంలో ఆయన వెళ్లే అన్ని మార్గాల్లో నిఘా, షాడో పార్టీలతో భద్రతను పర్యవేక్షించారు. రెవిన్యూ యంత్రాంగం కూడా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసింది కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు ప్రతి మూడు కిలోమీటర్లకు ఒక ఎమ్మార్వో చొప్పున నియమించి ఏర్పాట్లు పర్యవేక్షించారు. విద్యార్థులు, మహిళలకు మంచినీరు, ఇతర సౌకర్యాలను ఏ విధమైన లోటు రాకుండా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు.

సహకరించిన వాతావరణం

గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు శనివారం ఉదయం కనిపించ లేదు. ఉదయం నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపడంతో విద్యార్థులు, మహిళలు ఇబ్బందులు పడతారేమోననే ఆందోళన నిర్వాహకుల్లో నెలకొంది. సరిగ్గా వెంకయ్య వచ్చిన వెంటనే దట్టమైన మబ్బులు పరుచుకొని ఆద్యంతం ఆహ్లాదకరంగా మారడంతో అటు నిర్వాహకులు, ఇటు కార్యక్రమంలో పాల్గొన్న వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

రాష్ట్రాభివృద్ధిలో ఆలపాటి సేవలు చిరస్మరణీయం

• భారత స్వాతంత్ర్య సంగ్రామంలో వెంకట్రామయ్య సేవలు ప్రశంసనీయం: ఉపరాష్ట్రపతి వెంకయ్య



ఆలపాటి వెంకట్రామయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

తెనాలి, కెఎన్ఎన్: గుంటూరు జిల్లాలో రాజకీయాలకు అతీతంగా నిలిచి, అభివృద్ధికి చిరునామాగా నిలచిన ఏకైక వ్యక్తి ఆలపాటి వెంకట్రామయ్య అని భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. శనివారం గుంటూరు జిల్లా, తెనాలిలో ఆలపాటి వెంకట్రామయ్య శతజయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణదేవరాయుల ఆస్థానంలో అష్టదిగ్గజాలల్లో ఒక్కరైన తెనాలి రామకృష్ణుడు, భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఈనేలకు సేవచేసిన ఆలపాటి వెంకట్రామయ్యల వలనే తెనాలి పేరు ప్రఖ్యాతలు దశదిశలా వ్యాపించాయని పేర్కొన్నారు.

సహకారోద్యమనేతగా, విశాఖ బీచ్‌రోడ్డు అనుసంధానం వారి గొప్పకృషికి తార్కాణం అని, దేవాదాయశాఖ ప్రక్షళన, హైదరాబాదు అభివృద్ధిలో ఆయన తనదైన ముద్రవేశారని, నేటి తరం నేతలకు రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి ఆయన దిక్సూచి అని కొనియాడారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి విగ్రహం, ఆలపాటి జీవితచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాద్, రాష్ట్రమంత్రులు నక్కా ఆనందబాబు, కామినేని శ్రీనివాస్, ఎంపి గల్లాజయదేవ్, ఆలపాటి వెంకట్రామయ్య మనుమరాలు గోగినేని ఉమ, కుటుంబ సభ్యులు, శాసనసభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, రాష్ట్రమహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ శ్రీవారి ఆశీస్సులు ఉండాలి



ధ్వజస్తంభాన్ని మొక్కుతున్న నేపాల్ ప్రధాని





శ్రీవారి సన్నిధిలో సినీ తారలు శ్రీయ, సమంత

• నేపాల్, భారత్‌ల మధ్య విడదీయరాని బంధం: నేపాల్ ప్రధాని షేర్ బహుదూర్ దేవ్‌బా

తిరుమల , కెఎన్ఎన్ : ప్రపంచ మానవాళికి శ్రీవారి ఆశీస్సులు అందించాలని ప్రార్థించినట్టు నేపాల్ ప్రధాని షేర్ బహుదూర్ దేవ్‌బా ఉద్ఘాటించారు. ఆయన శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ నేపాల్, భారతదేశాల మధ్య సాంస్కృతికంగా, భౌగోళికంగా విడదీయరాని సంబంధం ఉందన్నారు. శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.అంతక ముందు ఆలయం వద్దకు చేరుకున్న ప్రధానికి టీటీడీ ఈవో అనిల్‌కుమార్‌సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు, ఆలయ అర్చకులు కలసి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనానంతరం రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలుకగా ఈవో, జేఈవోలు స్వామి వారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని ప్రధానికి అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కాల్వశ్రీనివాసులు,కలెక్టర్ ప్రద్యుమ్న, టీటీడీ సీవీఎస్‌ఓ రవికృష్ణ,ఆలయ డిప్యూటీ ఈవో కోదండరామారావు,రిసెప్షన్ డిప్యూటీఈవో హరీంద్రనాథ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సినీతారలు శ్రీయ, సమంత

ప్రముఖ సినీనటులు శ్రీ వేంకటేశ్వరస్వామివారిని శుక్ర, శనివారం వేకువజామున సుప్రభాత సేవలో దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనార్థం ప్రముఖ సినీనటి సమంత గురువారం రాత్రి కాలినడకన తిరుమల చేరుకున్నారు. అనంతరం ఆమె వేకువజామున సుప్రభాత సేవకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఆలయం వెలుపలకు రాగానే అభిమానులు ఆమెను చూడడానికి పోటీ పడ్డారు. అలాగే శనివారం వేకువజామున నటి శ్రేయ, యువ నటుడు ఆది సుప్రభాత సేవలో పాల్గొన్నారు,నటి గీత వీఐపి విరామ దర్శన సమయంలో స్వామివారిని దర్శించుకున్నారు.

భారీ బెట్టింగులకు అడ్డుకట్ట వేయాలి

• డీజీపీకి పీసీసీ అధ్యక్షుడు రఘువీరా లేఖ



అమరావతి, ఆంధ్రప్రభ: నంద్యాల ఉప ఎన్నిక ఫలితంపై భారీ ఎత్తున జరుగుతున్న పందాలకు తక్షణమే అడ్డుకట్ట వేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి డీజీపీ సాంబశివరావుకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన డీజీపీకి లేఖ రాశారు. రాష్ట్రంలో కొద్ది రోజులుగా భారీగా జరుగుతున్న పందేలుపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే, ఎన్నో కుటుంబాలు నాశనమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమలో పునరావృతమయ్యే ఫ్యాక్షన్ తగాదాలను నివారించేందుకు కూడా ముందుస్తుగానే చర్యలు చేపట్టాలని కోరారు. రాయలసీమలో అంతరించిపోయిందనుకున్న ఫ్యాక్షన్ వాతావరణాన్ని మళ్లీ తిరిగి పునరావృతమయ్యేందుకు అధికార,ప్రతిపక్ష నాయకులు చేస్తున్న రెచ్చగొట్టే వ్యాఖ్యలు దోహదపడతాయని పేర్కొన్నారు. అలాంటి పరిసితులు తిరిగి పునరావృతం కాకుండా అధికార, ప్రతిపక్ష నాయకులు సంయమనం పాటించి, హుందాగా వ్యవహరించాలని తాను అనేకమార్లు విజ్ఞప్తి చేశానని, మార్పు రాలేదన్నారు. ఎన్నికల కమిషన్ కూడా ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలపై తగిన సమయంలో సరిగా స్పందించలేదన్నారు. ఫలితంగా అధికార,ప్రతిపక్ష గ్రూపులు ఆయుధాలతో, రాళ్లతో దాడులకు దిగి,భయానక వాతావరణాన్ని సృష్టించారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులు భవిష్యత్‌లో రాయలసీమ ప్రాంతంలో అనేక చోట్ల పునరావృతమయ్యే అవకాశం లేకపోలేదని, సీమలో ఫ్యాక్షన్ తగాదాలు తిరిగి తలెత్తకుండా కట్టుదిట్టమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని రఘువీరారెడ్డి కోరారు.

నంద్యాల ఓట్ల లెక్కిపును వాయిదా వేయాలి: జంగా గౌతమ్

నంద్యాల ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపును తక్షణమే వాయిదా వేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి జంగా గౌతమ్ కేంద్ర ఎన్నికలసంఘాన్ని కోరారు. 29న కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఉన్నందున, ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రభావితమవుతుందని తెలిపారు.

సీఎంకు మొదటి శుభలేఖ ఇచ్చిన మంత్రి సునీత

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులను కలిశారు. మీడియాతో మాట్లాడిన ఆమె తన కుమారుడు వివాహానికి రావాల్సిందిగా చంద్రబాబుని ఆహ్వానించినట్లు తెలిపారు. మొదటి శుభలేఖను ముఖ్యమంత్రికి అందజేశారు.

జ్వరంతో జగన్

• కాకినాడ ప్రచార పర్యటన వాయిదా



అమరావతి, ఆంధ్రప్రభ: ప్రతిపక్షనేత వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి జ్వరంతో బాధపడుతున్నారు. కర్నూలు జిల్లా నద్యాల అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారంలో ఏకబిగిన 13రోజుల పాటు రోడ్‌షోలు నిర్వహించిన జగన్ అస్వస్థతకు గురయ్యారు. ఆయనకు జలుబుతోపాటు వైరల్ ఫీవర్ సోకినట్టు వైద్యులు తెలిపారు. జగన్ ఇంటినుంచి కదలకుండా పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో జగన్ కాకినాడ పర్యటన అనివార్యంగా వాయిదా పడింది. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ మున్సిపల్ కార్పోరేషన్‌కు జరుగుతున్న ఎన్నికల్లో వైఎస్ఆర్‌కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థుల విజయం కోసం శని, ఆది వారాల్లో రెండు రోజుల పాటు జగన్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ముందుగా షెడ్యూల్ ప్రకటించారు. అయితే జ్వరంతో బాధపడుతున్నందున తప్పని పరిస్థితుల్లోనే జగన్ కాకినాడ ఎన్నికల ప్రచార పర్యటనను వాయిదా వేసినట్టు పార్టీ వర్గాలు ఒక ప్రకటనలో పేర్కొన్నాయి.

అమిత్ షా పర్యటన వాయిదా


• కేంద్ర మంత్రివర్గ విస్తరణే కారణం • వచ్చే నెలలో తేదీలు ఖరారు • ర్యాలీ బాధ్యతలు కన్నాకు ఇవ్వడంపై కినుక • ఆర్థిక సహకారానికి ముందుకు రాని వైరిపక్షం



అమరావతి, ఆంధ్రప్రభ: భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా మూడు రోజుల రాష్ట్ర పర్యటన వాయిదా పడింది. అమిత్‌షా పర్యటనకు సంబంధించి వచ్చే నెలలో పర్యటన తేదీలు ఖరారు చేసే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు చెపుతున్నాయి. కేంద్రమంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణ వలనే అమిత్ షా పర్యటన వాయిదా పడినట్లు ప్రధానంగా పైకి చెపుతున్నా..తదుపరి తేదీలు ప్రకటించకపోవడం వెనుక పార్టీలోని గ్రూపు తగాదాలు కూడా కారణమని తెలుస్తోంది. ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు జరిగే అమిత్‌షా రాష్ట్రపర్యటన గత నెలలోనే ఖరారైంది. మూడు రోజుల పర్యటనలో ఓబీసీలతో సమావేశం, మీడియా యాజమన్యాలు, ప్రతినిధులతో ఇష్టాగోష్టి మినహా మిగిలిన కార్యక్రమాలన్నీ కూడా అంతర్గతంగా నిర్వహించేవే. గన్నవరం విమానాశ్రయం నుంచి తాడేపల్లిలోని గోకరాజు గంగరాజు అతిథి గృహం వరకు భారీ ర్యాలీ నిర్వహణ మాత్రం పార్టీపరంగా చేపట్టాలని ముందే నిర్ణయించారు. మిగిలిన కార్యక్రమాలన్నీ కూడా అంతర్గతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వివిధ మోర్చాలు, పార్టీ నేతలతో అంతర్గత చర్చలతో పాటు రాష్ట్ర అధ్యక్షుని ఎన్నికకూడా అమిత్ షా పర్యటనలో ఖరారయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు ముందుగానే చెప్పాయి. ఈ నెల 23, 24 తేదీల్లో తమిళనాడు పర్యటన ముగించుకొని 25వ తేదీన రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేయాలనేది అమిత్ షా నిర్ణయం. అది పూర్తికాగానే 28 నుంచి మూడు రోజుల పాటు ఆంధ్రాలో పర్యటించాల్సి ఉంది. అమిత్ షా భారీ ర్యాలీ నిర్వహణకు భారీగా ఖర్చు కానున్నట్లు పార్టీ నేతలు అంచనా వేశారు. ర్యాలీ నిర్వహణ బాధ్యతలను మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణకు అప్పగించినట్లు తెలిసింది. ర్యాలీ నిర్వహణ బాధ్యతలు మంత్రి కామినేని శ్రీనివాస్‌కు అప్పగించాలని మరో వర్గం పట్టుబట్టినట్లు చెపుతున్నారు. కన్నాకు ర్యాలీ నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తే అయ్యే ఖర్చులో తాము భాగస్వాములం కాలేమని తెగేసి చెప్పినట్లు చెపుతున్నారు. గతంలో వీరు నిర్వహించిన కార్యక్రమాలకు తాము నిధులు సమకూర్చిన విషయాన్ని కన్నా వర్గం గుర్తు చేయడంతో పాటు ఇప్పుడు ఇందుకు విరుద్ధంగా వ్యవహరించడమేంటని నిలదీసినట్లు పార్టీ నేతల సమాచారం. వీరు వైఖరిలో మార్పు లేకపోవడంతో ఖర్చు మొత్తం భరించేందుకు కన్నా లక్ష్మీనారాయణ నిర్ణయించుకున్నారు. అయితే ఉప రాష్ట్రపతి హోదాలో శనివారం నగరానికి వచ్చిన వెంకయ్య పౌర సన్మానాన్ని దృష్టిలో ఉంచుకొని గన్నవరం మొదలు నగరంలోని అన్ని హోర్డింగ్‌లను ప్రభుత్వపరంగా ముందుగానే ఖరారు చేసుకున్నట్లు తెలిసింది. ఈ నెల 30వ తేదీ వరకు కూడా హోర్డింగ్‌లు వెంకయ్య నాయుడు ఫొటోలతోనే ఉండే విధంగా ఆయా సంస్థలతో ఒప్పందం జరిగింది. దీంతో ప్రత్యేకంగా ఫ్రేములు తయారు చేసుకొని ఫ్లెక్సీల ఏర్పాటుకు కన్నా వర్గం నిర్ణయించుకోవడంతో పాటు జరిగే పరిణామాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు చెపుతున్నారు. మరో వర్గం కూడా పోటాపోటీ ఫిర్యాదులు చేయడంతో విధిలేని స్థితిలో అమిత్ షా తన పర్యటనను వాయిదా వేసుకున్నట్లు పార్టీలో జోరుగా సాగుతున్న ప్రచారం. మంత్రి వర్గ పునర్వవస్తీకరణ నిజమే అయినప్పటికీ తదుపరి తేదీలను ఖరారు చేయకపోవడం వెనుక బీజేపీలోని రెండు వర్గాల మధ్య నెలకొన్న ముఠా తగాదాలే కారణంగా చెపుతున్నారు. గత జూన్‌లో విశాఖపట్టణంలో జరగాల్సిన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు వాయిదా పడ్డాయి. పార్టీలోని రెండు గ్రూపుల్లో లోపించిన సమన్వయ లోపంతో జాతీయ కార్యవర్గ సమావేశాలను వచ్చే నెల 15న ఢిల్లీలో నిర్వహించేందుకు బీజేపీ జాతీయ నాయకత్వం నిర్ణయించింది. ఆ సమావేశాల తర్వాత గ్రూపుల మధ్య విబేధాలు సమసిపోయిన తర్వాతనే అమిత్ షా రాష్ట్ర పర్యటన ఉండొచ్చని పార్టీ నేతలు అంటున్నారు.

సాగర్‌లో జలకళ వెలవెల

• 50 వసంతాల చరిత్రలో దుర్భర పరిస్థితి • అడుగంటిన జలాశయం • ఈ ఏడాది కూడా ఖరీఫ్‌కు నీళ్లు కష్టం • 500 గ్రామాలకు ముంచుకొస్తున్న నీటి గండం • కర్నాటక కరుణిస్తేనే గుంటూరు, ప్రకాశంలకు తాగునీరు



అమరావతి, ఆంధ్రప్రభ: ప్రకృతి కరుణించకపోవడంతో ఆధునిక దేవాలయంగా పేర్కొనబడే 50 వసంతాల నాగార్జున సాగర్ ప్రాజెక్టు చరిత్రలో ముందెన్నడూ లేనివిధంగా ఈ ఏడాది దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. బీడు భూములను మాగాణి భూములుగా మార్చి అన్నదాతలకు అండదండలుగా నిలిచిన సాగర్, గత రెండేళ్లుగా ఖరీఫ్‌కు నీరులేక విలవిలలాడిపోతున్న రైతాంగానికి ఈ ఏడాది కూడా నిరాశే మిగిల్చనుంది. సాగర్ నీటిమట్టం రోజురోజుకూ పడిపోవడంతో ఈ సంవత్సరం ఆయకట్టుదారులకు ఖరీఫ్‌లో నీరందించడం కష్టతరంగా మారింది. సాగర్ ఆయకట్టు కింద 11.17 లక్షల హెక్టార్లు సాగుబడిలో ఉంది. దీనిలో 4.35 లక్షల ఎకరాలు మాగాణికాగా, 6.82 లక్షల ఎకరాలు ఆరుతడి పంటలు పండిస్తారు. రాష్ట్ర విభజన అనంతరం 2014-15లో వరుణుడు కరుణించడంతోపాటు ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్నాటకల్లో విస్తారంగా వర్షాలు పడటంతో కృష్ణానది ఎగువన ఉన్న ప్రాజెక్టులన్నీ నిండిపోయాయి. దీంతో నీటిని వదలడంతో దిగువన ఉన్న జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలకు పుష్కలంగా నీరు చేరింది. దీంతో ఆ యేడాది సాధారణంగా 132 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి ఉండగా, 159 టీఎంసీల నీటిని వాడటం జరిగింది. అయితే 2015-16 సంవత్సరానికి ప్రకృతి కరుణించకపోవడం, ఎగువ ప్రాంతాల నుంచి నీరు రాకపోవడంతో ఆ యేడాది ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలేదు. దీంతో ఆయకట్టు రైతాంగం ఆ సంవత్సరం వర్షాధార పంటలపైనే ఆధారపడాల్సి వచ్చింది. ఆ ఏడాది తాగునీటి కోసం కేవలం 17.64 టీఎంసీల నీటిని విడుదల చేశారు. కాగా 2016-17లో ఒక మోస్తరు వర్షాలతో జలాశయాలకు నీరు చేరడంతో ఆరుతడి పంటలకు మాత్రమే 59 టీఎంసీల నీటిని విడుదల చేయడం జరిగింది. సాగర్ ఆయకట్టు కింద వరి వేయవద్దని ప్రభుత్వం ప్రకటించింది. కేవలం వర్షాధార పంటలు, తాగునీటి కోసమే నీటిని వినియోగించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఐతే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ మరో కొద్ది రోజుల్లో ముగుస్తున్నా, ఇప్పటి వరకు సాగర్ నుంచి చుక్క నీరు కూడా వదల్లేదు. నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం నీళ్లు డెడ్ స్టోరేజీ స్థాయికి చేరాయి. సాధారణంగా 510 అడుగులకు నీటిమట్టం వస్తేనే డెడ్ స్టోరేజీగా ప్రకటిస్తారు. ఐతే ఆ ఏడాది అందుకు దిగువన నీటి మట్టం చేరింది. 510కి దిగువన ఉంటే ఎలాంటి అవసరాలకు వాడకూడదనే నిబంధన ఉంది. దీంతో సాగర్ ఆయకట్టు మాటెలా ఉన్నా, తాగునీటి సమస్య తలెత్తే అవకాశం నెలకొంది. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో తాగునీటి కోసం 500 చెరువులు, రిజర్వాయర్లు ఉన్నాయి. వీటిని గత ఏప్రిల్ 25 నుంచి మే 2 వరకు సాగర్ జలాలతో నింపడం జరిగింది. వీటిని నింపేందుకు 6 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ఐతే ప్రస్తుతం ఉభయ జిల్లాల్లో మంచినీటి రిజర్వాయర్లు, చెరువుల్లో నీరు అట్టడుగుకు చేరింది. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో మంచినీటి సరఫరా నిలిచిపోగా, మరికొన్ని పట్టణాల్లో వారానికి రెండ్రోజులు మాత్రమే తాగునీటిని అందిస్తున్నారు. మరో 15 రోజుల్లో సాగర్ నుంచి నీటిని విడుదల చేయకపోతే సమస్య మరింత జఠిలమయ్యే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఆల్మట్టి నుంచి 20 టీఎంసీల నీటిని ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు తాగునీటి కోసం విడుదల చేయాలని కృష్ణా రివర్ బోర్డు, కర్నాకట రాష్ట్రాన్ని కోరినట్లు సమాచారం. కర్నాటక కరుణించి నీటిని వదిలితేనే తెలుగు రాష్ట్రాలకు తాగునీటి సమస్య నుంచి గట్టెక్కే అవకాశం ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు.

ఇదిలా ఉంటే 1967 ఆగష్టు 4న నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయి నీటిని కాలువలకు విడుదల చేసి ఏ డాదికి 50 ఏళ్లు పూర్తయింది. ఈ 50 ఏళ్ల ప్రాజెక్ట్ చరిత్రలో కేవలం నాలుగుసార్లు మాత్రమే తక్కువగా నీటిని విడుదల చేయడం జరిగింది. ఐతే ఈ ఏడాది అధమంగా చుక్కనీరు కూడా విడుదల చేయకపోవడం ఈ సందర్భంగా గమనార్హం. గతంలో నీటి విడుదలను పరిశీలిస్తే 2001-02 సంవత్సరంలో సాగర్ నుంచి 44.78 టీఎంసీలు విడుదల చేయగా, 2003-04లో 43 టీఎంసీల నీటిని విడుదల చేశారు. అనంతరం 2011-12లో 38.09 నీటిని విడుదల చేయగా, 2015-16లో అతితక్కువగా 17.46 టీఎంసీల నీటిని మాత్రమే విడుదల చేయడం జరిగింది.

అయితే ఈ ఏడాది ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా కర్నాకటలోని ఆల్మట్టి ప్రాజెక్ట్ నిండి దిగువన ఉన్న తుంగభద్ర, జూరాల జలాశయాలు నిండి శ్రీశైలంకు నీరు విడుదలవుతుందనే ఆశతో ఎదురు చూస్తున్న సమయంలో ఎగువ ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం ఆగిపోయింది. దీంతో కృష్ణానదికి ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్ట్ నుంచి కర్నాటక, జూరాల నుంచి తెలంగాణా రైతులు నీటిని వాడుకోవడంతో ఆల్మట్టిలో 10 టీఎంసీల మేర నీరు పరిమాణం తగ్గినట్లు సమాచారం. ప్రస్తుతం ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పడ్డా, తగ్గిన నీటి భర్తీ అయితేనే ఆల్మట్టి నుంచి కిందకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం మహారాష్ట్ర, కర్నాటకల్లో వర్షాలు ఆగిపోవడం, జలాశయా లకు నీరు చేరకపోవడంతో ఈ ఏడాది కూడా శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు నిండటం గగనకుసుమమే అవుతుందని చెబుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు నీరు విడుదల చేయకపోవడంతో సాగర్ ఆయకట్టు కింద వరుసగా మూడోసారి కూడా వరిపంట పండే అవకాశం లేకుండా పోయింది. నాగార్జున సాగర్‌రిజర్వాయర్‌లో నీటి మట్టం పడి పోతుండటంతో ఇసుక తెన్నెలు కనిపిస్తున్నాయి. అంతేకాకుండా ముల్లపొదలు, చెట్లు దర్శనమిస్తున్నాయి. ఈ తరుణంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని ఆయకట్టు రైతులు, ప్రజలు ఎదురు చూస్తున్నారు.

ప్రస్తుతం కృష్ణానదీ పరీవాహక జలాశయాల నీటి వివరాలు

ప్రాజెక్ట్	నీటి సామర్థ్యం	ప్రస్తుతంనీటి	నిల్వ(టీఎంసీలు)	గతేడాది నీటి నిల్వ
శ్రీశైలం	885	782.9	21.48	150.49
సాగర్	590	500.1	115.47	138.19
పులిచింతల	123.75	---	4.75	7.15

విశాఖలో భారీ గణనాథుడు

• తొలిపూజ నిర్వహించిన మంత్రి గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నం, కెఎన్ఎన్ బ్యూరో: మహావిశాఖనగరంలో ప్రతీ ఏటా భారీ గణనాధుడు విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో తెలంగాణా రాష్ట్రంలోని ఖైరతాబాద్‌లో మాత్రమే అతిపెద్ద వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసేవారు. కానీ ఇప్పుడు విశాఖనగరంలో కూడా అందుకు దీటుగా పెద్ద ఎత్తున గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఇక్కడ గాజువాక వద్ద షీలానగర్ ప్రాంతంలో శ్రీ మహాగణపతి మహోత్సవ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో అతిపెద్ద వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. ఇక్కడ విగ్రహానికి తొలి పూజను రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధిశాఖామంత్రి గంటా శ్రీనివాసరావు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటి సభ్యులను మంత్రి గంటా అభినందించారు. కార్యక్రమంలో కెఎన్ఆర్ పౌండేషన్ ఛైర్మన్ కరణంరెడ్డి నర్సింగరావు, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి స్వర్ణ కిరీటం



పూర్ణామార్కెట్,(విశాఖపట్నం) కెఎన్ఎన్: విశాఖపట్నం బురుజుపేటకు చెందిన (ప్రస్తుతం ముంబాయి నివాసం) ఓ వ్యక్తి శ్రీకనక మహాలక్ష్మి అమ్మవారికి సుమారు 281 గ్రాముల (రూ. 8,00,000) స్వర్ణ కిరీటం అందచేశాడు. ముం దుగా వారిచే అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, సేవ జరిపి స్వర్ణ కిరీటం అమ్మవారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో కార్య నిర్వ హణాధికారిణి యస్. జె. మాధవి , ఛైర్మన్ భాస్కరరావు, ధర్మకర్తల మండలి కె.భా స్కరరావు, సి.హెచ్ చంద్రరావు, ఆర్. చలపతిరావు, పి.వెంకట రమణ, ఆలయ సహాయ కార్యనిర్వా హణాధికారి వి.రాంబాబు, పి.రామారావు, ఎస్. సూర్యకుమారి, ఉపకార్యనిర్వాహక ఇంజనీరు సిహెచ్‌వి రమణ, పర్యవేక్షకులు ఎన్. వి.వి.ఎస్.ఎ.ఎన్ రాజు పాల్గొన్నారు.

బిల్డర్లు, ప్లానింగ్ ఇంజనీర్లతో సీఆర్డీఏ ముఖాముఖి సమావేశం



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఇచ్చిన జీవో విషయంపై శనివారం బిల్డర్లు, ప్లానింగ్ ఇంజనీర్లతో ముఖా ముఖి సమావేశం నిర్వహించినట్లు సీఆర్‌డీఏ ప్రమోషన్ విభాగం డైరెక్టర్ వి.రాముడు తెలిపారు. జీవోలోని అంశాలపై బిల్డర్లు, భవన నిర్మాణ యజమానులు పలు విషయాలు లేవనెత్తారని ముఖ్యంగా రోడ్డు వెడల్పు, ఓపెన్ స్పేస్, పార్కింగ్ ప్రాంతాల విషయం వంటి అంశాలపై చర్చించారన్నారు. ఈసందర్భంగా వి.రాముడు మాట్లాడుతూ ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని జీవో జారీ చేశారని, ఈనియమాలపై అందరికి అవగాహన కల్పించాలని, నిబంధనలకు అనుగుణంగా ఆన్‌లైన్‌లో అనుమతి పొందాలన్నారు. ప్లానింగ్ ఇంజనీర్లు బిల్డర్లకు, సామాన్య ప్రజానీకానికి వీటిపై అవగాహన కల్పించాలని, లేకపోతే భవిషత్తులో మరిన్ని సమస్యలు తలెత్తుతాయన్నారు. సీఆర్‌డీఏ చట్ట ప్రకారం మాస్టర్ ప్లాన్ నియమాలను ఉల్లంఘించిన వారికి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష ఉంటుందన్నారు. సంతోషమైన, సౌకర్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు, పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని మాస్టర్‌ప్లాన్ లోని భవన నిర్మాణ నియమాలను పొందుపర్చారన్నారు. ఈనిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, బిల్డర్ల అసోసియేషన్ అభ్యర్థన మేరకు ప్రతి శనివారం వీటి మీద అవగాహన కల్పించటం జరుగుతుందని, ఈవిషయంలో బిల్డర్లు, యజమానులు నేరుగా అధికారులను కలిసి తమ సందేహాలను నివృతి చేసుకోవచ్చన్నారు. ప్రజలు, బిల్డర్లు, సమస్యలను సందేహాలను తీర్చటానికే ఈఫెసిలిటేషన్ సెంటర్‌ని ఏర్పాటు చేయటం జరిగిందని, దీని ద్వారా వెంటనే సమస్యని పరిష్కరించటం జరుగుతుందన్నారు. తరచుగా ఇలాంటి ముఖాముఖి సమావేశాలతో సమస్యల పరిష్కరించి మెరుగైన సేవలు అందిస్తామన్నారు. ఈసమావేశంలో జాయింట్ డైరెక్టర్స్, డిప్యూటీ డైరెక్టర్స్‌తోపాటు 100 మందికి పైగా బిల్డర్లు, నిర్మాణ యజమానులు పాల్గొన్నారు.

ఓపెన్ ఫోరంలో 20 దరఖాస్తులకు అనుమతి

ఏపీసీఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం జరిగిన ఓపెన్ ఫోరంలో 20 దరఖాస్తులకు అనుమతి లభించిందని సీఆర్‌డీఏ తెలిపింది. శుక్రవారం శెలవు దినం కావటంతో ఓపెన్ ఫోరాన్ని శనివారం నిర్వహించామని, నిబంధనలకు అనుగుణంగా ఉన్న దరఖాస్తులకు వెంటనే అనుమతి ఇవ్వటం జరిగిందని సీఆర్‌డీఏ పేర్కొంది.

విశాఖలోనే విరాట్


• తాత్కాలికంగా కాకినాడలో డాకింగ్ • టెక్నో ఎకానమీ ఫీజిబిలిటీ స్టడీ • పర్యాటకాభివృద్ధిపై కలెక్టర్ ప్రవీణ్‌కుమార్



విశాఖపట్నం, కెఎన్ఎన్ : ఐఎన్ఎస్ విరాట్ విశాఖకే వస్తుందని విశాఖ జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ స్పష్టంచేశారు. తాత్కాలికంగా కాకినాడ వద్ద నిలిపి ఉంచారని అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు టెక్నో ఎకానమీ ఫీజిబిలిటీ (టిఇఎఫ్) స్టడీని నాటెక్స్ కన్సార్టియం సంస్థకు అప్పగించారని వివరించారు. నగరంలోని ఎంవీపీ కాలనీలో 20 సెంట్ల స్థలంలో పర్యాటక భవన్‌ని నిర్మించనున్నట్టు చెప్పారు. రూ.3 కోట్లతో దీన్ని నిర్మిస్తామని అన్నారు. విశాఖ ఏజెన్సీలోని లంబసింగి, డల్లాపల్లిల్లో పర్యాటకశాఖే కాటేజీలను నిర్మిస్తుందని తెలిపారు. కోస్టల్ బ్యాటరీ నుంచి రుషికొండ వరకూ బీచ్‌ని రూ.100 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో అభివృద్ధిచేయనున్నట్టు చెప్పారు. దీంట్లో భాగంగా రూ.30 కోట్లతో కైలాసగిరిని వుడా అభివృద్ధిచేస్తుందని అన్నారు. యారాడ బీచ్‌ని కోటి న్నరతో అభివృద్ధిపరుస్తామన్నారు. మంగమారిపేటలో వాటర్ స్పోర్ట్స్ నిర్వహిస్తామని అన్నారు. సముద్రంలో ఈత కోసం దిగి పలువురు మృత్యువాత పడుతున్నారని, దీన్ని నివారించేందుకు ఆర్‌కే బీచ్, రుషికొండల్లో స్విమ్మింగ్ జోన్లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మిగతా ప్రాంతాల్లో స్విమ్మింగ్ నిషేధమని చెప్పారు. స్విమ్మింగ్ జోన్ల వద్ద సముద్రంలో బోట్లతో నిపుణులైన ఈతగాళ్ళు ఉంటారని, వారు ఈతకు దిగినవారిని గమనిస్తూ సూచనలు ఇస్తారని అన్నారు. కోటిన్నరతో స్విమ్మింగ్ జోన్లను అభివృద్ధి చేస్తామని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం జారీచేసిన జీఓ 269లోని ఈవెంట్ క్యాలెండర్ ప్రకారం నవంబర్ 11, 12 తేదీల్లో హార్స్ రైడింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ఐర్లాండ్‌లో ఈ తరహా రైడింగ్ ఉందని అన్నారు. డిసెంబర్ 22 నుంచి 25 వరకూ విశాఖ ఉత్సవ్, అక్టోబర్ 7,8 తేదీల్లో ఫ్రింజ్ ఫెస్టివల్, డిసెంబర్ మొదటి వారంలో యాచ్ పెంటగానల్, సెప్టెంబర్ చివరి వారంలో సౌండ్ ఆన్ ది క్లౌడ్స్ ఆఫ్ వైజాగ్, జనవరి 22 నుంచి 28 వరకూ కుకింగ్ ఒలింపియాడ్, నవంబర్ లేదా డిసెంబర్‌లో టీఎస్‌డీ కార్ ర్యాలీ, సెప్టెంబర్‌లో ఏపీ టూర్ ఆపరేటర్ల సదస్సు నిర్వహిస్తామని చెప్పారు. ఈ ఏడాది దసరా ఉత్సవాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు.

అప్పన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తి

• సాదర స్వాగతం పలికిన ఆలయ వర్గాలు




సింహాచలం, కెఎన్ఎన్: సింహాచలం వరాహాలక్ష్మీనృసింహస్వామిని శనివా రం హైకోర్టు జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ వర్గాలు సాదర స్వాగతం పలికి ఆయనకు మర్యాదలు చేశారు. కప్పస్థంభం ఆలింగనం అనంతరం బేడా చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల సన్నిదిలో నాగార్జునరెడ్డి పేరిట ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి వేద మంత్రోశ్చరణల నడుమ, మృధుమధుర మంగళవాయిద్యాల మధ్య అర్చక స్వాములు ఆశీర్వదించి తీర్ధ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఇవో కె.రామ చంద్రమోహన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అప్పన్న ఆలయంలో సహస్ర దీపాలంకరణ సేవ

సింహాద్రినాధుడి ఆర్జిత సేవల్లో భాగంగా శనివారం పలువురు భక్తులు సహస్ర దీపాలంకరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక దీపారాధనలు చేసి సింహాద్రినాదుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారి ఆలయం దీపాలతో ప్రత్యేక ఆకర్షణగా మారింది.

వీహెచ్‌కు వర్మ కిస్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వర్మ అభిమానంతో టార్గెట్ చేసినా.. అసూయతో టార్గెట్ చేసినా తట్టుకోవడం ఒకింత కష్టమే. నిన్న మొన్నటిదాకా కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ మీద ఘాటు వ్యాఖ్యలతో విరుచుకుపడ్డ వర్మ.. ఉన్నట్లుండి రోమాంటిక్ అవతారమెత్తాడు. వీహెచ్‌కు ముద్దిస్తున్న ఫోటో ఒకటి తన ఫేస్ బుక్ ఖాతాలో షేర్ చేశాడు. బహుశా ముద్దులతో మొదలైన వివాదానికి ముద్దుతోనే ముగింపు పలకాలన్నాడో మరమో గానీ ఇలా వీహెచ్‌ను గాఢంగా చుంబిస్తున్న ఫోటోను పోస్ట్ చేశాడు. ఇంకేముందు ఫోటోపై కామెంట్స్‌తో నెటిజన్స్ పండగ చేసుకుంటున్నారు. అంతేకాదు.. ఈ ఫోటోను ఎడిటి చేసి, వీహెచ్‌లో ఆ అప్పీల్ కనిపించడానికి 27 మంది కంప్యూటర్ గ్రాఫిక్ నిపుణులు ఆరు గంటల పాటు కష్టపడ్డారంటూ వర్మ పేర్కొనడం గమనార్హం. దీనిపై కొంతమంది వీహెచ్‌ను సమర్థిస్తూ వర్మపై ఫైర్ అవుతుండగా.. మరి కొంతమంది వర్మకు మద్దతుగా కామెంట్స్ చేస్తున్నారు. గతంలో అనురాగ్ కశ్యప్‌కు వర్మ ముద్దిచ్చిన ఫోటోలో కశ్యప్ స్థానంలో వీహెచ్‌ను చేర్చి వర్మ అభిమానులు ఆయన ఖాతాలో వదిలారు. దాన్నే వర్మ తన ట్విట్టర్ ఖాతాలో అభిమానులతో పంచుకున్నాడు.

31న పీఎస్ఎల్వీ జీ39 ప్రయోగం

• షార్‌లో కొనసాగుతున్న ఏర్పాట్లు • నేడు ప్రయోగ వేదికపైకి రాకెట్



నెల్లూర్లు, కెఎన్ఎన్ బ్యూరో : భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీష్ ధావన్‌స్పేస్‌సెంటర్ (షార్) నుంచి భారత అంతరిక్షప్రయోగ సంస్థ (ఇస్రో) ఈనెల 31న పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పీఎస్ఎల్‌వీ) -జీ 39 రాకెట్ ప్రయోగాన్ని చేపట్ట బోతోంది. అందుకు సంబంధించి గత నెల రోజులుగా షార్‌లో ప్రయోగ ఏర్పాట్లు శర వేగంగా సాగుతు న్నాయి. ఆదివారం రాకెట్‌ను ల్యాబ్ నుంచి శ్రీహరి కోటలోని రెండో ప్రయోగ వేదికపైకి తీసుకురాను న్నారు. 31న సాయంత్రం 5.59 నిమిషాలకు నింగి లోనికి దూసుకుపోనున్న పీఎస్ఎల్‌వీ రాకెట్ ప్రయో గానికి సంబంధించి 30 గంటలు ముందే కౌంట్‌డౌన్‌ను ప్రారంభించనున్నా రు. సమాచార వ్యవస్థకు సంబంధించి చేపడుతున్న ఈ ప్రయోగంలో ఐఆర్ఎన్ఎస్ఎస్- 1 హెచ్ ఉపగ్ర హాన్ని పీఎస్ఎల్‌వీ రాకెట్ ద్వారా కక్ష లోనికి భారత శాస్త్రవేత్తలు ప్రవేశపెట్ట నున్నారు. సమాచార వ్యవస్థబలోపేతానికి సంబంధించి ఇప్పటికే ఇస్రో 7 నావిగేషన్ ఉపగ్రహాలను కక్ష లోనికి ప్రవేశపెట్టింది.

అయితే 2014లో కక్షలోనికి ప్రవేశ పెట్టిన తొలి నావిగేషన్ ఉపగ్రహం ఐఆర్ఎన్ఎస్ఎస్ - 1లో కొన్ని సాంకేతిక లోపాలు తలెత్తడంతో ఆ స్థానంలో ఇస్రో ఆర్ఎన్ఎస్ఎస్ -1 హెచ్ ఉపగ్రహాన్ని ప్రవేశ పెడుతోంది. 1400 కేజీల బరువున్న ఈ ఉపగ్రహం 18 నిమిషాల్లో నిర్ణీత కక్షలోనికి చేరుకుని 10 సంవత్సరాల పాటు సేవలు అందించనుంది.

నాలుగు ప్రత్యేక రైళ్లు




అమరావతి - ఆంధ్రప్రభ: ఓనం పండుగను పురస్కరించుకునిసికింద్రాబాద్ -కొచ్చువెలి, హెచ్.ఎస్.నాందేడ్ - ఎర్నాకులం మార్గంలో నాలుగు ప్రత్యేకరైళ్లను నడిపేందుకు దక్షిణ మధ్యరైల్వే చర్యలు తీసుకున్నది. పండుగ సందర్భంగా ఏర్పడే రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే ఈ నాలుగు ప్రత్యేక రైళ్లను నడిపేందుకు చర్యలు తీసుకున్నది. సికింద్రాబాద్ -కొచ్చెవెలి (నెంబర్ 07119) ప్రత్యేక రైలు సెప్టెంబర్ ఒకటో తేదీ శుక్రవారం 16:25 గంటలకు సికింద్రాబాద్‌లో బయలు దేరి, ఆదివారం ఉదయం 00:30 గంటలకు కొచ్చెవెలి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కొచ్చివేలి - సికింద్రాబాద్ (నెంబర్07120) రైలు సెప్టెంబర్ 6న 20:30 గంటలకు కొచ్చెవెలీలో బయలు దేరి రెండో రోజు 03:00 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. ఈ క్రమంలో ఈ ప్రత్యేక రైళ్లు కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ,తెనాలి,ఒంగోలు, నెల్లూరు, గూడూరు,రేణిగుంట,కాట్పాడ,వనియంబడి జోలా ర్పేటై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్,కోయంబత్తూరు, పాలక్కాడ్, ఒట్టపళంకు,త్రిచూర్, ఆలూవ, ఎర్నాకు లం టౌన్ తదతర స్టేషన్లలో ఆగుతాయి. 19 కోచ్‌లుండే ఈ ప్రత్యేక రైలులో రెండు ఏసీ టూటైర్, 15 స్లీపర్‌క్లాస్, రెండు సెకండ్ జనరల్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి. అదే విధంగా హెచ్.ఎస్. నాందేడ్ - ఎర్నాకులం - నాందేడ్ మధ్య మరో రెండు ప్రత్యేక రైళ్లను కూడా నడపనున్నారు. ఈ ప్రత్యేక రైలు (నెంబర్ 07505) సెప్టెంబర్ ఒకటో తేదీ ఉదయం 07:10 గంటలకు నాందేడ్‌లో బయలు దేరి, తిరిగి శుక్రవారం 12:30 గంటలకు కల్లా మాల్కాజిగిరికి చేరుకుంటుంది. కాచిగూడలో 13:40 గంటలకు బయలు దేరి, మరుసటి రోజు ఉదయం 14:00 గంటలకు ఎర్నాకులం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు (నెంబర్ 07504) 23:40 గంటలకు ఎర్నాకులంలో బయలు దేరి, సెప్టెంబర్ నాలుగో తేదీన 23:00 గంటలకు నాందేడ్‌కు చేరుకుంటుంది. మాల్కాజిగిరికి 00:20 గంటలకు చేరుకుంటుంది. రెండో రోజు అంటే బుధవారం ఉదయం 06:30 గంటలకు హెచ్.ఎస్.నాందేడ్‌కు చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైలు ముద్దేడ్, ధర్మబాద్, బాసర, నిజామాబాద్, కామారెడ్డి, బొల్లారం, మాల్కాజిగిరి, జడ్చెర్ల ,మహబూబ్‌నగర్,వనపర్తి రోడ్, గద్వాల,కర్నూల్‌సిటీ,మదనపల్లి, గూటీ, తాడపర్తి, ముద్దనూర్, యర్రగుంట్ల,కడప, నందలూర్, రాజంపేట,ఆకివీడు,కోడూర్, రేణిగుంట, కట్పాడి,వాణింబడి, జోలార్పేటై, సేలం,ఈరోడ్, తిరుప్పూర్, కోయంబత్తూర్, పాలక్వాడ్, ఒట్టపళంకు, త్రిచూర్, అలువాలో స్టేషన్లలో ఆగుతుందని సంబంధిత అధికారులు తెలిపారు. 15 కోచ్‌లుండే ఈ ప్రత్యేక రైలులో ఒక ఏసీ టూటైర్, ఇంకో ఏసీ త్రీటైర్, 11 స్లీపర్‌కోచ్‌లు, రెండు సెకండ్ జనరల్ క్లాస్ కోచ్‌లుంటాయి.ఈ అవకాశాన్ని రైల్వే ప్రయాణీకులు వినియోగించుకోవాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులు కోరారు.

జనసేనానికి వ్యవసాయ విద్యార్థుల బహిరంగ లేఖ



అమరావతి, ఆంధ్రప్రభ : వివాదాస్పద జీఓ64ను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా గత 25రోజులుగా ఆందోళన చేస్తున్న వ్యవసాయ కళాశాలల విద్యార్థులు తమ ఆవేదనను జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు బహిరంగ లేఖ ద్వారా తెలిపారు. మన రాష్ట్రంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిపుణులను తయారు చేస్తోందనీ, ఇదే కాకుండా దేశ వ్యాప్తంగా భారత వ్యవసాయ పరిశోధనా మండలి(ఐకార్) గుర్తింపు పొందిన దాదాపు 45 వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు ఈ పనినే చేస్తున్నాయన్నారు. ఈ విద్యాలయాలనుంచి వచ్చిన పట్టభద్రులు అధికారులుగా శాస్త్రవేత్తలుగా దేశీయ వ్యవసాయ రంగానికి గణనీయమైన సేవలందించారనీ, అనేక నూతన సాంకేతికలను ఆవిష్కరించారని తెలిపారు. ఈ విద్యాలయాలు ఐకార్ నిర్దేశించిన విద్యా ప్రమాణాలు పాటించలేదని, అందుకే వీటికి ఐకార్ అక్రిడిటేషన్ దక్కలెదన్నారు. వ్యవసాయ శాఖ తాజాగా జారీ చేసిన జీఎ64, జీఓ16 స్ఫూర్తిని నీరు కారుస్తూ డిపార్టుమెంటు నియామకాలకు ఐకార్ అక్రిడేషన్ అవసరమే లేదని పేర్కొంటుందన్నారు. ఏ విద్యాలయంలో పొందిన పట్టా అయినా ఒకటే అంటూ అందరికీ డిపార్టుమెంటులోకి స్వాగతం పలుకుతోంది. దీని వలన రైతాంగానికి మెరుగైన సేవలందించాలన్న జీఓ16 మహోన్నత ఉద్దేశ్యం దెబ్బతింటుందని వివరించారు. జీఓ64ను ఉపసంహరించుకోవాల్సిందిగా వ్యవసాయ పట్టభద్రులము, విద్యార్థులమైన తామంతా ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికి పవన్ కల్యాణ్ కూడా వెన్నుదన్నుగా నిలబడి తోడ్పాటునందించాలని లేఖలో కోరారు.

ఏపీఏటీ ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై హైకోర్టు ఆగ్రహం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ పరిపాలనా ట్రిబ్యునల్ (ఏపీఏటీ) వెలువరించిన ఆదేశాలను సంబంధిత ప్రభుత్వ అధికారులు అమలు చేయకపోవడం పై ఉమ్మడి హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏపీఏటీ తీర్పులను నిర్దష్ట గడువు ఏ లోగా అమలు చేస్తామని హామీ ఇస్తూ కోర్టులో ప్రమాణ పత్రం దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. ట్రిబ్యునల్ ఆదేశాలపై వివిధ శాఖల వారీగా సమీక్ష నిర్వహించి, వాటి అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి స్పష్టం చేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.నాగార్జున రెడ్డి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఇటీవల ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 28కి వాయిదా వేసింది. ఏపీఏటీ ఉత్తర్వులను అధికారులు అమలు చేయకపోవడం పట్ల హైకోర్టు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. వైద్య ఆరోగ్య శాఖ లో పని చేస్తున్న వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించేందుకు తగిన ఉత్తర్వులు జారీ అధికారులను ఆదేశిస్తూ మార్చి 2001లో ఏపీఏటీ ఆదేశాలిచ్చింది. ఏపీఏటీ ఉత్తర్వులను సంబంధిత అధికారులు అమలు చేయడం లేదని పేర్కొంటూ శ్రీనివాసరావు మరికొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ... ఏపీఏటీ జారీ చేసిన ఉత్తర్వులిచ్చి 16 సంవత్సరాలు గడిచినప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లోని అధికారులు విస్మరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంత కాలయాపన చేయడం ఎంత మాత్రం సమంజసం కాదని అసహనం వ్యక్తం చేసింది. దీంతో ధర్మాసనం అమలుకు నోచుకోని ఏపీఏటీ ఉత్తర్వులను నిర్దేశిత గడువులోగా అమలు చేస్తామని హామీ ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ధర్మాసనం ఆదేశించింది.


సెక్యూరిటీ హబ్‌గా వెంకటాయపాలెం

• అటవీ భూముల మళ్లింపుతో మరి కొంత భూమి అందుబాటులోకి • భూముల్లో పచ్చదనానికే పెద్దపీట • తాడేపల్లి బ్లాక్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్, వ్యాపార సంస్థలు

అమరావతి, ఆంధ్రప్రభ : రాజధాని అమరావతి కోసం అటవీ భూములు మళ్లింపుకు కేంద్రం అనుమతివ్వటంతో తాడేపల్లి, వెంకటాయపాలెం అటవీభూముల్లో పలు కీలక శాఖల భవనాలు నిర్మించేందుకు సీఆర్‌డీఏ కసరత్తు చేస్తుంది. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ధృడనిశ్చయంతో ఉన్న ప్రభుత్వం ప్రపంచంలోనే ఉన్నతమైన సంస్థల పెట్టుబడులను ఆహ్వానిస్తుంది. ఇప్పటికే పలు సంస్థలు తమ సంస్థలు నెలకొల్పి పనుల ప్రారంభించగా మరి కొన్ని శంకుస్థాపలు పూర్తిచేసుకున్నాయి. వీటితోపాటు మరి కొన్ని సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తుండటంతో రాజధానిలో తగినంత భూమిని సిద్ధంచేసే విధంగా ఏపీసీఆర్‌డీఏ చర్యలు తీసుకుంటుంది. ఇప్పుడు అటవీ భూముల మళ్లింపుకు అనుమతి రావటంతో వాటిల్లో ప్రభుత్వ కీలక శాఖల నిర్మాణాలు చేపట్టేవిధంగా ప్రణాళికలు రూపొందిస్తుంది. మొదటినుంచి రాజధాని ప్రాంతంలో ఉన్న అటవీ భూములపై దృష్టి పెట్టిన సీఆర్‌డీఏ కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని మొత్తం 25 అటవీ బ్లాక్ ల్లోని 12,444 హెక్టార్ల అటవీ భూమిని రాజధాని నిర్మాణాకి ఇవ్వాలని సీఆర్‌డీఏ కేంద్రాన్ని కోరింది. దాంతో కేంద్రం తొలి విడతగా 2087.09(5వేల ఎకరాల భూమి) హెక్టార్లలో విస్తరించిన తాడేపల్లి, వెంకటాయపాలెంలోని అటవీ భూమిని రాజధాని నిర్మాణంలో అంతర్భాగంగా వుండే ప్రాజెక్టుల ఏర్పాటుకు వినియోగించుకునేందుకు కేంద్రం అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. భవిషత్తులో అప్పటి అవసరాలకు అనుగుణంగా మిగిలిన బ్లాక్‌ల్లోని అటవీ భూముల వినియోగం కోసం సీఆర్‌డీఏ ప్రయత్నించనుంది. తాడేపల్లి వెంకటాయపాలెం అటవీ భూముల్లో ఆక్రమణలు లేకపోవటంతో ఒకట్రెండు నెలల్లో అవి సీఆర్‌డీఏ పరిధిలోకి రానున్నాయి. ఈవిధంగా మళ్లింపు కాబడిన భూములు పర్యావరణ హితంగా ఉండాలన్న విధాన నిర్ణయంలో భాగంగా వెంటకాయపాలెం బ్లాక్‌ల్లోని భూమిలో 60 శాతం భూమిని సీఆర్‌డీఏ పచ్చదనానికి కేటాయించనుంది.

అదేవిధంగా తాడేపల్లి బ్లాక్ లోని అటవీ భూమిలో 25-30 శాతం భూమిని పచ్చదనం కోసం కేటాంయించాల్సి వుంది. ఇప్పటికే బ్లూ-గ్రీన్ కాన్సెప్ట్‌కు పెద్దపీట వేస్తున్న సీఆర్‌డీఏ దానిని 35 శాతానికి పెంచనున్నట్లు సమాచారం. మళ్లింపు భూముల్లోని తాడేపల్లి పరిధిలో 251.77 హెక్టార్ల భూమిలో అంతర్జాతీయస్థాయి వర్తక వాణిజ్య కేంద్రానికి అభివృద్ధి చేసేవిధంగా ప్రణాళికలు రచిస్తుంది. దానిలో బాగంగానే అక్కడ ప్రతిష్టాత్మక వరల్డ ట్రేడ్ సెంటర్, బిజినెస్ సెంటర్లను నిర్మించనుంది. ఇవి కాకుండా కొన్ని కేంద్ర, రాష్ట్ర కార్యాలయాలు ఇందులో ఉండనున్నాయి. వెంకటాయపాలెం పరిధిలోని 1835.32 హెక్టార్ల అటవీ భూమిలో సింహభాగం వివిధ భద్రతా దళాలకు కేటాయించనున్నారు. దీంతో ఈప్రాంతం సెక్యూరిటీ హబ్‌గా రూపాంతరం చెందబోతుంది. ఇందులో పోలీస్ హెడ్‌క్వార్టర్లు, సీఆర్పీఎఫ్, ఎస్టీఎఫ్, గ్రేహౌండ్స్, ఆర్పీఎఫ్, ఆక్టోపస్, ఆర్మీ, నేవీ తదితర భద్రతా సంస్థలకు చెందిన ప్రధాన కార్యాలయాలు ఏర్పాటుకానున్నాయి. షూటింగ్, భద్రతాపరమైన అంశాల్లో సిబ్బంది శిక్షణకు అవసరమైన మైదానాలు, ఇతర వసతులను కూడా ఈబ్లాక్‌లో ఏర్పాటుచేయనున్నారు. అదేవిధంగా మళ్లింపు భూముల్లో పర్యావరణహితమైన సంస్థల ఏర్పాటు నిబంధన ఉండటంతో ఆవిధంగా ఏర్పాటు చేసేందుకు సీఆర్‌డీఏ సన్నద్ధం చేస్తుంది. ఆభూముల్లో నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలి కాబట్టి వాటిలో ఎక్కవశాతం ప్రభుత్వ శాఖల నిర్మాణాలను చేపట్టనున్నారు. మిగిలిన భూముల్లో అంతర్జాతీయ సంస్థల ఏర్పాటు చేసేవిధంగా సీఆర్‌డీఏ చర్యలు తీసుకోనుంది.

నంద్యాల..నిష్ఠుర సత్యాలు!



వర్తమానమెప్పుడూ వింతగానే ఉంటుంది. వివాదాస్పదంగానూ ఉంటుంది. కాలగతిలో అదే చరిత్రగా మారినప్పుడు సందేశాత్మకమవుతుంటుంది. విశేషాంశంగా మారుతుంటుంది. నంద్యాల ఉపఎన్నిక వర్తమానంలో ఎన్నో పాఠాలను నేర్పుతున్నది. రేపటి చరిత్రలో అవి గుణపాఠాలుగా చెలామణి అవుతాయో లేదో గాని మొత్తానికి భారతదేశ పార్లమెంటరీ ఎన్నికల వ్యవస్థకు మాత్రం చేతినిండా పనిపెట్టబోతున్నది.
నంద్యాల అసెంబ్లీ సీటు..దేశవ్యాప్తంగా ఉన్న నాలుగు వేల పైచిలుకు అసెంబ్లీ సీట్లలో ఒకటి. మామూలుగా చూస్తే ఇంతే. కాని చరిత్రని..వర్తమానాన్ని కలగలిపి చూస్తే దానికదే సాటి. దాదాపు రెండు నెలలుగా సాగిన రాజకీయ క్రీడ దాని పర్యవసానమే. పార్టీల రాజకీయం..స్థానిక రాజకీయం..కుటుంబ రాజకీయాలు..కుల రాజకీయాలు..ఇన్ని కారకాలు ఒకేసారి ఒకే తాటి మీదికి వస్తే అది నంద్యాల అయింది. దానికి ఒక ఉప ఎన్నిక. పేరులో మాత్రమే ఉప అని ఉంది కాని నిజానికి అదొక పెద్ద ఎన్నికే. ఆమాటకొస్తే..దేశంలో ఏ ఇతర సీట్లకూ తీసిపోని పెద్ద ఎన్నిక. కాలపరిమితి కాస్త అటుఇటుగా ఏడాదిన్నరే. కాని ఇక్కడ అదసలు విషయమే కాదు. మామూలుగా అయితే ఇలాంటి ఉపఎన్నికలు దేశంలో ఏదో ఒక మూల తరచుగా జరుగుతూనే ఉంటాయి. ఎక్కడికక్కడ దేనికదే ప్రతిష్టాత్మకమని ప్రచారం జరుగుతుంటుంది. కాని మొన్న మంగళవారం జరిగిన నంద్యాల ఉప ఎన్నిక మాత్రం పనికట్టుకుని ఎవ్వరూ ప్రచారం చేయకుండానే దానికదే జాతీయస్థాయిలో ప్రచారమై కూచుంది. అందుకే అది అనేక కోణాల్లో విభిన్నమైనదిగా గుర్తింపు పొందింది.
ఉపఎన్నిక అనగానే తెలీకుండానే కొన్ని పరిమితులు లెక్కలోకి వస్తుంటాయి. అందుకనే చాలా సందర్భాల్లో సాధారణ ఎన్నిక కన్నా అది అతిప్రధానమవుతుంటుంది. ముఖ్యంగా అధికార పార్టీకి అది పరువు ప్రతిష్టల సమస్యగా మారిపోతుంది. ప్రతిపక్షానికి ఆధిపత్య పోరాటమవుతుంది. ఎవరి బలం వారు అనివార్యంగా ప్రదర్శించుకోవాల్సిన పరిస్థితులు వాటికవే ఏర్పడతాయి. తీర్పు స్పష్టంగా కనిపించేపరిస్థితుల్లో కూడా ఒక్కోసారి చేజేతులా సంక్లిష్టం చేసుకుంటుంటారు. ఒక అసెంబ్లీ స్థానం ఖాళీ అయినప్పుడు..దాన్ని భర్తీ చేయాల్సిన రాజ్యాంగ ప్రక్రియ దరిమిలా..ఉప ఎన్నిక అవసరమవుతుంది. ఇలా చూస్తే ఇదొక చిన్న విషయంగా కనిపిస్తుంది. కాని తీరా ప్రక్రియ మొదలయ్యాక అసలు కథ మొదల వుతుంది. అప్పుడదొక చిన్న పోటీగా మొదలై. ..మొక్కుబడి తంతు అన్న భావనకు ఆస్కారమిస్తూ..స్థానిక శక్తుల ప్రాబల్యం తెరమీదికొచ్చి..పోటీతత్వం పెరిగి..రాజకీయం ప్రబలి..ఘర్షణాత్మకమై..సవాలుగా మారి..చివరకు ప్రతిష్టాత్మకమై..మరిన్ని రంగులు సంతరించుకుంటుంది. ఇది సహజంగా జరిగేదే. కాని నంద్యాల అలా కాదు. అది ఎప్పుడు చూసినా సమరాంగణమే. అదొక కులాల కురుక్షేత్రమే..రాజకీయ రంగుల రాట్నమే.నంద్యాల అంతిమ ఫలితం రావడానికి మరికొన్ని గంటల వ్యవధి మాత్రమే ఉంది. ఆ ఫలితమెలా ఉన్నా.. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ సమీకరణాలేవీ ఇప్పటికప్పుడు మారే అవకాశాల్లేవు. దాని ప్రభావం మున్ముందు ఎలా ఉంటుందన్నదాని గురించి ఇప్పుడే ఊహించలేము. అలాగని ఈజీగా కొట్టివేయడానిక్కూడా ఆస్కారం లేదు. ఏ పక్షం గెలిచినా దాని ప్రభావానికి వర్తమానంలో మాత్రం కొన్ని ప్రకంపనలు తప్పకపోవచ్చు. అవి చర్చోపచర్చలకు దారితీయొచ్చు. ఎవరికి వారు గుండె నిబ్బరంతో ముందుకు నడవడానికి ఆస్కారమివ్వొచ్చు. కాని ఇదే ఫలితం రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ధర్మామీటర్ అని కరాఖండిగా చెప్పడానికి..సూత్రీకరించడానికి ఎవ్వరూ ప్రయత్నించినా అది దుస్సాహసమే అవుతుంది. ఎందుకంటే రాజకీయాలు ఆకాశంలో మేఘాలంతటి వేగంతో క్షణక్షణం రూపం మార్చుకుంటుంటాయి. ఇవ్వాల్టి సమీకరణాలు రేపటికి దూదిపింజల్లా ఛిద్రం కావచ్చు. ఏతావాతా ఈ ఉప ఎన్నిక ద్వారా అనేకనగ్న నిజాలు తెలిసొచ్చాయి. మన దేశంలో ఎన్నికల వ్యవస్థ పటిష్టంగానే ఉన్నా..ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులు అనివార్యమవుతున్నాయి. ఏ వర్ధమాన దేశానికైనా ఇది అనివార్యమే..అభిలషణీయమే. అందుకే ఎన్నికల సంస్కరణల గురించి అదే పనిగా చర్చలు సాగుతుంటాయి. ఇప్పటికీ మార్పులు జరుగుతున్నాయి. ఓటింగు యంత్రాల దగ్గర్నుంచి..పోలింగ్ కేంద్రాల్లో స్లిప్పుల ప్రదర్శన దాకా సంస్కరణల పథంలో భాగంగా వచ్చినవే. ఇది నిరంతర ప్రక్రియ అని తెలుసు. కాని నంద్యాల ఉపఎన్నిక చూసిన వారికి సంస్కరణలు వచ్చినా అంతా సవ్యంగా సాగుతుందా అన్న అనుమానం రాక మానదు. ఔత్సాహికులు రాజకీయాల మీద అభిమానం పెంచుకుని రంగప్రవేశం చేసి నిష్కల్మష రాజకీయాలు చేద్దామనుకుంటే అది సాధ్యమేనా అన్న ప్రశ్న ఉత్పన్నం కాకమానదు. ఒకే ఒక్క అసెంబ్లీ సీటుకి..అదీ ఒక ఉప ఎన్నికకు వంద కోట్లకు పైగానే ఖర్చయినట్టు సాధికారికంగా కాకపోయినా బాహాటంగానే అందరూ ఒప్పుకుంటున్నారు. ఏడాదిన్నర కాలానికి మాత్రమే పనికొచ్చే ఒక అసెంబ్లీ సీటుకి ఆ స్థాయిలో ఖర్చు పెడితే ఇక అయిదేళ్ల పదవీ కాలానికి ఎంత వ్యయం చేయాలో ఈ పాటికే కుహనా రాజకీయ నాయకులు ఒక అంచనాకు వచ్చి ఉంటారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ఈలెక్కల ప్రకారమే వారు ప్రణాళికలు రచించుకుంటూ ఉంటారు. ఈ నేపథ్యంలో మున్ముందు ఎన్నికల ఖర్చు సొరిలేదిగా ఉండదని స్పష్టమవుతున్నది. ప్రజాప్రాతినిధ్య చట్టం ఉన్నా..ఎన్నికల నిబంధనలున్నా..ఎన్నికల వ్యయంపై పరిమితులు, నియంత్రణలున్నా చాప కింద నీరులా కోట్లకు కోట్ల డబ్బు ఖర్చవడం దేనికి సంకేతమన్న ప్రశ్నకు సమాధానమే లేదు. అలాగే ఎన్నికలనగానే మద్యం పంపిణీ ఒక అనివార్యమైన దుష్ట సంప్రదాయంగా మారింది. ఓ వంక మద్యనిషేధం డిమాండ్లు పెరిగిపోతున్నా ఎన్నికల్లో మద్యం పంపిణీకి ఎలాంటి అవధులు లేకపోవడం కొత్తగా ఎన్నికల ప్రజాస్వామ్యంలోకి రావాలనుకునే వారికి ఆశనిపాతంగా మారుతున్నది. నంద్యాల ఉప ఎన్నిక ఇదే విషయాన్ని మరొకసారి ధృవీకరించింది. ఓటర్లకు డబ్బు పంచడం..మద్యం ప్యాకెట్లు ఇవ్వడం..మహిళలకు చీరెలు..కుంకుం భరిణెలు బహుమానంగా ఇవ్వడం నిస్సందేహంగా ఓటర్లను ప్రలోభపెట్టడమే. ఇది ఎన్నికల నిబంధనల ప్రకారం నేరమే. అయినా దాన్ని అరికట్టలేకపోవడం భవిష్యత్ ఎన్నికల ప్రక్రియ మీద నీలినీడలను పరుస్తున్నది. చీరెల పంపిణీ మాటున డబ్బుల పంపిణీ యథేచ్ఛగా జరిగినా అరికట్టలేని చట్టం మన కళ్లముందు వికృతంగా నవ్వుతున్నది.సాధారణ ఎన్నికైనా..ఉపఎన్నికైనా..అది ప్రజలకు సంబంధించి నది. ప్రజల ప్రతినిధిని ఎంచుకుని ఎన్నుకునే ప్రక్రియ. కాని అది సామాన్యుడి పరిధిని ఎప్పుడో దాటిపోయింది. రాజకీయ పార్టీల హక్కుభుక్తం అయిపోయింది. ఆ ప్రాంతంలోని ప్రజలకు ఎవరు ప్రతినిధిగా ఉంటే బావుంటుందన్న కోణంలో కాకుండా తమ పార్టీకి ఎవరితోనైతే విజయం ప్రాప్తిస్తుందన్న అంశం ప్రాతిపదికగా అభ్యర్థుల ఎంపిక జరుగుతున్నది. ఇక్కడే ఎన్నికల స్ఫూర్తికి తొలి దెబ్బ పడుతున్నది. ప్రతి ఒక్క రాజకీయ పార్టీ తమ స్వీయ ప్రాధాన్యతా క్రమంలో అభ్యర్థిని ఎంపిక చేయడం మానేసి దశాబ్దాలైంది. అవతలి రాజకీయ పార్టీ ఎవర్ని ఎంపిక చేస్తున్నదో చూసి ఆ అభ్యర్థిని బట్టి తమ అభ్యర్థిని ఎంపిక చేయడం ఇటీవలి కాలంలో ఆనవాయితీగా మారిపోయింది. దీంతో ఓటరు కేవలం తమ ఓటు హక్కు వినియోగించుకునే ఒక సాదాసీదా వినియోగదారుడిగా మిగిలిపోయాడు. ఫలానా వ్యక్తికి ఓటేద్దాం అని ఓటరు భావించే వాతావరణమే లేకుండా పోయింది. బరిలో నిలిచిన వారిలో నుంచి మాత్రమే ఎంపిక చేసుకునే స్థితిలో భారతీయ ఓటరున్నాడు. ఓటరు ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండానే ప్రజల ప్రతినిధి ఎన్నికవుతున్నాడు. ఇదొక వైపరీత్యమే. ఎన్నిక ప్రక్రియను అపహాస్యం చేస్తున్న మరో వింత తంతు..ఫిరాయింపుదారులకే ప్రాధాన్యతనివ్వడం. ఒకవంక చట్టసభల్లో ఫిరాయింపుదార్లను ప్రోత్సహించ రాదని చర్చలు జరుగుతుంటాయి. అలాంటివారిని అనర్హులుగా ప్రకటించాలని ఉద్యమిస్తుంటారు. మరోవంక ఎన్నికలకు ముందు రెండు మూడు జంపింగులు చేసినవారికి పార్టీ టిక్కెట్లు ఇచ్చేస్తుంటారు. ఒక పార్టీ టిక్కెట్టు మీద గెలిచి మరో పార్టీలోకి వెళ్లి ఎమ్మెల్యేగా చెలామణి అవ్వడం ఒక అవాంఛనీయ పరిణామమైతే.. ఎన్నికలకు ముందు ఏ పార్టీకి విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయో చూసుకుని..ఏ పార్టీ టిక్కెట్టు ఇస్తుందో చూసుకుని గోడలు దూకే జంపింగ్ జపాంగ్‌లు ఎక్కువైపోయిన ఈ కాలంలో రాజకీయ నైతికతను ఆశించే సామాన్యుడికి శృంగభంగమే ఎదురవుతున్నది. ఎన్నిక ప్రచారంలో వికృత పోకడలు భయాందోళనలు కలిగిస్తున్నాయి. ఎన్నికల కోడ్ ఉంది. ప్రచారంలో ఏస్థాయిలో నియంత్రణ పాటించాలో కూడా స్పష్టత ఉంది. కాని అది కార్యరూపంలోనే విఫలమవుతున్నది. పార్టీ విధానాలను, సిద్ధాంతాలను ప్రచారం చేసుకుని..తాము అధికారంలోకి వస్తే ఏమి చేస్తామో చెప్పుకోవడానికి బదులు వ్యక్తిగత దూషణలు, నిందలు, వ్యక్తిత్వ హననాలు ఈమధ్య ఎక్కువైపోయాయి. నంద్యాల ఉప ఎన్నిక దీనికి పరాకాష్టగా మారింది. అలాగే కులాల వారీ సమావేశాలు అధికారికమయ్యాయి. ఏ కులానికి ఎన్నెన్ని ఓట్లున్నాయన్నది ఎన్నికల్లో లెక్కలు సరిచూసుకోవడం సర్వసాధారణమే అయినా..కుల సంఘాల సమావేశాలను బాహాటంగానే సాధికారికంగానే నిర్వహించడం కొత్త పరిణామం. మున్ముందు ఇది ఎన్నెన్ని విపరీత ధోరణులకు దారితీస్తుందో ఊహిస్తే ఆందోళనకరంగానే ఉంటుంది.ప్రధాని మోడీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మరిన్ని సంస్కరణలకు ప్రతిపాదనలు చేస్తున్నది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల విధానం అందులో ఒకటి. చీటికి మాటికి ఎన్నికలు జరక్కుండా నివారించడం దాని ప్రధానోద్దేశం. దానివల్ల ఉప ఎన్నికల తంతు కూడా తొలిగిపోతుందా అంటే కష్టమే. ఏదైనా కారణాల వల్ల ఒక సీటు ఖాళీ అయితే ఏళ్లకు తరబడి దానికి ఎన్నిక జరక్కపోతే అక్కడి ప్రజలకు అది అన్యాయమే అవుతుంది. అలాగని మాటిమాటికీ ఎన్నికల ద్వారా ఇలాంటి అవాంఛనీయ పరిణామాలు ప్రబలిపోయేందుకు అవకాశాలివ్వకూడదు. ఇన్నేళ్ల సార్వభౌమాధికార సువిశాల భారతదేశ ఎన్నికల వ్యవస్థలో ఇప్పటిదాకా వచ్చిన సంస్కరణలు ఒక ఎత్తయితే..ఇంకా అనివార్యమైన సంస్కరణలు అంతకు వంద రెట్లున్నాయి. అందుకే నంద్యాల ఉప ఎన్నికను ఒక ప్రయోగంగా భావించి దాన్నుంచి తెలిసిన అంశాలనాధారంగా సంస్కరణలు తెస్తే భారత ఎన్నిక వ్యవస్థకు ఎంతో ఉపయుక్తమవుతుంది.!


-వయ్యెస్సారెస్

మోడీపై యుద్ధానికి మమత సై!



మమతా బెనర్జీ మొత్తానికి మోడీ మీద యుద్ధానికే నిర్ణయించుకున్నారు. ఏ చిన్న అవకాశం వచ్చినా ఇదే వైఖరిని చేతల ద్వారా చెప్పడానికే సిద్ధమయ్యారు. తాజాగా ఆగస్టు పదిహేను సందర్భాన్ని ఆమె ఎంచుకున్నారు. దేశవ్యా ప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్ణీత పద్ధతిలో జరపాలం టూ మార్గదర్శ కాలిస్తూ కేంద్ర మానవ వనరుల శాఖ అన్ని రాష్ట్రాలకూ ఆదేశాలు జారీచేసింది. మమతా బెనర్జీ కళ్లు దానిమీద పడ్డాయి. పశ్చిమబెంగాల్‌లోని అన్ని స్కూళ్లకు, సంబంధిత విద్యాసంస్థలకు ఆమె ఆగమేఘాల మీద అర్జంట్ సర్క్యులర్లు పంపారు. ఏమనో తెల్సా? కేంద్ర ఆదేశాలను పట్టించుకోవద్దని. కేంద్రం సూచించిన ప్రకారం వేడుకల సన్నాహాలను ఆపేయాలని. సంకల్ప్ సిద్ధి ప్రతిజ్ఞ చేయనక్కర్లేదని కూడా ఆమె ఆదేశించారు. దేశభక్తి గురించి మోడీ చేత పాఠాలు చెప్పించుకునే స్థితిలో తాము లేమన్నది ఆమె అభిప్రాయం. దాన్నే ఈవిధంగా ఆమె నిరసనపూర్వకంగా ప్రదర్శించారు.

మంత్రి పదవొస్తుందేమోనని...!



ఇదొక ముంబాయ్ రాజకీయవేత్త కథ...వ్యథ.. పదవుల కోసం తామూ త్యాగాలు చేస్తుంటా మని గొప్పగా చెప్పుకుంటూనే లోలోన దాగిన తన అసంతృప్తిని సైతం బైటపెట్టుకున్నారు. ఈమధ్య ఆయన సెంట్రల్ ముంబాయ్‌లోని ఖరీదైన ప్రాంతంలో ఒకసన్నిహితుడి సలహాతో ఒక ఫ్లాట్ బుక్ చేసుకున్నాడు. ఇంతలో దేవేంద్ర ఫడ్నవిస్ తన కేబినెట్‌ని త్వరలోనే విస్తరించబోతున్నట్టు వార్తలు గుప్పుమన్నాయి. అందులో ఈ రాజకీయ నాయకుడికి పదవి రాబోతున్నట్టు ఆనోటా ఈనోటా వ్యాపించింది. ఆయనలోనూ నమ్మకం కుదిరింది. ఈసమయంలో కోట్లాది రూపాయలు పెట్టి ఫ్లాట్ కొన్నట్టు తెలిస్తే కేబినెట్ పదవి రాకపోవచ్చునని మళ్లీ అదే సన్నిహితుడు సలహా ఇచ్చాడు. ఇప్పటికే ఆయన ఉన్నట్టుండి కోటీశ్వరుడు ఎలా అయ్యాడంటూ అక్కడక్కడా గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈతరుణంలోఏకంగా ఫ్లాట్ కొంటే ఇక మంత్రి పదవి చేజారుతుందని..సదరు నాయకుడు తాను బుక్ చేసుకున్న ఫ్లాట్‌ని కేన్సిల్ చేసుకున్నాట్ట. మంత్రి పదవి ముందు కోట్ల రూపాయలు విలువ చేసే ఆ ఫ్లాట్ ఎంత!

ప్రణబ్ జీవిత చరిత్ర రాస్తారా!



తాజా మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కొత్త నివాసంలో ఇప్పుడిప్పుడే కుదురుకుంటున్నారు. రాష్ట్రపతిగా ఉన్నప్పుడు రకరకాల వ్యాపకాలుండేవి. రాజ్యాంగబాధ్యతలుండేవి. ఇప్పుడవేవీ లేవు. అలాగని ఆయనేమీ ఖాళీగా కూచోదలుచుకోలేదు. అయి దేళ్లు రాష్ట్రపతిగా రాష్ట్రపతి భవన్‌లో తన అనుభవాలను గ్రంథస్తం చేయాలనుకున్నారు. అంతే. అనుకున్నదే తడవుగా ఆయన ఆ పని ప్రారంభిం చారు కూడా. అసలే ఆయనకు వర్క్‌హాలిక్ అని పేరు. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు క్షణం తీరిక లేకుండా తనను తాను బిజీగా ఉంచుకునేవారు. ఇప్పుడు మళ్లీ ఆయనకు అలాంటి అవకాశమే వచ్చింది. ఇది అయ్యాక తన జీవిత గ్రంథాన్ని కూడా రాసే అవకాశం లేకపోలేదని ఆయన సన్నిహితులు అంటున్నారు. దీన్నిబట్టి ఆయన తనకు తానే చేతినిండా పని పెట్టుకున్నారన్న మాట!


దులపర బుల్లోడా!

స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దఎత్తున ఉద్యమ స్థాయిలో అమలు చేస్తున్నాయి. అమితాబ్ వంటి ప్రముఖులనేకమంది బ్రాండ్ అంబాసిడర్లుగా ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తున్నారు.
స్వచ్ఛ భారత్ సరే, మన ఇంటి మాటేమిటి? ఇంట్లో ఏమేమి పేరుకుపోయాయి. పనికి వస్తుందనుకుంటూ భద్రంగా పేర్చుకుంటూ వస్తోన్న చెత్తసామాను ఎంత? ఇంట్లో కార్పెంటరీ పనిచేయిస్తాం. ముక్క చెక్క మిగులుతాయి. మేకులూ పోగుపడతాయి. అక్కరకు వస్తాయని జాగ్రత్తగా సేకరించి అటకమీద భద్రపరుస్తాం.
ఇంటి పనేదో చేయిస్తాం. గంపెడు ఇసుక, గుప్పెడు సిమెంటు మిగులుతుంది. చూస్తూ చూస్తూ పారేయబుద్ధికాదు. దాన్ని నిల్వ చేస్తాం. ఏడాది తర్వాత ఏదో అవసరం వచ్చిచూస్తే ఆ సిమెంటు వాడకానికి రాకుండా రాయిలా గట్టిపడిపోయి వెక్కిరిస్తుంటుంది.
వంటింటి సంగతి చెప్పాలా? మూతలు లేకుండా విరిగిపోయిన డబ్బాలు, వంకర్లు తిరిగిన స్పూన్లు, కాడలు ఊడి వికృతంగా మారిన గిన్నెలు వార్డ్ రోబ్‌లో కురచయిపోయిన దుస్తులు, గుండీలు ఊడిపోయి, జేబులు చిరిగిన చొక్కాలు, వెలిసిపోయిన లంగాలు, లుంగీలు. వానాకాలంలో మాత్రమే పురివిప్పే గొడుగులు, రెక్కలు తొడిగే రెయిన్‌కోట్లు. తీరా బయట వానపడుతుంటుంది. హడావిడిగా గొడుగు తీసుకుని బయల్దేరబోతుంటే ఎంత తన్నుకున్నా అది తెరుచుకోదు. అవసరానికి అక్కరకు రాదు. నెమ్మదిగా రిపేరు చేయించవచ్చులే అనుకుంటూ తక్షణావసరాల కోసం కొత్త గొడుగు కొనుక్కొస్తాం. పాత గొడుగు మాత్రం అలమరలో ఒదిగి విశ్రాంతి తీసుకుంటూ ఉంటుంది. ఆ గొడుగు రిపేరు మాటే మరిచిపోతాం.
ఇవన్నీ ఒక ఎత్తు, దుమ్ము ధూళీ మరొక ఎత్తు. టేబుళ్ల కింద, కిటికీ చువ్వలు, అద్దాల మీద, ఫ్యాను రెక్కల మీద దుమ్ముదట్టంగా పేరుకుపోతుంది. దుమ్ముకు రెక్కలు ఉండవు గానీ చాలా వేల మైళ్ల దూరం ప్రయాణిస్తుందట. దేశాలు, ఖండాల ఎల్లలు దాటి వస్తుంది. ఆ లెక్కన చూస్తే ఇంట్లో పేరుకున్న దుమ్ములో రష్యా వాననలో, అమెరికా విగరో ఉన్నా ఆశ్చర్యపోనక్కర్లేదు.
ఇక మరుగుదొడ్ల మకిలి గురించి చెప్పాలా? కొందరికి ఒంటిశుభ్రం ఎక్కువ. ఏ కాలంలోనైనా పూటకో మారు స్నానం చేస్తారు, డ్రెస్సులు మారుస్తారు. నా శరీర తత్వం, ఉత్తినే చమట పట్టేస్తుంది, స్నానం చేస్తేగానీ ప్రాణంసేద తీరదు అంటుంటారు. ఒంటి శుభ్రతపై ఇలా శ్రద్ధ పెట్టేవారిలో చాలామందికి ఇంటి శుభ్రత గురించిన ఆలోచనే రాదు.
కొందరు ఇల్లాళ్లు ప్రతిరోజూ పనిమనుషుల చేత ఇంటినంతా నీళ్లుపెట్టి తుడిపిస్తారు గానీ ఇతరత్రా మురికి జోలికి మాత్రం



వెళ్లరు.
సంప్రదాయ కుటుంబాలు పండగలు పబ్బాలప్పుడు మాత్రం ఉద్యమస్థాయిలో దులుపుడు కార్యక్రమం పెట్టుకుంటారు. ఇంటి గోడలకు సున్నాలు వేయిస్తారు. గడపలకు తలుపులకు రంగులు పూయిస్తారు. గుమ్మానికి కడిగిస్తారు. ముగ్గులుపెట్టి ముచ్చట తీర్చుకుంటారు.
అమెరికా మనకంటే అభివృద్ధి చెందిన దేశం కనుక శుచీ శుభ్రత విషయంలో వారు రెండాకులు ఎక్కువే చదివారనిపిస్తుంది. ఒకటికి పదిసార్లు హేండ్ వాష్‌లకు పనిపెడతారు. ఆస్పత్రుల్లోనూ, హోటళ్లు, రెస్టారెంట్లలోనూ విరివిగా శానిటైజర్లు అందుబాటులో ఉంటాయి.
అప్పుడే పుట్టిన పాపాయిలను చూడటానికి వచ్చేవారూ విధిగా శానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసుకునే, పాపాయిని చేతుల్లోకి తీసుకుంటారు. అపరిశుభ్రంగా ఉన్న చేతులవల్లే చాలారోగాలు సంక్రమిస్తున్నాయి.
పదిమంది వాడే లిఫ్టులలో బ్యాక్టీరియా పెద్ద సంఖ్యలో జమ అవుతుందని తేల్చారు. మనదేశంలోని పెద్దనగరాల్లో పరిస్థితి కొంత మెరుగవుతున్నా ప్రజానీకంలో ఇంకా చైతన్యం రావలసి ఉంది. పెద్దహోటళ్లలో వాష్‌బేసిన్లు, హేండ్ వాష్‌లు అందుబాటులో ఉన్నా రోడ్డు పక్క దోసెలు, బజ్జీలు, జిలేబీలు చాట్‌భండార్ బళ్ల దగ్గర పరిస్థితి మాత్రం దారుణంగా ఉంటుంది. ఒక పక్క చెత్తాచెదారం, మరోపక్క పారిశుధ్య కార్మికులు రోడ్లు ఊడుస్తుంటారు. దుమ్ము రేగుతుంటుంది. ఆ దుమ్ము వచ్చి తినుబండారాలమీద పడుతుంటుంది. బళ్లలో తగిన నీటివసతి ఉండదు. ఈగలు ముసురుతుంటాయి.
దోసెలు వేసే చేతులే డబ్బులెక్కలూ చూసుకుంటాయి. చేతులు మారే ఆ కరెన్సీ ఎన్నెన్ని వ్యాధికారక క్రిములను మోసుకొస్తున్నాయో ఎవరికీ పట్టదు. చేతులకు గ్లోవ్స్ వాడండని చాదస్తులెవరైనా సూచిస్తే వారివంకవింతగా చూస్తారు. మునిసిపాలిటీలు, పంచాయతీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఇలాంటి విషయాలేమీ పెద్దగా పట్టవు.
ఆరు నెలలపాటు ఉపయోగించని వస్తువేదైనా నిరుపయోగమేనని ఒక అంచనా. కానీ పనికిరానివనుకున్నా పారేయాలంటే మనసు మాత్రం రాదు. ఏటిలో ఏగాని వేయాలన్నా ఆచితూచి ఎంచి వేయాలన్న సామెతలన్నీ అప్పుడే గుర్తుకొస్తాయి.
ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి కొన్ని విలువలు, ఆదర్శాలకు కట్టుబడి నడుచుకుంటారని చెబుతారు. ఇంట్లో పిల్లలెవరికీ ఆరు జతల కంటే మించి దుస్తులు ఉండకూడదన్నది నియమం. మరో జత దుస్తులు కొనాలంటే ఒక జత చిరిగిపోయి అయినా ఉండాలి. లేదా ఎవరికేనా దానమన్నా చేయాలి. దుస్తుల సంఖ్య మాత్రం
ఎట్టిపక్షంలో ఆరుకు మించకూడదు. ఎప్పుడో పెట్టుకున్న ఈ నియమం ఇప్పటికీ ఆచరణలో ఉందో లేదో మనకు తెలియదు. ఆడంబరాలకు ఆర్భాటాలకు దూరంగా పిల్లలను పెంచాలని ఆశించే తల్లిదండ్రులెవరైనా అనుసరించదగిన కట్టుబాటే ఇది.
భాగ్యనగరంలో వాల్ ఆఫ్ కైండ్‌నెస్ (దాతృత్వ కుడ్యం) పేరిట ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న వస్తువులను దానం చేసేలా ప్రోత్సహిస్తున్నారు. అవసరంలేని వస్తువులను అక్కడ ఉంచి వెళితే కావాలనుకున్నవారు వాటిని పట్టుకెళ్లి వాడుకుంటారు. పాఠ్యపుస్తకాలు, ఖాళీ నోటుబుక్కులు, చెప్పులు, చొక్కాలు, ప్యాంట్లు, దుప్పట్లు వంటివేవైనా తెచ్చి అక్కడ ఉంచవచ్చు. ఈ తరహా ఆలోచనలు మరిన్ని పట్టణాలకు, నగరాలకు విస్తరించటం అభిలషణీయం.
ఇలాంటి స్ఫూర్తితోనే మధ్యతరగతి జీవి ఒకరు ఇంట్లో చిరిగిపోయిన దుప్పట్లను సద్వినియోగపరచాలని తలపోశాడు. వాటిని సంచీలో వేసుకుని చలికి వణికిపోతున్నా బిచ్చగాళ్ల కోసం అన్వేషిస్తూ రోడ్డెక్కాడు. ఒకచోట
చక్రాల తోపుడుబండిపై ఒక యాచకుడు తారసపడ్డాడు. చలికాలం కదా, పాతదుప్పట్లు తెచ్చాను. పాతవే గానీ పాడవలేదు. తీసుకుంటావా? అని అడిగితే ఆ బిచ్చగాడు వద్దుగాక వద్దని తిరస్కరించడంతో ఆశ్చర్యపోయాడు ఆ పెద్దమనిషి.
దుప్పట్లను ఎందుకు వద్దంటున్నాడో కూడా అతగాడే వివరించాడు. నేను ఊరంతా తిరుగుతుంటాను. నాకు ఇల్లు వాకిలీ లేదు. మీరిచ్చే దుప్పట్ల మాటెలా ఉన్నా అవి మాత్రం నాకు భారం అవుతాయి అన్నాడు.
ఆ యాచకుడి ఆలోచనా ధోరణిని మనమూ ఆదర్శంగా తీసుకుంటే పనికొచ్చినా రాకున్నా అన్నీ పోగేయాలన్న
మనస్తత్వంలో మాత్రం తప్పక మార్పు వస్తుంది.
స్వచ్ఛ భారత్ బాటలో స్వచ్ఛ కుటుంబం నినాదంతో స్వచ్ఛందంగా ఉద్యమం చేపడితే బావుంటుంది.
దుమ్ము ధూళి చెత్తాచెదారం తొలగిస్తేనే సరిపోతుందా? బుర్రలో నుంచి పనికిరాని చెత్త ఆలోచనలనూ ఖాళీ
చేయవద్దా?

-గోవిందరాజు చక్రధర్
98498 70250



కన్యాశుల్కం @ 125

నూటపాతికేళ్ళు.. ఒక మనిషికి ఇంత వయస్సంటే.. ఆశ్చర్యమేస్తుంది. అబ్బురమనిపిస్తుంది. ఆహా అని ఆనందమేస్తుంది. ఇదే ఒక నాటకానికి నూటపాతికేళ్ళంటే. రంగస్థలమే ఉబ్బితబ్బిబ్బవుతుంది. నాటక కళామతల్లే ఉత్తుంగ తరంగమై.. నిత్యనూతనమై.. భాసిల్లుతుంది. నూటపాతికేళ్ళుగా సరిగ్గా ఇదే జరుగుతోంది.

నూటపాతికేళ్ళ క్రితం నాటి మాట.. విజయనగరంలోని జగన్నాథ విలాసిని అనే సంస్థ ఈ నాటకాన్ని ప్రదర్శించింది. అప్పటి సమాజంలోని మౌఢ్యాన్ని ఖండిస్తూ గురజాడ అప్పారావు పంతులు గారు కలం ఝుళిపించిన రచన ఇది. ఆడపిల్లని నాడూనేడూ మధ్యతరగతి జీవికి భారంగానే భావిస్తున్నారు. మూడుతరాలు మారినా ఆ దయనీయ స్థితి మాత్రం మారలేదు. మారింది ఒక్కటే... కన్యాశుల్కం కాస్తా.. వరకట్నమైంది. వృద్ధులై.. కాటికి కాళ్ళు జాపుకుని ఉన్నవారు సైతం కన్యాశుల్కాన్ని చెల్లించి, బాలికలను పెళ్ళాడడం. ఆ తదుపరి ఆ వృద్ధుడు కన్నుమూస్తే, చిన్ననాటే వైధవ్యాన్ని మూటగట్టుకుని పుట్టింటికి చేరి, శేష జీవితాన్ని కుటుంబ సభ్యుల చీదరింపుల మధ్య... అసభ్య దూషణల మధ్య నెట్టుకొచ్చేవారు ఆ చిన్నారి బాలికలు. ఈ వ్యవస్థను మార్చాలనుకుని గురజాడ వారు అక్షర శరాల్ని సంధించారు. కారణమేదైనా క్రమేపీ ఆ జాఢ్యం వదిలిపోయింది. వరకట్నంగా రూపుదాల్చింది. ఆడపిల్ల పెళ్ళి చేయాలంటే ఎదురుడబ్బిచ్చి, వరుడ్ని కొనుగోలు చేయాల్సిన స్థాయికి వచ్చింది. విషయం పక్కకెళ్ళిపోయినట్టనిపిస్తోంది కదూ!
నాటకాన్ని డబ్బులిచ్చి టికెట్లు కొనుక్కుని మరీ చూసేవారా రోజుల్లో. పాత్రధారులను బట్టి నాటకాలకు గిరాకీ ఉండేది. కన్యాశుల్కం తరవాత నాటక సారాంశానికి గిరాకీ మారింది. కన్యాశుల్కం నాటకం పూర్తి నిడివి ప్రదర్శన 13 గంటలు. ఈ నాటక శతజయంతి సందర్భంగా ఇంతటి సుదీర్ఘమైన ప్రదర్శనను కూడా ఇచ్చారు. దీనికి విశాఖ వేదికైంది. 1992 ఆగస్టులో ముగింపు ఉత్సవాల సందర్భంగా ఈ ప్రదర్శన ఏర్పాటైంది. శత జయంతి సంవత్సరం నాడు ప్రతి నెలా నాటకాన్ని ప్రదర్శించారు కళాకారులు. నాటకం.. అంశం.. పాత్రల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే.
ఆ నాటకానికి సినిమా రూపమిచ్చి, మరింత ప్రాధాన్యత తెచ్చారు. 1955 ఆగస్టు 26న ఈ చిత్రం విడుదలైంది. పి. పుల్లయ్య దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సంగీతాన్ని ఘంటసాల వెంకటేశ్వరరావు మాస్టారు సమకూర్చారు. ఆద్యంతం హాస్యస్ఫోరకంగా సాగిన ఈ చిత్రం ఆఖరులో మాత్రం గంభీరంగా మారుతుంది. గోవిందరాజుల సుబ్బారావు, విన్నకోట రామన్నపంతులు, సావిత్రి, షావుకారు జానకి, ఎన్టీ రామారావు ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రంలో లొట్టిపిట్ట అనే మాటకు మధురవాణి పాత్రధారిణి సావిత్రి రువ్విన నవ్వులు నభూతో నభవిష్యతి. ఆమె నటన చూసి, ప్రేక్షకుల కడుపు చెక్కలై, కంటనీరొచ్చేది. పూటకూళ్ళమ్మ పాత్రలో ఛాయాదేవి, ఎన్టీ రామారావు మధ్య సాగిన సంభాషణలో పదాలు ఆనటి సామాజిక జుగుప్సతకు ప్రతీకగా తీసుకున్నారు. ఆనాటి పరిస్థితిని కళ్ళకు కట్టడానికి అలా చేసి ఉంటారనుకోవచ్చు. ముసలి పెళ్ళికొడుకు పాత్రకు గోవిందరాజుల సుబ్బారావు అతికినట్టు సరిపోయారు. అప్పటికే ఆయనకు 60 ఏళ్ళు దాటాయి. ఆనాటి పాత్రలకు పాత్రధారుల ఎంపిక ఎలా ఉండేదో చెప్పడానికి గోవిందరాజుల ఓ ఉదాహరణ. గిరీశం పాత్రలో ఎన్టీ రామారావు తన శిష్యుడితో ఆంగ్ల సంభాషణ నవ్వులు పూయిస్తుంది. అమాయకులైన తల్లిదండ్రులను ఆంగ్ల పాఠ్యపుస్తకంలోని పాఠాలతో బోల్తా కొట్టించిన తీరు కడుపుబ్బ నవ్విస్తుంది. మధ్యలో పుత్తడిబొమ్మ పూర్ణమ్మ నాటకం.. కంటతడిపెట్టిస్తుంది.
జె.వి. రమణమూర్తి, రావి కొండలరావు, తదితర ప్రముఖ కళాకారులు ఆపై కన్యాశుల్కం నాటక ప్రదర్శనను ముందుకు తీసుకెళ్ళే బాధ్యతను తమ భుజస్కంధాలపై వేసుకున్నారు. రావి కొండల రావుగారి దర్శకత్వంలో చిన్నితెరకు ఎక్కింది కన్యాశుల్కం. 13 భాగాలు ప్రసారమైన ఈ నాటకంలోని ఏ ఒక్క అంశాన్నీ మార్చకుండా నాటకాభిమానుల ఆదరాభిమానాలను చూరగొన్నారు రావి కొండలరావు. ఇందులో మధురవాణి పాత్రను క్యారెక్టర్ ఆర్టిస్టు జయలలిత పోషించారు.
అన్ని నాటకాల్లాగే.. దాన్ని ప్రదర్శించిన వారి అభిరుచుల్ని బట్టి చిన్న మార్పులు చేసుకుంటూ వచ్చారు నిర్వాహకులు. కాలానుగుణంగా సంభాషణలు మార్చుకున్నారు. ఎవరు ఎలా మార్చుకున్నా సారాంశమొక్కటే. మిగిలిన నాటకాల్లా మూలాన్ని మార్చే తెగువను ఎవరూ చేయకపోవడం అభినందనీయం. కొన్ని నాటకాలు, పుక్కిటి పురాణాల ప్రభావం దీనిపై పడలేదు. డిగ్రీలో తెలుగు ఉపవాచకంగా కూడా కన్యాశుల్కం నాటకాన్ని ప్రవేశపెట్టారు కూడా.
కన్యాశుల్కం నిత్య నూతన నాటకమే ఎప్పటికీ. నాటక రచయిత గురజాడ అప్పారావు పంతులు గారు 1862 సెప్టెంబర్ 21న జన్మించారు. 1890 ప్రాంతంలో ఆయన శుద్ధ వ్యవహారిక భాషలో నాటకాన్ని రచించారు. ఆనాటి సమాజానికి పీడగా పరిణమించిన కన్యాశుల్కానికి వ్యతిరేకంగా పోరాడారు. 1915 నవంబరు 30న ఆయన కన్నుమూశారు. తెలుగు భాషా ఉద్యమకారుడు గిడుగు రామ్మూర్తి ఆయనతో కలిసి పనిచేశారు.
గురజాడ కన్యాశుల్కం నాటకాన్ని కొన్ని మార్పులతో 1896 ప్రాంతంలో తిరగరాశారు. ఆ ప్రతిని అప్పటి ఆనంద గజపతికి సమర్పించారు.
1915లో గురజాడ మరణించలేదనీ, అప్పటి నుంచే ఆయన జీవించడం ప్రారంభించాడనీ అన్న దేవులపల్లి వ్యాఖ్య ఆయన రచనా శైలిని తెలియచెబుతుంది. కన్యాశుల్కానికి సాటిరాగల రచన భారతీయ సాహిత్యంలో మృచ్ఛ కటికం తప్ప మరొటి లేదని శ్రీశ్రీ వ్యాఖ్యానించారు. కన్యాశుల్కం బీభత్స రస ప్రధానమైన విషాదాంత నాటకమనీ, కవిత్రయమంటే తిక్కన, వేమన, గురజాడ అనీ కూడా శ్రీశ్రీ తన అభిప్రాయలను వెల్లడించారు. ఆ మహాకవులిద్దరి అభిప్రాయాలు చాలవా.. ఆ నాటకం స్థాయిని చెప్పడానికి. 53వ ఏటే కన్నుమూసిన గురజాడ చేసిన ఆ రచన 125 సంవత్సరాలైనా అప్రతిహతంగా ప్రేక్షకుల మన్ననలు అందుకోవడం చూస్తే.. అది ఇక తరాల అంతరాలకు, చోటివ్వకుండా కాలానికి అతీతంగా, చిరంజీవిగా వర్ధిల్లుతుందని ఆశించవచ్చు.

-కెవిఎస్

ఎవరిది త్యాగం.. ఎవరిది ద్రోహం?!

● తమిళనాట రక్తికట్టిన రాజకీయం ● అన్నాడీఎంకేలో ముదిరిన వర్గపోరు ● ఒక్కొక్కరినీ తనవైపు తిప్పుకుంటున్న చిన్నమ్మ ● దారికి రాకుంటే పార్టీ పదవుల నుంచి తొలగింపు ● రెబల్స్‌ను పెంచే దిశగా దినకరన్ వ్యూహాలు





చెన్నై: తమిళనాడు అధికార పార్టీ అన్నాడీఎంకేలో లుకలుకలు రోజురోజుకూ ముదురుతున్నాయి. ఒకరు ఒకరి కారం కోసం ప్రయత్నాలు చేస్తుంటే.. మరొకరు పార్టీపై పట్టుకోసం ప్రయత్నాలు చేస్తున్నారు. పన్నీర్,పళని ఒక్కటైన తర్వాత అన్నాడీఎంకేలో మూడోవర్గంలో అసమ్మతి రాజుకుంది. పన్నీర్,పళని విధానాలను వ్యతిరేకిస్తున్న శశికళ మేనల్లుడు, పార్టీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ టీటీవీ దినకరన్ తన వ్యూహాలకు పదును పెంచారు. పన్నీర్,పళనిలను దెబ్బ తీసేందుకు పార్టీనే అస్త్రంగా వాడుకుంటున్నారు. తాజాగా ప్రభుత్వంలోని ఐదుగురు మంత్రులు, ప్రభుత్వ విప్ ఒకరు పార్టీ పదవుల నుంచి తొలగించి కలకలం రేపారు.

పార్టీ పదవుల నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు ఔట్

చిన్నమ్మ శశికళ ఆదేశాలను బేఖాతరు చేసి పన్నీర్,పళని పక్కన చేరిన నేతలపై అన్నాడీఎంకే డిప్యూటీ జనరల్ సెక్రెటరీ దినకరణ్ వేటువేసారు. శశికళకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణల నేపథ్యంలో ఉన్నతవిద్యాశాఖ మంత్రి కె.పి అన్బలగాన్‌ను ధర్మపురి జిల్లా కార్యదర్శి పదవి నుంచి తొలగించారు. అన్బలగాన్ స్థానంలో స్థానిక నాయకుడు వి.కె రాజేంద్రన్‌ను నియమిస్తున్నట్లు చిన్నమ్మనుంచి ఆదేశాలు వచ్చాయని దినకరన్ ప్రకటించారు. రెండ్రోజుల క్రితమే నలుగురు మంత్రులను కూడా పార్టీ పదవుల నుంచి తొలగిస్తూ దినకరన్ కలకలం రేపారు. అన్నాడీఎంకే అరియలూర్ జిల్లా కార్యదర్శి పదవి నుంచిరాజేంద్రన్‌ను తొలగిస్తూ..ఆస్థానంలో పి.మతివన్‌ను నియమించారు. రాజేంద్రన్‌తో పాటు విల్లుపూరం(దక్షిణ), శివగంగ జిల్లాల కార్యదర్శులపై కూడా వేటు పడింది. సీఎం పళని స్వామి బలపరీక్షకు డిమాండ్ చేస్తున్న 19 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటువేయాలని ప్రభుత్వ విప్ రాజేంద్రన్ అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయనను పార్టీపదవికి దూరం చేసినట్లు తెలుస్తోంది. దినకరన్ సైన్యం మొత్తం చిన్నమ్మ ఆదేశాల మేరకే జరుగుతుందని పార్టీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అక్రమాస్తుల కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న శశికళ జైలు నుంచి అంతర్గత మార్గాలు కూడా చిన్నమ్మ ఆమోదంతోనే జరుగుతున్నాయని దినకరన్ పేర్కొనడం గమనార్హం.

గవర్నర్ మంచి నిర్ణయమే తీసుకుంటారు: దినకరన్

తమిళనాడులో నెలకొన్న రాజకీయ ప్రతిష్ఠంభనకు గవర్నర్ విద్యాసాగర్‌రావు మార్గం చూపిస్తారని అన్నాడీఎంకే పార్టీ డిప్యూటీ సెక్రెటరీ దినకరన్ అన్నారు. అన్నాడీఎంకే పార్టీలో నెలకొన్న విభేదాలపై గవర్నర్ మంచి నిర్ణయమే తీసుకుంటారన్నారు. విద్యాసాగర్ రావు న్యాయ నిపుణుడు అన్న దినకరన్.. త్వరలోనే ఆయన నుంచి మంచి వార్తను వింటామని ఆశాభావం వ్యక్తం చేశారు.పార్టీని కాపాడేందుకు తాను ప్రభుత్వంపై తిరుగుబాటు ప్రకటించానని చెప్పుకొచ్చారు. ఇప్పటికే ప్రభుత్వానికి వ్యతిరేకంగా 19 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయగా..మరో ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా తమకు మద్దతు పలుకడంతో మొత్తం మద్దతుదారుల సంఖ్య21 కి చేరిందన్నారు.. ఇది త్యాగానికి, ద్రోహానికి మధ్య జరుగుతున్న యుద్ధమని అభివర్ణించిన దినకరన్..తమకు మద్దతు పలికే వారిసంఖ్య ఇంకా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమకు మద్దతు పలికే ఎమ్మెల్యేలు డబ్బుకు అమ్ముడుపోయిన వారు కాదని...పార్టీ అభివృద్ధిని కాంక్షించే వారే తమతో ఉన్నారని స్పష్టం చేశారు.

దినకరన్‌కు మరో ఎమ్మెల్యే మద్దతు

తమిళనాడు ప్రభుత్వంపై తిరుగుబాటుకు దిగుతున్న అధికార పార్టీ అన్నాడీఎంకే ఎమ్మెల్యేల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. తాజాగా విల్లివక్కం ఎమ్మెల్యే వీటీ కలైసెల్వం సీఎం పళనిస్వామిని వ్యతిరేకిస్తూ.. దినకరన్ గూటికి చేరుకున్నారు. దీంతో చిన్నమ్మ మద్దతుదారుల సంఖ్య 21కి చేరింది. ఫిబ్రవరి 18న పళనిస్వామిపై జరిగిన బలపరీక్షలోకూడా వ్యతిరేకంగా ఓటు వేసిన పన్నీర్ వర్గంతో పళని వర్గం ఏకమవడం తనను బాధించిందని కలైసెల్వం తెలిపారు. పార్టీకి మార్గదర్శకుడు దినకరన్ మాత్రమేనని ఆమె వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోని పలువురు మంత్రులు పార్టీ వ్యవహారాలను సరిగ్గా చూడటం లేదని కూడా ఆరోపించారు.

ప్రభుత్వం మెజారిటీ నిరూపించుకోవాలి: స్టాలిన్

అన్నాడీఎంకే పార్టీలోని వర్గపోరును ప్రతిపక్ష డీఎంకే క్యాష్ చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మురం చేసింది. అధికార పార్టీ నుంచి పలువురు ఎమ్మెల్యేలు వైరివర్గంలో చేరడంతో ప్రతిపక్షం రెచ్చిపోయింది. పళని ప్రభుత్వం మెజారిటీ నిరూపించుకోవాలని గవర్నర్ సీఎంను ఆదేశించాలని డీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్ స్టాలిన్ డిమాండ్ చేశారు. గవర్నర్ తక్షణమే ఆదేశాలు జారీ చేయకుండా బలపరీక్ష సమయంలో అసెంబ్లీలో హార్స్ ట్రేడింగ్ నడుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.పదవుల కోసం కొంతమంది నాయకులు రాజ్యాంగంలోని నిబంధనలు కూడా ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. 19 మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన వెంటనే...సీఎం బలపరీక్షకు ఆదేశించాలని గవర్నర్‌కు లేఖ రాసిన స్టాలిన్ మరోమారు తమ పార్టీ డిమాండ్‌ను బయటపెట్టారు. పన్నీర్,పళని వర్గాల విలీనాన్ని వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్యేలే ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన రెబెల్స్ గా మారారని గవర్నర్‌కు వివరించారు. పాండిచ్చేరి లోని రిసార్ట్ లో ఉన్న దినకరన్ వర్గ ఎమ్మెల్యేలపై వేటువేయాలని ప్రభుత్వం స్పీకర్‌కు ఫిర్యాదు చేయడం కూడా డ్రామాగా స్టాలిన్ అభివర్ణించారు.



ఖైరతాబాద్‌లో భారీ వినాయకుడి విగ్రహాన్ని సందర్శించిన గవర్నర్ నరసింహన్, తదితరులు

ఐసిస్‌పై ఇరాక్ మరో విజయం

చారిత్రక కోట తల్ ఆఫర్ స్వాధీనం



బాగ్దాద్ : ఇరాక్ సైన్యం ఇస్లామిక్ స్టేట్(ఐసిస్) ఉగ్రవాదుల ఆట కట్టించింది. ఐసిస్ ఉగ్రవాదుల ఆధీనంలో ఉన్న చారిత్రక కోట తల్ అఫర్ సెంటర్‌ను ఇరాక్ సైన్యం చేజిక్కించుకుంది. ఇరాక్‌లో పాగా వేసేందుకు తల్ అఫర్ సెంటర్‌ను ఆక్రమించిన ఐసిస్‌కు ఇది పెద్ద దెబ్బే అని ప్రభుత్వం ప్రకటించింది. తమదేశంలో ఐసిస్‌ను సమూలంగా రూపుమాడటంలో ఇదో విజయంగా భావిస్తున్నట్లు పేర్కొంది. 2014లో ఇరాక్‌లోని కీలక ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్న ఐసిస్ ఉగ్రవాదులు చాలాకాలం పాటు మారణహోమం సృష్టించారు. ఐసిస్ పని పట్టేందుకు పటిష్టమైన ప్రణాళికతో సైన్యాన్ని రంగంలోకి దించింది. ఐసిస్ ఛాయలు తమ దేశంలో లేకుండా చేసేందుకు కసరత్తు చేస్తోంది. మోసూల్ నగరాన్ని తిరిగి పొందడం ఐసిస్ పై విజయమేనని ఇరాక్ ప్రధాని హైదర్ అల్ అబ్బాసి ఇటీవలే ప్రకటించారు. అమెరికా సైన్యం సహకారంతో ఐసిస్‌ను అంతమొందించేందుకు ఇరాక్ సైన్యం ముందుకు కదులుతోంది. తల్ అఫర్ లో దాదాపు 2 లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారు.

చైనా తెంపరితనం ఒక పరిధిలోనే: అమెరికా

వాషింగ్టన్: ట్రంప్ హెచ్చరికల తరువాత పాకిస్థాన్‌ను చైనా వెనకేసుకు వచ్చినా, అఫ్గానిస్థాన్‌లోనూ, దక్షిణాసియాలోనూ శాంతికే చైనా కట్టుబడి ఉండే అవకాశం ఉందని అమెరికా భావిస్తోంది. ఇటీవల అఫ్గానిస్థాన్ పై అమెరికా విధానాన్ని ప్రకటించిన ట్రంప్ పాక్‌ను తీవ్రంగా విమర్శించిన విషయం తెలిసిందే. ఆ దేశం ఉగ్రవాదులకు స్వర్గధామమని మండిపడ్డారు కూడా. అయితే.. చైనా మాత్రం ఈ ప్రాంతంలో స్థిరత్వానికే ప్రాధాన్యం ఇస్తుందని అమెరికా ప్రభుత్వంలో సీనియర్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. అందుకు ఒన్ బెల్ట్ ఒన్ రోడ్ (ఓబీఓఆర్)ను తార్కాణంగా చూపారు. ఈ ప్రాజెక్టు వల్ల ఆసియా, యూరోప్, ఆఫ్రికాలను రహదారులతోనూ, సముద్ర మార్గాలతోనూ కలపాలని చైనా యోచిస్తోంది. దీని వల్ల పురాతన సిల్క్ రూట్ కూడా తిరిగి ఏర్పడడమే కాక, ఆసియా, యూరోప్‌లు వాణిజ్యపరంగా కలుస్తాయి. దీంతో అనవసరమైన రాద్ధాంతాలకు ఒకపరిధికి మించి చైనా పోకపోవచ్చని అమెరికా అంచనాగా ఉంది.

చైనా, రష్యా, టర్కీలకు పాక్ విదేశాంగ మంత్రి


ఇస్లామాబాద్: అమెరికా హెచ్చరికలు, భారత్‌తో తెగని వివాదాల నేపథ్యంలో పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఖ్వాజా మొహమ్మదద్ ఆసిఫ్ చైనా పర్యటనకు వెళ్లనున్నారు. ఆ తరువాత ఆయన రష్యా, టర్కీల ను కూడా సందర్శిస్తారు. ఈ మూడు దేశాలతోనూ ఆయన అఫ్ఘాన్‌పై అమెరికా విధానంపై చర్చలు జరుపుతారని తెలుస్తోంది. అఫ్గాన్‌లో శాంతి కోసం ఆయన అన్ని దేశాల ఏకగ్రీవ అభిప్రాయం కోసం కృషి చేస్తారని తెలుస్తోంది. ఇంతకు మునుపు ఆయన అమెరికాకు వెళ్లి ద్వైపాక్షిక చర్చలు జరపాలన్నది ప్రణాళిక. అయితే.. అమెరికా ప్రకటించిన అఫ్గాన్ విధానంతో పాక్ తన మనసు మార్చుకున్నట్లు కనబడుతోంది. అమెరికాతో చర్చించడం లాభం లేదని, భారత్‌కు వ్యతిరేకంగా స్థానికంగానే మద్దతు కూడగట్టాలన్న యోచనలో ఉంది. అఫ్గాన్ విధానంలో పాక్‌కు బదులుగా భారత్‌కు ఎక్కువ పాత్రను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చారు. పాక్‌కు జారీ చేసిన హెచ్చరికలతో దిమ్మదిరిగిన ఆ దేశం చైనా ప్రాపకం కోసం తాపత్రయపడుతోంది.

పాక్‌పై అమెరికా కఠిన చర్యలు!

వాషింగ్టన్: ఉగ్రవాద మూకల పైన పాక్ చర్య తీసుకునేలా చేయడానికి ఏం చేయడానికైనా అమెరికా సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. వారి మీద చర్య తీసుకోవడం పాక్‌కే మంచిదని తెలిసివచ్చేలా చేయొచ్చని సీనియర్ అమెరికన్ అధికారి ఒకరు అన్నారు. తన పేరు వెల్లడించొద్దన్న ఆ అధికారి, అమెరికా దక్షిణాసియా పరిస్థితిని సరిగా పట్టించుకోకపోవడమే, పాక్ ఉదాసీనతకు కారణంగా అభిప్రాయబడ్డారు. పాక్‌కు అమెరికా తీవ్రంగా హెచ్చరికలు జారీ చేయడం, సాయాన్ని ఆపడం, భారత్‌కు ప్రాధాన్యత పెంచడం వంటి చర్యల వల్ల ఉగ్రవాదుల మీద పాక్ చర్యలు తీసుకోక తప్పదని అమెరికా భావిస్తోంది. అఫ్గాన్‌లో అమెరికా యుద్ధానికి అంతం పలకడానికి పాక్ సిద్ధంగా లేకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని ట్రంప్ హెచ్చరించారు. దీంతో పాక్ మీద కఠిన చర్యలు తీసుకోవడానికి అమెరికా ఇక ఏ మాత్రమూ వెనకాడదని ప్రభుత్వంలో సీనియర్ అధికారులందరూ ఒక నిర్ణయానికి వచ్చేసారు. ఈ మేరకు అమెరికా ఒక వ్యూహం కూడా రూపొందించనుందని ఆ వర్గాలు పీటీఐకి తెలిపాయి. ఆసియాలో అమెరికాకు పాక్ ఎంత దగ్గరైనప్పటికీ, వారుచేయాల్సిన పనులు చేయకుంటే.. అమెరికా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకుంటుందన్నది కొత్త విధానంగా ఉంది. అమెరికాతో భాగస్వామ్యం వల్ల పాక్‌కే ఎక్కువ లాభమని అమెరికా తేల్చింది.

ఆగని లాలూ... జరగనున్న సభ

● పట్నాలో నేటి సభకు సర్వం సిద్ధం ● సఫలమవుతుందన్న ధీమాతో ఆర్జేడీ అధినేత ● లాలూ కుమారులే అంతా అయి నడిపిస్తున్న వైనం



పట్నా: బీజేపీ భగావ్, దేశ్ బచావ్ ర్యాలీకి లాలూ అన్ని విధాలా సిద్ధమయ్యారు. ఆదివారం జరగనున్న ఈ ర్యాలీని ఆయన వరదల నేపథ్యంలోనూ రద్దు చేసుకోకపోవడం గమనార్హం. ర్యాలీ నిర్వహణలో ఆయన ఇద్దరు కుమారులు తేజ్ ప్రతాప్ యాదవ్, తేజస్వి యాదవ్ ఈ ర్యాలీ సఫలం కావడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు. జనతాదళ్ (యూ) రెబెల్ శరద్ యాదవ్ హాజరు కానున్న ఈ ర్యాలీకి తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గులాం నబీ అజాద్ హాజరు కానున్నారు. సీపీఐ నుంచి సుధాకర్ రెడ్డి హాజరవుతున్నా, సీపీఎం నుంచి సీతారాం ఏచూరి, బీఎస్పీ అధినేత్రి మాయావతి హాజరు కావడం లేదు. ఏఐసీసీ అధినేత్రి సోనియా కూడా హాజరు కాకూడదని నిర్ణయించిన తరువాత కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ నార్వేకు వెళ్లిపోయారు. అయినా.. ఏ మాత్రం వెనుకంజ వేయకుండా లాలూ తన ర్యాలీని జరపనున్నారు. ఈ సమావేశంలో ఆయన తన చిన్న కుమారుడు తేజస్వీ యాదవ్‌ను ఆర్జేడీ నుంచి నాయకుడిగా చూపించనున్నారు. సత్తు, చురాలనే బీహార స్థానిక ఆహారాన్ని తీసుకుని తన పార్టీ అభిమానులంతా పట్నాలోని ర్యాలీకి హాజరవుతున్నారని లాలూ విలేకరులతో చెప్పారు. ఈ నేపథ్యంలో పట్నా నగరమంతా ఆర్జేడీ పతాకం రంగు ఆకుపచ్చమయమైంది. పట్నాలో ఆకుపచ్చ టోపీలు, జెండాలు ధరించిన కార్యకర్తలు భారీగా హోర్డింగులు ఆర్చిలతో నగరాన్ని నింపేసారు. గాంధీమైదాన్‌లో జరగనున్న ఈ ర్యాలీలో లాలూ చిన్న కుమారుడు తేజస్వియే ప్రధాన ఆకర్షణ అని తెలుస్తోంది. అయితే.. వరద బాధిత ప్రాంతాలైన సీమాంచల్, కోశి, మిథిలాంచల్ ప్రాంతాల నుంచి సభకు జనాన్ని తరలించడం లాలూకు కొంచెం కష్టమే కావచ్చు.

శరద్ యాదవ్‌ను తొలగించనున్న జేడీ(యూ)!

లాలూ సభ నేపథ్యంలో శరద్ యాదవ్‌ను పార్టీ నుంచి తొలగించడానికి జనతాదళ్ (యూ) సిద్ధమైంది. ఆరు నూరైనా తాను ఆదివారం నాటి లాలూ ర్యాలీలో పాల్గొంటానని శరద్ తేల్చి చెప్పడంతో జేడీ(యూ) అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే.. శరద్‌పై ఏ చర్య తీసుకుంటారన్నది ఇంకా తెలియరాలేదు. పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశానికీ శరద్ యాదవ్ హాజరు కాకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో జేడీ(యూ) ప్రధాన కార్యదర్శి కేసీ త్యాగి శరద్ యాదవ్‌కు ఒక లేఖ రాసారు. ఆయనను పార్టీ నుంచి తొలగించడమే కాక, రాజ్యసభ సభ్యత్వంపై కూడా అనర్హత వేటు వేయడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ''మీరు ఆర్జేడీ నిర్వహించనున్న ర్యాలీలో పాల్గొనాలని నిర్ణయించుకున్నందున మీరు పార్టీని వదలి వెళ్లాలని నిర్ణయించుకున్నారని భావించాలి'' అని త్యాగి తన లేఖలో పేర్కొన్నారు. దీంతో సదరు ర్యాలీలో శరద్ పాల్గొనగానే ఆయన రాజ్యసభకు అనర్హుడిగా ప్రకటించాలని జేడీ(యూ) కోరే అవకాశం ఉంది. ఇందుకు భారత రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌ను జేడీ(యూ) తీసుకుంటోంది. ఇందులో క్లాజ్ రెండు (ఏ) ప్రకారం ఒక వ్యక్తి తాను ఏ రాజకీయ పార్టీలో ఉన్నాడో ఆ సభ్యత్వాన్ని వదులుకుంటే.. రాజ్య సభ సభ్యత్వానికీ అనర్హుడు అవుతాడు. శరద్ యాదవ్ పదవీ కాలం 2022 నాటికి పూర్తవుతుంది. శరద్ యాదవ్ నిర్వహించిన జనసం వాద్ కార్యక్రమానికి జేడీ(యూ) నుంచి కార్యకర్తలూ పెద్ద సంఖ్యలో హాజరు కాలేదు. నాయకులూ మద్దతు తెలపలేదు.

ఢిల్లీలో ఘనంగా వినాయక నవరాత్రి వేడుకలు

లంబోదరుడికి తెలుగు సంఘాల ప్రత్యేక పూజలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: దేశ రాజధాని ఢిల్లీలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. వివిధ తెలుగు సంఘాల ఆధ్వర్యంలో హస్తినలోని పలు ప్రాంతాల్లో నవరాత్రి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ / తెలంగాణా భవన్ ప్రాంగణంలో గణపతి మంటపాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. రోజూ అన్నదానం, వేద పండితుల ప్రవచనాలు, తాడేపల్లిగూడెం నుంచి వచ్చిన బృందంచే హరికథా కాలక్షేపం, అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పెద్ద సంఖ్యలో తెలుగు వారు, భవన్ సిబ్బంది, అధికారులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని తమ భక్తి ప్రపత్తులను చాటుకుంటున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో మూడో రోజే లంబోదరుణ్ని యమునా నదిలో నిమజ్జనం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. మేళతాళాల మధ్య పార్వతీ తనయుడికి వీడ్కోలు పలుకుతామని అన్నారు. ఆంధ్రా ఆసోసియేషన్ ఆధ్వర్యంలో గోల్ మార్కెట్ ప్రాంతంలోనూ గణేష్ మంటపాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో తెలుగు వారు తరలి వచ్చి వక్ర తుండుడికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. తీర్థ ప్రసాదాలతో ఆయనను పూజిస్తున్నారు. మందిర్ మార్గ్ ప్రాంతంలో అఖిల భారత హిందూ మహాసభ ప్రాంగణంలోనూ వినాయక నవరాత్రి ఉత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. ఢిల్లీలోని వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న తెలుగు, ఉత్తరాది వారితో సభా ప్రాంగణం రద్దీగా మారుతోంది. మరో వైపు ఉత్తరాది వారూ బొజ్జ గణపయ్యను తమ శైలిలో ఆరాధిస్తున్నారు. ''గణపతి బప్పా మోరియా... మంగళ మూర్తీ మోరి యా'' అంటూ భక్తిశ్రద్ధలతో భజనలు చేస్తున్నారు. ఇళ్లలో నూ గణేష్ ప్రతిమలను పెట్టి కోలాహలంగా నవరాత్రి వేడుకలు జరుపుతున్నారు. మరోవైపు విగ్రహాలు, వినాయకుడికి సమర్పించే పత్రి, పూజా సామగ్రి తెలుగు రాష్ట్రాల నుంచి రావడంతో వాటి ధరలు ఆకాశాన్నంటాయి. మామూలు కంటే రెండింతలు రేట్లు పెరిగిపోయాయి. అయినా భక్తులు రేట్లకు వెనుకాడకుండా పండుగకు కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేశారు. పూజా సామగ్రి కొనుగోలు చేసే భక్తులతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంటోంది.

బీహార్‌కు రూ.500 కోట్ల సాయం



పూర్ణియా (బీహార్): ప్రధాని నరేంద్ర మోడీ బీహార్‌లోని వరద బాధిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే జరిపారు. శనివారం ఈ సర్వే తరువాత రాష్ట్రానికి రూ. 500 కోట్ల సాయం ప్రకటించారు. దీంతో పాటు వరదల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ. రెండు లక్షల చొప్పున నగదు సాయం చేస్తామని చెప్పారు. జరిగిన పంట నష్టాన్ని అంచనా వేయాలని బీమా కంపెనీలకు సూచించారు. ఏరియల్ సర్వే అనంతరం బీహార్ సీఎం నితీశ్ కుమార్, డిప్యూటీ సీ ఎం సుశీల్ కుమార్ మోడీ, ఇతర సీనియర్ అధికారులతో సమావేశమైన అనంతరం మోడీ ఈ నిర్ణయాలను ప్రకటించారు. ఈ సమీక్షా సమావేశం తరువాత రాష్ట్రానికి ఏ సాయమైనా చేస్తానని మోడీ ప్రకటించారని ప్రధాని కార్యాలయం తెలిపింది. తాజా అంచనాల ప్రకారం బీహార్‌లో వరదల కారణంగా 418 మంది మరణించగా, 1.67 కోట్ల మంది నిరాశ్రయులవడమో లేక వరద బాధిత ప్రాంతాల నుంచి తరలడమో జరిగింది. ఇప్పటికే రూ. 2,000 కోట్ల మేర వివిధ వస్తువుల పంపిణీ జరిగిందని తెలుస్తోంది. బీహార్ లో రహదారులకు జరిగిన నష్టాన్ని కేంద్ర ఉపరితల రవాణా శాఖ సరి చేస్తుందని మోడీ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో నేపాల్‌తో కలిసి భారత్ ఆ దేశ సరిహద్దు రాష్ట్రాల్లో వరదల నివారణకు కృషి చేస్తుందని చెప్పారు. జేడీ(యూ), బీజేపీ కలిసి బీహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తరువాత రాష్ట్రానికి మోడీ రావడం ఇదే ప్రథమం.



హెచ్‌సీఎల్ టెక్నాలజీ చేతికి అర్బన్ ఫుల్‌పిల్‌మెంట్ సర్వీసెస్

న్యూఢిల్లీ : దేశంలోని అతి పెద్ద ఐటి సర్వీసెస్ కంపెనీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీ నాలుగో స్థానంలో ఉంది కాగా అర్బన్ ఫుల్‌ఫిల్‌మెంట్ సర్వీసెస్ ఎల్ఎల్‌సీ శుక్రవారం నాడు టేకోవర్ చేసింది. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఏప్రిల్‌లో హెచ్‌సీఎల్ అర్బన్ ఫుల్‌ఫిల్‌మెంట్ సర్వీసెస్‌ను టేకోవర్ చేయబోతున్నట్లు ప్రకటించింది. ఇక అర్బన్ ఫుల్‌పిల్‌మెంట్ విషయానికి వస్తే కుదవ వ్యాపారంతో పాటు బిజినెస్ ప్రాసెస్ వ్యాపారం చేస్తోంది. టేకోవర్‌ను ఈ నెల 24నే పూర్తి చేసినట్లు హెచ్‌సీఎల్ బీఎస్ఈకి సమాచారం అందించింది. యూఎఫ్ఎస్ విషయానికి వస్తే ఈ కంపెనీని 2002లో స్థాపించారు. సుమారు 350 మది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అమెరికాలో మొత్తం మూడు సెంటర్లున్నాయి. యుఎఫ్ఎస్‌లో మొత్తం 100 శాతం టేకోవర్ చేసినట్లు కంపెనీ ఒక ప్రకటనలో వివరించింది. 30 మిలియన్ డాలర్లు మొత్తం నగదు చెల్లించి టేకోవర్ చేసినట్లు ప్రకటనలో వివరించింది. ఈ టేకోవర్‌తో యూఎఫ్ఎస్ కుదవ వ్యాపారం, బీపీఓ సర్వీసెస్‌ను మరింత బలోపేతం చేస్తామని పేర్కొంది.



ఇన్ఫీకి నీలేకనే ఆధార్!

(హైదరాబాద్, ఆంధ్రప్రభ బిజినెస్ బ్యూరో): నారాయణమూర్తి నేతృత్వంలోనే నడక నేర్చుకున్న నీలేకన్నీ మళ్లీ ఛైర్మన్‌గా పగ్గాలు తీసుకోవడంతో మార్కెట్‌కు కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. తొలితరపు ఐటి దిగ్గజంగా ఇన్ఫోసిస్ రూపొందడంలో నారాయణమూర్తితో పాటు నీలేకన్నీ వంటి మొదటితరపు ఉద్యోగులూ కీలకపాత్రే పోషించారు. అంతేకాకుండా 2002-2007 మధ్యకాలంలో నీలేకన్నీ మొదటిసారి ఇన్ఫోసిస్ ఛైర్మన్‌గా పదవీబాధ్యతలు నిర్వహించారు. సంస్థ ఆదాయం, లాభాలను పెంచే విషయంలోను, ఉద్యోగుల నమ్మకాన్ని చూరగొనడంలోనూ ఆ టైములో నీలేకన్ని విశేష ప్రతిభ కనబరిచారని విశ్లేషకులు చెబుతారు. నీలేకన్ని రాకతో ఇన్ఫోసిస్ పూర్వ వైభవాన్ని పొందే సూచనలున్నాయని వారంటున్నారు.


టిసిఎస్, విప్రో వంటి ఇతర సంస్థలలాగే భారత ఐటి దిగ్గజంగా పేరొందిన ఇన్ఫోసిస్ కూడా ఆదాయం, లాభాల విషయంలో తీవ్ర వత్తిడి ఎదుర్కొంటున్న మాట నిజం. అంతర్జాతీయంగా ఐటి సేవల రంగంలో చోటు చేసుకున్న, చేసుకుంటున్న పరిణామాలు, ఏటా పెరుగుతున్న ఉద్యోగుల జీతాలు, ఇతర నిర్వహణా వ్యయాలు అన్నింటికీ మించి మార్కెట్ అంచనాలు ఇన్ఫోసిస్‌ను వత్తిడికి గురిచేస్తున్న అంశాలు. ఈ సవాళ్లన్నింటినీ సమర్థంగా ఎదుర్కొనే నాయకుడు సిఇఓగా దొరికేదాకా నీలేకన్ని పరిస్థితులను సమర్థంగా చక్కదిద్దగలరని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

నారాయణమూర్తి మనసులో భావాన్ని గుర్తించగల నైపుణ్యంతోపాటు ఉద్యోగుల మనస్తత్వాన్ని అంచనా వేయడంలోనూ దిట్టయిన నీలేకన్నికి ఇన్వెస్టర్ల ప్రయోజనాల పరిరక్షణా కొత్త కాదు. కాకపోతే కొంత విరామం రావడంతో, చురుగ్గా చర్యలు తీసుకోవడానికి కొంత సమయం పట్టొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోసారి ఇన్ఫోసిస్ తన సత్తా చాటుతుందని అంతర్జాతీయంగానూ నిలబడుతుందని ఈ వర్గాలు భావిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆధార్ ప్రాజెక్టు అధినేతగా అందరి మన్ననలూ చూరగొన్న నీలేకన్నీ తన ఫామ్ కోల్పోలేదని వారి అభిప్రాయం.

నారాయణమూర్తి సహా సంస్థాగత పెట్టుబడిదారులూ కోరడంతో నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ పదవిని అంగీకరించానని, అందరి ప్రయోజనాలను పరిరక్షించాల్సిన బాధ్యత తనపైన వుందని స్పష్టం చేస్తున్న నీలేకన్నికి భవిష్యత్తులో వెంటనే ఏం చేయాలి, నెమ్మదిగా ఏం చేయాలనే దాని మీద అవగాహన వుందనడానికి ఉదాహరణగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. తొలితరపు ప్రమోటర్లలాగా పాలన విషయంలో ఇప్పటి ఇన్ఫోసిస్ మెలగడం లేదన్న అంశాన్ని నారాయణమూర్తితో పటు, మరికొంత మంది వ్యవస్థాపకులూ ఇటీవల లేవనెత్తారు. అందరి ఆమోదంతో తాను కొత్త బాధ్యత స్వీకరిస్తున్నానని చెబుతున్న నీలేకన్ని ఈ విషయంలో కూడా స్పందించారు. డైరెక్టర్ల బోర్డు - పరిపాలన విషయంలో తగిన మార్పులు వుంటాయని సూచనప్రాయంగా తెలిపారు.

టీమునీ, ఇన్వెస్టర్లనూ, ఇతర స్టేక్ హోల్డర్లనూ అందరినీ ఏకతాటి మీదకు తీసుకు రాగలననే ఆత్మవిశ్వాసం నీలేకన్ని వ్యక్తపరుస్తున్నారు. నిజానికి ఆధార్ వంటి మెగాప్రాజెక్టు విజయం సాధించడంలో ఈ వైఖరే కారణమని చెబుతున్నారు. ఆధార్ ఎందుకు ఆవశ్యకమనే విషయంలో మారిన ప్రభుత్వాన్నీ అంగీకరింప చేయడాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. 26వ ఏట ఇన్ఫోసిస్‌లో తొలిసారి ఉద్యోగిగా చేరిన నీలేకన్నీ 62వ ఏట మరోసారి నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం మరో విశేషంగా చెప్పుకోవచ్చు.

కార్పొరేట్ గవర్నెన్స్ పాటించడంలో ఇన్ఫోసిస్ వెనకబడుతోందని ఇటీవల నారాయణమూర్తి అభిప్రాయపడ్డారు. నిజానికి దేశంలోని ఐటి సేవల రంగ కంపెనీలు ఇన్ఫోసిస్ బోర్డు మీటింగ్ తర్వాత తమ బోర్డు మీటింగ్ తేదీలను ఖరారు చేసుకోడం చాలా మందికి తెలుసు. అంతే కాకుండా భవిష్యత్తు పనితీరు మీద అంచనాలు విడుదల చేసే విషయంలో ఇన్ఫోసిస్ ఎంత నిక్కచ్చిగా వ్యవహరించిందో కూడా వారందరికీ అవగాహనలో వుంది. కార్పొరేట్ గవర్నెన్స్ విషయంలో ఉత్తమ పనితీరు ప్రదర్శించడంలో ఇన్ఫోసిస్ ముందుండేది. దేశంలోని సెక్యూరిటీస్ మార్కెట్ నియమావళి మార్పులను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ, అందుకనుగుణంగా వ్యవహరిస్తుందనే పేరు సంపాదించుకుంది. ఇలాంటి విషయాలలో నీలేకన్నీ కొత్తగా నేర్చుకోవల్సినది ఏమీ వుండదు....ఎందుకంటే ఇవన్నీ ఆయనకు కొట్టిన పిండి అనేది విశ్లేషకుల మాట. సిఇఓ ఎంపికకు ఖచ్చితమైన గడువు నిర్ధారించడం కరెక్టు కాదని నీలేకన్ని ప్రకటించడం ఆయన పరిణతికి నిదర్శనంగా పేర్కొంటున్నారు.



ఇక వ్యాపారపరంగా చూసినా, ఏ విభాగంలో ఎవరున్నారు, పనితీరు ఎలా వుంది, ఇప్పుడెలా చేస్తే ఇంకా బాగుంటుందనే విషయంలోనూ నీలేకన్ని గతంలోలాగే తనదైన ముద్ర వేస్తరనే మార్కెట్ వర్గాలు ఆశిస్తున్నాయి. బాధ్యతలు చేపట్టడంతోటే మీడియా, 600 మంది ఇన్వెస్టర్లు, కీలకమైన ఉన్నతోద్యోగులతో నీలేకన్నీ ఒక దఫా సమావేశమయ్యారు. ప్రస్తుత పరిస్థితుల మీద అవగాహన తెచ్చుకోవడానికి, సమీప భవిష్యత్తుకు కార్యాచరణ ప్రణాళకలు రూపొందించుకోవడానికి నీలేకన్నికి చాలా తక్కువ సమయమే పడుతుందన్న విశ్వాసం మార్కెట్ వర్గాలలో వ్యక్తమవుతోంది. పాన్యా డీల్‌తో సహ అన్ని ముఖ్యాంశాల మీద ద్రుష్టి పెడతానని, దిద్దుబాటు చర్యలు తదనుగుణంగా వుంటాయని నీలేకన్నీ ఇప్పటికే మీడియాకు వెల్లడించారు. 200 మిలియన్ డాలర్ల విలువైన పాన్యా డీల్‌లో పారదర్శకత లోపించిందనేది నారాయణమూర్తి గతంలో వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

ఇన్ఫోసిస్‌కు పూర్వ వైభవం తీసుకు రావడమే తన ముందున్న ప్రధాన లక్ష్యమని, ఇందుకు అవసరమైన సమగ్ర ప్రణాళికను అక్టోబర్ నాటికి పూర్తిచేసి, రెండో త్రైమాసిక ఫలితాలతో పాటు వెల్లడించాలనుకుంటున్నామని నీలేకన్ని ప్రకటించారు. మొదటిదఫా ఛైర్మన్‌గా వున్నప్పుడు ఇన్ఫోసిస్ ఏటా 36 శాతం చొప్పున వృద్ధి సాధించిందనీ, ఇప్పుడు మళ్లీ అదే బాటలో పయనిస్తుందనే ఆశాభావానికి ఆయన అనుభవం ఊతమిస్తోందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. వ్యయ నియంత్రణలోనూ నీలేకన్నికి మంచి అనుభవమే వుందనీ, అలాగే అంతర్జాతీయ మార్కెట్ నుంచి కొత్త ఆర్డర్లు తేవడంలోనూ ఆయన అనుభవం ఇప్పుడు మరింత దోహదపడగలదనీ భావిస్తున్నాయి. బోర్డు నాయకత్వంలో పనిచేస్తాను, భవిష్యత్తులోనూ పాలన విషయంలో బోర్డు స్పష్టమైన వైఖరితో వుండేలా చర్యలు తీసుకుంటానని నీలేకన్ని మీడియాకు తెలిపారు.

మారుతున్న అంతర్జాతీయ సమీకరణాల నేపథ్యంలో వాణిజ్య దిశను ఇన్ఫోసిస్ కూడా మార్చుకోవల్సి వుంటుందని, కొత్త పోకడలను తొందరగా అందిపుచ్చుకుంటున్న చిన్న సంస్థలు మెరుగయిన ఫలితాలు సాధిస్తున్నాయని విశ్లేషకులు ప్రస్తావిస్తున్నారు. ఆటోమేషన్, క్లౌడ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ రంగాలలో చొచ్చుకు పోగలిగితేనే భవిష్యత్ బంగారంలా వుంటుందని అంతర్జాతీయంగా పేరొందిన కొంత మంది విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఉద్యోగుల వలస విషయంలో ఇన్ఫోసిస్ గతంలో కంటె ఇప్పుడు మెరుగ్గానే వుందని, కాకపోతే వాణిజ్య అభివృద్ధి ప్రణాళికల విషయంలో జాగ్రత్త వహించాలని వారు వివరిస్తున్నారు. రెండు దశాబ్దాలకు పైగా ఐటిసేవల రంగంలో దిగ్గజంగా వెలుగొందుతున్న ఇన్ఫోసిస్ భవిష్యత్తులో మళ్లీ కళకళలాడుతుందని, ఇన్వెస్టర్లతోపాటు స్టేక్ హోల్డర్లందరికీ ప్రయోజనం చేకూరుస్తుందనీ నమ్మకం కుదరాలంటే బహుశా అక్టోబర్ నెలాఖరు నాటికి స్పష్టత వస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



డీఎల్ఎఫ్ అనుబంధ సంస్థ వాటాలు జీఐసీకి విక్రయం

● డీల్ విలువ రూ.11,900 కోట్లు

న్యూఢిల్లీ : రియల్టీ దిగ్గజం డీఎల్ఎఫ్ బోర్డు శుక్రవారం నాడు డీఎల్ఎఫ్ ప్రమోటర్లకు చెందిన అనుబంధ సంస్థ రెంటల్ సంస్థ డీఎల్ఎఫ్ సైబర్ సిటి డెవలపర్స్ లిమిటెడ్ (డీసీసీడీఎల్)లో 40 శాతం వాటాలను సింగపూర్‌కు చెందిన జీఐసీ రియల్ ఎస్టేట్‌కు రూ.11,900 కోట్లకు విక్రయించడానికి ఆమోదం తెలిపింది. రియల్ ఎస్టేట్ రంగంలో దేశంలో అతి పెద్ద లావాదేవీ ఇదే. ఇదిలా ఉండగా శుక్రవారం నాడు డీఎల్ఎఫ్ స్టాక్‌ఎక్స్ఛేంజీలకు ఈ విషయం తెలియజేసింది. ఈ లావాదేవీ పూర్తి కావడానికి కార్పొరేట్, నియంత్రణా సంస్థల అనుమతులు పొందాల్సి ఉంది. కాగా డీసీసీడీఎల్ కంపెనీ విలువ రూ.35,617 కోట్లు తేలింది. ఈ ఒప్పందం పూర్తయిన తర్వాత డీఎల్ఎఫ్‌కు కు డీసీసీడీఎల్‌లో 66.66 శాతం వాటాలు ఉండగా.. జీఐసీ అనుబంధ సంస్థ రెకో డైమండ్ చేతిలో 33.34 శాతం వాటాలుంటాయి. కాగా జీఐసీ విషయానికి వస్తే సింగపూర్‌కు చెందిన సావరిన్ వెల్త్‌ఫండ్ కంపెనీ.

వోడాఫోన్.. కొత్త ఫీచర్‌ఫోన్‌తో పాటు క్యాష్ బ్యాక్ ఆఫర్

న్యూఢిల్లీ : టెలికం ఆపరేటర్ వోడాఫోన్‌కు రిలయన్స్ జియోకు గట్టి పోటీ ఇచ్చేందుకు రంగంలో దిగింది. దీంతో మొబైల్ కంపెనీ ఐటెల్‌తో చేతులు కలిపి ఉచిత టాక్ టైంతో పాటు కొత్త కస్టమర్లకు ఐటెల్ ఫీచర్ ఫోన్లను కూడా అందిస్తుంది. కొత్త ఆఫర్ విషయానికి వస్తే ఫీచర్ ఫోన్‌లు రూ.800 నుంచి 2,000 వరకు ఉంటాయి. దీనిపై రూ.50 ఉచిత టాక్ టైంతో పాటు 18 నెలల పాటు ప్రతి నెలా రూ.100తో కనీస రీచార్జి చేయించుకోవాల్సి వస్తుంది. ఈ ఆఫర్ కొత్త సబ్‌స్క్రైబర్‌తో పాటు పాత వోడాఫోన్ సబ్‌స్క్రైబర్లకు వర్తిస్తుందని వోడాఫోన్ ఒక ప్రకటనలో వివరించింది. ప్రస్తుతం మార్కెట్లో రిలయన్స్‌జియో కొత్తఫీచర్‌ఫోన్‌ను ఉచితంగా ఇస్తామని ప్రకటించింది. ఉచిత ఫోన్ ప్రకటనతో గ్రామీణ ప్రాంతాల్లోని కస్టమర్లకు తక్కువ మొత్తంలో మొబైల్ వ్యయం చేసే వారు ఈ ఫోన్‌లకు మారిపోతారు. ఐఫోన్ భాగస్వామ్యం చేపట్టడం వల్ల తమ కస్టమర్లకు కొత్త ఫోను కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుందని వోడాఫోన్ ఇండియా కన్స్యూమర్ బిజినెస్ అసోసియేట్ ఎడిటర్ అవ్‌నీశ్ కోస్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఐటెల్ కస్టమర్లకు తమ ఫీచర్ ఫోన్ కొనుగోలు చేసి వోడాఫోన్‌ను కాష్‌బ్యాక్‌ను పొందవచ్చునని ఐటెల్ మొబైల్ ఇండియా సీఈవో సుధీర్‌కుమార్ ఒక ప్రకటనలో వెల్లడించారు.



దక్షిణ కొరియా బంగారం దిగుమతిపై ఆంక్షలు

న్యూఢిల్లీ: దక్షిణ కొరియా నుంచి బంగారం దిగుమతులపై నిషేధం విధిస్తున్నట్లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డిజిఎఫ్‌టి) ప్రకటించింది. ఆ దేశంతో కుదుర్చుకున్న ఒప్పందం కింద సుంకం లేకుండా బంగారం దిగుమతిని ఇప్పటిదాకా ప్రభుత్వం అనుమతిస్తోంది. అయితే దేశీయంగా తయారు చేసే బంగారు ఆభరణాల మీద విధిస్తున్న ఎక్సైజ్‌కు సమానంగా 12.5 శాతం కౌంటర్ వీలింగ్ డ్యూటీ (సివిడి) మాత్రమే దక్షిణ కొరియా నుంచి దిగుమతయ్యే బంగారం మీద విధించేది. జులై 1 నుంచి జిఎస్‌టి అమలులోకి వచ్చిన నేపథ్యంలో బంగారం మీద సివిడి లేకుండా పోయి, కేవలం మూడు శాతం సుంకం మాత్రమే అమలులోకి వచ్చింది. దీంతో కొరియా నుంచి బంగారం దిగుమతి చేసుకోవడం వ్యాపారస్థులకు ఆకర్షణీయంగా మారింది. ఇతర దేశాల నుంచి దిగుమతయ్యే బంగారం మీద 10 శాతం దిగుమతి సుంకం కొనసాగుతున్నా కూడా, కొరియాలో డ్యూటీ ఫ్రీ విధానం వుండటం వరంగా పరిణమించిందని భావిస్తున్నారు. ఫలితంగా కొరియా నుంచి బంగారం దిగుమతులు ఒక్కసారిగా పెరిగి జులై1-ఆగస్టు3 మధ్య కాలంలో 339 మిలియన్ డాలర్లకు పెరిగాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంలో దక్షిణ కొరియా నుంచి దిగుమతయిన బంగారం విలువ 70.5 మిలియన్ డాలర్లు మాత్రమే. పర్యవసానంగా డిజిఎఫ్‌టి ఆగస్టు 14న భారత్ నుంచి దక్షిణ కొరియాకు 22 క్యారట్లకు మించిన బంగారు ఉత్పత్తుల ఎగుమతిని నిషేధించింది. బంగారం కొరియా నుంచి వచ్చి, కొద్దిపాటి వ్యాల్యూ ఎడిషన్‌కు అధిక ధర నిర్ణయించడం ద్వారా ఆభరణాల రూపంలో దేశం బయటికి వెళ్తోందన్న అనుమానంతోనే డిజిఎఫ్‌టి ఈ చర్య తీసుకుందని భావిస్తున్నారు.

రూ.250 పెరిగిన పసిడి ధరలు

నిలకడగా గ్లోబల్ మార్కెట్లో ధరలు

స్థానిక నగల వ్యాపారులు పెద్దమొత్తంలో బంగారం కొనుగోలు చేయడంతో దేశ రాజధాని ఢిల్లీలో పది గ్రాములు రూ.250 పెరిగి రూ.29,950 మార్కుకు ఎగబాకింది. దీంతో పాటు గ్లోబల్ మార్కెట్లు ధరలు నిలకడగా ఉండటం కూడా దేశీయ మార్కెట్లకు కలిసొచ్చింది. వెండి విషయానికి వస్తే కిలో రూ.40,200ల్లో ఎలాంటి మార్పుల్లేవు. ఇక్కడి వ్యాపారుల అంచనా ప్రకారం దేశీయంగా నగలవ్యాపారులు పెద్దమొత్తంలో బంగారం కొనుగోలు చేయడంతో పసిడి ధరలు పెరిగాయన్నారు. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే శుక్రవారం నాడు ఔన్స్ బంగారం 0.39 శాతం పెరిగి 1290.80 డాలర్లకు, వెండి 0.59 శాతం పెరిగి 17.05 డాలర్ల వద్ద ముగిసింది. దేశ రాజధాని ఢిల్లీలో 99.9 శాతం 99.5 శాతం మేలిమి బంగారం రూ.250 చొప్పున పెరిగి రూ.29,950, రూ.29,800కు చేరింది. కాగా శుక్రవారం నాడు రూ.150 క్షీణించింది. ఎనిమిది గ్రాములు సావరిన్ బంగారం మాత్రం ఫ్లాట్‌గా రూ.24,500 వద్ద ముగిసింది.

హెచ్‌పీలో చేరడం లేదు: సిక్కా



బెంగళూరు: గత శుక్రవారం నాడు ఇన్ఫోసిస్ సీఈవో బాధ్యతల నుంచి తప్పుకున్న విశాల్ సిక్కా, అమెరికాకు చెందిన ఐటి దిగ్గజం హెవ్లెట్ ప్యాకర్డ్ ఎంటర్‌ప్రైజెస్ (హెచ్‌పీఈ)లో చేరడం లేదని స్పష్టం చేశారు. మీడియాలో తాను హెచ్‌పీఈలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని కావాలని కొంత మంది పుకార్లు సృష్టిస్తున్నారని ఆయన అమెరికా నుంచి ఒక వార్త చానల్‌కు వీడియో ఇంటర్వ్యూలో చెప్పారు. కంపెనీ వ్యవస్థాపకుడు నారాయణమూర్తికి, సీఈవోకు మధ్య తీవ్రమైన అభిప్రాయ భేదాలు రావడం, మూర్తి బోర్డుపై ఆగ్రహించి మీడియాకు ఎక్కడం సిక్కాకు రుచించలేదు. దీంతో ఆయన సీఈవో పదవి నుంచి ఆగస్టు 18వ తేదీన రాజీనామా చేశారు. గురువారం ఇన్ఫోసిస్ ఛైర్మన్‌గా నందన్ నీలేకని తిరిగి ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సిక్కా ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. కంపెనీ ప్రయోజనా లను దృష్టిలో ఉంచుకుని పదవికి రాజీనామా చేశానని, నీలేకనికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వడానికి పదవి నుంచి తప్పుకున్నా నని సిక్కా వివరించారు. వాస్తవానికి తాను గత వారమే ఇన్ఫోసిస్ వైస్ ఛైర్మన్ పదవి నుంచి తప్పుకుందామను కున్నాననీ, అయితే బోర్డు తనను కొంత కాలం పాటు కొనసాగాలని కోరడంతో ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా వ్యవహరించ డానికి అంగీకరించానన్నారు.

ఆదాయపు పన్ను మదింపులో భారీ వృద్ధి

● టీడిఎస్ రాబడి అంచనాలు పెంపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అన్ని రంగాల్లో ముందంజలో ఉంటూ అద్భుత ప్రగతిని నమోదు చేసుకుంటున్న తెలంగాణ రాష్ట్రం ఆదాయపు పన్ను చెల్లింపులోనూ ముందు వరుసలో నిలుస్తోంది. ఆదాయపు పన్ను సఘటు వృద్ధిరేటు జాతీయ స్థాయిలో 19.2 శాతం కాగా తెలంగాణలో అది 45 శాతంగా నమోదైంది. టీడీఎస్ దాఖలులో హైదరాబాద్ రూ. 18007 కోట్లను గతేడాది జమ చేయగా ఈ ఆర్థిక ఏడాదిలో రూ. 21,704 కోట్లను లక్ష్యంగా పెట్టుకున్నారు. టీడీఎస్‌ను 45 శాతం పెంచుతూ లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఇన్‌కంటాక్స్ కమిషనర్ బివి వినోద్ తెలిపారు. తెలంగాణలో పెరుగుతున్న సేవలు, మాన్యుఫాక్చరింగ్ రంగం పరిధి పెరగడం వంటి చర్యలతో లక్ష్యం పెంచుకున్నామని ప్రకటించారు. గతేడాది తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో ఆదాయపు పన్నుల రూపంలో రూ. 38865కోట్లు వసూలు అయ్యాయి. ఇందులో తెలంగాణనుంచి రూ. 32,100కోట్లు, ఏపీనుంచి రూ. 5600కోట్లు వసూలయ్యాయి. ఈ ఏడాది ఇప్పటికే హైదరాబాద్‌నుంచి రూ. 18007కోట్లు టీడిఎస్ రాబడి జమ కావడం గొప్ప విషయమని అధికారులు అంటున్నారు. గతేడాదిఇదే సమయంలో ఇది రూ. 8వేల కోట్లుగా ఉంది.

ఫార్మాకు టానిక్ ఆర్&డి

● చైనా నుంచి ముడి దినుసులకు స్వస్తి పలకాలి ● ఆర్అండ్‌డిపై దృష్టి పెట్టాలి

(హైదరాబాద్, ఆంధ్రప్రభ బిజినెస్ బ్యూరో): భారత ఫార్మా రంగం చౌకరకం ఔషధాలను అందించడంలో అందేవేసిన చేయి. దీంతో ప్రపంచ ఫార్మా మార్కెట్లో భారత్ ఫార్మా రంగం హవా కొనసాగుతోంది. గ్లోబల్ ఫార్మా కంపెనీలకు గట్టిపోటీ ఇస్తోంది. ఇక నుంచి అయిన భారత ఫార్మా రంగం వెనీలా జెనెరిక్ ఔషధాల ఎగుమతి జోలికి పోకుండా సంక్లిష్టమైన ఔషధాలను తయారుపై దృష్టి పెట్టడం మేలని ఈ రంగానికి చెందిన నిపుణులు చెబుతున్నారు. (వెనీలా అంటే సాధారణ లేదా బేసిక్) అని అర్థం.. ఉదాహరణకు సాదాసీదా వెనీలా ఐస్‌క్రీంగా చెప్పుకోవచ్చు.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నుంచి భారత ఫార్మారంగం దేశానికి గర్వకారణంగా నిలిచింది. ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్లో హవా కొనసాగిస్తోంది. చౌకరకం పెటెంట్ ఔషధాలను కాపీ కొట్టి గ్లోబల్ మార్కెట్లో విక్రయిస్తోంది. దేశీయ ఫార్మా కంపెనీలు సంవత్సరాల క్రితమే కొన్ని ఔషధాలను కాపీ కొట్టి వాటిని ఇక్కడ భారత్‌లో తయారు చేస్తున్నాయి. ఏవో కొన్ని స్వల్పమార్పులు చేస్తున్నాయి. దీనికి దేశీయ చట్టాలు కూడా అనుమతిస్తున్నాయి కూడా.. ప్రస్తుతం అభివృద్ధి చెందిన దేశాలకు భారత్ పెద్దెత్తున ఔషధాలను ఎగుమతులు చేసే స్థాయికి ఎదిగింది.

సంస్కరణలతో పాటే ఫార్మా రంగం జోరు : 1991లో కేంద్రంలోని నరసింహారావు ప్రభుత్వం సంస్కరణలు శ్రీకారం చుట్టిన తర్వాత నుంచి ఫార్మా రంగం జోరందుకుంది. ఉదాహరణకు ర్యాన్‌బాక్సీ, డాక్టర్ రెడ్డీస్, సన్‌ఫార్మా, లూపిన్‌లు యూఎస్ జెనరిక్ మార్కెట్లోకి ఎంట్రీ ఇచ్చాయి. అప్పటి వరకు ఈ మార్కెట్‌ను తెవా, మైలాన్, యాక్టివిస్, సాండోజ్ తదితర కంపెనీలు ఏలేవి

హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న డాక్టర్ రెడ్డీస్ 2001లో యాంటీ డిప్రెషన్ ఔషధం ప్రోజాక్ అమెరికా మార్కెట్లో పరిమిత కాలానికి మార్కెట్ చేసుకోవడానికి హక్కులు దక్కించుకుంది. అటు నుంచి డాక్టర్ రెడ్డీస్ వెనక్కి తిరిగి చూడలేదు. ఈ ప్రొడక్టు యూఎస్ మార్కెట్లో విజయం సాధించింది. దీంతో పాటు మరో ఫార్మా కంపెనీ సిప్లాను తీసుకుంటే ప్రపంచంలోనే అత్యంత కీలకమైన మందులను పక్కాగా కాపీ కొట్టి తయారు చేయడం మొదలుపెట్టింది. ఈ మందులను ఆఫ్రికా మార్కెట్లో ఎయిడ్స్‌కు బాధితులకు విక్రయించింది. బ్రాండెడ్ మందులతో పోల్చుకుంటే 20 నుంచి 30 రెట్లు చౌక. సిప్లాను చూసి మిగిలిన కంపెనీలు గ్లెన్‌మార్కు, క్యాడిలాలు 2008లో ఇదే పద్ధతిని పాటించడం మొదలుపెట్టాయి. 2009 నాటికి ఫార్మా కంపెనీలు టొరెంట్, అలెంబిక్, అజంతా, స్ట్రయిడ్స్‌లాంటి కంపెనీలన్నీ ప్రపంచంలోనే అతి పెద్ద ఫార్మా మార్కెట్ అమెరికాకు క్యూకట్టాయి.

0.3 బి. డాలర్ల నుంచి 5.9 బిడాలర్లకు: దేశీయ ఫార్మా ఇండస్ట్రీ లాబీ .. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయెన్స్ అంచనా ప్రకారం యూఎస్ డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ ది యూఎస్ బ్యూరో ఆఫ్ సెన్సెస్ ప్రకారం 2005 నుంచి 2015 వరకు భారత్ నుంచి అమెరికా మార్కెట్లకు ఎగుమతులు 0.3 బిలియన్ డాలర్ల నుంచి 5.9 బిలియన్ డాలర్లకు చేరాయి. (ఇక్కడ బిలియన్ డాలర్లు అంటే రూ.6,400 కోట్లుగా) చదువుకోవాలి.

దేశీయ ఆరోగ్య వ్యవస్థపై దృష్టిపెట్టండి : దేశానికి స్వాతంత్ర్యం లభించి 70 సంవత్సరాలు పూర్తయింది. ఇకనైనా ఫార్మా రంగం దేశ ఆరోగ్య వ్యవస్థపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనికి తాజా ఉదాహరణ గోరఖ్‌పూర్‌లో జరిగిన విషాదాన్ని చెప్పుకోవచ్చు. ఆక్సిజన్ అందక పెద్దమొత్తంలో పసిపిల్లలు మృత్యువాతపడ్డారు. దేశంలో హెల్త్‌కేర్ వ్యవస్థ సక్రమంగా ఉంటే వందలాది మంది చిన్నారుల ప్రాణాలను కాపాడవచ్చు.

చైనా ముడిపదార్థాల దిగుమతికి స్వస్తి పలకాలి : ముందుగా చైనా నుంచి ఫార్మాస్యూటికల్స్ ముడి పదార్థాల దిగుమతులకు స్వల్ప పలకాలి. 85 శాతం ఔషధాల తయారీకి చైనా నుంచి దిగుమతి చేసుకునే ముడి పదార్థాలను వినియోగిస్తుంటాం. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త చట్టాలను తీసుకురావాల్సిన అవసరం ఉందని, ఆన్‌లైన్ ఔషధాల అమ్మకాల మానిటరింగ్‌పై ఉన్న సందిగ్ధతను తొలగించాలి, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ గైడ్‌లైన్స్, క్లినికల్ ట్రయల్స్‌కోసం కొత్త చట్టాలను తీసుకురావాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.



ఇప్పటికి ఫార్మా కంపెనీలు వెనీలా జెనెరిక్ ఔషధాలు ఎగుమతి చేయడానికి మన ఫార్మా కంపెనీలు పెద్దపీట వేస్తున్నాయి. ప్రస్తుతం దేశీయ ఫార్మా కంపెనీలు ప్రధానంగా సంక్లిష్టమైన జనరిక్ ఔషధాల పరిశోధనపై (ఆర్అండ్‌డి) పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టాలని కోరుతున్నారు.

భారత ఫార్మా కంపెనీలు నాణ్యతను పాటించడం లేదని విదేశీ ఔషధ నియంత్రణా సంస్థలు ఇటీవల కాలంలో కొత్త ఔషధాల మార్కెటింగ్ దరఖాస్తులను (యుఎస్ఎఫ్‌డీఏ) తిరస్కరిస్తున్నాయి. దీంతో కంపెనీలు షార్ట్‌కట్‌లను అనుసరిస్తున్నాయి. తయారీ ప్రాసెస్‌కు సంబంధించి షార్ట్‌కట్ దరఖాస్తులను తగ్గించుకుంటే ఫిర్యాదులు తగ్గుతాయని ఈ రంగానికి చెందిన నిపుణులు సూచిస్తున్నారు. దీంతో పాటు ఫార్మారంగంలో పేటెంట్, చట్టాలపై స్పష్టత కావాల్సి ఉంటుంది. ఉన్న చట్టాలను సరళీకరణ చేస్తే ఫార్మారంగంలో అక్రమాలకు చోటుండదు. ఈ రంగానికి చెందిన నిపుణులు చెప్పేదేమిటంటే ప్రభుత్వం కూడా అనవసరంగా ధరల నియంత్రణ పాటించడం ఫార్మా రంగానికి మంచిది కాదని, ప్రభుత్వం ఒకవేళ ధరలు పెంచాలనుకుంటే ఈ రంగానికి చెందిన వారితో సంప్రతింపులు జరిపితన తర్వాత పెంచడం మేలని చెబుతున్నారు.

చిన్న కార్లపై టాటా మోటార్స్ నజర్

కోలకతా : దేశీయ ఆటో దిగ్గజం టాటామోటార్స్ చిన్న కారు నానోకు ప్రత్యమ్నాయంగా మరో చిన్న కారు తయారు చేయడానికి సన్నాహాలు చేస్తోందని కంపెనీ సీఓఓ సతీష్ బోర్వాన్‌కర్ చెప్పారు. నానోకు ప్రత్యామ్నాయయంగా చిన్న ఎలక్ట్రిక్ కారు ఉత్పత్తి చేసే ఆలోచన ఉందని, నానో కారు ఉత్పత్తి ఎట్టి పరిస్థితుల్లో గిట్టుబాటు కాదని ఆయన స్పష్టంచేశారు. అయితే నానోకారు ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేసే ప్రసక్తిలేదని.. ఎందుకంటే దీనిపై సెంటిమెంట్ ఉందని, దీంతో పాటు వాటాదారులు కూడా నానోను కొనసాగించాలని కోరుతున్నారన్నారు. గుజరాత్‌లోని సనంద్‌లో నానో కారు ఉత్పత్తి కొనసాగుతోంది. ప్రతి నెల 1000 నానో కార్లు ప్రస్తుతానికి విక్రయిస్తున్నామని ఆయన వివరించారు.



సనంద్ ప్లాంట్ గురించి ప్రస్తావిస్తూ ఇక్కడ మూడు ప్యాసిజర్‌కార్లను అసెంబ్లింగ్ చేస్తున్నట్లు చెప్పారు. వాటిలో నానో, టిగోర్, టియాగో అని వివరించారు. నానోతో పోల్చుకుంటే టియాగో, టిగోర్ ఉత్పత్తి చాలా చాలా ఎక్కువని ఆయన అన్నారు. వాణిజ్య వాహనాలతో పాటు ప్యాసింజర్ల వాహనాల మార్కెట్ వాటా తగ్గిపోవడం గురించి ప్రశ్నించినప్పుడు బోర్వాన్‌కర్ మాట్లాడుతూ.. కస్టమర్లకు వీటిపై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేస్తామన్నారు. కస్టమర్లకు అభిరుచిని తెలుసుకునేందుకు డీలర్లవద్దకు విచ్చేసి కస్టమర్లు లెవనేత్తిన అంశాలపై దృష్టి పెడుతున్నామన్నారు. కాగా జూన్, జులై, ఆగస్టు నెలల్లో కూడా అమ్మకాలు తిరిగి పుంజుకున్నాయని ఆయన శనివారం నాడు ఇక్కడ జరుగుతున్న సీఐఐ సదస్సులో మాట్లాడుతూ అన్నారు. దీపావళి నాటికి కొత్త ఎస్‌యూవీని మార్కెట్‌లో విడుదల చేస్తామని ఆయన పేర్కొన్నారు.

రేపటినుంచి నిమిస్మే శిక్షణ

హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వ అధీనంలోని నిమిస్మే (ఎన్ఐఎంఎస్ఎంఇ) ఔత్సాహికులకు శిక్షణ కోసం ఈ నెల 28 నుంచి నాలుగు వారాలపాటు ఉచిత ప్రోగ్రామ్ నిర్వహించనుంది. నగరంలోని యూసఫ్‌గూడ వద్దనున్న నిమిస్మే క్యాంపస్‌లో ఈ శిక్షణ నిర్వహించనున్నట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. 18-40 సంవత్సరాల మధ్య వయసున్న ఔత్సాహికులు రిజిస్ట్రేషన్ కోసం 040-23633263, 9391384622, 7989480853 నెంబర్లలో సయ్యద్ ఫక్రుద్దీన్‌ను సంప్రదించాల్సిందిగా కోరింది. సైన్స్, ఇంజినీరింగ్, టెక్నాలజీలలో డిగ్రీ లేదా డిప్లొమో వున్న వారు అర్హులని నిమిస్మే ఈ ప్రకటనలో వివరించింది.

రైల్వే అప్రెంటిస్‌లకు భరోసా ఏది?

- ఏళ్ల తరబడి చాకిరీ చేసినా ఫలితం శూన్యం
- గల్లీ నుంచి ఢిల్లీ వరకు దశల వారీగా ఆందోళన
- పాతపద్ధతి ప్రకారమే ఉద్యోగాల్లో తీసుకోవాలి
- ఆలిండియా రైల్వే ఆక్ట్ అప్రెంటిస్‌ల అసోసియేషన్

అమరావతి, ఆంధ్రప్రభ : రైల్వే అప్రెంటిస్‌ల ఆశలు నీరుగారిపోతున్నాయి. ఏళ్ల తరబడి చేసిన సేవలకు ఫలితం లేకుండా పోతుండడంతో వారి ఆందోళన, ఆవేదనకు అంతులేకుండా ఉంది. భవిష్యత్‌లో తప్పకుండా రెగ్యులర్ చేస్తారనే ఆశతో గంపెండాశతో రైల్వేలో ఎంతోకాలంగా అప్రెంటీస్‌గా పనిచేస్తున్నా, వారిని పట్టించుకునే నాథుడు లేకపోవడంతో ఆందోళన బాట పట్టారు. గల్లీ నుంచి ఢిల్లీ వీధుల్లో సైతం వినూత్నరీతిలో ఆందోళన చేసినా ఫలితం లేకపోవడంతో ఏం చేయాలో తోచక తలలు పట్టుకు కూర్చున్నారు. ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు రైల్వేలో చేరి, అప్రెంటిస్ చేస్తారు. ఇలా ఆరు నెలలు లేదా సంవత్సరం పూర్తి చేసిన తర్వాత వారిని రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియమించి, వారికి ఉద్యోగావకాశాలు కల్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఇలా దాదాపు రైలేలో దాదాపు రెండే వేల మంది దాకా అప్రంటీస్ చేసి,ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నట్లు సమాచారం. ఒక్క విజయవాడ రీజియన్‌లోనే దాదాపు 700 మంది దాకా అప్రంటీస్ చేసి, ఖాళీగా ఉన్నట్లు తెలిసింది. వీరంతా గత సంవత్సర కాలంగా అప్రంటిస్ పూర్తి చేసినా, ఇంతవరకు వారికి ఎటువంటి ఉపాధి కల్పిం చకపోవడంతో ఆందోళనచెందుతున్నారు. తమకెం దుకు ఉపాధి చూపించడం లేదని రైల్వే అధికారులను అడిగితే రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించే పరీక్ష రాసుకుంటే అందులో 20 శాతం కోటా కల్పిస్తామని చావు కబురు చల్లగా చెప్పారని బాధితులు లబోదిబోమంటున్నారు. ఇలా చేయడమంటే తమకు అన్యాయం చేయడమేనని బాధితులు అంటున్నారు. రైల్వేలో అప్రంటీస్ చేసిన వారందరికీ పాత పద్ధతిలోనే ఉద్యోగావశాశాలు కల్పించాలని కోరుతు న్నారు. రైల్వేలో లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయకపోవడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. మరో వైపు రైల్వేలో ఖాళీలు భారీగా ఉన్నాయని, సిబ్బంది కొరత వల్లనే ప్రమాదాల నివారణలోను రక్షణ చర్యలు సక్రమంగా తీసుకోలేకపోతున్నామని చెబుతున్న రైల్వే ఉన్నతాధికారులు అన్ని విధాలా శిక్షణ తీసుకుని, ఖాళీగా ఉన్న అప్రంటీస్‌కు ఎందుకు ఉద్యోగం కల్పించడం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వాస్తవానికి రైల్వేలో 2011వరకు కూడా జీఎం పవర్‌తో అప్రంటీస్ చేసిన వారిని పర్మినెంట్ చేశారు. కానీ 2012 నుంచి ఆ పద్ధతికి స్వస్తి చెప్పడంతో వేలాది మంది అప్రంటీస్‌ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.అప్రంటీస్ చేసిన అభ్యర్థులను వదిలేసి,కొత్తగా ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడంతో అప్రంటీస్ నిరుద్యోగులంతా ఢిల్లీ వెళ్లి ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు జంతర్‌మంతర్ వద్ద వినూత్నరీతిలో దశల వారీగా ఆందోళన కొనసాగించారు. మంత్రులను, ఎంపీలను కలసి, తమ గోడు వెళ్లబోసు కున్నారు. కానీ ఫలితం శూన్యంకావడంతో మళ్లీ ఆందోళనకు దిగాలని భావిస్తున్నారు. సమస్య పరిష్కారానికి మరో భారీ పోరాటానికి దిగుతామని ఆలిండియా రైల్వే ఆక్ట్‌అప్రంటీస్ అసోసియేషన్ విజయవాడ డివిజన్ కో - ఆర్డినేటర్ బి.దేవేం ద్రనాయక్ స్పష్టం చేశారు. తామంతా పేద వర్గాలమని, తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు క ూడా వినతపత్రాలు అందజేశామని తెలిపారు. రైల్వే మంత్రికి కూడా పలుమార్లు విజ్ఞప్తి చేశామని, అయినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదని ఆవేధన వ్యక్తం చేశారు. అప్రంటీస్‌లకు అన్యాయం చేసే ఆర్‌బిఇ 71 / 2016, ఆర్‌బిఇ 34 / 2017 రైల్వే బోర్డు జీవోలను రద్దు చేయాలని బాధితులు కోరుతున్నారు. పాత జీవో ఆర్‌బిఇ 136./2004 ప్రకారమే తమల్ని పర్మినెంట్ చేయాలని కోరుతున్నారు. రైల్వేలో ప్రస్తుతం సేఫ్టీ క్యాటగిరి కింద 2.5 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని తమతో భర్తీ చేసే రైల్వేలో చాలా మటుకు సమస్యలు దూరమమై, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించినవారవుతారని అంటున్నారు. ఏళ్ల తరబడి అప్రంటీస్ చేసినా,ఉద్యోగం రాకపోవడంతో ఎన్నో కుటుంబాలు మానసికాందోళన చెందుతున్నాయని,ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని బాధితులు కోరుతున్నారు.

కరవు నివారణ చర్యలు చేపట్టాలి

కిషాన్‌ఖేత్ మజ్దూర్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి గురునాథరావు

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో కరవు విలయతాండవం చేస్తోందని, తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని కిషాన్‌ఖేత్ మజ్దూర్ కాంగ్రెస్ రాష్ట్రఅధ్యక్షుడు జెట్టి గురునాథరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆంధ్రరత్న భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రతి రైతుకు నెలకు రూ. 10వేలు కరవు పింఛన్ ఇవ్వాలని, కరవుతో అల్లాడుతున్న రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రజలను తక్షణమే ఆదుకోవాలని కోరారు. రైతాంగాన్ని, ప్రజలను ఆదుకోవడానికి శాశ్వత కరవు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతులకు రుణమాఫీ వర్తింప జేయడంతోపాటు మిగిలి ఉన్న అప్పులన్నీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుకూలీలందరికీ నెలకు రూ. 5వేలు పింఛన్ ఇవ్వాలని కూడా కోరారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, కరవు పీడిత ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపి, వలసలు, ఆత్మహత్యలను నివారించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

సేవాదళ్ పోరాట పటిమ శ్లాఘనీయం

అమరావతి, ఆంధ్రప్రభ: యువతకు శారీరక శిక్షణను అందించడంతోపాటు దేశంలోని మత సామరస్యాన్ని ప్రోత్సహించడంలో కాంగ్రెస్ సేవాదళ్ పోరాట ప టిమ శ్లాఘనీయమని ఏపీ సేవాదళ్ అధినేత భవానీ నాగేంద్రప్రసాద్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, కాంగ్రెస్ నేత డాక్టర్ నారాయణ్ సుబ్బారావు హార్డికార్ 42వ వర్ధంతిని సేవాదళ్ ఆధ్వర్యంలో ఏపీసీసీ కార్యాయలంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి మీసాల రాజేశ్వరరావు, నరహరిశెట్టి నరసింహారావు, అధికార ప్రతినిధి వి.గురునాథం, సేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ గౌస్ తదితరులు ఎన్.ఎస్.హార్డికర్ చిత్రపటానికి పూలవూలలు వేసి,ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ హార్డికార్ 1923లో కాకినాడలో సేవాదళాన్ని స్థాపించారని, సేవాదళ్ శాసనోల్లంఘనోద్య మంలో ప్రముఖపాత్ర పోషించిందన్నారు. 1934 తర్వాత సేవాదళ్ పార్టీ కేంద్ర స్వచ్ఛంద సంస్థగా అవతరించిందన్నారు. . ఏపీసీసీ కార్యదర్శులు దుర్‌బేషుల హుస్సేన్, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ పి.చంటిబాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేదింటికి సర్కారు సారె

- బతుకమ్మ పండుగకు చేనేత చీరల పంపిణీ
- 18 ఏళ్ళు నిండిన మహిళలందరికీ అందజేయండి
- వచ్చే నెల 18 నుంచి రేషన్ షాపుల ద్వారా పంపిణీ
- ఎక్కడా లోటు లేకుండా చూడండి: టీ. సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : బతుకమ్మ పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలోని 18 ఏళ్ళ నిండిన పేద మహిళలందరికీ చీరలను కానుకగా ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రకటించారు. రాష్ట్రంలోని 1,04,57,610 మందికి రేషన్ షాపుల వారీగా సెప్టెంబర్ 18, 19, 20 తేదీలలో ఈ చీరలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. కుల, మతాలకు అతీతంగా పేద మహిళలందరికీ పంచనున్నట్లు తెలిపారు. పవర్‌లూమ్, హ్యాండ్లూమ్ కార్మికులకు ఉపాధి కల్పించడం కోసం వారు వేసిన చీరలనే కొనుగోలు చేసి పంపిణీకి సిద్ధం చేస్తున్నట్లు కేసీఆర్ చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు పేద మహిళలందకీ చీరలందించే విధంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఎం పిలుపునిచ్చారు. చీరల పంపిణీ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించాల్సిందిగా కలెక్టర్లను కేసీఆర్‌ను కోరారు.

బతుకమ్మ కానుకగా చీరలు పంపిణీ చేసే కార్యక్రమంపై ముఖ్యమంత్రి ప్రగతి భవన్‌లో సమీక్ష నిర్వహించారు. పంపిణీ చేసే చీరల నాణ్యతను పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు. చీరలను పంపిణీ చేసే విధానంపై అధికారులతో మాట్లాడారు. షెడ్యూల్ ఖరారు చేశారు. తెలంగాణ ప్రజలంతా కులమతాల కతీతంగా బతుకమ్మ, దసరా పండుగను జరుపుకుంటాని సీఎం అన్నారు. ఇది రాష్ట్ర పండుగ. తెలంగాణ ప్రజల జీవితాలతో ముడిపడిన పండుగ, కుటుంబ బంధాలకు ఈ పండుగ పతీకని తెలిపారు. ప్రతి ఆడపడుచు తన సొంతింటికి వెళ్ళి ఆనందంగా జరుపుకునే వేడుకన్నారు. ఈ పండుగను ప్రజలంతా మరింత సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో పేద మహిళలందరికీ చీరలను కానుకగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

ప్రభుత్వ సంస్థలను ప్రయివేటుపరం చేస్తే సహించేది లేదు


మోడీ, చంద్రబాబు కుట్రలను ప్రజలు గమనించాలి: సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘువులు



విశాఖపట్నం, కెఎన్ఎన్ బ్యూరో: దేశ సౌభాగ్యాన్ని తాకట్టు పెట్టే పబ్లిక్, ప్రయివేట్ భాగస్వామ్య పద్ధతిని ప్రజలు పూర్తిగా వ్యతిరేకించాల్సిందేనని, ఇందుకోసం ప్రతీ ఒక్కరూ సన్నద్ధం కావాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘువులు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణపై సీపీఎం ఆధ్వర్యంలో శనివారం రైల్వే డిఆర్ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహం ఎదురుగా ఏర్పాటు చేసిన బహిరంగసభలో రాఘువులు ప్రసంగిస్తూ ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న ప్రయివేటీకరణ కుట్రలను ప్రజలు గ్రహించాలన్నారు. ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టడానికి, కొల్లగొట్టడానికి , ప్రభుత్వ పరిశ్రమలను ప్రయివేటీకరణ చేయడానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అవలంభిస్తున్నాయని, ఈ విధానం మంచిది కాదన్నారు. తాను దేశభక్తుడునని పదే పదే ప్రధానమంత్రి మోడీ చెబుతున్నారని, అయితే ఆయన చెప్పే మాటలు ఒక విధంగా ఉంటే మరో విధంగా ఆయన ఆలోచనలు అమలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలకు ముందు సంవత్సరానికి రెండు కోట్లు మందికి ఉపాధి కల్పిస్తామని అందుకు తగ్గట్లుగా ఉద్యోగ అవకాశాలు ఏర్పరుస్తామని ప్రధాని మోడీ ప్రకటించారని , అయితే ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు పూర్తి కావచ్చిన ఎక్కడా ఉద్యోగాల మాట లేదన్నారు. పైగా ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టే ప్రయత్నంలో వారు నిమగ్నమయ్యారని ధ్వజమెత్తారు. ప్రయివేటీకరణ వల్ల పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయని కొంత మంది భావిస్తున్నారని కానీ ప్రయివేటు బడాబాబుల చేతుల్లోకి ప్రభుత్వరంగ సంస్థలు వెళ్తే అక్కడ పట్టించుకునే పరిస్థితి ఉండదన్నారు. ఉన్న ఉద్యోగాలు తొలగించి, కొత్తవారికి ఎలా ఉపాది కల్పిస్తారని ప్రశ్నించారు. విశాఖలో టెక్ మహేంద్ర ఐటి సంస్థను నెలకొల్పి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు అందులో ఒక్కరికి కూడా ఉపాధి కల్పించలేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయడం సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. తాము చేస్తున్న పోరాటం దేశభక్తితో చేస్తున్నామని ఇందుకు ప్రతీ ఒక్కరూ కలిసి రావాలన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ లక్షల కోట్ల విలువ గల ప్రభుత్వ రంగ పరిశ్రమలను కొనడం దేశంలోని ప్రైవేట్ వ్యక్తుల వశం కాదని, కారు చౌకగా కొట్టేయడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వరంగ పరిశ్రమల్లో కార్మికులు పనిచేయడం లేదనే దుష్ప్రచారాన్ని ప్రభుత్వ అనుకూల మీడియాతో చేస్తున్నారని స్టీల్‌ప్లాంట్‌లో ప్రగతి, హెచ్‌పిసిఎల్, ఇన్సూరెన్స్ రంగంలో అత్యధిక ప్రగతి సాధించడం జరిగింది కార్మికులు కాకపోతే ఎవరు చేశారని ఆయన ప్రశ్నించారు.

దేశ జిడిపిలో గాజువాక ప్రాంతం నుంచి వెళ్లే ఆదాయానికి కారణం ప్రభుత్వ రంగ పరిశ్రమలు కీలకంగా ఉన్నందునేనన్నారు. సభకు అధ్యక్షత వహించిన సీపీఐ(ఎం) నగర కార్యదర్శి గంగారావు మాట్లాడుతూ విశాఖ నగరంలో అభివృద్ధి పేర రోడ్లు, మంచినీరు, భవన నిర్మాణాలు, మురికివాడల అభివృద్ధి అంటూ ప్రైవేటీకరణ, ఛార్జీల వసూలుకు అధికారులు సిద్ధమయ్యారని వివరించారు. సభకు ముందు నగరంలోని రైల్వేస్టేషన్ నుంచి వందలాది మందితో సీపీఎం నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీతో సభకు చేరుకున్నారు.

పురాతన విగ్రహం విక్రయించేందుకు యత్నం... వ్యక్తి అరెస్టు



హైదరాబాద్, కెఎన్ఎన్ : పురాతన విగ్రహాలను విక్రయిస్తున్న ఓ వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే విజయవాడ కృష్ణా నగర్‌కు చెందిన నీలకంఠి వెంకటేశ్వర్ రావుకు విజయనగరంనకు చెందిన అతని స్నేహితుడు శ్రీనివాసరావు ఏడాది క్రితం తన దగ్గర శ్రీకృష్ణదేవరాయుల కాలం నాటి పురాతన విగ్రహం ఉందని, ఆ విగ్రహాన్ని ఎలాగైనా అమ్మిపెడితే, వచ్చిన మొత్తంలో 40 శాతం కమీషన్‌ను కూడా చెల్లిస్తామని అంగీకరించాడు. దీంతో ఏడాది నుంచి విగ్రహాన్ని విక్రయించేందుకు వెంకటేశ్వర్‌రావు విజయవాడ, విజయనగరంతో పాటు అనేక ప్రాంతాల్లో ప్రయత్నాలు మొదలుపెట్టాడు. అయితే అక్కడ ఎవరూ కొనుగోలు చేయక పోవడంతో, హైదరాబాద్‌లోని కుసులం పురాలోని ఓ హోటల్ దగ్గర విక్రయించేందుకు గురువారం యత్నిస్తుండగా, సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితుడు నీలకంఠి వెంకటేశ్వర్ రావును అరెస్టు చేశారు. అయితే పట్టుబడ్డ విగ్రహం విలువ సుమారు రూ. కోటి ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు.

నల్లగొండ జిల్లాలో డేరా బాబా ప్రకంపనలు

- చిట్యాల మండల పరిధిలో 54 ఎకరాల విలువైన భూమి
- అసైన్డ్ భూముల ఆక్రమణ



అసైన్డ్ భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ విశాలాక్షి

చిట్యాల, కెఎన్ఎన్ : వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు రామ్‌రహీం గురుమిత్‌సింగ్ బాబా ఆస్తులు నల్లగొండ జిల్లా, చిట్యాల మండల పరిధిలోని వెలిమినేడు గ్రామ శివారులో ఉండటంతో ప్రకంపనలు పుట్టుకొస్తున్నాయి. అత్యాచార కేసులో దోషిగా తేలడంతో ఇక్కడి ఆస్తులు ప్రచారంలోకి వచ్చాయి. 2007-2009వరకు బాబాలుగా రైతుల నుంచి భూములను కొనుగోలు చేసి 54 ఎకరాల చుట్టూ ప్రహరీగోడ నిర్మిం చారు. జిల్లాలో 65వ నెంబర్ జాతీయ రహదారి పక్కన వెలిమినేడు సమీ పంలో శ్రీ ఆంజనేయస్వామి దేవా లయ సమీపంలో అత్యంత విలువైన 54 ఎకరాల భూమి ఉండటంతో డేరా బాబా పేరు ప్రకంపనలు సృష్టిస్తుంది. ఈ స్థలంలో డేరా స్వచ్ఛ సౌదా పేరుతో ఆశ్రమాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ భూముల్లో సుమారు 7.24ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నట్లు తేలింది. సర్వే నెంబర్ 98లో 3.30 ఎకరాలు, 102సర్వే నెంబర్‌లో 1.22 ఎకరాలు 132లో 2ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఇక్కడ శ్యామ్‌లాల్ అనే వ్యక్తి ట్రస్టు మెంబర్‌గా ఉండి నిర్వాహణను చేపడుతున్నాడు. ఇదిలా ఉండగా సామాజిక సేవ పేరుతో రైతుల నుంచి కారుచౌకగా భూములను కొనుగోలు చేసిన రాంరహీం గురుమిత్‌సింగ్ ఆగడాలు తెలంగాణలో కొనసాగ కుండా ఆస్తులను స్వాధీనం చేసుకొని ప్రభుత్వం పేదలకు పంపిణీ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. 2002లో ఇద్దరి మహిళలపై లైంగిక దాడి కేసులో దోషికి సీబీఐ కోర్టు పేర్కొంది. రేప్ కేసులో దోషిగా తేలిన గురుమిత్‌సింగ్ తనకు తానుగా దేవుని అవతారంగా చెప్పుకోవడం సిగ్గుచేటని పలువురు అసహ్యించు కుంటున్నారు.

అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకుంటాం: తహసీల్దార్ విశాలాక్షి

మండలంలోని వెలిమినేడు శివారులోని డేరా బాబా ఆశ్రమ స్థలంలో ప్రభుత్వ అసైన్డ్ భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారుల దృష్టికి రావడంతో చిట్యాల తహసీల్దార్ విశాలాక్షి శనివారం ఆశ్రమ స్థలాన్ని తన సిబ్బందితో పరిశీలించారు. ఆశ్రమానికి సంబంధించిన 54ఎకరాల భూమిలో 7.24ఎకరాల అసైన్డ్ భూమి ఉందని ఆమె తెలిపారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించాల్సిన బాధ్యత తమకు ఉందని, పై అధికారులకు నివేదికను అందజేసి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు ఆమె విలేకరులకు వివరించారు.

90 ఏళ్ల వయస్సులో డా. మనోహర్‌కు బంగారు పతకం



విశాఖపట్నం, కెఎన్ఎన్ బ్యూరో : న్యూఢిల్లీలోని భారత ప్రభుత్వ ఆహార, వ్యవసాయ మంత్రిత్వశాఖ అదనపు సహాయ సంచాలకులుగా పదవీ విరమణ చేసిన అంతర్జాతీయ ప్రఖ్యాత చెరకు పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ పీజే మనోహర్‌ను ప్రతిష్టాత్మకమైన ద నోయెల్ డెర్ గోల్డ్ మెడల్ వరించింది. ద సుగర్ టెక్నాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు వాహన ఇంధనంగా పెట్రోల్ స్థానంలో ఇథైల్ ఆల్కహాల్ వాడకంలో బ్రెజిల్ విజయం అనే అంశంపై ఆయన సమర్పించిన పరిశోధన పత్రాలకుగాను ఆయనకు ఈ అరుదైన గౌరవం లభించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి 1945-48 బ్యాచ్‌లో బీఎస్సీ (ఆనర్స్) టెక్ ఆ తర్వాత అమెరికా, భారత దేశాలలో డీడీ పూర్తి చేసిన ఈయన తొలినాళ్లలో ఉయ్యూరు, తణుకు, సామర్లకోట షుగర్ ఫ్యాక్టరీలలో పనిచేసి ఆ తర్వాత భారత ప్రభుత్వంలోని అత్యున్నత పదవులకు వన్నె తెచ్చారు. చెరకు ఉత్పత్తులపై అధ్యయనం, పరిశోధనల నిమిత్తం 66 దేశాలు పర్యటించి విశేషమైన పరిజ్ఞానం సంపాదించారు. ప్రపంచ పర్యటనలో తాను సంపాదించిన అనుభవాలకు అక్షర రూపమిస్తూ మనోహరరావు చెరకు పరిశోధనలో మార్గనిర్దేశకత్వం వహించే 10 పరిశోధనాత్మక గ్రంథాలు ప్రచురించారు. ఆయన రాసిన రెండు పరిశోధన గ్రంథాలు అంతర్జాతీయ ఖ్యాతినార్జించాయి. నంద్యాలకు చెందిన ఆయన ప్రస్తుతం ఆయన కిర్లంపూడి లే ఔట్‌లో నివసిస్తున్నారు. 90 ఏళ్ల వయస్సులో కూడా ఆయన పీజే ఇంటర్నేషనల్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉంటూ తన అనుభవ జ్ఞానం భావితరాలకు ఉపయోగ పడాలనే సదాశయంతో నిరంతరం శ్రమిస్తూ అనేక పుస్తకాలు రాయడంలో నిమగ్నమై ఉంటారని డాక్టర్ మనోహర్ కుమార్తె, ప్రముఖ కన్సల్టెంట్ సైకాలజిస్ట్, కౌన్సెలర్, స్పర్శ్ కౌన్సిలింగ్ కేంద్రం వ్యవస్థాపకురాలు డాక్టర్ లెనోరా ఆర్‌మోహన్ తెలిపారు.

దళితులకు రక్షణ కరవు



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న కేవీపీఎస్ నేతలు

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని దళిత, గిరిజన జాతులకు రక్షణ భద్రత కరువైందని కుల వివక్ష పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం విజయవాడలో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌చైర్మన్ కారెం శివాజీకి కెవీపీఎస్ నేతలు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎదో ఒకచోట ఎస్సీ, ఎస్టీలు దాడులు, వివక్షకు నిత్యం గురవుతూనే ఉన్నారన్నారు. గరగపర్రులో దళితులను సాంఘిక బహిష్కరణ చేయగా, దేవరపల్లిలో దళిత భూములను అన్యాయంగా లాక్కొన్నారని, దొండపాడులో దళితులపై దాడులకు తెగబడగా, కర్నూలులోని చిరుమాన్‌దొడ్డిలో దళితులకు ఆలయ ప్రవేశాన్ని నిషేదించారని, అలాగే కర్నూలులోని కట్టమంచి స్కూలు యాజమాన్యం 10వ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థిని ప్రీతిభాయి బలవర్మణానికి కారకులయ్యారని చెప్పారు. తాజాగా కడప జిల్లాలోని కాశినాయన మండలం సాగిశెట్టిపల్లె గ్రామానికి చెందిన ఎంబడి పోలయ్యపై అగ్రకుల పెత్తందారులు హత్యా ప్రయత్నం చేశారని ఆరోపించారు. దీనిపై ఎస్సీ, ఎస్టీ కేసును నమోదు చేయడం జరిగిందని, కానీ నిందితులు ఎవరో తెలిసినప్పటికీ వారిపై చర్యలను తీసుకొనేందుకు పోలీసులు వెనుకాడుతున్నా రన్నారు. తక్షణమే దీనిపై చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై వెంటనే స్పందించిన చైర్మన్ శివాజీ హత్యాప్రయత్నం చేసిన నిందితులపై వారంలోగా చట్టపరమైన చర్యలను తీసుకోవాలని మైదుకూరు డీఎస్పీని ఆదేశించారు. చైర్మన్‌ను కలిసిన వారిలో కెవీపీఎస్ రాష్ట్ర నేతలు నటరాజ్, ఉమామహేశ్వరరావు, క్రాంతి కుమార్, శాంసన్ తదితరులు పాల్గొన్నారు.


మసాజ్, స్పా సెంటర్ల ముసుగులో హైటెక్ వ్యభిచారం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మసాజ్, స్పా సెంటర్ల ముసుగులో హైటెక్ వ్యభిచారం, డ్రగ్స్ దందా కేసులో పరారీలో ఉన్న థాయిలాండ్ యువతి కేకా, మరో ఇద్దరు వ్యాపార భాగస్వాముల కోసం పోలీసుల వేట కొనసాగుతోంది. ఈ కేసులో పోలీసులకు చిక్కిన దాసరి సిద్ధార్థ్‌కు దేశంలో మూడు ప్రధాన మెట్రోపాలిటన్ నగరా ల్లోనూ అతడికి నెట్‌వర్క్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ దందాలో సిద్ధార్థను మించిన వారు కూడా ఉన్నారని విశ్వసనీయంగా తెలిసింది. వారికి పెద్దల సహకారం ఉందని సమాచారం. ఇద్దరు జూనియర్ ఆర్టిస్టులతో పాటు కొందరు బడా వ్యాపారవేత్తలు కూడా మసాజ్ సెంటర్లకు వచ్చేవారని ప్రాథమికంగా గుర్తించారు. థాయ్ జాయ్ కంటే హైదరాబాద్‌లోనే మరింత లగ్జరీగా దొరుకుతుందని విషయం స్పష్టంగా వెల్లడైందని ఓ పోలీసు అధికారి తెలి పారు. మసాజ్ సెంటర్ల ముసుగులో హైటెక్ వ్యభిచారం, డ్రగ్స్ దందా కొనసాగిస్తున్న ఓ ముఠా ఇటీవల పోలీసులకు పట్టు బడింది.

డ్రగ్స్ దందా కేసులో విచారణ వేగవంతం

కేసులో దాసరి సిద్ధార్థ్‌తో సహా 19 మందిని పోలీసులు అరెస్ట్ చేసి.. 65 మంది యువతులకు విముక్తి కలిగించి రెస్క్యూ హోంకు తరలించారు. జల్సాలకు అలవా టు పడి మసాజ్ వ్యాపారంలోకి అడుగిడిన సిద్ధార్థ్ భారీగా నష్టాలు రావడంతో వ్యభిచారం నిర్వహణతో పాటు పలు అనైతిక కార్యకలాపాలకు తెరదీశాడు. సిద్ధార్థకు ధూల్‌పేట లోని గంజాయి పెడ్లర్లతో క ూడా లింక్‌లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. తాను డ్రగ్స్ అలవాటు పడటంతో పాటు థాయ్ యువతులను డ్రగ్స్‌కు బాని ఎలను చేశాడు సిద్ధార్థ్. సిద్దార్థ్, అతని స్నేహితుల స్పాల్లో పట్టుకుని జగద్గిరిగుట్టలోని స్టేట్ హోంకు తరలించిన వారు కొద్ది రోజులుగా డ్రగ్స్ లేకపోవడంతో పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస ్నారు. వారి పరిస్థితి ఆందోళనకరంగా మారింది. తాను చెపి ్పనట్లు వారు నడుచుకునేలా చేసేందుకు వారిని డ్రగ్స్‌కు బానిసలను చేసినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

మితిమీరుతున్న పెత్తందారుల ఆగడాలు



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర వ్యాప్తంగా పెత్తందారుల ఆగడాలు, ఫ్యాక్షన్ హత్యా రాజకీయాలు పెట్రేగిపోతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం నుంచి ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతపురం జిల్లాలోని యల్లనూరు మండల సీపీఐ కార్య దర్శి, రైతు సంఘం నేత రామేశ్వ రయ్యను ప్రత్యర్థులు అత్యంత కిరాతకంగా హత్య చేయడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఉన్నత విద్యావంతుడై రామేశ్వ రయ్య, అతని భార్య సులోచనపై పెత్తందారులు వ్యూహాత్మకంగా దాడికి పాల్పడ్డారన్నారు. రైతాంగ సమస్యలపై, స్థానిక ప్రజా సమస్యలపై చురుకుగా ఉద్యమాల్లో పాల్గొనే రామేశ్వర య్యను అత్యంత దారుణంగా నరికిచంపిన దుండగులు ఆయన భార్యను కూడా తీవ్రంగా గాయప రచడం దారుణమన్నారు. తక్షణమే హంతకులను అరెస్టులు చేయడంతోపాటు పెత్తందారుల బారి నుంచి భయాందోళనలో ఉన్న యల్లనూరు మండలంలోని దుగ్గుపల్లి గ్రామస్తులకు రక్షణ కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విశాఖలో శాంతిదూత డాక్టర్ సయ్యిద్ శాంతి ప్రవచనాలు



ఆరిలోవ (విశాఖపట్నం) కెఎన్ఎన్ : మహా విశాఖ పరిధిలోని ఎండాడ మజీదును కొలంబోకు చెందిన ఆధ్యాత్మిక మత గురువు, శాంతిదూత డాక్టర్ సయ్యిద్ ముషావ్వాల్ సయుద్దీన్ సందర్శించారు. కొలంబో నుంచి శనివారం విశాఖకు చేరుకున్న ఆయన మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయనకు ముస్లిం బాహెరా కమ్యూనిటీ ఘన స్వాగతం పలికింది ఈ సందర్భంగా స్థానిక మత పెద్దలు మాట్లాడుతూ సయుద్దీన్ ఐదు రోజుల పాటు ఆధ్యాత్మిక పసంగాలు, శాంతిమార్గాలను వివరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి చెన్నై, ముంబయి, కోల్‌కతాల నుంచి సుమారు సుమారు 10 వేల మంది అతిథులు విచ్చేస్తారని వారు వివరించారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో మొట్టమొదటి సారి విశాఖ ఎండాడ మసీద్‌కు రావడం చాలా ఆనందంగా వుందని నిర్వాహణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మతపెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లోని ప్రాజెక్టులపై కేసీఆర్ ప్రత్యేక దృష్టి

ఢిల్లీలో కేంద్ర పర్యావరణ, అటవీ శాఖాధికారుల చర్చ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : గిరిజన ప్రాంతాలను సైతం అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో తెలంగాణా సీఎం కేసీఆర్ ప్రత్యేక పథకాలు రూపొందిస్తున్నారని మహబూబాబాద్ ఎంపీ సీతారాం నాయక్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధికి నోచుకోని మోడికుంట, పాలెంవాగులపై ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. మహబూబాబాద్ నియోజకవర్గంలోని మోడికుంట ప్రాజెక్ట్ రెండోదశ అనుమతులపై కేంద్ర పర్యావరణ, అటవీశాఖాధికారులు, తెలంగాణా నీటి పారుదల, అటవీశాఖాధికారులు సమావేశమై చర్చించారు. అనంతరం సీతారాం నాయక్ ఢిల్లీలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. గత కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యం కారణం గా రూ. 118 కోట్లతో పూర్తయ్యే మోడికుంట వాగు ప్రాజెక్ట్ వ్యయం ప్రస్తుతం రూ. 426 కోట్లకు చేరిందని వెల్లడించారు. అయినా సరే గిరిజన ప్రాంత అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కేసీఆర్ ఈ ప్రాజెక్టను పూర్తి చేసేందుకు కంకణం కట్టుకున్నారని చెప్పుకొచ్చారు. తమ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర ఖజానాపై రూ. 292 కోట్ల భారం పడేలా చేసిన కాంగ్రెస్ పాలకులు ఏం సమాధానం చెప్తారని సీతారాం నాయక్ ప్రశ్నించారు. మోడికుంట ప్రాజెక్ట్ పూర్తయితే 13 వేల 591 ఎకరాల భూమి సాగుకు నోచుకుంటుందని, వ్యవసాయం మీదే ఆధా రపడ్డ దాదాపు 12 వేల మంది గిరిజనుల జీవితాలు బాగు పడతా యని వివరించారు. ప్రస్తుతం ప్రాజెక్టులను అడ్డుకునేందుకు నానా రకాలుగా ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ నేతలు, గతంలో ప్రాజెక్టలను నిర్ల క్ష్యం చేసింది తామేననే విషయం గుర్తు పెట్టుకోవాలని సీతారాం హిత వు పలికారు. గిరిజన ప్రాంతాల్లో వాగులు, రిజర్వాయర్లు, నీటి పారు దల అభివృద్ధికి కృషి చేస్తున్న కేసీఆర్‌కు గిరిజన బిడ్డగా ధన్యవాదాలు చెప్తున్నానన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్జీటీలో విచారణ వాయిదా

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో దాఖలైనపిటిషన్‌పై తదుపరి విచారణ ఈ నెల 29కి వాయిదా పడింది. పలు కారణాల వల్ల ఎన్జీటీ ఛైర్మన్ జస్టిస్ స్వతంత్ర కుమార్ కేసు విచారణ నుంచి తప్పుకున్నారు. దీంతో కేసు విచారణ మరో బెంచ్‌కు బదిలీ అయింది. పర్యావరణ అనుమతులు లేకుండా కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మిస్తున్నారని అడ్వకేట్ రచనా రెడ్డి ఎన్జీటీలో పిటిషన్ దాఖలు చేశారు. ఏ అనుమతులు లేకుండా ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టడం చట్ట విరుద్ధమని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

రెండో ఘాట్‌రోడ్డులో విరిగిపడ్డ కొండచరియలు



తిరుమల, కెఎన్ఎన్ : తిరుమల రెండో ఘాట్‌రోడ్డులో శుక్రవారం ఉదయం కొండచరియలు విరిగి పడ్డాయి. దీంతో కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గత నాలుగు రోజులుగా రాత్రి వేళల్లో తిరుమలలో భారీ వర్షం పడుతోంది. ఈ ప్రభావంతో రెండో ఘాట్‌రోడ్డులోని కొండచరియలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. ఈ సమాచారం అందుకున్న అటశాఖ సిబ్బంది యంత్రాల సహాయంతో కొండ చరియలను తొలగించారు. ఆ సమయంలో వాహనాల రాక పోకలు స్తంభించాయి. అధికారులు బండరాళ్ళను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరింపచేశారు.

జమ్ము కాశ్మీర్‌లో ఉగ్ర దాడి



(మొదటి పేజీ తరువాయి)

బలగాలు ఆదమరచి నిదిస్తున్న సమయంలో దాడికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులు దాడి జరిపిన సమయంలో ఎక్కువ మంది జవాన్లు నిద్రలోనే ఉన్నట్లు సమాచారం. సరిహద్దుల్లో ఉగ్రవాదులకు జవాన్లు ధీటైన జవాబిస్తుండటంతో పోలీస్ లైన్ లక్ష్యంగా దాడి జరిపినట్లు తెలుస్తోంది. దాడికి ముందే ప్రభుత్వ క్వార్టర్స్ లో దాక్కున్న ఉగ్రవాదులు...జవాన్ల ఏమరపాటునే అనుకూలంగా మలచుకున్నట్లు సమాచారం.

ఉగ్రవాదుల చెరలో బంధీలు లేరుః పోలీసులు

దాడి జరగిన సమయంలో ఉగ్రవాదుల చెరలో స్థానికులెవరూ బంధీలుగా లేరని జమ్ము కశ్మీర్ పోలీసులు తెలిపారు. కాల్పులు జరుగుతున్న సమయంలోనే స్థానికులను అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించారు.రంగంలోకి దిగిన అదనపు బలగాలు ముగ్గురు మిలిటెంట్లను మట్టుబెట్టాయి. ప్రభుత్వ క్వార్టర్స్ లో దాక్కున్న మిలిటెంట్లు అదనుచూసి భద్రతా బలగాలపై దాడి చేసినట్లు హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఎదురుకాల్పుల్లో మృతి చెందిన ఉగ్రవాదుల సంఖ్య పూర్తిగా తెలియలేదని చెప్పారు.

సరిహద్దుల్లో ముగ్గురు పాక్ రేంజర్లు హతం

రాజౌరి జిల్లాలోని సుందర్‌బనిలో కాల్పుల విరమణ ఒప్పందానికి పాల్పడిన పాకిస్థాన్ పై భారత జవాన్లు ప్రతీకార దాడులు చేశారు. సరిహద్దు భద్రత దళాల కాల్పులు ముగ్గురు పాక్ రేంజర్లు హతమయ్యారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సరిహద్దుల్లోని పర్గ్వల్ ప్రాంతంలో కవ్వింపు చర్యలకు పాల్పడుతూ భారత భద్రతాబలగాలు రెచ్చగొడుతున్న సమయంలో సహనం కోల్పోయిన బీఎస్ఎఫ్ జవాన్లు ముగ్గురు పాక్ రేంజర్లను మట్టుబెట్టారు. శుక్రవారం ఆర్ఎస్ పురా సెక్టర్‌లో బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ కెకె అప్పారావు లక్ష్యంగా పాక్ ఆర్మీ కాల్పులు జరిపింది. పాక్ కాల్పుల్లో జవాన్ గాయపడగా...పాక్ కవ్వింపు చర్యలు శృతి మంచుతున్న తరుణంలో భారత్ ఆర్మీ పాకిస్థాన్‌కు ధీటైన జవాబిచ్చింది. పదేపదే కాల్పులు జరుపుతూ రెచ్చగొడుతున్న రేంజర్లను మట్టుబెట్టింది.

సీఐఏ చేతిలో ఆధార్ డేటా!

(మొదటి పేజీ తరువాయి)

సంస్థ తస్కరించే వ్యవస్థ లేదని చెప్పారు. సేకరించిన సమాచారం ఎన్‌క్రిప్టెడ్ రూపంలో ఆధార్ సర్వర్లను చేరుతుంది తప్పితే.. ఇతరులకు చేరే అవకాశమే లేదని యూఐడీఏఐ అధికారులు చెప్పారు. వికీలీక్స్‌ను సమర్థించే వారు సీఐఏకు ఉన్న ఆఫీస్ ఆఫ్ టెక్నికల్ సర్వీసెస్ (ఓటీఎస్) శాఖను ప్రస్తావిస్తున్నారు. బయోమెట్రిక్ ద్వారా సమాచారం సేకరించే ఈ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా తన సర్వీసులను ఇతర దేశాల సంస్థలతో అనుసంధానం చేసుకుంటుంది. వారితో సమాచారాన్ని పంచుకుంటుంది. అయితే.. స్వచ్ఛందంగా పంచుకునే ఈ వ్యవహారంలో ఆధార్ సమాచారం లేదని భారత్ చెబుతోంది. అయితే.. తమ ఆధార్ వివరాల ఆధారంగా ఎయిర్‌టెల్ ఖాతాదారుల సమ్మతి లేకుండానే వారికి ఖాతాలు ఇచ్చేస్తోందని, ఈ నేపథ్యంలో సీఐఏ లాంటి గూఢచారి సంస్థ ఆ సమాచారాన్ని పొందడంలో వింతేముందని పలువురు ప్రశ్నిస్తున్నారు. మొత్తానికి గోప్యత ప్రజల హక్కని సుప్రీం కోర్టు తీర్పిచ్చిన నేపథ్యంలో ఈ ఆధార్ వ్యవహారం ఎక్కడి నుంచి ఎక్కడికి వెళుతుందో చూడాలి.



నిర్మూలిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. తెలుగుదేశం, బీజేపీ కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి, విశాఖల కంటే మిన్నగా కాకినాడను తానభివృద్ధి చేస్తామన్నారు. 2019నాటికి పూర్తిస్థాయి స్మార్ట్‌సిటీగా కాకినాడను రూపుదిద్దుతా మన్నారు. రాష్ట్రంలో పౌరసదుపాయల కల్పనలో పెద్దపీటేస్తున్నా మన్నారు. సాగునీటి ప్రాజెక్టుల్ని వేగంగా పూర్తి చేస్తున్నామన్నారు. కానీ ప్రధాన ప్రతిపక్షం ప్రతి చిన్నదానికి అడ్డంకులు సృష్టిస్తోందని దుయ్యబెట్టారు. అప్పుడు పోలవరం, తర్వాత పట్టిసీమ, ఇప్పుడు పురుషోత్తపట్నం ఇలా ప్రతి ప్రాజెక్ట్‌పైన కోర్టులకెక్కి ముందుకు సాగకుండా అడ్డుకుంటున్నారన్నారు. తూర్పు రైతాంగానికి రెండు పంటలకే కాదు.. మూడుపంటలక్కూడా సాగునీరివ్వాలన్నది తన లక్ష్యంగా చెప్పారు. నంద్యాలలో అభివృద్ధి మంత్రానికే ప్రజలు ఆకర్షితులయ్యారన్నారు. తెలుగుదేశానికను కూలంగా ఓట్లేశారన్నారు. ఇదే ఒరవడి కాకినాడలో కూడా కనిపించాలని కోరారు. నగరాభివృద్ధి బాధ్యత తనదేనన్నారు. కాకినాడలో రూ. 430 కోట్లతో భూగర్భ డ్రైనేజ్ నిర్మిస్తామని, ఈ మేరకు నిధులు మంజూరు చేసామన్నారు. 200కోట్లతో రోడ్ల ఆధునీకరణ చేపట్టామన్నారు. మరో 230 కోట్లతో తాగునీటి సదుపాయాలు మెరుగుపరుస్తున్నా మన్నారు. కత్తిపూడి నుంచి కాకినాడ మీదుగా ఒంగోలు వరకు రహదారిని బ్రహ్మాండంగా అభివృద్ధి పరుస్తున్నామన్నారు. రాజానగరం, కాకినాడ మధ్య రహదారిని నాలుగులైన్లుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కాకినాడ సెజ్‌లో మరో పోర్టు నిర్మిస్తామన్నారు. ఇక్కడే హెచ్‌పిసిఎల్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటౌతుందన్నారు. ఫారన్‌ట్రేడ్ ఇనిస్టిట్యూట్‌ను ఇక్కడ నెలకొల్పు తున్నట్లు చెప్పారు. లాజిస్టిక్ హబ్ కూడా ఇక్కడ ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంతో కాకినాడ శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఉపాధి అవకాశాలు అనూహ్యంగా మెరుగౌతాయని చెప్పారు. నగరంలో నెలకొన్న ఇళ్ళ కొరతను నిర్మూలించేందుకు తిమ్మాపురం వద్దనున్న ఆవచెరువుకు చెందిన 150ఎకరాల స్థలాన్ని కేటాయించనున్నట్లు చంద్రబాబు వెల్లడించారు.

కాకినాడ మేయర్ స్థానాన్ని తెలుగుదేశం కూటమికి అప్పగిస్తేనే తామాశించిన ప్రగతి మరింత వేగంగా సాధ్యపడుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రతిపక్ష వైకాపాకు ఓట్లేస్తే అవి మురిగిపోతాయన్నారు. నడిరోడ్డుమీద ఒక ముఖ్యమంత్రిని కాల్చేస్తాం.. చెప్పుల్తో కొడతాం.. బట్టలూడదిస్తామంటూ ప్రధాన ప్రతిపక్షనేత చేసిన వ్యాఖ్యల్ని ఇప్పటికే ప్రజలు తీవ్రంగా పరిగణిస్తున్నా రన్నారు. ఇటువంటి ప్రతిపక్షనేత దేశంలోనే కాదు.. ప్రపంచంలోనే మరెక్కడా ఉండరన్నారు. నిరంతరం తనకు అభివృద్ధి మంత్రం తప్ప మరే ధ్యా ్న లేదన్నారు. 39ఏళ్ళ రాజకీయ చరిత్రలో నిష్క ళంకుడిగా ఉన్నానన్నారు. హైదరాబాద్‌లో పదేళ్ళుండే అవకాశమున్నప్పటికీ వేగంగా సొంత రాజధాని నగర నిర్మాణాన్ని చేపట్టే లక్ష్యంతోనే అమరావతికి తరలొచ్చామన్నారు. 40వేల కోట్ల విలువైన భూముల్ని రైతులు తనపై విశ్వాసంతో ఉచితంగా రాజధాని నిర్మాణానికి అప్పగించా రన్నారు. గతంలో హైదరాబాద్‌ను అభివృద్ధిపర్చిన రీతిలోనే ఇప్పుడు అమరావతిని తీర్చిదిద్దుతాన న్నారు. శనివారం రాత్రి చంద్రబాబు కాకినాడలోనే బస చేశారు. ఆదివారం ఉదయం వివిధ సామాజికవర్గాల్తో ఆయన ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తారు. మంగళవారం జరిగే ఎన్నికలకు సంబంధించి వ్యూహరచన చేస్తారు. మధ్యాహ్నం జగన్నాధపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన అనంతరం విజయవాడకు తిరిగెళ్తారు.

దేశానికే ప్రధాని బీజేపీకి కాదు!

న్యూఢిల్లీ: గుర్మీత్ కేసు నేపథ్యంలో అల్లర్లపై పంజాబ్, హర్యానా ఉమ్మడి హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీపైనా ఆగ్రహం వ్యక్తంచేసింది. గుర్మీత్‌ను దోషిగా నిర్ధారిస్తూ తీర్పు వచ్చిన క్రమంలో నెలకొన్న అల్లర్లపై కేంద్ర ప్రభుత్వాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. నేరుగా ప్రధానికి చురకలు వేసింది.'అతను దేశానికి ప్రధానమంత్రి.. బీజేపీకి కాదు' అని వ్యాఖ్యానించింది. శుక్రవారం నాటి హింసాత్మక పరిస్థితులు హర్యానా రాష్ట్రా నికి సంబంధించిన విషయం అని అడిషనల్ సొలిటల్ జనరల్ సత్యాపాల్ జైన్ చేసిన వాదనపై హైకోర్టు మండిపడింది. హర్యానా భారత్‌లో భాగం కాదా? హర్యానా, పంజాబ్‌లను సవతి పిల్లల్లాగా ఎందుకు చూస్తున్నారు? అంటూ సత్యపాల్‌ను నిలదీసింది. రాంరహీంకు వ్యతిరేకంగా తీర్పు వెల్లడైన మరు నిముషాల్లో ఆయన అభిమానులు, అనుచరులు ఢిల్లీ, హర్యానా,పంజాబ్ రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేశారు.

డేరా సచ్ఛాకు లొంగిన ఖట్టర్

న్యూఢిల్లీ: డేరా సచ్చాసౌధా అధినేత గుర్మీత్ అనుచరుల వీరంగంపై హర్యానా రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు మందలించింది. రాజకీయంగా లబ్ధి పొందేందుకే ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ప్రభుత్వం 'పంచకుల'ను తగులబెట్టేలా చేసిందని కోర్టు వ్యాఖ్యానించింది. సీబీఐ కోర్టు తీర్పు అనంతరం రెచ్చిపోతున్న డేరా సచ్చా సౌధా అనుచరులను కట్టడి చేయకుండా వారికి ప్రభుత్వం లొంగిపోయిందని న్యాయమూర్తి పేర్కొన్నారు. గుర్మీత్ కోర్టుకు వెళ్తున్న సమయంలో అన్ని వాహనాలను ఎందుకు అనుమతించారని ప్రశ్నించారు. పంచకుల తగులబడటానికి కారణమైన ఇద్దరు గుర్మీత్ అనుచరులపై దేశ ద్రోహం కేసు నమోదు చేయాలని హైకోర్టు ఆదేశించింది. గుర్మీత్ ఆస్తుల వివరాలను ఈ నెల 29లోగా కోర్టు ముందు ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. కాగా, పంచకుల సీబీఐ తీర్పుకు 72 గంటల ముందు నుంచే హరియాణా ప్రభుత్వం ముందస్తు చర్యలను చేపట్టింది. సున్నితమైన ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సేవలను కూడా నిలిపివేసింది.

ఖట్టర్‌కు ముప్పు తప్పినట్టే

• హర్యానా సీఎం పదవి నుంచి తొలగించాలని డిమాండ్లు • ఒత్తిళ్లకు లొంగేది లేదని బీజేపీ సంకేతాలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు పదవీగండం తప్పినట్టే కనిపిస్తోంది. బాబా రామ్ రహీమ్ అనుచరుల విధ్వంసకాండలో 32 మంది చనిపోవడంతో, ఆయనను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలని అన్నివైపుల నుంచి డిమాండ్లు వచ్చాయి. అయితే ఈ ఒత్తిళ్లక ు అధిష్టానం వాటికి తలొగ్గడం లేదు. స్వయంగా హర్యానా కోర్టు ఖట్టర్‌పై తీవ్రమైన వ్యాఖ్యలు చేసినా వాటిని పెద్దగా పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు ఆ వ్యక్తి వాదన వినడం సహజన్యాయమని సంకేతాలు పంపుతోంది. దీంతో ఇప్పటికిప్పుడు మనోహర్‌లాల్ ఖట్టర్‌ను పదవీ నుంచి ఉద్వాసన పలకరని తెలుస్తోంది. హర్యానాలో తొలిసారిగా బీజేపీ అత్యధిక స్థానాలు గెలుచుకోగా, ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి పదవికి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను స్వయంగా ఎంపిక చేశారు. హర్యానా సీఎంలుగా ఎవరున్నా జాట్ సామాజిక వర్గం నుంచే ఇప్పటిదాకా పనిచేస్తూ వచ్చారు. దానికి భిన్నంగా జాట్‌యేతర వ్యక్తి అయిన మనోహర్‌లాల్ ఖట్టర్‌ను ప్రధాని మోడీ సీఎం పదవిపై కూర్చోబెట్టారు. ఈ ప్రయోగం సఫలమవుతుందా ? లేదా అనేసందేహాలు మొదటినుంచే వ్యక్తమయ్యాయి. అయితే ఖట్టర్ పరిపాలన సామర్థ్యంపైనే ఇప్పుడు అనుమానాలు వస్తున్నాయి. రాష్ట్రంలో చెలరేగుతున్న ఆందోళనలు నియంత్రించి, శాంతిభద్రతలను పరిరక్షించడంలో ఆయన విఫలమవుతున్నారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఆయన మూడు ఆందోళనలు నియంత్రించడంలో వైఫల్యం చెందారని విపక్షాలు ఆరోపణలు గుప్పిస్తున్నాయి. తొలుత రామ్‌పాల్ మహరాజ్ ఆశ్రమంలో జరిగిన ఆందోళనలో సమయంలో ఐదుగురు చనిపోయారు. జాట్ల రిజర్వేషన్ల కోసం చేసిన ఆందోళన హింసాత్మకంగా మారి 30 మందికిపైగా చనిపోయారు. తాజాగా బాబా రామ్‌రహీమ్ అనుచరులు జరిపిన విధ్వంసకాండలో 37 మంది ప్రాణాలువదిలారు. ఈ మూడు ఘటనలను సరిగ్గా నియంత్రించడంలో ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ పూర్తిగా వైఫల్యం చెందారని, దాని ఫలితంగా ఇంతమంది ప్రాణాలు కోల్పోయి, ఆస్తుల విధ్వంసం జరిగిందని ప్రతిపక్షాలు భగ్గుమంటున్నాయి. అక్కడక్కడా లోపాలు జరిగాయంటూనే... రామ్‌రహీమ్ బాబా అనుచరుల్లో కొద్దిమంది గూండాలు ప్రవేశించడం వల్లే ఈ విధ్వసం జరిగిందని ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అభిప్రాయపడుతున్నారు. వైఫల్యాల హ్యాట్రిక్ సాధించిన ఖట్టర్‌కు ఆ పదవిలో కొనసాగే అర్హత లేదని విపక్షాలు మండిపడుతున్నాయి. 37మంది అమాయకుల చావుకు కారణం ఎవరని ? పశ్రిస్తున్నారు. ముఖ్యమంత్రి సరైన నిర్ణయం తీసుకోని కారణంగా లక్షల మంది పంచకుల పట్టణానికి వచ్చారని దాని వల్లే వారంతా యథేచ్ఛగా విధ్వంసకాండకు పాల్పడ్డారని అంటున్నారు. వీరిని నియంత్రించడం పోలీసులు వల్ల సాధ్యం కాక చేతులెత్తాశరని, దాని వల్ల మీడియా వాహనాలు క ూడా ధ్వంసమయ్యాయని ప్రతిపక్షాలు అంటున్నాయి.

కుండపోతే!

(మొదటి పేజీ తరువాయి)

ఉండాలని సూచించింది. ఈ ఐదు జిల్లాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. కొన్ని చోట్ల రెండు నుంచి ఐదు సెంటిమీటర్ల వర్షపాతం ఈ ఐదు జిల్లాల్లో ఐదు నుంచి 8 మీటర్ల వర్షపాతం నమోదు అయ్యే చాన్స్ ఉందని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే రెండురోజులుగా భారీ వర్షాలతో అల్లాడుతున్న కొన్ని ప్రాంతాల్లో 27,28వ తేదీల్లోనూ భారీ వర్షాలు పడే ప్రమాదం ఉండనుండటంతో ఆ స్థాయిలో చర్యలకు తీసుకోవాలని స్థానిక ప్రభుత్వాలకు ఆదేశాలు అందాయి. పంచాయతీలు, మున్సిపాలిటీల్లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించింది. చెట్లు కూలడం, విద్యుత్ స్తంభాలు విరిగిపడటం వంటి ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే సహాయచర్యలు తీసుకోవాలని సూచించింది. దీని కోసం ఆయా ప్రాంతాల్లో ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించింది. సముద్రంలోకి వేటకు వెళ్లే మత్స్యకారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. వాతావరణశాఖ ఆదేశాలను ఎప్పటికప్పుడు పాటించి దానికి తగిన విధంగా స్పందించాలని పిలుపునిచ్చింది. సముద్రతీర ప్రాంతాల్లో గంటలకు 45 నుంచి 50 కిలోమీటర్ల వేగంగా బలమైన గాలులు వీస్తాయని తెలిపింది. ఈ క్రమంలో సముద్రతీర ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. వర్షాలు పడే సమయంలో చెట్లక్రింద, బలహీన నివాసాల్లో ఉండవద్దని సూచించింది. డ్రైయిన్లల్లో నీరు నిల్వ ఉండకుండా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షాల అనంతరం వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. బలహీన చెరువులు, కాలువలగట్లు పటిష్టంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం హెచ్చరించింది.

వరరామచంద్రాపురంలో 7సెంటీమీటర్ల అత్యధిక వర్షం

రాష్ట్రవ్యాప్తంగా సాధారణ నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. కోస్తాంధ్రలో అత్యధిక వర్షపాతం నమోదు అవుతోంది. శనివారం ఒక్కరోజే పలుచోట్లు కుండపోత వర్షపాతం నమోదు అయ్యింది. వరరామచంద్రాపురంలో అత్యధికంగా 7సెంటిమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. వీరఘట్టం, కారంచేడు, అద్దంకిలలో 5 సెంటిమీటర్లు, పిలేరుపాడు, పాతపట్నంలలో 4సెంటిమీటర్లు, బాపట్ల, గజపతినగరం, కూనవరం, ఆర్థవీడులలో 3 సెంటిమీటర్ల వర్షపాతం కురిసింది. రాయలసీమలలో హొలగుండలో 4 సెంటిమీటర్లు, బేత్లపల్లే, ఆలూరులలో 3 సెంటిమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. కోస్తా జిల్లాల్లో చాలా ప్రాంతాల్లో రెండు, మూడు సెంటిమీటర్లమేర వర్షపాతం నమోదు అయ్యింది. కొన్ని చోట్ల సాధారణ వర్షాలు కురిశాయి. పలుచోట్ల కుండపోత వాన పడింది. దీంతో రైతాంగం హర్షం వ్యక్తం చేస్తుంది. ఇప్పటి వరకూ పడిన వర్షాలు వ్యవసాయానికి ఉపయుక్తంగా ఉంటాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. మరో రెండురోజులు భారీ వర్షాలు పడితే వాగులు, వంకలు, చెరువులు నిండుతాయని భూగర్భజలాలు పెరుగుతాయని అంటున్నారు.

చర్చలతోనే ప్రగతి

అమరావతి, ఆంధ్రప్రభ : భారతదేశ ఉపరాష్ట్రపతిగా రాజ్యాంగ పదవిని చేపట్టాను.. ఇక రాజకీయాల నుండి తప్పుకున్నాను.. అయినా తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి సహరిస్తా.. అని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. శనివారం గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెలగపూడిలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'పౌర సన్మాన' కార్యక్రమంలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి కీలక అంశాలపై ప్రసంగించారు. భవిష్యత్తులో తాను ప్రోటోకాల్‌కు లోబడి ఉండాల్సిన అవసరం ఉన్నందున ఇకపై ఎలాంటి రాజకీయాలు మాట్లాడబోనని వెంకయ్యనాయుడు అన్నారు. ఇందుకు ఒక్కింత బాధగా కూడా ఉంది. నేనుపుట్టిన జన్మస్థలానికి రావడం, రాష్ట్ర విభజనతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నష్టమే జరిగిందని ఈసందర్భంగా ఉప రాష్ట్రపతి అన్నారు. విభజన బిల్లు పార్లమంట్‌లో ఆమోదం పొందిన సమయంలో బిల్లు వల్ల ఆంధ్రప్రదేశ్‌కు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలన్న ప్రయత్నంతో రాజ్యసభలో తాను ఒంటరిగా పోరాడానని, అందువల్లే ఏపీకి ప్రత్యేకహోదా, ప్యాకేజీ అంశాలు.. పొందు పరిచారన్నారు. 'ఏది ఏమైనా విభజన జరిగింది.. ఇరు రాష్ట్రాలూ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఏపీ-తెలంగాణా ముఖ్యమంత్రులు ఏ విషయాన్నైనా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. వైరంతో ఎలాంటి ప్రగతిని సాధించలేరన్నారు. 'పోట్లాడుకోవద్దు.. మాట్లాడుకోండి.. సమస్యలు పరిష్కరించుకోండి.. నేను ఎక్కడున్నా తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి సహకరిస్తానని' వెంకయ్యనాయుడు అన్నారు. ఇచ్చి ప ుచ్చుకునే ధోరణిలో వ్యవహరించాలని సూచించారు. తెలుగుభాషను బతికించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భాష.. యాస.. మారుతున్న వేళ్ల.. అమ్మభాషను మర్చిపోతున్నామని ఉపరాష్ట్రపతి ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న కాలంలో తెలుగుభాష కనుమరుగయ్యే ప్రమాదం పొంచివుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తెలుగుభాషలో పరిపాలనను సాగించాలన్ని సూచించారు. ఇంట్లో.. బయట..పరిపాలనలో తెలుగుకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తెలుగువారికి ప్రపంచ వ్యాప్తంగా అపూర్వమైన భవిష్యత్తు, సంపత్తు ఉందన్నారు. తెలుగువారికి అపారమైన తెలివితేటలు ఉన్నాయని, ప్రపంచంలో ఎక్కడ చూసినా 100 మంది ప్రముఖుల్లో కనీసం 10 మంది తెలుగువారు స్థానం సంపాదించడం దీనికి తార్కాణమన్నారు. కేంద్రంతో కలిసిమెలసి ప్రభుత్వ పథకాలను అమలు చేయడం వల్ల రాష్ట్రాలు మరింత అభివృద్ధిని సాధిస్తాయన్నారు. దేశంలో నానాటికీ అవినీతి, అరాచకం, అశాంతి పెరిగిపోతోందన్నారు. అవినీతిని అంతమొందిచకపోతే భవిష్యత్తు ఎంతో ప్రమాదకరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అరాచకాలు సృష్టించడానికి ఒక కులాన్నో.. మతాన్నో.. వర్గాన్నో అడ్డంపెట్టుకొని చేయడం దౌర్భాగ్యమని ఉపరాష్ట్రపతి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కోణాన్ని చూడలేకపోతున్న వారి అభివృద్ధికి పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. ఎదుటివారు ఆకలితో ఉంటూ చూస్తూ ఎలా ఉంటూమని ప్రశ్నించారు. కష్టపడితేనే పదవులు వాటంతట అవే వరిస్తాయని, తానెప్పుడూ పదవులకోసం ప్రయత్నాలు చేయలేదన్నారు.. పార్టీ సేవలు గుర్తించి అప్పగించిన బాధ్యతలను విశ్వసనీయతతో.. నిబద్ధతతో పలువురికి సహాయం చేయాలన్న తపనతో వాటిని నిర్వర్తించానని ఉపరాష్ట్రపతి అన్నారు. జనమే మనం..మనమే జనంగా గుర్తించాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండకపోతే.. అసలు నాయకులే పుట్టుకురాలేని ఉద్బోధించారు. రాష్ట్రప్రజల ఆదరణ జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేనన్నారు. గన్నవరం విమానాశ్రయం నుండి ప్రకాశం బ్యారేజీ వరకూ ప్రజలు తనకు పలికిన ప్రేమపూర్వకమైన ఆహ్వానం.. మీఅందరి ప్రేమ.. అభిమానాలు.. జీవితాంతం గుర్తుంచుకుంటాన్నారు. గతంలో నేను ఎన్నో ర్యాలీలు.. ఉద్యమాలు చూశాను. కానీ నేటి తెలుగు ప్రజల ఆదరణ.. ఆహ్వానం అపూర్వమైనదన్నారు. విజయవాడ కేంద్రంగా జై ఆంధ్రా ఉద్యమంతో కేంద్రాన్ని కుదిపివేశామని.. 1978 లోనే రాష్ట్ర విభజన జరిగి ఉంటే ఎంతో బాగుండేదన్నారు. సన్మాలు బాధ్యతలను ఎప్పుడూ గుర్తు చేస్తుంటాయని వెంకయ్యనాయుడు అన్నారు. నా బాధ్యతను నాకు ఈ సన్మానం ఎప్పుడూ గుర్తు చేస్తూ ఉంటుంది.

మీ అందరికీ నేను ఒక్కమాట చెప్పాలని ఉంది.. ''నాపై ఉంచిన ఈ బాధ్యతలతో పార్టీలకు అతీతంగా ప్రజలకు మీ ఆశలు అనుగుణంగా ఉన్నత ప్రమాణాలు తేవడానికి ప్రయత్నిస్తా.. చిన్నప్పటి నుండీ నేను నేర్చుకుంది ఒక్కటే.. అది కష్టపడి పనిచేయడం.. 'ఐ యామ్ రిటైర్డ్.. బట్ నాట్ టైర్డ్' అని వ్యాఖ్యానించారు. రాజ్యసభ ఛైర్మన్‌గా సభకు పూర్వ వైభవాన్ని తీసుకువస్తానని వెంకయ్యనాయుడు అన్నారు. దేశంలో పార్లమెంట్, అసెంబ్లీ, శాసనమండలి, జిల్లాపరిషత్, పంచాయతీల వంటి చట్టసభలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, వాటిల్లో జరిగే చర్చలు అభివృద్ధికి పీటలు వేయాలే తప్ప, అభివృద్ధి నిరోధకాలుగా ఉండరాదన్నారు. చట్టసభల్లో అర్థవంతమైన చర్చలు జరిపి చట్టాలు తేవాలన్నారు. ప్రస్తుత చట్టసభలపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఆ భావన వారిలోనుండి తొలగిపోయే ప్రయత్నాలు జరగాలన్నారు. చట్టసభల రూపుమాపడానికి తాను ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఇలాంటి వాతావారణం ప్రజాస్వామ్య పద్ధతిలోఉంటే ప్రజాస్వామ్య వ్యవస్థ దెబ్బతింటుందని ఉపరాష్ట్రపతి అన్నారు. సభల్లో చర్చ అర్థవంతంగా ఉంటే దేశాన్ని ముందుకు తీసుకువెళ్తాయని, రాజీకాయ పార్టీల నేతల విమర్శలు హుందాగా, సాంప్రదాయంగా, సహేతుకంగా ఉండలే కానీ, వ్యక్తిగత దూషణలకు తావివ్వయాదర్నారు. ఏ సందర్భంలో



అయినా ప్రతిపక్షాలు అప్రమత్తంగా ఉంటూ ప్రభుత్వాల పనితీరుకు సహకరించాలన్నారు. మనలో ఒకరికి ఒకరం ఎవరూ శత్రువులం కాదు.. కేవలం రాజకీయ ప్రత్యర్థులం మాత్రమే.. స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చాలంటే చట్టసభలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిపక్షాలను గౌరవించాలి. ప్రతిపక్షం కూడా ఆ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదవిలో ఉన్న వ్యక్తి తన పదవి ఔన్నత్యాన్ని పోగొట్టుకోరాదని, ఎంతోమంది మహానుభావులు పార్లమెంట్ గౌరవాన్ని ఇనుమడింపజేశారని వారి గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి మంత్రిగా పక్కా రోడ్లు ఉండాని భావించానని.. వెంకయ్యనాయుడు తెలిపారు. ''నేను ఒక మారుమూల గ్రామంలో పుట్టాను. ప్రతీ రోజూ 3, 6 కిలోమటర్ల దూరం నడిచి వెళ్లి విద్యాభ్యాసం చేశాను.. ఇదే పరిస్థితి పలు చోట్ల ఉండటం బాధాకరం. అందుకే పల్లెల్లో రోడ్లు విస్తరించాలని నాడు అటల్‌బిహార్ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో పట్టుబట్టానని ఆయన గుర్తుచేశారు. 'గ్రామ రాజ్యంలేని రాజ్యం అసంపూర్ణమని' మహాత్మాగాంధీ చేసిన వ్యాఖ్యలను ఉపరాష్ట్రపతి ప్రస్తావించారు. ఏపీలో గృహనిర్మాణాల పథకాన్ని పెద్ద ఎత్తున చేపట్డం నా అదృష్టం.. 5.35 లక్షల ఇళ్లను ఏపీకి మంజూరు చేశా, వాటికి ఇప్పుడు ఈ సభా వేదిక నుండి శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి వచ్చి 70 ఏళ్లు అయింది. క్విట్ ఇండియా ఉద్యమంలో మనమంతా పునరంకితం కావాలని, దేశంలో ఆహార సమృద్ధిని సాధించే స్థాయికి మన దేశం ఎదిగిందన్నారు. ఇప్పటికీ దేశంలో ఆకలి, అవిద్య, అహింస, అవినీతి.. ఉన్నాయి.. దేశంలో 30 శాతం మందికి చదువు రాదు, 25 శాతం మంది ఇంకా దారిద్ర్యరేఖ కిందే ఉన్నారు, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు అవినీతికి దూరంగా ఉంటే సరిపోదు.. అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన సూచించారు. 'కిందిస్థాయి సిబ్బంది చెయ్యి తడపకుండా.. చెయ్యి కలపడం లేదని .. అధికారులు ఇటువంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. దేశంలో అరాచకాలకు తెరతీస్తున్న నేపథ్యం ఆమోదయోగ్యమైంది కాదన్నారు. తాజాగా పంజాబ్ హర్యానాలోల కులం మతం, భాషపేరుతో చేపట్టిన ఆందోళనల.. అరాచకం ఏమాత్రం ప్రజాస్వామ్యానికి అంగీకారం కాదని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. మతం ముసుగు ఇంకా కనిపిస్తోంది. ఈ ముసుగు నుండి ప్రజలు బయటకు రావాలని పిలుపునిచ్చారు. ఆర్థిక అసమానతలు పెరిగాయి వాటిని నివారించే దిశగా ప్రయత్నాలు జరగాలన్నారు. ఇప్పటికీ దేశంలోని పలు గ్రామాల్లో కనీస వసతులు లేని పేదల గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఆకలితో ఆఖరి పంక్తిలో కూర్చున్న వ్యక్తి కూడా సంతృప్తిగా భోజనం చేయాల్సిన రోజు రావాలన్నారు. రాజకీయ పార్టీలు తాత్కాలిక జనాకర్షక పథకాలు ప్రారంభించరాదని, ప్రభుత్వ పథకాలు పేదల సంక్షేమానికి శాస్వత పద్దతిలో ఉపయోగపడేలా ఉంటే దేశాభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరన్నారు. ఇప్పటికీ దేశంలోని పలుచోట్ల ఆలయాల్లోకి ఒక కులం వారిని రానీయడం లేదన్న వార్తలు చాలా సిగ్గు చేటని ఉపరాష్ట్రపతి అన్నారు. 'ఇది ఫ్రీ ఇండియా, గ్రేట్ ఇండియా..మన వారసత్వాన్ని కాపాడాలి.. కులం. మతం పేరుతో వెలివేయడం బాధాకరం.. మతాల మద్య ఉన్న తేడాను రూపుమాపాల్సిన బాధ్యత మనపైనే ఉంది. ఇవది మన ముందున్న సవాల్‌గా భావించాలన్నారు. పొరుగదేశంమైన చైనా శక్తివంతమైనదే కావచ్చు. అయినా ఇప్పుడు శత్రు దేశంగా మారింది. ఈ సమస్యను చర్చల ద్వారా ఇరుదేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయన్న ఆశాభావాన్ని వెంకయ్యనాయుడు వ్యక్తం చేశారు. 'ఈ మాటలు నా హృదయాంతరంగాల్లో నుండి మాట్లాడుతున్న మాటలు..' ఏ ఒక్కరినీ ఉద్దేశించినవి కావు.. అని ఉపరాష్ట్రపతి ఉద్విగ్నంగా ప్రసంగించారు. అమరావతిలో అభివృద్ధి వేగంగా జరుగుతోంది. తక్కువ సమయంలో కేంద్ర నుండి కూడా అధిక నిదులు వచ్చాయి. తక్కువ సమయంలో ఏపీకి ఎంతో మేలు జరిగింది. అది న్యాయపరమైన వాటాయే అదనంగా ఇచ్చిందేమీ లేదు.. నావంతు నాప్రయత్నాలు నేను చేశా.. నాపైన విమర్శలు కూడా వచ్చాయి. వెంకయ్యనాయుడు ఏపీకి మంత్రి అంటూ.. అయినా ఏపీ దేశంలోనే ఉందని వాదించాను.

నా రాజకీయ 45 ఏళ్ల చరిత్రలో 683 జిల్లాలో పర్యటించి ప్ర జల సమస్యలు తెలుసుకొని కష్టపడి సాధారణ నేపథ్యం నుండి ఈస్థాయికి చేరుకున్నారు. ఎక్కడ ఉన్నా మేలే చేశా.. ఏ బాధ్యత అప్పగించినా చక్కగా నిర్వర్తించానని ఆయన అన్నారు. 'నేను ఎప్పుడూ ఈ స్థాయికి వస్తానని భావించలేదని రాజకీయ నేపథ్యం లేదు . వెనుక టైటిల్ అంటే వారసత్వం లేదు.. నేనెప్పుడూ నా కారుకి ఎర్రబుగ్గ ఎప్పుడూ వాడలేదు. ఎయిర్‌పోర్టులో సాధారణ ప్రజలతోనే మమేకమయ్యానని, జనమే మనం.. మనమే జనం, అదే ఆక్సిజన్.. అదే జీవన్‌టోన్.. జనంతో కలిసి ఉంటే కలిగే ఆ ఉత్సాహమే వేరు.. ఇప్పుడు ఇక రాజకీయ పార్టీలో లేను ఆ విషయాలు ప్రస్తావించలేను.. అంటూ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తన ప్రసంగాన్ని ముగించారు. అంతకు ముందు ఉపరాష్ట్రపతిని ఆంధ్రప్రదేశ రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సన్మానించింది. ప్రభుత్వం సన్మాన పత్రాన్ని, చందనంతో తయారు చేసిన శ్రీవేంకటేశ్వరస్వామివారి విగ్రహాన్ని సిఎం చంద్రబాబు అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఉండి వచ్చిన వేదపండితులు ఆయనకు ఆశీస్సులు అందజేసి, ప్ర సాదాన్ని అందించారు. అనంతరం ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాష్ట్రంలో ప్రధానమంత్రి ఆవాజ్‌యోజన, ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి నాగులపల్లి శ్రీకాంత్ వందన సమర్పణ చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు అశోకగజపతిరాజు, సృజనాచౌదరి, స్పీకర్ డాక్టర్ కోడెలశివప్రసాదరావు, మండలిడిప్యాటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి దినేష్‌కుమార్, డీజీపీ సాంబశివరావు, రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు,



భయం గుప్పిట్లో పంచకుల

విలవిల

• షాక్‌లో స్థానికులు, పర్యాటకులు • నిషేధాజ్ఞలు, పర్యాటకులు

డేరా సచ్చా సౌధా అధినేత బాబా గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ మద్ధతుదారులు సృష్టించిన హింసాకాండతో హర్యాణా, పంజాబ్ రాష్ట్రాలు, వాటితో పాటు కేంద్రపాలిత ప్రాంతంగా ఉన్న ఈ రెండు రాష్ట్రాల ఉమ్మడి రాజధాని చండీగఢ్ చిగురుటాకులా వణుకుతోంది. హింసోన్మాదం ప్రభావం దేశ రాజధాని ఢిల్లీ సహా ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోనూ ప్రకంపనలు సృష్టించింది. భూకంపాన్ని తలపించే భయోత్పాతానికి పంచకుల పట్టణం కేంద్ర బిందువుగా మారింది. అత్యధిక ప్రాణనష్టం జరిగిన పంచకుల నుంచి ఆంధ్రప్రభ ప్రత్యేక కథనం అందిస్తోంది.

హర్యానా(పంచకుల) నుంచి ఆంధ్రప్రభ ప్రతినిధి

అత్యాచార ఆరోపణలు ఎదుర్కొన్న బాబా గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌ను సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం దోషిగా తేల్చిన మరుక్షణం నుంచి పంచకుల రణరంగంగా మారింది. అప్పటికే వందలు కాదు, వేలు కాదు, ఏకంగా లక్షల్లోనే రామ్ రహీమ్ భక్త జనం పంచకులకు చేరుకుంది. కానీ వారిని ఎదుర్కోడానికి సిద్ధంగా ఉన్న హర్యాణా పోలీసులు, కేంద్ర పారా మిలటరీ బలగాల సంఖ్యాబలం వేల సంఖ్యకే పరిమితమైంది. ఫలితంగా పరిస్థితి అదుపు తప్పింది. చివరకు బాబా భక్తజనం ఉన్మాదుల్లా మారి విధ్వంసం సృష్టిస్తుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర వహించాల్సి వచ్చింది. అంతేకాదు, రాళ్ల వర్షాన్ని తలపించేలా పోలీసుల మీదకే విరుచుకుపడడంతో పారిపోవడం పోలీసుల వంతైంది. విధ్వంసాన్ని అడ్డుకోవాల్సిన పోలీసులే వెనుకడుగు వేయడంతో అల్లరిమూకలు మరింత రెచ్చిపోయాయి. కనిపించిన ప్రతి వాహనాన్ని, దుకాణాన్ని ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. అదనపు బలగాలను రప్పించి అల్లరి మూకను చెదరగొట్టే వరకు విధ్వంసం కొనసాగింది. సెక్టార్-5, సెక్టార్-16లో అత్యధికంగా ఆస్తి నష్టం సంభవించింది.

యంత్రాంగం అడుగడుగునా వైఫల్యం

బాబా రామ్ రహీమ్ సింగ్‌పై నమోదైన అత్యాచారం అభియోగాలపై పంచకులలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం తీర్పు వెలువరించనుందన్న విషయం అందరికీ తెలుసు. ఈ తీర్పు సందర్భంగా హింస చోటు చేసుకునే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు సైతం ముందు నుంచీ హెచ్చరించాయి. దైవంతో సమానంగా భావించే తమ బాబాపై కోర్టు తీర్పునిస్తుందని తెలుసుకున్న భక్తులంతా పెద్ద ఎత్తున పంచకులకు పయనమయ్యారు. రెండు రోజుల ముందు నుంచే పంచకులకు చేరుకోవడం మొదలుపెట్టారు. కానీ ప్రభుత్వం వారిని నియంత్రించలేకపోయింది. అసలు భక్తుల రాకను గుర్తించడంలోనే విఫలమైంది. వచ్చిన వారి సంఖ్య వందలు దాటి వేలుగా మారి ఆ తర్వాత లక్షలకు చేరుకుంది. అప్పుడు ప్రమాదాన్ని గ్రహించిన హర్యాణా ప్రభుత్వం, తమ దగ్గరున్న పోలీసు సిబ్బంది సరిపోరని భావించి కేంద్రం నుంచి పారా మిలటరీ బలగాల సాయం కోరింది. ఆలస్యంగా అందిన విజ్ఞప్తిపై కేంద్రం వెంటనే స్పందించి బలగాలను పంపించింది. అయినా సరే కీడు శంకించిన రాష్ట్ర ప్రభుత్వం ఆర్మీ సహాయాన్ని సైతం కోరింది. ఆర్మీ యూనిట్లు సైతం అందుబాటులో సిద్ధంగా ఉన్నాయి. చూడ్డానికి ఏర్పాట్లన్నీ చకచకా చేసినట్టే కనిపించినా, అసలు తీర్పు వెలువరించిన రోజు యంత్రాగం సరైన ప్రణాళిక లేకుండా వ్యవహరించింది. లక్షల సంఖ్యకు చేరుకున్న భక్తజనాన్ని అరెస్టు చేసి నిర్బంధించడానికి వీలుగా ఒక స్టేడియాన్ని తాత్కాలిక జైలుగా మార్చినట్టు పోలీసులు ప్రకటించారు. కానీ తీర్పు వెలువరించేలోపు ఏ ఒక్కరినీ అరెస్టు చేయలేదు. స్టేడియంలోకి ఒక్కరినీ తరలించలేదు. కనీసం వారిని ఒకే చోట గుమికూడకుండా అడ్డుకోవడంలోనూ పోలీసులు విఫలమయ్యారు. అందుకే తీర్పు గురించి తెలిసిన కొద్ది క్షణాల్లోనే అంచనాలకు, ఊహకూ అందని రీతిలో చేయిదాటిపోయింది.

విధ్వంస రచనకు పక్కా ప్రణాళిక

పంచకులలో చోటు చేసుకున్న హింస తీర్పు అనంతరం ఏర్పడ్డ భావోద్వేగంతోనో, ఆగ్రహావేశాలతోనో జరిగింది కాదు. పక్కా పథకం ప్రకారమే హింసకు సిద్ధపడి భక్తులు పంచకుల చేరుకున్నారు. వచ్చేవారిని పోలీసులు అడ్డగిస్తారన్న ఉద్దేశంతో ఎవరికీ అనుమానం కలుగకుండా ప్రజా రవాణా వ్యవస్థలైన బస్సులు, రైళ్లలోనే పంచకుల చేరుకున్నారు. భార్యాభర్తలు, పిల్లాపాపలు, తల్లిదండ్రులతో కలిసి సకుటుంబ సపరివార సమేతంగా పంచకులకు పయనమయ్యారు. తీర్థయాత్రలకు వెళ్తున్న కుటుంబాన్ని తలపించేలా భక్తుల ప్రయాణం సాగింది. దీంతో పోలీసులు పెద్దగా అనుమానించాల్సిన అవసరం ఏర్పడలేదు. భక్తుల్లో మగాళ్లంతా తమతో పాటు కర్రలు, పెట్రోల్ నింపిన క్యాన్లు వెంట తెచ్చుకున్నారు. వాటిని బట్టల సంచుల మధ్యలో పెట్టి బయటకు కనిపించకుండా జాగ్రత్తపడ్డారు. ఈ విషయాన్ని సైతం నిఘా సంస్థలు ముందుగానే పసిగట్టి ప్రభుత్వ యంత్రాంగాన్ని హెచ్చరించాయి. అయినా సరే పంచకుల పోలీసులు ఆ హెచ్చరికలను అర్థం చేసుకోలేకపోయారు. మధ్యాహ్నం 3 గంటల సమయం వరకు అంటే కోర్టు తీర్పు ఇచ్చే వరకు రాష్ట్రం నలు మూలల నుంచి పంచకులక ు వచ్చిన భక్తులు సెక్టార్ 5లో ప్రశాంతంగా బైఠాయించారు. ముందు వరుసలో స్త్రీలు, చిన్నారులు, వృద్ధులను కూర్చోబెట్టారు. ఏ ఒక్కరిని పలకరించే ప్రయత్నం చేసినా వారు మాత్రం మౌనాన్నే ఆశ్రయించారు. దీంతో భక్తుల ఉద్దేశమేంటో ఎవరికీ అర్థం కాలేదు.

ఎప్పుడైతే కోర్టు తీర్పు వచ్చిందో భక్తుల్లో మహిళలు, చిన్నారులు, వృద్ధులు ముందు వరుస నుంచి వెనక్కు వెళ్లడం మొదలైంది. ఇది గమనించిన పోలీసులు వారంతా వెనక్కి తిరిగి వెళ్లిపోతున్నారని భావించారు. కానీ వారిలో మగాళ్లంతా ఒక్కసారిగా ముందుకు దూసుకొచ్చారు. ఏం జరుగుతుందో గ్రహించేలోపే అక్కడున్న మీడియా వాహనాలపై కర్రలు, రాళ్లతో విరుచుకుపడ్డారు. ఆలస్యంగా మేల్కొన్న పోలీసు యంత్రాంగం ఆ తర్వాత భాష్పవాయు గోళాలు ప్రయోగించినా ఫలితం లేకపోయింది. ఒకదశలో భక్తజనం విసరుతున్న రాళ్లకు భయపడి పోలీసులు అర కిలోమీటరు వరకు వెనక్కి తిరిగి పరుగు తీశారు.

ఆ తర్వాత ఎప్పటికో తేరుకున్న పోలీసులు పారా మిలటరీ బలగాల సహాయంతో హింసాకాండను అడ్డుకునే ప్రయత్నం చేసింది. ఆ క్రమంలో చోటుచేసుకున్న ఘర్షణలో అనేక మంది చనిపోయారు. ఇలా మొత్తానికి అత్యధిక మరణాలతో పంచకుల రక్తమోడింది. స్థానికులను ప్రాణభయంతో వణికించింది.

భయాందోళనలో పర్యాటకులు, స్థానికులు

కల్లో కూడా ఊహించని ఈ భయోత్పాతాన్ని కళ్లారా చూసిన పంచకుల చిగురుటాకుల వణికిపోతోంది. రెండు రోజులు గడిచినా స్థానికులు ఇంకా షాక్ నుంచి తేరుకోలేకపోతున్నారు. గుర్వీందర్ సింగ్ అనే పంచకుల వాసులు తమకు ఎదురైన భయంకరమైన అనుభవాలను ఆంధ్రప్రభతో పంచుకున్నారు. ''ఏనాడూ తాము ఊహించని దుర్ఘటనలు కళ్లారా చూశామని భయాందోళనలతో తెలిపారు. ఇలాంటి రోజు మళ్లీ రాకూడదని కోరుకుంటున్నారు. పోలీసులు పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేసి ఉంటే బావుండేదని అభిప్రాయపడ్డారు''. చండీగఢ్‌ను ఆనుకుని ఉన్న పంచకుల నుంచే కులూ మనాలీ వెళ్లాలి. బస్సు, ట్రైను ఏదైనా ఈ మార్గమే గత్యంతరం. వేలు, లక్షల రూపాయలు ఖర్చు పెట్టుకుని ఎంతో పక్కా ప్రణాళికతో ఉత్తరాది, దక్షిణాది నుంచి వచ్చిన ఎందరో సందర్శకులు పంచకులలో చిక్కుకున్నారు. వరుసగా సెలవులు రావడంతో ఎప్పుడో ప్రణాళికలు వేసుకుని పర్యాటక ప్రదేశాల సందర్శనకు వచ్చిన వారంతా తీవ్ర భయాందోళనలకు లోనవుతున్నారు. ఉండడానికి సరైన హెూటళ్లు దొరక్క, బడ్జెట్ పెరిగిపోయి, రవాణా వ్యవస్థ అస్తవ్య స్థమై, ఎప్పుడే ప్రమాదం ముంచుకొస్తుందో, ఎప్పుడే అల్లరి మూక

రేప్ కేసులో డేరా గురువు దోషే

పేట్రేగిన హింస

పంచకుల(హర్యానా): 15 ఏళ్ల నాటి అత్యాచార కేసులో పంచకుల సీ బీఐ ప్రత్యేక న్యాయస్థానం సంచలన తీర్పునిచ్చింది. తనను తాను దేవుడి అవతారంగా చెప్పుకునే బాబా గుర్మీందర్ రామ్ రహీమ్ సింగ్ ను రేప్ కేసులో దోషిగా తేల్చింది. 2002లో తన ఆశ్రమంలోని ఇద్దరు మహిళలపై అత్యాచారం చేసిన గుర్మీత్..పక్కా సాక్షాధారాలు లభించడంతో దోషిగా తేలారు. గుర్మీత్ కు విధించే శిక్షలను న్యాయస్థానం సోమవారం ఖరారు చేయనుంది. సీబీఐ కోర్టు గుర్మీత్‌ను దోషిగా తేల్చిన వెంటనే హర్యాణా పోలీసులు బాబాను అదుపులోకి తీసుకుని అంబాలాసెంట్రల్ జైలుకు తరలించారు. తీర్పు తర్వాత గుర్మీత్ అనుచరులు రెచ్చిపోవడంతో ఆయన్ని హెలికాప్టర్‌లో రోహ్‌తఖ్ తరలించారు.

దోషిగా తేల్చిన నిమిషాల్లోనే హింస

డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌ను పంచకుల సీబీఐ కోర్టు దోషిగా తేల్చిన నిమిషాల్లోనే పంజాబ్,హర్యానాలోని పలు ప్రాంతాల్లో బాబా అనుచరులు రెచ్చిపోయారు. ఎక్కడికక్కడ హింసకు పాల్పడ్డారు. మూడు మీడియా వాహనాలకు నిప్పుపెట్టారు.నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీ చార్జ్,టియర్ గ్యాస్ ప్రయోగించారు. పంజాబ్ లోని ఛనసన్ వాల్‌లో టెలిఫోన్ ఎక్స్ఛేంజీకి నిప్పుపెట్టారు. మన్సాప్రాంతంలో రెండు పోలీసు వాహనాలను దగ్ధం చేశారు. హర్యానాలోని పంచకులలో ఐటీ శాఖ ఆఫీసును గుర్మీత్ అనుచరులు ధ్వంసం చేశారు. షాపింగ్ మాల్స్,థియేటర్లలో దాడులకు పాల్పడ్డారు. పంజాబ్ లోని ఐదు జిల్లాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పోలీసులు కర్ఫ్యూ విధించారు. గుర్మీత్ అనుచరుల దాడిలో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోగా...వందలాది మందిం గాయపడ్డారు. బాబా గుర్మీత్ సింగ్ రాం రహీమ్ ను రేప్ కేసులో దోషిగా తేలేందుకు గంటల వ్యవధిలో చేసిన చిన్నతప్పుతోనే పంచకుల రణరంగంగా మారిందన్న వాదన తెరపైకి వచ్చింది. గుర్మీత్ కేసు సందర్భంగా పంచకులలో కేంద్రబలగాల ముందస్తు మోహరింపు, ఇంటర్నెట్ సేవలు నిలిపివేత, ఎక్కడికక్కడ చెక్ పోస్టుల ఏర్పాటు చేసినప్పటికీ...నిషేదాజ్ఞల్లోని తప్పిదమే 37మంది ప్రాణాలు తీసినట్లు తెలుస్తోంది. ఈనెల 25న తీర్పు సందర్భంగా ఉద్రిక్తపరిస్థితులు తలెత్తుతాయని ముందే ఊహించిన హర్యానా ప్రభుత్వం ఈనెల 18,22 తేదీల్లో వేర్వేరుగా రెండు ఆర్డర్లు జారీ చేసింది. వాటిలో పంచకుల వచ్చే వారు ఎలాంటి ఆయుధాలు ధరించి రాకూడదని పేర్కొంది కానీ..జనాలు గుంపులు గుంపులుగా గుమిగూడొద్దన్న పదాన్ని చేర్చలేదు.దీంతో తీర్పునాటికే రామ్ రహీమ్ 2 లక్షలమంది అనుచరులు పంచకుల చేరుకున్నారు. సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం బాబాను దోషిగా తేలుస్తూ తీర్పునిచ్చిన వెంటనే హింసకు పాల్పడ్డారు.

బాధిత మహిళల ప్రాణభయం!

గుర్మీత్ దోషిగా నిర్ధారణ అయిన నేపథ్యంలో హింసాత్మక పరిణామాలు బాధిత మహిళలను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. గుర్మీత్ అత్యాచారానికి పాల్పడ్డారని ఆరోపించిన ఇద్దరు సాధ్వీలు ప్రస్తుతం ఎక్కడున్నారో ఎవరికీ తెలీదు. ఈ విషయంపై నోరు మెదిపేందుకు వాళ్ల తరపు న్యాయవాది కూడా సుముఖంగా లేదు. తాజా పరిస్థితుల్లో వారి ప్రాణాలకు ముప్పు ఉండటంతో ఎలాంటి సమాచారం బయటకు పొక్కనీయటం లేదు. 'గత కొద్దిరోజులుగా వాళ్లలో భయాందోళనలు కనిపిస్తున్నాయి. ప్రాణభయంలో బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారు. ఒకవేళ కేసులో ఆయన్ను(గుర్మీత్) నిర్దోషిగా ప్రకటిస్తే తాము వేరే రాష్ట్రానికి వెళ్లిపోతామని వాళ్లు తనతో మొరపెట్టుకున్నట్లు' న్యాయవాది తెలిపారు.



డ్రైవర్‌గా రామ్ రహీం గుర్మిత్ సింగ్ కుటుంబంతో ఉన్న ఫైల్ ఫోటో



బాబా రామ్ రహీం డేరా సచ్చా సౌధా ఆశ్రమం

ఖైదీ నంబర్ 1997

రోహతక్ జైలులో రాంరహీమ్ బాబాకు ఖైదీ సంఖ్య 1997ను కేటాయించారు. సాధారణ ఖేదీగానే అతడిని ట్రీట్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక సదుపాయాలు కల్పించడం లేదని చెప్పారు. కాగా, అతనికి సహాయకుల్ని నియమించలేదని హర్యానా ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డీఎస్ దేశి తెలిపారు. వీఐపీ సౌకర్యాలు కల్పిస్తున్నారన్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. అదేవిధంగా గుర్మీత్‌ను జైలుకు తరలించే క్రమంలో ఆయన వెంట మహిళను హెలికాప్టర్‌లోకి అనుమతించడంపై వచ్చిన ఆరోపణలపై డీజీపీ, సీఎస్ వివరణ ఇవ్వలేదు.



బాబా కంటతడి

ఇప్పటి వరకు రాజభోగాలు అనుభవించిన గుర్మీత్ కోర్టు తీర్పుతో నిర్వెరపోయారు. కొద్దిసేపటి వరకు కోలుకోలేకపోయారు. జైలుకు బ యల్దేరే ముందు ఆయన కన్నీరు పెట్టుకున్నారు. ఈ విషయం ఇప్పుడు వెలుగులోకి రావడంతో సంచలనంగా మారింది. ఆయన కన్నీరు పెట్టుకున్నారన్న వార్తతో ఆయన అనుచరులు కూడా కన్నీరు పెట్టుకున్నారు.తీర్పును జీర్ణించుకోలేని లక్షలాదిమంది అనుచరులు రోడ్లమీదికొచ్చి హింసకు పాల్పడ్డారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేశారు.

డేరా సచ్చా సౌధాపై కథనాలు

న్యూఢిల్లీ: డేరా అంటే తాత్కాలిక గుడారం లేదా తాత్కాలిక సమావేశ స్థలం. ఈ పదం పర్షియా భాష నుంచి వచ్చింది. కాలక్రమంలో డేరాలకు శబ్దార్థం మారుతూ వచ్చింది. మజిలీ, మజ్లిస్ అని, అన్న పానీయాలు అందుబాటులో ఉండే చోట అనే అర్థం కూడా వచ్చింది. ఒకప్పుడు డేరాలంటే తాత్కాలికంగా తాళ్లతో కట్టేవే ఉండేవి. ఇవి కూడా ఆధునిక హంగులను పులుముకుని ఏసీ గదులుగా మారిపోయాయి. పంజాబ్ రాష్ట్రంలో విస్తరించిన డేరాలకు ఆధ్యాత్మిక అంశాలను బోధించే గురువు ఆవాసం అని అర్థం. ఒక్కో ఆధ్యాత్మిక గురువుది ఒక్కో గుడారం. ప్రతి గుడారానికి ఓ పేరుంటుంది. గుళ్లు, గోపురాల్లాగే ఓ ప్రత్యేకమైన ఆకృతిని కలిగి ఉండే ఈ డేరాలు చాలా చోట్ల సిమెంట్‌తో నిర్మించిన పక్కా మందిరాలుగా కూడా మారిపోయాయి. మతాలకు, డేరాలకు ప్రత్యక్ష సంబంధం ఏమీ ఉండదు. ఆయా మతాల విశ్వసించే గురువులనుబట్టి వారి బోధనలు ఉంటాయి. సిక్కు పవిత్ర గ్రంథం 'గురు గ్రంథ్ సాహిబ్'ను నమ్మే గురువు ఆ గ్రంథంలో ఉన్న బోధనలే ప్రజలకు విడమర్చి చెప్పవచ్చు. సిక్కు మతాలే కాకుండా ఇతర మతాలకు చెందిన గురువులు కూడా పంజాబ్‌లో డేరాలను నిర్వహిస్తున్నారు.

పంజాబ్ రాష్ట్రంలో పదివేలకుపైగా డేరాలు ఉంటాయన్నది పంజాబ్ యూనివర్శిటీ పొలిటికల్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్ పనిచేస్తున్న రోంకీ రామ్ అంచనా. అత్యాచారం కేసులో అరెస్టై జైల్లో ఊచలు లెక్కపెడుతున్న గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌ది అందులో ఒక డేరా. డేరా సచ్చాసౌదా అన్నది దాని పేరు. ఆయన దేవుళ్లు, మతాలు అన్ని సమానమని చెప్పడానికే తన పేరును 'గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్'గా మార్చుకున్నారు. డేరాలకు ఓ సిక్కు, క్రిస్టియన్, ముస్లిం లేదా బౌద్ధ మతస్థుడు ఎవరైనా గురువుగా ఉండవచ్చు. ఆ డేరాకు తానే గురువన్న హెూదాలో ప్రజలకు ప్రబోధనలు చేయవచ్చు. లేదా ఫలానా గురువు వారసుడినంటూ బోధనలు చేయవచ్చు. ఉదాహరణకు డేరా సచ్‌ఖండ్ బల్లాన్ 'రవిదాసియా ధర్మాన్ని' పాటిస్తుంది. అంటే గురువు రవిదాస్ బోధనలను ఆచరిస్తోంది. సచ్చా సౌధా, నిరంకారీస్, నాంధారీస్, బినియర్‌వాలా, రవిదాసియాస్, రాధా సోయామీస్ తదితర డేరాలను సిక్కుయేతర డేరాలుగా పరిగణిస్తారు.

పంజాబ్ లాంటి రాష్ట్రంలో డేరాలకు ఆదరణ పెరగడానికి ప్రధాన కారణం కొన్ని వందల సంవత్సరాలుగా దళితులను హిందూ, గురుద్వార్, చర్చి, మసీదుల్లోకి అనుమతించకపోవడమే. ఇప్పటికీ కూడా వారికి చాలా చోట్ల అనుమతి లేదు. దేశవ్యాప్తంగా సరసారి 16 శాతం దళితులుంటే ఒక్క పంజాబ్ రాష్ట్రంలోనే 33 నుంచి 34 శాతం మంది దళితులు ఉన్నారు. వీరికి డేరాల్లోకి అనుమతి ఉండడంతో వారు ఎక్కువగా డేరాల్లోకి ప్రవేశించడం ఆచారంగా మారింది. పైగా డేరాల్లో ఏ మతస్థులు కూడా తక్కువ కులాల వారిని తక్కువచేసే చూడరు. అలా చూడకూడదని, ప్రజలంతా సమ భావంతో మెలగాలని డేరాల్లో బోధిస్తారు. కనుక డేరాల సంస్కృతి ఎక్కువగా నచ్చే ప్రజలు ఉన్నారు.

డేరాలు సమాజంలో అంతర్భాగంగా ఉండడం వల్ల సమాజ ప్రభావం వాటి మీద కూడా పడింది. దీనివల్లే కొన్ని డేరాలు ఎన్నికల్లో ఫలానా రాజకీయ పార్టీకి ఓటేయండి అంటూ పిలుపునిస్తుంటాయి. ఎన్నికల సందర్భంగా రాజకీయ నాయకులు కూడా ఎక్కువగా డేరాలను సందర్శిస్తారు. వారికి కావాల్సిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకుంటారు. వాటిని తీరుస్తామని, అందుకు ప్రతిఫలంగా తమను గెలిపించాలని కోరుతుంటారు. ఇలా రాజకీయ నాయకులు, డేరాల గురువులు పరస్పరం సహకరించుకునే కొత్త సంస్కృతి వెల్లూనుకుంటోంది. హేతువాదిగా చెప్పుకునే ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మూడు డేరాలను సందర్శించారు.

డేరా చీఫ్ కేసు పరంపర..

డేరా సచ్చా సౌధా 1948లో షా మస్తానా మహరాజ్ స్థాపించారు. ఆతర్వాత దీనికి మస్తానా మహరాజ్ చీఫ్‌గా ఎన్నికయ్యారు. దీనిని 1990లో సంత్ గురీ ్మత్ సింగ్‌కు దీని బాధ్యతలు అప్పగించారు. రాజస్థాన్ రాష్ట్రం శ్రీగంగానగర్ లొ ని గురుదామోదీయ గ్రామం నుంచి సిర్సా పట్టణానికి గుర్మీత్ చేరుకున్నారు.

2002: ఆశ్రమంలో ఉండే ఒక సాధ్వి తనపై గుర్మీత్ అత్యాచారం చేశారంటూ లేక ద్వారా ఫిర్యాదు చేసింది. మూడు పేజీల ఆ లేఖ అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్, కేంద్ర హెూం మంత్రి, హైకోర్టు, ఇతరుల పేర్లను ప్రస్తావిస్తూ తనపై గుర్మీత్ అత్యాచారం చేసినట్లు బాధిత మహిళ ఆరోపించింది. తనని గ ుఫాగా అభివర్ణిస్తూ గుర్మీత్ తన డెన్‌లో పక్కనే గన్ పెట్టుకుని బెదిరిస్తూ పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు లేఖలో ఉంది.

మే 2002: హైకోర్టు ఆదేశాల మేరకు సిర్సా సెషన్స్ జడ్జి ఈ లేఖపై విచారణ చేపట్టారు. ఇక ఈ లెటర్ వెలుగులోకి రావటానికి కారణమైన వ్యక్తి హ త్యకు గురయ్యాడు. **2002 డిసెంబర్:** ఈ లేఖలోని ఆరోపణలు వాస్తవాలేనని తేలింది. దీంతో గుర్మీత్‌పై సెక్షన్ 376, 506, 509 కింద కేసు నమోదైంది.

2003 డిసెంబర్ : కేసును సీబీఐకి అప్పగించారు. దర్యాప్తు అధికారిగా సతీశ్ దాగర్ నియమితులయ్యారు. **2005-06:** దర్యాప్తులో భాగంగా అత్యాచార బాధితురాలైన సాధ్విని ఎట్టకేలకు గుర్తించారు. ఆమె వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. **2007 జులై:** సీబీఐ విచారణను పూర్తిచేసింది. అంబాలా కోర్టులో బాబా రాంరహీమ్‌కు వ్యతిరేకంగా చార్జిషీటు ఫైల్ చేశారు. తర్వాతికాలంలో కేసు ప ంచకులకు బదలీ అయింది. **1991-2001:** మధ్య కాలంలో మరికొంత మంది సాధ్వీలు కూడా అత్యాచారానికి గురైనట్లు వెలుగులోకి వచ్చింది. కానీ, సదరు బాధితులను గుర్తించలేక పోయారు. **2008 ఆగస్టు** : డేరా చీఫ్‌పై చార్జిషీటు నమోదు.**2011-2016:** విచారణ ప్రారంభం. బాబా తరపున న్యాయవాది క్రాస్ ఎక్సామిన్‌కు హాజరయ్యారు. **2016 జులై** : కేసు విచారణలో మొత్తంగా 52 మంది సాక్షులు కోర్టుకు వచ్చారు. వీరిలో 15 మందిని ప్రాసిక్యూషన్ చేశారు. 37 మంది డిఫెన్సివ్‌ను ఎదుర్కొన్నారు. **25 జులై 2017:** ప్రతీరోజు ఈ కేసును విచారించాల్సిందిగా సీబీఐ కోర్టు స్పష్టంచేసింది. తద్వారా త్వరగా తీర్పు వెలువరించే ప్రయత్నం చేసింది.**17 ఆగస్టు 2017:** డేరా చీఫ్ విదేశాలకు వెళ్లకుండా న్యాయస్థానం ఆంక్షలు విధించింది. ఇరువర్గాల మధ్య తుదిదశ వాదోపవాదనలు ముగిశాయి. కోర్టు తీర్పును 25కి వాయిదా వేసింది. **25 ఆగస్టు 2017:** బాబా గుర్మీత్‌సింగ్‌ను దోషిగా ఖరారు చేస్తూ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. అయితే, శిక్ష ఖరారు విషయాన్ని మాత్రం 28వ తేదీకి వాయిదా వేసింది.

వందలాది రైళ్లు, కార్లు కాన్వాయ్..

శుక్రవారం కోర్టు తీర్పు నేపథ్యంలో బాబా గుర్మీత్ అభిమానులు, అనుచరులు వేలాదిగా పంచకులకు తరలివచ్చారు. రాజస్థాన్,పంజాబ్, హర్యానా రాష్ట్రాల నుంచి వందలాది కార్లు, రైళ్ల కాన్వాయ్‌తో గుర్మీత్ ఉదయం 8.30 గంటలకు కోర్టు ఆవరణకు చేరుకున్నారు. దీంతో అక్కడ అసాధారణ భద్రత ఏర్పాటు చేశారు. కాన్వాయ్‌ను హెలికాప్టర్, డ్రోన్ కెమెరాతో పోలీసు ఉన్నతాధికారులు పర్యవేక్షించాల్సివచ్చింది. కాన్వాయ్‌లో జామర్లతో కూడిన ప్రత్యేక వాహనాన్ని కోర్టు దాకా నడిపించారు. డేరా వద్ద ఆర్మీ కట్టుదిట్టమైన భద్రత చేపట్టింది. సైన్యం ఫ్లాగ్ మార్చ్ చేపట్టింది. హింసాత్మక చర్యలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలను పాటించింది.

జైలు ప్రయాణం ఇలా...

- 15 ఏళ్ల నాటి అత్యారం కేసులో గుర్మీత్‌పై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు అనంతరం శుక్రవారం ఆయనను పంచకులలోని ఆర్మీ పశ్చిమ కమాండ్ ప్రధాన కార్యాలయానికి తరలించారు.
- బాబా అరెస్టు నేపథ్యంలో ఆయన అనుచరులు, అభిమానులు పెద్ద ఎత్తున ఆందోళనకు, హింసాత్మక చర్యలకు దిగారు. దీంతో భద్రతా చర్యల్లో భాగంగా 25న సాయంత్రం 4.55 గంటలకు ఆర్మీ హెలికాప్టర్‌లో తరలించారు.
- రోహతక్‌లోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లోని సునంద హెలిపాడ్‌లో ఆర్మీ ల్యాండ్ అయింది. ఆయన వెంట ఓ మహిళ కూడా వచ్చింది. ఆమె అతని కుమార్తె హనిప్రీత్‌గా అధికారులు పేర్కొన్నారు.
- సాయంత్రం 5.10 గంటలకు రోహతక్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ అతిథి గృహానికి తరలింపు. ఈ అతిథి గృహాన్ని మంత్రులు, పోలీసు ఉన్నతాధికారుల బసకు ఉపయోగిస్తారు. ఈ పీటీసీ కేంద్రం అన్ని హంగులతో ఐదు నక్షత్రాల హెూటల్‌ను తలపిస్తుంది.
- రాత్రి 8.40 గంటలకు భోజనం గురించి అక్కడి సిబ్బంది వాకబు చేశారు. అయితే ఆహారం తీసుకునేందుకు నిరాకరించిన రాంరహీమ్ కేవలం ఒక గ్లాసు పాలు మాత్రమే తాగారు.
- చివరకు రోహతక్ జైలుకు గుర్మీత్‌ను తరలించారు.

తొలిరోజు జైలులో..

అనేక నాటకీయ పరిణామాల తర్వాత హెలికాప్టర్‌లో గుర్మీత్ రాంరహీమ్‌మ్ వీఐపీ అతిథి గృహం నుంచి రోహతక్ జైలుకు చేరుకున్నారు. జైలులో ఆయన తీవ్ర ఒత్తిడితో కనిపించారు. శుక్రవారం సాయంత్రం జైలుకు వెళ్తున్న సమయంలో గుర్మీత్ కళ్లలో నీళ్లు సుడులు తిరిగాయి.

- రాత్రి 9.30 గంటల ప్రాంతంలో జైలుకు చేరుకున్న బాబాకు అధికారులు ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశారు. ఒక సహాయకుడిని అందుబాటులో ఉంచారు. మినరల్ వాటర్ బాటిళ్లను సమకూర్చారు.
- తొలిరోజు జైలు జీవితం ఆయనకు కష్టంగా గడిచింది. రాత్రంతా కునుకు తీయలేదు. బార్యక్‌లో అటూ ఇటూ పచార్లు చేస్తూనే గడిపారు.
- రాత్రి 10.30 గంటల ప్రాంతంలో సహచర ఖైదీలతోపాటు అతనికి భోజనం వడ్డించారు. గుర్మీత్ కేవలం ఒక చపాతీ, ఒక గ్లాస్ పాలు మాత్రమే తీసుకున్నారు.
- శనివారం తెల్లవారు జామున నాలుగు గంటలకు యోగాతో దినచర్య ప్రారంభించారు. అల్పాహారంలో భాగంగా టీతోపాటు రెండు స్లయిస్ బ్రెడ్ తీసుకున్నారు.

కేసు మూసివేయాలని బెదిరించారు

సీబీఐ మాజీ అధికారి సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: గుర్మీత్ కేసు విచారణలో ఉండగా దర్యాప్తు సంస్థపై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు వచ్చాయని విచారణ చేపట్టిన సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ ములిన్జా నారాయణన్ చెప్పారు. ఈ కేసుకు సంబంధించి పలు కీలక విషయాలను ఆయన వెల్లడించారు. విచారణ సమయంలో గుర్మీత్ కూడా తాను బాబానంటూ పరోక్షంగా బెదిరించేందుకు యత్నించారు. ఇలాంటి ఆటలో ఒక్కోసారి మేం గెలవచ్చు.. ఒక్కోసారి ఓడిపోవచ్చు.. కానీ, చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరు' అని ములిన్జా పేర్కొన్నారు. 'డిసెంబర్ 12, 2002లో పంచకుల ప్రత్యేక కోర్టు ఆదేశాల మేరకు అత్యాచార ఆరోపణలతో సీబీఐ కేసు నమోదు చేసింది. సబ్ ఇన్‌స్పెక్టర్ హెూదా నుంచి నేరుగా సీబీఐ జాయింట్ డైరక్టర్ పగ్గాలతోపాటు గుర్మీత్ కేసును కూడా ములిన్జాకు ప్రభుత్వం అప్పగించింది. ఆ సమయంలో సీబీఐలోని ఓ ఉన్నతాధికారి నా గదిలోకి ప్రవేశించారు. ఎలాంటి చర్యలు చేపట్టవద్దని, తక్షణమే కేసు మూసే యాలని సూచించారు.

జడ్‌ప్లస్ భద్రత తొలగింపు

అత్యాచారం కేసులో దోషిగా తేలడంతో గుర్మీత్ సింగ్ రామ్ రహీమ్ కల్పిస్తోన్న జడ్‌ప్లస్ కేటగిరీ భద్రతను ఉపసంహరించుకున్నట్లు హరియానా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దీపిందర్ సింగ్ చెప్పారు. సీబీఐ కోర్టు తీర్పు అనంతరం రాష్ట్రంలో చెలరేగిన హింసాకాండపై శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆందోళనల్లో ఇప్పటి వరకు 31 మంది చనిపోయారని, 250 మంది గాయపడ్డారని సీఎస్ సింగ్ తెలిపారు. శుక్రవారం రాత్రి 15 మంది డేరా కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నామని, ఆయా బృందాలపై రెండు దేశద్రోహం కేసులు పెట్టామని చెప్పారు. పంచకుల కోర్టు నుంచి గుర్మీత్‌ను హెలికాప్టర్‌లో రోహతక్ జైలుకు తరలించామన్న సీఎస్.. జైలులో దోషికి వీఐపీ సేవలు అందుతున్నాయన్న వార్తలను ఖండించారు. గుర్మీత్‌ను సాధారణ ఖైదీగానే చూస్తున్నామని, అందరూ తినే ఆహారాన్నే ఆయనకూ అందిస్తున్నామని వివరించారు.

కనిష్టంగా ఏడేళ్ల శిక్ష!

ఇద్దరు సాధ్వీలను అత్యాచారం చేసిన కేసులో దోషిగా నిర్ధారణ అయిన డేరా సచ్చా సౌధా అధినేతకు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం రేపు శిక్షను ఖరారు చేయనుంది. ఐదేళ్లకు పైబడే శిక్ష విధింపు ఉంటుందని న్యాయనిపుణులు పేర్కొంటున్నారు. కనిష్టంగా ఏడేళ్లు, గరిష్టంగా పదేళ్లు శిక్ష పడే అవకాశం ఉందని చెబుతున్నారు. హైకోర్టు నుంచి బెయిల్ పొందేవరకూ ఆయన జైలులోనే ఉంటారని తెలిపారు.

ఆంధ్రప్రభ
క్రీడాప్రభ
ఆదివారం 27 ఆగస్టు 2017 | విజయవాడ 10



సైనాకు కాంస్యమే

- సెమీస్‌లో పోరాడి ఓడిన నెహ్వాల్
- క్వార్టర్స్‌లో వెనుదిరిగిన శ్రీకాంత్

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు శనివారం నిరాశాజనక ఫలితం ఎదురైంది. గత ఛాంపియన్‌షిప్‌లో రజతం కైవసం చేసుకున్న ఏస్ షట్లర్ సైనా నెహ్వాల్ మరోసారి ఫైనల్ చేరలేకపోయింది. మహిళల సింగిల్స్ సెమీ ఫైనల్‌లో ఓటమి చవి చూసి భారత అభిమానులను నిరాశకు గురిచేసింది. తొలి గేమ్ గెలిచిన సైనా .. అదే జోరును మ్యాచ్ అంతటా కొనసాగించలేకపోయింది. సెమీస్‌లో ఓడినా సైనాకు కాంస్యం లభించనుంది.

గ్లాస్గో: సైనా నెహ్వాల్ మహిళల సెమీఫైనల్ మ్యాచ్‌లో 21-12, 17-21, 10-21 తేడాతో జపాన్ షట్లర్ నవోమి ఒకుహర చేతిలో పరాజయం పాలైంది. ఆరంభంలో ఆమె కోర్టులో అద్వితీయంగా కదిలింది. సైనా డిఫెన్స్ అద్భుతంగా ఉంది. కానీ మ్యాచ్ సాగే కొద్దీ ఆమె అలసిపోయింది. దీంతో సైనా అదే జోరును కొనసాగించలేకపోయింది. తొలి గేమ్‌ను 21-12 తో దక్కించుకున్నా ఆమె ఫైనల్ చేరలేకపోయింది. గత ఏడాది ఫైనల్ చేరిన సైనా మరోసారి ఆ ఘనతను దక్కించుకోలేకపోయింది. ఆశ్చర్యకరంగా ఒకుహర కెరీర్‌లోనే అత్యుత్తమ బ్యాడ్మింటన్ ఆడింది. రెండో గేమ్‌లో 11-10 ఆధిక్యం సాధించిన జపనీస్ షట్లర్ చివరకు 21-17తో వశం చేసుకుంది. రెండో గేమ్‌ను 22 నిమిషాల్లో గెలుచుకున్న ఒకుహర చివరి గేమ్ హోరాహోరీగా సాగడంతో 27 నిమిషాల్లోగాని దక్కించుకోలేకపోయింది. మూడో గేమ్‌లో పోరు తొలి గేమ్‌లో మాదిరిగానే సాగింది. కాకుంటే ఒకుహర ఆధిపత్యం చెలాయించింది. విరామానికి ఆమె ఏకంగా ఏడు పాయింట్ల ఆధిక్యంలో నిలిచింది. ఆధిక్యం లభించడంతో ఒకుహర ర్యాలీలతో చెలరేగిపోయింది. సైనా పుంజుకోవాలని చూసినా అప్పటికే ఆలస్యం అయింది. గేమ్‌ను 10-21తో చేజార్చుకుని ఈసారి కాంస్యంతో తృప్తి పడింది. జపాన్ నుంచి ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కెళ్లిన తొలి మహిళగా ఒకుహర చరిత్ర సృష్టించింది.

సెమీస్‌లో సింధు: శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ పోరులో సింధు 21-14, 21-9 తేడాతో చైనాకు చెందిన సున్ యును వరస గేమ్‌లలో అనాయాసంగా మట్టికరిపించింది. సైనా నెహ్వాల్ 21-19, 18-21, 21-15తో స్కాట్లాండ్ షట్లర్ కిరస్టీ గిల్‌మోర్‌తో హోరాహోరీగా పోరాడి గెలిచి సెమీ ఫైనల్లో అడుగుపెట్టింది.

క్వార్టర్స్‌లో ఓడిన శ్రీకాంత్: పురుషుల విభాగంలో భారత్ ఆశాకిరణం కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగాడు. శుక్రవారం క్వార్టర్స్‌లో పేలవ ప్రదర్శనతో అతను 21-14, 21-18 తో వరుస గేమ్‌లలో టాప్ సీడ్ సోన్ వాన్ హో (దక్షిణకొరియా) చేతిలో పోరాడి ఓటమి చవిచూశాడు.



సంతోషంగానే ఉంది

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సెమీస్ చేరగలిగినందుకు సంతోషంగానే ఉందని సైనా అంది. గాయం నుంచి కోలుకుంటున్న తాను అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చానని చెప్పింది. ''తొలి గేమ్ గెలిచినా ఓడినందుకు నిరాశగానే ఉంది. కానీ గాయం నుంచి కోలుకొని మొత్తంమీద సెమీస్ చేరినందుకు సంతోషంగానే ఉంది. అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వగలిగినందుకు తృప్తిగా ఉంది'' అని చెప్పింది. తాను రియో ఒలింపిక్ క్రీడలకు వెళ్లాల్సింది కాదని సైనా నెహ్వాల్ అంది. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో గెలిచిన తర్వాత ఆమె మాట్లాడుతూ రియో వెళ్లినందుకు పశ్చాత్తాపం వ్యక్తంచేసింది. ''నేను రియో వెళ్లివుండాల్సింది కాదు. గాయం అంత పెద్దదని నాకు తెలియలేదు. నేను కోలుకోవడంలో నా కోచ్, నా తల్లిదండ్రులు ఎంతో సాయం చేశారు. కుడి మోకాలిలో ఇంకా సమస్య ఉంది'' అని సైనా చెప్పింది.

సెమీస్‌లో నాదల్ X ఫెదరర్?

- రేపటి నుంచి యుఎస్ ఓపెన్

న్యూయార్క్: ఏడాదిలో చివరిదైన యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ సెమీఫైనల్లో ప్రపంచ నెంబర్ వన్ రఫెల్ నాదల్, మూడో సీడ్ రోజర్ ఫెదరర్ ఎదురయ్యే అవకాశం ఉంది. టోర్నీ సోమవారం ఆరంభమై సెప్టెంబరు 10న ముగుస్తుంది. గ్రాండ్‌స్లామ్ నిర్వాహకులు శుక్రవారం విడుదల చేసిన డ్రా ప్రకారం ఈ దిగ్గజాలు ఈ దశలో తలపడే అవకాశాలే ఎక్కువ. ఈ పోరులో ఫెదరరే ఫేవరెట్. 2007 తర్వాత ఒకే ఏడాది వరుసగా మూడు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచి రికార్డులకెక్కాలని ఫెదరర్ భావిస్తున్నాడు. కానీ ఇటీవలే నెంబర్‌వన్‌గా తిరిగి అగ్రస్థానం దక్కించుకున్న నాదల్.. మరోసారి టైటిల్ గెలవాలని కృతనిశ్చయంతో ఉన్నాడు. ఆండీ ముర్రే, నొవాక్ జకోవిచ్ తదితర దిగ్గజాలు ఈ టోర్నీకి దూరం కావడంతో ఛాంపియన్‌గా అవతరించేందుకు యువకులకు సదవకాశమని విశ్లేషకులు భావిస్తున్నారు. రెండు సార్లు విజేత జకోవిచ్ మోచేతి గాయంతో, 2014 రన్నరప్ కీ నిషికొరి మణికట్టు గాయంతో, ఛాంపియన్ ఆండీ ముర్రే, 2012 ఛాంపియన్ మారిన్ సిలిక్ గాయాలతో వింబుల్డన్ నుంచే టెన్నిస్‌కు దూరమయ్యారు.




షరపోవాకు ఆరంభం కఠినం: 18 మాసాల తర్వాత టెన్నిస్ కోర్టులోకి అడుగుపెడుతున్న రష్యా భామ మరియ షరపోవాకు తొలి పోరు కఠినంగా ఉండబోతోంది. ఆమె తన తొలి పోరులో రొమేనియాకు చెందిన రెండో సీడ్ సిమోనా హెలెప్ ఎదురవుతోంది. మాజీ నెంబర్ వన్ షరపోవా.. డోపింగ్ నిషేధాన్ని ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. డిఫెండింగ్ చాంపియన్ కెర్బర్ తన తొలి పోరులో జపాన్ క్రీడాకారిణి నవోమి ఓసాకాతో తలపడుతుంది. ప్రపంచ నెంబర్‌వన్, గత ఏడాది ఫైనలిస్ట్ కరోలినా ప్లిస్కోవా (చెక్) తొలి రౌండ్ పోరులో మగ్ద లినెట్‌ను ఢీకొంటుంది.

అమిత్, గౌరవ్ గెలుపు



- బాక్సర్ల శుభారంభం

హాంబర్గ్: ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు శుభారంభం చేశారు. శనివారం ఆసియా కాంస్య పతక విజేత అమిత్ ఫంగల్ (49 కిలోలు) తొలి రౌండ్ పోరులో ఇటలీకి చెందిన ఫెడరికో సెర్రాను చిత్తుచేశాడు. గౌరవ్ బిధురి (56 కి.) కూడా తొలి రౌండ్‌లో గెలిచి ముందుకు వెళ్లాడు. గౌరవ్ ప్రపంచ యూత్ ఛాంపియన్ షిప్ కాంస్య పతక విజేత శామ్ గుడ్‌మాన్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు. వీరిద్దరు ఈ ఛాంపియన్‌షిప్‌లో తొలి సారి ఆడుతున్నారు.

బ్రాత్‌వైట్, హోప్ సెంచరీలు

- విండీస్ 329/5
- ఇంగ్లాండ్ 258 ఆలౌట్

లీడ్స్: బ్రాత్‌వైట్ (134, 249 బంతుల్లో, 17 ఫోర్లు, 2 సిక్స్), హోప్ (147 బ్యాటింగ్, 252 బంతుల్లో, 23 ఫోర్లు) శతకాలతో కదంతొక్కడంతో రెండో టెస్టులో వెస్టిండీస్ భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. శనివారం రెండో రోజు ఆట ఆఖరుకు 5 వికెట్లకు 329 పరుగులు చేసింది. ఇప్పటికే ఇంగ్లాండ్‌పై 71 పరుగుల ఆధిక్యం సంపాదించింది. విండీస్ చేతిలో ఇంకా 5 వికెట్లు ఉన్నాయి. హోప్ అజేయ సెంచరీ సాధించడంతో విండీస్ భారీ స్కోరు చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అండర్సన్ 46 పరుగులిచ్చి 3 వికెట్లు దక్కించుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు శుక్రవారం టాస్ గెలిచి ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 258 పరుగులకు ఆలౌట్ అయింది. బెన్ స్టోక్స్ (100, 124 బంతుల్లో, 17 ఫోర్లు) సెంచరీ సాధించాడు. జాయ్ రూట్ (59) అర్ధసెంచరీ చేశాడు. తక్కిన బ్యాట్స్‌మెన్ పెద్దగా రాణించలేదు. రోచ్ 71 పరుగులిచ్చి 4, గాబ్రియల్ 51 పరుగులిచ్చి 4 వికెట్లు తీశారు.





తలవంచిన తలైవాస్

ముంబయి: ప్రొ కబడ్డీ లీగ్ పోరులో తమిళ తలైవాస్.. పాట్నా పిరేట్స్‌కు తలవంచింది. శనివారం జరిగిన పోరులో పిరేట్స్ 35-24తో గెలిచింది. మను గోయత్ 11 పాయింట్లు సాధించంతో పాట్నా తిరుగులేని విజయం సాధించింది. పాట్నా తరఫున జైదీప్ 5 టేకిల్ పాయింట్లు సాధించాడు. తలైవాస్ తరఫున అజయ్ ఠాకుర్ 10 రైడ్ పాయింట్లు సాధించినా సహచరుల నుంచి తోడ్పాటు అందకపోవడంతో జట్టును గెలిపించలేకపోయాడు. మరో మ్యాచ్‌లో పుణేరీ పల్టాన్ 26-24 తేడాతో యు ముంబాపై గెలిచింది.

ప్రయోగమా... ఫలితమా!

- లంకతో భారత్ మూడో వన్డే నేడే

బలహీనమైన ప్రత్యర్థి.. తొలి వన్డేలో సునాయాసంగా చిత్తయింది. అటు భారత బౌలర్లు లంక బ్యాట్స్‌మెన్ భరతం పడితే.. బ్యాట్స్‌మెన్ వారి బౌలర్లను ఓ ఆటాడుకున్నారు. ప్రయోగాలెలాంటి ఫలితాలిస్తాయో తెలుసుకునే అవకాశమే భారత జట్టుకు రాలేదు. రెండో వన్డేలోనూ అదే ఒరవడి కొనసాగుతుందనుకుంటే.. లంక కొత్త హీరో, యువ స్పిన్నర్ దనంజయ రూపంలో సవాలెదురైంది. అతను తన స్పిన్ మాయతో రెండో వన్డేలో కోహ్లి సేనను ఓడించినంత పని చేశాడు. సిరీస్‌ను ఆసక్తి కరంగా మార్చేశాడు. భారత్ ప్రయోగాలు సత్ఫలితానివ్వని నేపథ్యంలో ఆదివారం పల్లెకెలెలోనే జరిగే మూడో వన్డేలో టీమ్ఇండియా సారథి విరాట్ ప్రయోగాలను కొనసాగిస్తాడా? లేక పల్లెకెలెలోనే సిరీస్‌ను వశం చేసుకునేందుకు ప్రయోగాలకు తాత్కాలికంగా తెరదించుతాడో వేచి చూడాలి.



పల్లెకెలె: అప్రతిహత విజయాలు సాధిస్తున్న భారత్.. వన్డే సిరీస్‌లో ఇప్పటికే 2-0 ఆధిక్యంలో ఉంది. మరో విజయం సాధిస్తే సిరీస్ కైవసమవుతుంది. ఈ నేపథ్యంలో సిరీస్ ఫలితం కోసం కోహ్లి బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులకు స్వస్తి.. యధాప్రకారం తాను వన్‌డౌన్‌లోనే దిగే అవకాశాలను కొట్టిపడేయలేం. సిరీస్ దక్కిన తర్వాత చివరి రెండు మ్యాచ్‌లకు ప్రయోగాలు చేపట్టే అవకాశాలే ఎక్కువ. రెండో వన్డేలో దనంజయ బౌలింగ్‌కు దిగే వరకు భారత ఓపెనర్లకు ఎదురే లేకపోయింది. మిడిలార్డర్ పేకమేడలా కూలింది. మూడో స్థానంలో రాహుల్, నాలుగో స్థానంలో జాదవ్, ఐదో స్థానంలో కోహ్లి ప్రయోగం బెడిసికొట్టింది. ధోని, భువనేశ్వర్ సహనంతో బ్యాటింగ్ చేసి జట్టును ఒడ్డుకు చేర్చి మిడిలార్డర్ వైఫల్యం కనిపించకుండా చేశారు. ప్రత్యేకించి భువీ బ్యాటింగ్ నైపుణ్యం భారత్‌కు వరం. టెస్టుల్లో మాదిరిగానే వన్డేల్లోనూ బ్యాటింగ్ చేయాలన్న ధోని సలహాతో అతను వన్డేల్లో తొలి అర్ధసెంచరీ సాధించాడు. ఇక బౌలింగ్‌లో బుమ్రా, చచల్, అక్షర్ పటేల్ లంక బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేయడంలో సఫలీకృతులవుతున్నారు.

ఇది మూడోదే: పల్లెకెలెలో భారత్ ఎక్కువ వన్డేలు ఆడింది లేదు. ఇంతవరకు ఆడింది రెండు మ్యాచ్‌లే. 2012లో తొలి మ్యాచ్ ఆడి గెలిచిన టీమ్ఇండియాకు ఆదివారంనాట వన్డే మూడోదవుతుంది. దీంతో ఇక్కడ కోహ్లి సేనకు నూరు శాతం గెలుపు రికార్డు ఉంది. ఈ రికార్డును కొనసాగించాలని వారు భావిస్తున్నారు. మూడో వన్డేలోనూ గెలిచి జోరును కొనసాగించాలనుకుంటు న్నారు. దీంతో ప్రయోగాలను విరాట్ కొనసాగిస్తాడా అన్న సంశయం ఏర్పడుతోంది. ప్రయోగాలకు బదులు ఇంతవరకు ప్రతిసారీ టాస్ గెలుస్తూ వస్తున్న కోహ్లి.. మరోసారి టాస్ గెలిస్తే యువకులకు బ్యాటింగ్ ప్రాక్టీసు కోసం ముందుగా బ్యాటింగ్‌ను ఎంచుకునే అవకాశాన్ని కాదనలేం. మరోవైపు ఫీల్డింగ్ కోచ్ శ్రీధర్ మాత్రం బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రయోగాలు కొనసాగుతాయని నమ్మకంగా చెబుతున్నాడు.

లంకకు దెబ్బ: మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు... వరుస ఓటములతో నీరసిల్లిన లంకకు అనుకోని దెబ్బ తగిలింది. రెండో వన్డేలో స్లో ఓవర్ రేటింగ్ కారణంగా కెప్టెన్ ఉపుల్ తరంగపై రెండు వన్డేల నిషేధం పడింది. దీంతో అతను మూడో వన్డేకు దూరమయ్యాడు. మూడు మాసాల్లో తరంగపై నిషేధం పడడం ఇది రెండో సారి. ఛాంపియన్స్ ట్రోఫీ లో కూడా ఇలాంటి కారణంతోనే రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఫామ్‌లో లేని తరంగకు ఇది ఒకరకంగా మంచిదే. అతని గైర్హాజరీలో చమర కపుగెదెర లంక జట్టుకు సారథ్యం వహిస్తాడు. ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ గుణతిలక భుజం గాయం కారణంగా పది రోజుల పాటు విశ్రాంతి తీసుకోవలసి రావడంతో చివరి మూడు వన్డేల కోసం టెస్టు కెప్టెన్ చండిమాల్, బ్యాట్స్‌మన్ లహిరు తిరిమానె లంక జట్టులోకి వచ్చారు. చండిమాల్.. తరంగ స్థానంలో బ్యాటింగ్ చేసే అవకాశముంది. గుణతిలక స్థానంలో తిరిమానె ఇన్నింగ్స్ ఆరంభిస్తాడు. రెండో వన్డేలో సిరివర్ధన, కపుగెదెర అద్భుత బ్యాటింగ్‌తో లంక 50 ఓవర్లు పూర్తి చేయగలిగింది. బౌలింగ్‌లో మరోసారి దనంజయ మరోసారి మాయ చేయాలని కోరుకుంటున్న లంక.. బ్యాటింగ్‌లో సిరివర్ధన, కపుగెదెర రాణించాలని వాంఛిస్తోంది. లసిత్ మలింగ పేలవ ఫామ్, చమీర, ఫెర్నాండోల క్రమశిక్షణ లేని బౌలింగ్ ఆ జట్టుకు సమస్యగా మారింది. దనంజయ ఇచ్చిన స్ఫూర్తితో తిరిగి పుంజుకోవాలని లంక కృతనిశ్చయంతో ఉంది.

పిచ్: రెండో వన్డేలో స్పిన్నర్ దనంజయ అద్భుత ప్రదర్శన చూసిన లంక మరోసారి స్పిన్నర్లకు అనుకూలించేపిచ్‌నే కోరుకునే అవకాశాలున్నాయి. దీంతో మరోసారి స్పిన్నర్లు కీలకమవుతారు. సాయంత్రం ఉరుములతో కూడిన జల్లులు కురియవచ్చు. ఫలితంగా మ్యాచ్‌లో ఓవర్లను కుదించే అవకాశాలున్నాయి.

తుది జట్లు (అంచనా):

భారత్: రోహిత్, ధావన్, విరాట్ (కెప్టెన్), రాహుల్, ధోని (కీపర్), జాదవ్, పాండ్య, అక్షర్, భువనేశ్వర్, బుమ్రా, చచల్.

శ్రీలంక: డిక్వెల (కీపర్), తిరిమానె, కుశాల్, చండిమాల్, మాథ్యూస్, సిరివర్ధన, కపుగెదెర (కెప్టెన్), దనంజయ, చమీర, ఫెర్నాండో, మలింగ.

పాండ్య ఉంటాడా?




రెండో వన్డేలో తొడ కండరం గాయంతో బాధపడ్డ పాండ్య మూడో మ్యాచ్‌లో ఆడతాడా అన్నది సందేహాస్పదంగా ఉంది. ఒకవేళ ఫిట్‌గా ఉన్నా డిసెంబరు వరకు తీరికలేకుండా వన్డే మ్యాచ్‌లున్న భారత్.. అతణ్ని ఇక్కడ ఆడించే సాహసం చేస్తుందా అన్నది చూడాలి. పాండ్యకు విశ్రాంతినిచ్చినట్లయితే కుల్‌దీప్ యాదవ్ లేదా శార్దూల్ ఠాకుర్‌ను ఐదో బౌలర్‌గా బరిలోకి దించవచ్చు. మనీష్ పాండే ఈ సారి కూడా బెంచ్‌కే పరిమితం కాకతప్పదు.



1 వన్డేల్లో ప్రపంచ రికార్డు స్టంపింగ్‌లకు ధోని (99) మరో స్టంపింగ్ దూరంలో ఉన్నాడు. రెండో వన్డేలో అతను కుమార సంగక్కర (99)ను సమం చేశాడు. సంగక్కర 353 ఇన్నింగ్స్‌లో ఆ రికార్డు సాధించగా.. ధోని 293 ఇన్నింగ్స్‌లోనే పూర్తిచేశాడు.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: M Satish Chandar, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.



మంచి సినిమా అంకెలకు అతీతం!

మనసు స్పందించే విషయాలనే కథా వస్తువులుగా ఎంచుకుంటాను. వాటిలో సామాజిక సమస్యలూ ఉంటాయి. వాటిని నేను థియేటర్లో చూడాలనుకునే విధంగా తెరకెక్కిస్తాను. సినిమాను ప్రేమిస్తాను గనుక ప్రేక్షకులూ ప్రేమించేలా రూపొందిస్తాను. మంచి సినిమా గొప్పదనాన్ని వసూళ్లలో చెప్పలేం. దానిలో ఉన్న విషయాన్ని బట్టే ప్రశంసించాలి. నాకు తెలిసి..వందల కోట్ల రూపాయల లెక్కలు కేవలం అంకెలకు పరిమితం. మంచి సినిమా వీటికి అతీతంగా హృదయంలో నిలిచిపోతుంది.

బాలీవుడ్ దర్శకుడు రాజ్ కుమార్ హిరాణీ

రాజ్ కుమార్ హిరాణీ... బాలీవుడ్‌లోనే...కాదు దేశవ్యాప్తంగా ఈ దర్శకుడి పేరుకో ప్రత్యేకత ఉంది. దర్శకుడిగా ఆయన అనుభవం పద్నాలుగేళ్లు. తెరకెక్కించింది కేవలం నాలుగు చిత్రాలే. అయితే చేసిన ప్రతి సినిమా సమాజం వేస్తున్న తప్పటడుగులను చూపించింది, మంచిని చెప్పింది, ఆలోచింపజేసింది, చరిత్ర సృష్టించింది. ప్రతి సినిమా... దర్శకుడి హృదయాన్ని తెరపై ఆవిష్కరిస్తుంది. అలా చూస్తే రాజ్ కుమార్ హిరాణీలో ఓ ఉద్యమకారుడు ఉన్నట్లే. అలాంటి మంచిపేరుని సంపాదించుకున్న ఈ దర్శకుడి అంతరంగం ఈ వారం 'ఆంధ్రప్రభ లైఫ్' లో...

ఆణిముత్యాలను తీసిన... మార్గ దర్శకుడు!




సందేశాత్మక చిత్రాల రూపకల్పన అనేది... వెండితెరపై అత్యంత క్లిష్టమైన పని. వినోద సాధనమైన సినిమాతో సందేశాన్ని ఇవ్వడం ఖరీదైన తప్పుగా అభివర్ణిస్తుంటారు చాలా మంది దర్శక నిర్మాతలు. కోట్లాది రూపాయల ఖర్చుతో కూడుకున్న సినిమాలో ఆటపాటలే చూపించాలంటారు. ఆ గీత దాటితే...మూల్యం చెల్లించక తప్పదని భయపడతారు. చలన చిత్రాల్లో సందేశాలు ఇవ్వడం అంటే... చేతులు కాల్చుకోవడమే. ఇందులో అతిశయం, అబద్ధం ఏమీ లేదు. కానీ ఏదీ అసాధ్యం కాదని నిరూపించారు బాలీవుడ్ దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణీ. ఆసక్తికరంగా సందేశాన్ని చూపిస్తే ప్రేక్షకులు ఆస్వాదిస్తారని ఆయన నిరూపించాడు. ఆయన రూపొందించిన 'మున్నాభాయి ఎంబీబీఎస్', 'లగే రహో మున్నాభాయ్', 'త్రీ ఇడియట్స్', 'పీకే'....ఈ సినిమాలన్నీ సమాజ లోపాల్ని ప్రశ్నించినవే. ఇవన్నీ పురస్కారాలతో పాటు అత్యధిక వసూళ్ల ఘనతలూ సాధించాయి.



మున్నాభాయ్‌తో ప్రస్థానం ప్రారంభం...

రాజ్‌కుమార్ హిరాణీ సినీ పరిశ్రమ ప్రయాణం ఎడిటింగ్ గది నుంచి ప్రారంభమైంది. పలు వ్యాపార సంస్థలకు ప్రకటనల రూపకల్పనతో ఆయనకు పేరొచ్చింది. ఇందులో కొన్ని ద్విచక్ర వాహనాల ప్రకటనలు బాగా గుర్తింపు తీసుకొచ్చాయి. ఈ రంగంలో పేరొచ్చినా...సంతృప్తి దక్కలేదు. ఏదో కోల్పోతున్న మానసిక భావన కలిగేది. దీంతో దర్శక నిర్మాత విను వినోద్ చోప్రా బృందంలో చేరారు. అక్కడ ఎడిటింగ్ శాఖలో పలు చిత్రాలకు పనిచేశారు. ప్రచార చిత్రాలను



రూపొందించారు. ఈ సందర్భంలో హిరాణీ ప్రతిభను గుర్తించారు వినోద్ చోప్రా. రాజ్‌కుమార్ హిరాణీ ఆలోచనలు, దృక్పథం చోప్రాను ఆకట్టుకునేవి. అతను చెప్పిన ఓ గొప్ప ఆలోచన నుంచి మున్నాభాయ్ అనే సినిమాకు అంకురార్పణ జరిగింది. మున్నాభాయ్ ఎంబీబీఎస్‌తో హిరాణీ ప్రస్థానం ప్రారంభమైంది.

రోగికి కావాల్సింది నిబంధనలు కాదు..ఆత్మీయ స్పర్శ..

తొలి చిత్రంతోనే తన దృక్పథాన్ని చూపించారు హిరాణీ. ఆయన రూపొందించిన మున్నాభాయ్ ఎంబీబీఎస్ వైద్య రంగంలో కనుమరుగవుతున్న మానవీయ విలువలను గుర్తుచేసింది. రోగికి కావాల్సింది నిబంధనలు కాదు ఒక ఆత్మీయ స్పర్శ... అని చెప్పింది. మనసున్న ఓ వీధి రౌడీ రోగుల పట్ల చూపించే ప్రేమ, సానుభూతిని ... చదువుకున్న వైద్య సిబ్బంది మర్చిపోవడాన్ని ప్రశ్నించారు హిరాణీ. అమ్మానాన్నలకు ఇచ్చిన మాట కోసం వైద్యుడిగా వేషం వేసుకున్న మున్నాభాయ్ నవ్విస్తూ ఆలోచింపజేశాడు.

దాదాగిరి వద్దని...గాంధీగిరి ముద్దని..

అహింసతో దేశానికి స్వేచ్ఛను ప్రసాదించారు మహాత్ముడు. ఆయన విగ్రహాల్ని వాడవాడలా పెట్టుకున్న మనం ఆయన బోధించిన శాంతి మంత్రాన్ని మాత్రం పూర్తిగా మర్చిపోయాం. ఈ విషయాన్ని లగే రహో మున్నాభాయ్ చిత్రంతో గుర్తుచేశారు రాజ్‌కుమార్ హిరాణీ. ఒక చెంపపై కొడితే మరో చెంప చూపించమన్న మహాత్ముడి జీవనసూత్రాన్ని కథానాయకుడి పాత్రకు ఆపాదించారు. తొలి చిత్రానికి కొనసాగింపుగా హిరాణీ తెరకెక్కించిన లగే రహో మున్నాభాయ్ అంతటి విజయాన్నే అందుకుంది. గాంధీ గిరిలో ప్రతి సమస్యకు పరిష్కారం ఉందని సోదాహరణంగా నిరూపించారీ దర్శకుడు.

ర్యాంకులు కావాలా...? జ్ఞానమా..?

ప్రకృతి పరిశీలన ద్వారా జ్ఞానాన్ని పెంచుకున్నాడు పూర్వపు మానవుడు. మన విద్యా విధానం ఈ ప్రాథమిక సూత్రాన్ని వదిలేసింది. ఎంత పెద్ద ర్యాంకు వస్తే అంత గొప్ప విద్యార్థులుగా పరిగణించడం జరుగుతోంది. విద్యార్థికి కావాల్సింది ర్యాంకు కాదు జ్ఞానం అంటూ 'త్రీ ఇడియట్స్' చిత్రంతో అసలు మేథస్సుకు అర్థం చెప్పారు హిరాణీ. విద్యా రంగాన్ని, ఈ రంగంలోని మేధావుల్ని కదిలించిందీ చిత్రం. యాజమాన్యాలను, తల్లిదండ్రులను ఆలోచనలో పడేసింది. విద్యార్థులను ర్యాంకుల యంత్రాలుగా చూసే దృక్కోణాన్ని మార్చేసింది.

మనిషే...ఎన్ని తేడాలు...

మనుషులంతా ఒక్కటే. అయితే ఈ రూపానికి ఆపాదించుకున్న తేడాలు అనేకం. కులం, మతం, వేష భాషలు ...ఇలా ఎంతో భిన్నత్వం ఉంది. ముఖ్యంగా దేవుడు... అతని పేరు చెప్పుకుని దండుకునే మూకల అసలు స్వరూపం తెరపైకి తీసుకొచ్చారు హిరాణీ. ఆయన రూపొందించిన నాలుగో సినిమా 'పీకే' దేవుడి పేరుతో జరుగుతున్న దందాలను, మత మౌఢ్యాలను ప్రశ్నించింది. దేవుడి పేరుతో చంపుకోమని ఏ మతం చెప్పిందని నిలదీస్తాడు కథానాయకుడు. ఇలా అడగాలంటే విభిన్నమైన విశిష్టమైన వ్యక్తి కావాలనుకుని గ్రహాంతరవాసిని కథానాయకుడిగా ఎంచుకున్నాడు హిరాణీ. ఈ పాత్ర ద్వారా భూమ్మీద మతం, కులం పేరుతో జరుగుతున్న గందరగోళాన్నంతా అత్యంత పకడ్బందీ కథా కథనాలతో ఆసక్తికరంగా చూపించాడు. ప్రస్తుతం తన ఐదో చిత్రంగా సంజయ్‌దత్ జీవిత కథను తెరకెక్కిస్తున్నాడీ దర్శకుడు.

- రమేష్ గోపిశెట్టి

యోగా టైమ్

మెదడుకి ఆక్సిజన్ పెంచే... బంధ హస్త ఉత్తానాసనం

మోడల్ : కె.స్వాతి







రెండు కాళ్లనూ దగ్గరగా ఉంచి నిటారుగా నిలబడాలి. రెండు చేతుల్ని నేలకు సమాంతరంగా పక్కలకి చాపి ఉంచాలి. శరీర బరువుని రెండు కాళ్ల మీద సమంగా ఉంచి ప్రశాంతంగా నిలబడాలి. ఇప్పుడు రెండుచేతులను తలపైకి తీసుకుని వెళ్లి మణికట్టు వద్ద క్రాస్ చేస్తూ ఇంటూ మార్క్‌లా ఉంచాలి. ఈ స్థితిలో తలని వెనక్కు వంచి పైనున్న చేతులను చూడాలి. ఆ

తరువాత చేతులను అలాగే క్రాస్‌గా ఉంచి కిందకి తీసుకురావాలి. చేతులతో పాటు తలను కూడా సాధారణ స్థితికి తేవాలి. ఇలా 10 నుండి 12 సార్లు చేయాలి. చేతులను పైకెత్తేటప్పుడు శ్వాస తీసుకోవాలి. కిందకు దించేటప్పుడు శ్వాస వదలాలి.


ఉపయోగాలు : భుజాల్లోనూ, వీపు పైభాగంలోనూ కండరాల్లో పేరుకున్న టెన్షన్ వదిలిపోయి హాయిగా ఉంటుంది. ఈ వ్యాయామంతో శ్వాసని లోతుగా తీసుకోగల శక్తి పెరుగుతుంది. గుండెకు రక్తసరఫరా ధారాళంగా జరుగుతుంది. మొత్తం శరీరానికి, మెదడుకి ఆక్సిజన్ సరఫరా మరింత మెరుగ్గా జరుగుతుంది.



గాయత్రి
యోగా ట్రైనర్

న్యాయ సలహా

ముస్లిం మహిళ వీలునామా... ఎలా రాయాలి?



మేడమ్, నేను ఒక ముస్లిం మహిళను. నాకు నలుగురు పిల్లలు. అందరికీ వివాహాలు అయిపోయాయి. మాకు రెండు ఇళ్లు ఉన్నాయి. నాలుగు సంవత్సరాల క్రితం నా భర్త మరణించాక నేను... నా పెద్ద కుమార్తెతో పాటు మా రెండు ఇళ్లల్లో ఒకదాంట్లో ఉంటున్నాను. ఒక ఇల్లు అద్దెకు ఇచ్చాము. ఆ అద్దె డబ్బు వస్తుంది. కొంత మొత్తం ఫిక్స్‌డ్ డిపాజిట్ లో ఉంది. మా ఇద్దరు కొడుకులు దుబాయిలో ఉంటున్నారు. మా ఆయన చనిపోయాక రెండు ఇళ్లను నా పేర మార్చుకున్నాను. నా వయసు 65 సంవత్సరాలు. నా తరువాత ఆస్తిని నేను వీలునామా రాయవచ్చా? వీలునామా రాయాలంటే నేనేం చేయాలో తెలుపగలరు?

-ఓ సోదరి, గుంటూరు

ఇతర మతస్తులకు వర్తించినట్టుగా ముస్లింలకు భారత వారసత్వపు చట్టం వర్తించదు. ముస్లిం మతస్తుల వీలునామాకు ఎలాంటి చట్టబద్ధమైన నియమాలు కూడా లేవు. ముస్లింలలో రెండు తెగలున్నాయి. షియాలు, సున్నీలు. ఈ రెండు తెగలవారి వీలునామాలకు చాలా తేడాలున్నాయి. ముస్లింలలో ఘోషా స్త్రీలు కూడా వీలునామా చేయవచ్చును. ఘోషా స్త్రీల వీలునామాకు రుజువుభారం ఎక్కువ. ముస్లింలలో మైనర్లకు సైతం వీలునామా రాసే అవకాశం ఉంది. అయితే మైనరు అయిన వ్యక్తి మేజరు అయ్యాకే ఆ వీలునామాని ఆమోదించాల్సి ఉంటుంది. దాన్ని ర్యాటిఫై చేయాల్సి ఉంటుంది. వారసులు న్న ముస్లిం ఎవరైనా వీలునామా రాయటం జరిగితే అతనికి లేదా ఆమెకు గల ఆస్తిలో మూడింట ఒకవంతు ఆస్తిని మాత్రమే వీలునామా చేయాల్సి ఉంటుంది. మిగిలిన రెండువంతులను వారసత్వ రీత్యా చెందాల్సిన వారికి చెందేందుకు వదిలేయాలి. ఒక ముస్లిం... నికర ఆస్తిని లెక్కవేయాలంటే అతని మరణ సంస్కార ఖర్చులకు, ఇతర రుణాలకు తీసివేసి మిగిలిన దాన్నే నికర ఆస్తిగా భావించాలి. ఇతర వారసులు అంగీకరిస్తేనే వారసుల్లో కొంతమందికి ఆస్తిని ఇవ్వవచ్చును.

ముస్లింలు నోటిమాట ద్వారా కూడా వీలునామా రాయవచ్చు. ఒకవేళ వీలునామా రాతపూర్వకంగా రాసినా దానిపై ఆస్తిరాసిన వ్యక్తి సంతకం కానీ, వేలుముద్రగానీ సాక్షి సంతకం కాని ఉండాల్సిన అవసరం లేదు. ఆస్తిని సంక్రమింపచేయాలనే కోరిక ఉంటేచాలు. అందుకే ముస్లింల వీలునామాని నిరూపించడంలో ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయి. వీరు మాట్లాడలేని స్థితిలో ఉండి, సంజ్ఞల ద్వారా చేసిన వీలునామాని కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ముస్లిం విల్లు ఒక నిర్దిష్టమైన పద్ధతిలో ఉండాలని లేదు. మరణానికి ముందు ఆస్తి చెందే విధానంతో రాసిన ఉత్తరాన్ని సైతం వీలునామాగానే పరిగణిస్తారు. ముస్లింలలో కూడా వీలునామాని రద్దుచేసే (రివోక్) అవకాశం ఉంది. మరొక కొత్త వీలునామా రాస్తే...అంతకుముందు ఉన్న వీలునామా రద్దవుతుంది. ముస్లిం వీలునామా విషయంలో మరొక ముఖ్యమైన విషయం...ఎగ్జిక్యూటర్ (విల్లు రాసిన వ్యక్తి మరణించేముందు నామినేట్ చేసిన వ్యక్తి) ముస్లిం కానక్కర్లేదు. వారసులు అంగీకరిస్తే మూడింటా ఒక వంతుకంటే ఎక్కువ ఆస్తిని విల్లుద్వారా ఇవ్వవచ్చును. ఇతర వారసులు అంగీకరిస్తే...వారసుల్లోని వ్యక్తులకు కూడా వీలునామా ద్వారా ఆస్తిని ఇవ్వవచ్చును. వారసులు లేనివారు యావదాస్తిని వీలునామా రాయవచ్చును. భార్య కూడా ఒక వారసురాలిగా ఉంటే ఆమె వాటా తప్ప మిగిలిన ఆస్తి మొత్తాన్ని వీలునామా రాయవచ్చును. వీలునామా ద్వారా ముస్లింలకు, ముస్లింలు కానివారికి కూడా ఆస్తి ఇవ్వవచ్చును. మహిళలు మగవారికి ఇవ్వవచ్చు. గర్భస్థశిశువుకి కూడా ఆస్తిని ఇచ్చే అవకాశం ఉంది.



రమ్యకుమారి ఆకుల
ప్రముఖ న్యాయవాది
సెల్ : 88856 65733

చింతన

పంచగవ్య ప్రాసనతో మహాఫలం

నేడు భాద్రపద శుక్లషష్ఠి

శుక్లే భాద్రపదే షష్ఠ్యాం స్నానం భాస్కర పూజనమ్
ప్రాసనం పంచ గవ్యస్య అశ్వమేధ ఫలాధికమ్
యేయం భాద్రపదే మాసి షష్ఠీస్యాత్ భరతర్షభ
యోస్యాం పశ్యతి గాంగేయుం దక్షిణా పథ వాసినామ్
బ్రహ్మ హత్యాది పాపైస్తు ముచ్యతే నాత్ర సంశయః

అని భవిష్య పురాణంలో చెప్పబడింది.



భాద్రపద శుక్ల షష్ఠిని సూర్యషష్ఠి అని అంటారు. సప్తమితో కూడిన భాద్రపద షష్ఠిని ఆచరించాలని దివోదాసు అనే ఋషి చెప్పియున్నారు. ఈనాడు స్నానమాచరించి సూర్యభగవానుడిని పూజిం చి పంచగవ్య ప్రాసన చేస్తే అశ్వమేధయాగ ఫలం లభిస్తుంది. భాద్రపద శుక్ల షష్ఠి యందు దక్షిణాపథమున ఉన్న కుమారస్వామిని దర్శిస్తే బ్రహ్మహత్యాది పాపాలు నశిస్తాయి.

పంచగవ్యము అనగా గోమూత్రం, గోమయం, గోక్షీరం, గోవు నెయ్యి, గోవు పెరుగుల మిశ్రమం. రెండు చెంచాల గోమూత్రం, రెండు పెసరగింజలంత గోమయం, సగం గ్లాసు గోవు పాలు, పావు గ్లాసు పెరుగు, 5 చెంచాల గోవు నెయ్యి కలుపవలెను. పురోహితులు ఒక్కొక్క దానిని కలిపేటపుడు ఒక్కొక్క మంత్రాన్ని పఠిస్తారు.

యత్వగస్థి కృతం పాపం దేహే తిష్ఠతి మామకే
ప్రాసనాత్ పంచగవ్యస్య దహత్యగ్ని రివేంధనమ్

ఈ మంత్రంతో పంచగవ్యాన్ని ప్రాసనం చేయవలెను. దీని అర్థం చర్మం, ఎముకలు, నరాలతో చేసిన నా శరీరంలో ఉన్న పాపం పంచగవ్య ప్రాసనము వలన కాలి బూడిద అవ్వాలి. అగ్ని కట్టెలను కాల్చినట్లు పంచగవ్యం నా పాపాన్ని కాల్చివేయాలి.

ముక్తాభరణ సప్తమి


భాద్రపద శుక్ల సప్తమి నాడు ముక్తాభరణ వ్రతం ఆచరించాలి. దీనిని ముక్తాభరణ సప్తమిగా కూడా వ్యవహరిస్తారు. ఈనాడు ముత్యాలతో ఆభరణాలు చేసుకొని శక్తి కలవారు ముత్యములతో లక్ష్మీనారాయణుల ప్రతిమలను తయారుచేసి ఆవుపాలతో అభిషేకం నిర్వహించి షోడశోపచార పూజ చేయాలి. అనంతరం ఆ ప్రతిమలను ముత్యాలతో కూడిన దుస్తులతో, ముత్యాల ఆభరణాలతో అలకరింపచేసి సప్త ఋషులను పూజించి విశేషించి సూర్య భగవానుని ఆరాధించాలి. ఏడుగురు బ్రాహ్మణులకు శక్తి కొద్దీ ముత్యాలు, ఆభరణాలు ఇచ్చి వారికి భోజనం, మరియు దక్షిణతాంబూలాలు సమర్పించి వారి అనుమతితో ముత్యాల ఆభరణాలు ధరించి దేవాలయానికి వెళ్ళాలి. స్వామిని దర్శించి ప్రదక్షిణ చేసి నైవేద్యం తీసుకుని శక్తిఉన్నవారు రాత్రి జాగరణ చేసి సూర్యోదయంతో ఈ వ్రతాన్ని పూర్తి చేయాలి.

గజముఖ ఆంతర్యం

గణపతి ఆవిర్భావానికి సంబంధించి అందరకూ తెలిసిన కథ ఒకటుంది. జగన్మాతగా పేరొందిన పార్వతి అనుకోకుండా బొమ్మను చేసి ప్రాణ ప్రతిష్ట చేయడం, సర్వజ్ఞుడైన శంకరుడు ఆ పిల్లవాడు ఎవరో తెలియక శిరస్సును ఖండించడం, అమ్మ ప్రార్థిస్తే గజశిరాన్ని అనుసంధానం చేయడం. అయితే ఇదంతా పార్వతీ పరమేశ్వరులు అనుకుని చేసిన కార్యక్రమంలాగా అనిపిస్తుంది. శంకరుడు అర్ధనారీశ్వరుడు కావున పార్వతీ చెంతనే ఉంటాడు. అదే విధంగా శంకరుడు ఏ పని చేసినా సగభాగం పార్వతే కావున పార్వతి బొమ్మ చేసినపుడు శంకరుడు ఉన్నాడు. అలాగే శంకరుడు బాలుని శిరస్సును ఖండించినపుడు పార్వతీ చెంతనే ఉంది. ఈ కథలోని పరమార్థం లోకానికి గజముఖుడైన గణపతి కావాల్సి రావడం. అంతేకాక ఆ గజం అసుర తత్త్వం నిండిన దైవభక్తి కలదై ఉండాలి. అనగా ప్రాకృత శక్తి, అసుర శక్తి, దైవ శక్తి. ఈ మూడు సాత్విక, రాజస, తామస గుణాల పుట్టిల్లు. ఉదరంలో శంకరుణ్ని కొలువుంచుకోవాలన్న కోరిక, భగవంతుడిని తాను మాత్రమే సేవించాలి, దర్శించాలి, తననే కాపాడాలి అనే స్వార్థం అసుర గుణం. అలాగే భగవంతుడిని దాచుకోవడం ప్రాకృత గుణం. అది భగవంతుని ధ్యానంగా పరిణమించడం సాత్వికగుణం. మంగళాన్ని, శుభాన్ని కలిగించే శంకరుణ్ని ఉదరంలో దాచుకుని మరల తిరిగి ఇవ్వడంలోనే ఆంతర్యం దాగి ఉంది. **"ఉదరమంతరం కృతే అథతస్య భయుం భవతి."** అనగా జగత్తును పరమాత్మ కంటే వేరుగా ఏ కొంచెం చూచినా భయం కలుగుతుంది. భేద దృష్టి భయకారకం అని భావం. మంత్రం వల్ల భేదం తొలగి పరమేశ్వరుడు సాక్షాత్కరిస్తాడనేది గజాసుర సంహారంలోని ఆంతర్యం. గజాసురుడు తాను చనిపోయినా తన శిరస్సును లోకపూజ్యం చేయమని ప్రార్థించాడు. భగవంతుడిని ఉదరంలో దాచుకోవాలన్న తలంపు శిరస్సులో పుట్టింది కావున ఆ శిరస్సు లోకపూజ్యం అయ్యింది. ఉదరం అనగా భేదం, స్వార్థం లేదా ఆశ. వీటిని వాక్కు బలంతో అనగా మంత్రోపాసనతో తొలగించి బుద్ధిలోని దైవత్వాన్ని ఆరాధించాలి. అందువల్ల ఆ శిరస్సు సకల లోకపూజ్యం అయ్యింది.




గణపతి నవరాత్రుల ప్రత్యేకం



- డా॥ కందాడై రామానుజాచార్య

రామాయణ రచన

రామాయణ రమణీయ కావ్యాన్ని వీనుల విందుగా గానం చేయుగలవారు ఎవరా అని వాల్మీకి ఆలోచిస్తుండగా, ముని కుమార వేష ధారులైన కుశలవులు వచ్చారు. యుగళ గానంలో వారికి వారే సాటి! మార్దవమైన కంఠ స్వరంతో శ్రోతలను మంత్ర ముగ్ధులను చేయగల గాన కళా కోవిదులు, హావ భావ ప్రకటనలో సిద్ధహస్తులు, రామాయణ కథాగానానికి కుశలవులే అర్హులని వాల్మీకి నిర్ణయించాడు. 'శ్రీరామ చరితం, సీతామాత చరితం, రావణ వధ ఇందులో వర్ణించబడింది. అందువల్ల ఈ కావ్యాన్ని రామాయణం అని, సీతా చరితం అని, పౌలస్త్య వధము అని వ్యవహరింపవచ్చు' అని వాల్మీకి కుశలవులకు తెలిపాడు.



వాల్మీకి మహర్షి పవిత్రుడై, వ్రతనియతుడై దర్భాసనంపై ఆసీనుడయ్యాడు. ఆచమనం చేశాడు. నారదుడు తెలిపిన రామ కథను పునశ్చరణ చేసుకున్నాడు. తన తపో మహిమతో రహస్యాలను విశేషాలను గ్రహించాడు. రామాయణ కథా సన్నివేశాలు, వాటికి మూలాలైన రహస్యాలు స్ఫురించాయి. వాల్మీకి మనస్సు అనే గని నుంచి తవ్వే కొలది రామాయణ కథా విశేషాలు వెలువడ్డాయి. ప్రధాన సంఘటనలతో బాటు చిన్న చిన్న సంఘటనలు కూడా కన్నుల ముందు కదలాడాయి. సంపూర్ణ రామాయణం రమ్యాతిరమ్యంగా రచింపబడింది. బ్రహ్మదేవుని అనుగ్రహం వల్ల సిద్ధించిన జ్ఞానంతో, వాల్మీకి రామాయణ కథను ఆ పాతమధురంగా రచించాడు. గానానుకూలంగా మలిచాడు. కరుణ రసప్లావితమైన కావ్యంగా రూపొందించాడు. బ్రహ్మ అనుగ్రహం వల్ల భూత భవిష్యద్వర్తమా నకాలాలను కూడా దర్శించగలిగాడు. ఐదు వందల సర్గలతో, ఇరవై నాలుగు వేల శ్లోకాలతో, ఆరు కాండలుగా రామాయణాన్ని సుందర రమణీయ కావ్యంగా నిర్మించాడు. శ్రీరామ పట్టాభిషేకం తరువాత సంభవించబోయే సీతా పరిత్యాగం, అశ్వమేధయాగం అనంతర పరిణామాలను ఉత్తర కాండంగా రచించాడు.

కుశలవులు

ఈ రమణీయ కావ్యాన్ని వీనుల విందుగా గానం చేయగలవారు ఎవరా అని వాల్మీకి ఆలోచిస్తుండగా, ముని కుమార వేషధారులైన కుశలవులు వచ్చారు. యుగళగానంలో వారికి వారే సాటి! మార్దవమైన కంఠ స్వరంతో శ్రోతలను మంత్ర ముగ్ధులను చేయగల గాన కళా కోవిదులు, హావ భావ ప్రకటనలో సిద్ధహస్తులు, రామాయణ కథాగానానికి కుశ లవులే అర్హులని వాల్మీకి నిర్ణయించాడు. 'శ్రీరామ చరితం, సీతామాత చరితం, రావణ వధ ఇందులో వర్ణించబడింది. అందువల్ల ఈ కావ్యాన్ని రామాయణం అని, సీతాచరితం అని, పౌలస్త్య వధము అని వ్యవహరింపవచ్చు' అని వాల్మీకి కుశలవులకు తెలిపాడు. వాల్మీకి మహర్షి ఆశ్రమానికి వచ్చిన మునిపుంగవులు, కుశలవులు గానం చేసిన రామాయణ కథాగానాన్ని విన్నారు. అది వారి చెవులకు ఇంపు సొంపులు కల్పించింది.

సంక్షిప్త రామాయణం

వీనుల విందు చేసింది. వారి కనుల ఆనంద బాష్పాలు కురిశాయి. 'రామా యణ కథ కన్నులకు కట్టినట్లు ఉంది. కవి రచనా చాతుర్యం మహాద్భుతం. కుశలవుల గాన మాధుర్యం అద్భుతం' అని మునీంద్రులు వేనోళ్ల కొనియాడారు. మునీంద్రులు కుశలవు లకు వల్కలాలు, కృష్ణాజినం, మౌంజి, కమండలం, యజ్ఞోప వీతం, జపమాల, కౌపీనం, కాషాయ వస్త్రం ఉత్తరీయం మొద లయినవి బహూకరించారు.

కుశలవులు అయోధ్యా నగర వీధులలో ముగ్ధ మనోహరంగా, శ్రవణపేయంగా రామ కథా గానం చేశారు. వారి గాన మాధుర్యం అయోధ్యా ప్రజలను సంతోష పరవశులను చేసింది. వారి గాన మాధుర్యాన్ని గురించి విని శ్రీరాముడు వారిని రాజ భవనానికి రప్పించాడు. వారు ముద్దులొలికే పలుకులతో, నగు మోములతో తమ గాన మాధుర్యంతో శ్రీరామాది సోదరులను, కౌసల్యాది రాజమాతలను మంత్ర ముగ్ధులను చేశారు. కుశలవుల గానాన్ని విని అనందించమని శ్రీరాముడు అశ్వమేధ యాగ సందర్శకులకు చెప్పాడు. వారందరూ విని ఆనందించారు.

- కె.ఓబులేశు
9052847742

శబ్దానికి అతీతం నిశ్శబ్దం

సంస్కృతంలో మౌనం, నిశ్శబ్దం అన్నవి రెండు ముఖ్యమైన పదాలు. మౌనం అన్నది మాట్లాడకపోవడం. అది నిశ్శబ్దాన్ని సృష్టించే ఒక ప్రయత్నం. నిశ్శబ్దం అంటే శబ్ద రాహిత్యం లేదా శబ్దానికి అతీతమైనది. ఏదైతే శబ్దానికి అతీతమైనదో అది రూపానికీ, పంచభూతాల క్రీడకు అతీతమైనది. శబ్దానికి అతీతమై ఉన్నది ఈ సృష్టి మూలానికి చేరే చివరి తోవ.

శబ్దం ఒక నిర్దిష్ట వాస్తవం. కాని పదాలు అసత్యం అని వివరిస్తున్నారు సద్గురు. నిశ్శబ్ద మౌనంలోకి కరిగిపోయే ప్రక్రియకు ఉదాహరణగా ఆయన మత్స్యేంద్రనాథ్, గోరఖ్‌నాథుల జీవితాల నుండి ఒక కథను వినిపిస్తున్నారు.

పంచేంద్రియాలతో చూసే, వినే, వాసన గుర్తించే, రుచి చూసే, స్పృశించే సృష్టి అంతా ప్రతిధ్వనులు సృష్టించేది. శబ్దం ఆడే నాటకం. మనిషి మనశ్శరీరాలు కూడా ప్రతిధ్వనులే. కాని మనశ్శరీరాలు వాటికవే అంతిమ లక్ష్యాలు కావు. అవి పైపై మెరుగులే. చాలామంది ఆ తోలు దాటిపోరు. వాళ్ల జీవితమంతా ద్వారం వెలుపలే కూర్చుని గడుపుతారు. కాని ద్వారం ప్రయోజనమేమిటి? లోపలికి ప్రవేశించడం, ఆ ద్వారానికి ఆవల ఉన్న దాన్ని అనుభూతి చెందడానికి మౌనం అవసరం.


సంస్కృతంలో మౌనం, నిశ్శబ్దం అన్నవి రెండు ముఖ్యమైన పదాలు. మౌనం అన్నది మాట్లాడకపోవడం. అది నిశ్శబ్దాన్ని సృష్టించే ఒక ప్రయత్నం. నిశ్శబ్దం అంటే శబ్ద రాహిత్యం లేదా శబ్దానికి అతీతమైనది. ఏదైతే శబ్దానికి అతీతమైనదో అది రూపానికీ, పంచభూతాల క్రీడకు అతీతమైనది. శబ్దానికి అతీతమై ఉన్నది ఈ సృష్టి మూలానికి చేరే చివరి తోవ. నిశ్శబ్దం, నిర్వాణం, నిర్వికల్పం-ఒక విధంగా చూస్తే వీటన్నిటికీ అర్థమొక్కటే. నిశ్శబ్దమంటే శబ్దరాహిత్యం. నిర్వాణం అంటే రూప రాహిత్యం. నిర్వికల్పం అంటే 'కల్పం లేనిది' అంటే సృష్టికి ఆవల అని అర్థం. అది రూపం, శబ్దం రెండూ లేనిది.

మత్స్యేంద్రనాథ్, గోరఖ్‌నాథుల కథ ఒకటి ఉంది. మహాయోగి అయిన మత్స్యేంద్రనాథుని అందరూ శివుడి అవతారంగా భావిస్తారు. అంటే శివుడు మళ్లీ జన్మించాడన్న భావన కాదు. ఆయన్ని మనం అవతారం అని ఎందుకంటామంటే జ్ఞానంలోను, సామర్థ్యంలోను ఆయన శివుని కంటే భిన్నం కాదు అని. అయినా మనకు శివుడి మీద ఆసక్తి వ్యక్తిగా కాదు గదా. ఆయనకున్న లక్షణాల వల్ల. మత్స్యేంద్రనాథుడు లక్షణాలలో శివునికి చాలా దగ్గర. అందువల్ల ప్రజలు ఆయన్ను శివుడే అన్నారు. గోరఖ్‌నాథుడు ఆయనకు ప్రియశిష్యుడు. తరువాత తానే ఒక పురాణ పురుషుడయ్యాడు. దేశంలో అత్యంత ప్రసిద్ధుడైన యోగి అయ్యాడు. ఉపఖండంలో గోరఖ్‌నాథుడు అద్భుతమైన కృషి చేశాడు. భారతదేశంలో ఆయనను గురించి విననివారు ఉండరు.

ఒక పర్యాయం మత్స్యేంద్రనాథుడు, గోరఖ్‌నాథునితో కలిసి నడిచి వెళుతున్నాడు. వాళ్లు అప్పుడే చిన్నవాగు దాటారు. మత్స్యేంద్రనాథుడు ఒక చెట్టు కింద కూర్చుని, ''కాసిని నీళ్లు తీసుకురా'' అని చెప్పాడు. గోరఖ్‌నాథుడు నీళ్లకోసం పరిగెత్తాడు. గోరఖ్‌నాథుడు గురువు నీళ్లడిగారంటే అది క్షణంలో చేసేయాలనుకుంటాడు. అందువల్ల అతను పరిగెత్తాడు. అప్పుడే కొన్ని బండ్లు ఆ వాగును దాటాయి. నీళ్లు మురికయ్యాయి. అప్పుడతను మళ్లీ గురువు దగ్గరికి పరిగెత్తుకొని వచ్చాడు. ''అక్కడ నీళ్లు మురికిగా ఉన్నాయి, పదినిమిషాల దూరంలో నది ఉంది, నేనక్కడికి వెళ్లి నీళ్లు తెస్తాను'' అన్నాడు. ''వద్దు. అదేవాగులో అదే చోటి నుండి తీసుకురా'' అన్నాడు మత్స్యేంద్రనాథుడు. ''కాని అవి మురిగ్గా ఉన్నాయి'' అన్నాడు గోరఖ్‌నాథ్. ''నాకు దాహంగా ఉంది. అదే వాగులో అక్కడి నుండి నీళ్లు తీసుకురా'' అన్నాడు మత్స్యేంద్రనాథుడు.

సద్గురు బోధ

గోరఖ్‌నాథుడు మళ్లీ వాగుకు పరుగెత్తాడు. ఇంకా నీళ్లు చాలా మురికిగానే ఉన్నాయి. ఏం చేయాలో అతనికి తెలియలేదు. మళ్లీ గురువుగారి దగ్గరికి పరిగెత్తాడు. మత్స్యేంద్రనాథుడు మళ్లీ చెప్పాడు. ''నాకు ఆ వాగు నీళ్లే కావాలి'' ఏం చేయాలో తెలియక అతను మళ్లీ వెనక్కి పరిగెత్తాడు. అప్పుడు నీళ్లు కొంచెం తేరుకోవడం చూశాడు. కొంచెంసేపు ఎదురుచూశాడు. ఐదుపదినిమిషాల్లో నీళ్లు పూర్తిగా తేరుకొని స్వచ్ఛంగా తయారయ్యాయి. మహాసంతోషంతో నీళ్లు తీసికొని ఎగురుకుంటూ వచ్చాడు. గురువుగారికిచ్చాడు. మత్స్యేంద్రనాథుడు నీళ్లు పక్కన పెట్టాడు. తాగలేదు. అతనికి దప్పికలేదు. గోరఖ్‌నాథుడు ఎలాంటి వాడంటే ఒక మంత్రాన్ని పదిసార్లు జపించమంటే పదివేలసార్లు జపిస్తాడు. ఎప్పుడూ ఏదో చేస్తూనే ఉంటాడు.



అతనికి ఏం చెప్పినా ఎంతో ఉత్సాహంతో చేస్తాడు. ఎంతో చక్కగా చేస్తాడు. కాని ఇప్పుడతను మరోస్థాయికి వెళ్లవలసిన సమయం వచ్చింది. అందువల్ల మత్స్యేంద్రనాథుడొక సందేశం ఇచ్చాడు. ''నువ్వు చాలా పరిగెత్తావు. తీవ్రంగా పనిచేశావు. ఇప్పుడు సమయం వచ్చింది. కేవలం ఎదురుచూడు. అది స్ఫటికంలా స్వచ్ఛమవుతుంది.

వాస్తవానికి శబ్దం మీ మనస్సులో ఉంది. ఏ శబ్దం అవుతున్నా మీరు నిద్రపోతూ ఉంటే, అది మిమ్మల్నేమీ చేయదు. మీకేమైనా నిద్ర సమస్య ఉంటే తప్ప. ...! మీరు గాఢనిద్రలో ఉంటే శబ్దంతో ఎటువంటి సమస్యా ఉండదు. మీరు ఉత్పత్తి చేసే శబ్దాలే మీ కలుషిత బుద్ధికీ కారణం. ఈ శబ్దాలు పదాల రూపం తీసుకుంటాయి. ఆ అర్థంలేని మాటలకు మీరు అర్థం కల్పిస్తారు. కాని నేనేం చెప్తానంటే కేవలం ఎదురుచూడండి. అది మళ్లీ స్ఫటికంలా స్వచ్ఛమవుతుంది. అన్ని శబ్దాలు సన్నగిల్లిపోతే, మీరు పదాలకు అర్థాలు ఆపాదించడం మానివేస్తే, అన్నీ సమసిపోతాయి. అప్పుడంతా స్ఫటికంలా స్వచ్ఛమవుతుంది. నిశ్శబ్దమవుతుంది.

- సద్గురు జగ్గీ వాసుదేవ్

దినఫలాలు

మేష రాశి
సంబంధ బాంధవ్యాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అవమానకర సంఘటనలను నెట్టుకు రాగలుగుతారు. విద్యలో శ్రద్ధ తప్పరిసరి. వ్యాపార లావాదేవీల విషయంలో అనుకూలత గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం. ఆర్థిక చిరాకులను అధిగమిస్తారు.

వృషభ రాశి
కుటుంబ సఖ్యత పెరుగుతుంది. వ్యాపార కలహాలు తగ్గుతాయి. ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు పొందుతారు. క్రీడా విషయాల్లో పేరు, ప్రఖ్యాతలు ఉంటాయి. స్నేహితుల ద్వారా లబ్దిచేకూరుతుంది. ఆర్థిక అవకాశాలు పెరుగుతాయి.

మిథున రాశి
శత్రుభీతి తగ్గుతుంది. కోర్టు సంబంధిత విషయాల్లో విజయాలు సాధించగలుగుతారు. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. కుటుంబ విషయాల్లో ప్రోత్సాహం ఉంటుంది. విద్యావిషయాలు అనుకూలం. విదేశీ ప్రయాణాలు లాభిస్తాయి. గృహనిర్మాణ కార్యాలు వంటివి సంతృప్తిని కలిగిస్తాయి.

కర్కాటక రాశి
ఆర్థిక విజయాలు సాధించగలుగుతారు. ప్రయాణాల ద్వారా ప్రయోజనాలు సాధించగలుగుతారు. కుటుంబ విషయాల్లో అలజడులు సద్దుమణుగుతాయి. విద్యాప్రయత్నాలు ఫలిస్తాయి. కార్యక్రమాల్లో లోపాలు సవరించుకోగలుగుతారు. అసహన పరిస్థితులను అధిగమించగలుగుతారు.

సింహ రాశి
కుటుంబంలో ఆకస్మిక ఆందోళన ఉంటుంది. ఆర్థిక అసహనం తగ్గుతుంది. అంచనాలు దగ్గరవుతాయి. మిత్ర బలం పెరుగుతుంది. ఆశాజనకమయిన వాతావరణం ఆర్థికంగా కొనసాగుతుంది. ఇబ్బందికర పరిస్థితులను ప్రయత్నాలతో మాత్రమే అధిగమించగలుగుతారు.

కన్యా రాశి
వ్యయం అధికం అయినప్పటికీ ఆదాయం కూడా సమాంతరంగా ఉంటుంది. ఉద్యోగవిషయాల్లో ప్రతిభ గుర్తింపబడుతుంది. కుటుంబ చిక్కులకు పరిష్కారాలు లభిస్తాయి. వ్యాపార అభివృద్ధి కొనసాగుతుంది. కార్యకలాపాలు సజావుగా పూర్తిచేస్తారు.

తులా రాశి
తత్తరపాటు సంఘటనలు ఆర్థికంగా కొనసాగుతాయి. శారీరిక శ్రమ ఉన్నప్పటికీ, అంతిమ విజయాలు కూడా సాధించగలుగుతారు. వ్యయం పెరుగుతుంది. వేధిస్తున్న సమస్యల నుండి మాత్రం ఉపశమనం లభిస్తుంది. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి.

వృశ్చిక రాశి
అసహన పరిస్థితుల నుండి బయటకు రాగలుగుతారు. నత్తనడక కార్యక్రమాల ద్వారా పరిష్కారాలు పొందగలుగుతారు. రుణ ఒత్తిడులు పెరుగుతాయి. శ్రమ అధికమవుతుంది. విద్యార్థులు శుభవార్తలు వింటారు.

ధనూ రాశి
సంబంధ బాంధవ్యాలు లాభిస్తాయి. ఒడిదుడుకులను తట్టుకోగలుగుతారు. గృహంలో ప్రతికూల పరిస్థితులు తగ్గుతాయి. కోర్టు వ్యవహారాల్లో అసహన పరిస్థితులు ఉంటాయి. స్థిరాస్తి విషయాల్లో జాగ్రత్తలు పాటించాలి. మెరుగైన మార్పులు విద్యపరంగా మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మకర రాశి
కుటుంబ రీత్యా క్రమశిక్షణ తప్పనిసరి. పిల్లల విషయంలో ఆనందకర సంఘటనలు ఉంటాయి. శుభప్రయత్నాలు లాభిస్తాయి. అభివృద్ధి వ్యాపారం పరంగా ఉంటుంది. గృహ విషయాల్లో ఏర్పడిన సమస్యలకు పరిష్కారాలు పొందగలుగుతారు.

కుంభ రాశి
అవమానాలని అనుకూలంగా మరల్చుకోగలుగుతారు. చిరుసమస్యలు ఆర్థికంగా కొనసాగుతాయి. అయినప్పటికీ నిలదొక్కుకోగలుగుతారు. విద్యావిషయాలు అనుకూలం. కుటుంబ సఖ్యత తగ్గుతుంది. స్నేహితుల సహాయ సహకారాలు లోపిస్తాయి.

మీన రాశి
ఉద్యోగప్రయత్నాలు ఫలిస్తాయి. ఆర్థిక విషయాల్లో ఆశాజనకమయిన వాతావరణం ఉంటుంది. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఉద్యోగ విషయాల్లో సమస్యలను మెల్లమెల్లగా అధిగమించగలుగుతారు. అభివృద్ధి ఆర్థికంగా ఉంటుంది. స్నేహితుల ద్వారా ఏర్పడిన సమస్యలు పరిష్కరించబడతాయి.

28.8.2017, సోమవారం

మేష రాశి
వ్యాపార ఒప్పందాలు అనుకూలం. వాహనకొనుగోళ్లు వంటివి లాభిస్తాయి. విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. వ్యాపార కార్యాలలో ఆనందకర సంఘటనలు చోటుచేసుకొంటాయి. గృహవిషయాల్లో చిరు ఇబ్బందులు ఏర్పడతాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది.

వృషభ రాశి
విదేశీ లావాదేవీలు, సంభాషణలు ఉపకరిస్తాయి. కోర్టు వ్యవహారాలు, ప్రక్రియలు అనుకూలం. ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. ఆర్థిక లావాదేవీలుఉపకరిస్తాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి.

మిథున రాశి
ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. విద్యా ప్రయత్నాలు అనుకూలం. దూర ప్రయాణాలు ఆశించిన ప్రయోజనాలను కలిగిస్తాయి. గృహవిషయాలు అనుకూలం. కుటుంబవ్యవహారాల్లో, ఆరోగ్యంలో శ్రద్ధ తప్పనిసరి. కోర్టు వ్యవహారాల్లో విజయాలు సాధించగలుగుతారు.

కర్కాటక రాశి
ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. గృహ సంబంధిత కార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. వ్యాపారలావాదేవీలు కలసి వస్తాయి. దూరప్రయాణాలు లాభిస్తాయి. ఆనందకర పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. శత్రుభీతి పోతుంది. మానసిక ధైర్యం పెరుగుతుంది.

సింహ రాశి
విద్యా ప్రయత్నాలు అనుకూలం. దూరప్రయాణాల ద్వారా ఆశించిన ప్రయోజనాలు సిద్ధిస్తాయి. నూతన ఒప్పందాలు ఊరట కలిగిస్తాయి. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. ఆరోగ్య పరీక్షలు ఉపకరిస్తాయి. ఆర్థిక వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి.

కన్యా రాశి
ఆర్థికలావాదేవీలు ప్రోత్సాహాన్ని కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలు, ప్రక్రియలు, సంభాషణలు అనుకూలం. వ్యాపార విస్తరణలు కలసి వస్తాయి. స్వతంత్ర నిర్ణయాలు లాభిస్తాయి. స్థిరాస్తి ప్రతికూల పరిస్థితులు ఇంకా కొనసాగుతాయి. ఆరోగ్యంలో శ్రద్ధ తప్పనిసరి. వ్యాపారంలో పోటీ పెరుగుతుంది. ఆదాయంలో అనుకూల మార్పులు ఉంటాయి.

తులా రాశి
వ్యాపార ఒప్పందాలు అనుకూలం. వాహన కొనుగోళ్లు వంటివి లాభిస్తాయి. విద్యాప్రయత్నాలు అనుకూలం. విదేశీ లావాదేవీలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. వ్యయం పెరుగుతుంది. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. ఆదాయంలో లాభాలకోసం చేసే ప్రయత్నాలు అనుకూలం.


వృశ్చిక రాశి
విదేశీ లావాదేవీలు ఉప కరిస్తాయి. గృహ విషయాల్లో ప్రోత్సాహం ఉంటుంది. విద్యావిషయాల్లో మెరుగైన పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి. ఉద్యోగ ప్రతిబంధకాలు తొలగిపోతాయి. కోర్టు వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో అనుకూల పరిస్థితులు.

ధనూ రాశి
విద్యా ప్రయత్నాలు అనుకూలం. వ్యాపార నిర్ణయాలలో పురోగాభివృద్ధి ప్రయత్నంతో మాత్రమే సాధ్యం. గృహకార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. గృహంలో ప్రశాంత పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది.

మకర రాశి
ప్రయాణాల విషయాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక లావాదేవీలు కలసి వస్తాయి. ఆరోగ్య ప్రతిబంధకాలు తొలగుతాయి.ఆదాయం ప్రయత్నాలతో సాధ్యం .

కుంభ రాశి
నూతన వాహన కొనుగోళ్లు సంతృప్తిని కలిగిస్తాయి. ఆరోగ్యవిషయంలో జాగ్రత్తలు పాటించాలి. అవమానకర సంఘటనలు ఉన్నా నెట్టుకురాగలుగుతారు. ఆకస్మిక ఆరోగ్య ఆందోళన ఉంటుంది. విజయాలు అన్ని రంగాల వారికి గట్టి ప్రయత్నాలు ద్వారానే దగ్గరవుతాయి.

మీన రాశి
సంబంధ బాంధవ్యాలు కలసి వస్తాయి. ఆర్థిక లావాదేవీలు కలసి వస్తాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. విద్యావిషయాల్లో ఆటంకాలు ఉన్నా నెట్టుకురాగలుగుతారు. కోర్టు వ్యవహారాల్లో ఆందోళనలు తగ్గుతాయి. ముఖ్యమైన పనులు విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com





రెండవ ప్రపంచ సంగ్రామ సమయంలో బ్రిటీషువారు 'వార్‌ఫండ్' కోసం తెలుగు నాటకాలు అన్ని ప్రాంతాలలో ఆడించి ధనం వసూలు చేసేవారు. ఆ రకంగా కొంత నాటక కళాపోషణ జరిగింది. ఆనాడు నిజాం సంస్థానం తెలుగు ప్రాంతాలలో కలెక్టర్లు, తహసీల్దారుల పలుకుబడి ఉపయోగించి నాటకాలు వేయించి ధనం ఆర్జించేవారు.

సంస్కృతి

వెలుగు దారుల్లో నడిచిన తెలంగాణ నాటకం

భారతదేశంలో సంస్కృతం దేవభాష, రాజాస్థానాలకు, పండితులకు, ముఖ్యంగా పరిమితమైంది. వాల్మీకి వ్యాసాదులు వేదతుల్యమైన రచనలు చేసి వాఙ్మయ మార్గదర్శకులైనారు.

'కవి కాళిదాసు' అనే వాదు ఉంది. ఆ మహాకవి భారతాంర్గత శాకుంతలోపాఖ్యానికి మార్పులు చేసి ''అభిజ్ఞాన శాకుంతలమ్'' అనే విశ్వవిఖ్యాత నాటకాన్ని రాశాడు.

నన్నయాది కవులు, నాటకాల జోలికి పోలేదు. శ్రీనాథ పోతనలు, అల్లసాని పెద్దనాది అష్టదిగ్గజ కవులూ అంతే. పిల్లల మర్రి పినవీరభద్ర కవి శాకుంతలాన్ని ''శృంగార శాకుంతలం'' పేర కావ్యమే రాశాడు.

ఆధునిక ఆంధ్ర వాఙ్మయ నిర్మాత, తెలుగు సాహిత్య శాఖలు వెలయింప జేసిన కీర్తి అభినవ తిక్కన, కందుకూరి వీరేశలింగం గారికే దక్కింది.

ఆయన అభిజ్ఞాన శాకుంతలాన్ని చక్కని తెలుగు నాటకంగా రూపుదిద్దారు. ఆ పని వేదం వేంకటరాయశాస్త్రి గారు కూడా చేశారు. కాని కందుకూరి వారి రచనలోని మాధుర్యం గొప్పగా ఉంది. మహానటుడు యడవల్లి సూర్యనారాయణగారు దుష్యంతుడిగా, గాయక శిరోమణి అద్దంకి శ్రీరామమూర్తిగారు కణ్వుడిగా వాడవాడలా ఆ నాటకం ప్రదర్శింపబడి ఎంతో కీర్తిని, కవికి, నటులకు తెచ్చిపెట్టింది.

ఆంధ్ర నాటక పితామహుడిగా గద్వాలలో గౌరవింపబడిన ధర్మవరం రామకృష్ణమాచార్యుల వారు 'విషాద సారంగధర' 'చిత్ర నళీయం', మొదలైన నాటకాలు రాశారు. ఆయన సహజంగా నటుడు, న్యాయవాది విశ్వవిఖ్యాత నటుడు బళ్లారి రాఘవాచారి ఆయన మేనల్లుడు. 'సారంగధర'' నాటకం రాఘవ, యడవల్లి రాజరాజనరేంద్రులుగా, యడవల్లి, బందా కనకలింగేశ్వరరావు, సి.ఎస్.ఆర్. ఆంజనేయులు సారంగధరులుగా పులిపాటి వేంకటేశ్వర్లు, సుబుద్ధిగా వీరి మధ్య మహానటుడు స్థానం నరసింహారావు, చిత్రాంగిగా నటించి ఆ నాటకానికి, తమకు, నాటకానికి ఎనలేని కీర్తి తెచ్చిపెట్టారు. గద్వాల, వనపర్తి మొదలైన చోట్ల ఆ నాటకం ఘనంగా ఆదరింపబడింది.

రామకృష్ణమాచార్యుల వారి తమ్ముడు, హైదరాబాద్‌లో న్యాయవాది. ధర్మవరం గోపాలాచార్యులు వారు 'భద్రాచల రామదాసు', 'గోలుకొండ నవాబు తానీషా కథ', 'భక్త రామదాసు' అనే గొప్ప నాటకం రాశాడు. కబీరు రామదాసుల సంభాషణలు, కబీరు పాటలు ఉర్దూలో ఉన్నాయి. రాఘవ, యడవల్లి, సి.ఎస్.ఆర్. రామదాసులుగా జొన్నవిత్తుల శేషగిరిరావు, పర్వతరెడ్డి, రామచంద్రారెడ్డి, ఘంటసాల రాధాకృష్ణయ్య, మద్దూరి బుచ్చన్న శాస్త్రి, చిత్తూరి నాగయ్య గార్లు కబీరు పాత్రలను సుసంపన్నం చేశారు.రామదాసు నాటకం గద్వాల, వనపర్తి మొదలైన తెలంగాణా ప్రాంతాలలో ప్రదర్శింపబడేది. భారతదేశంలో నిజాం సంస్థానం పెద్దది. దేశంలో ఉన్న అన్నిభాషలు మాట్లాడేవారు ఇక్కడ ఉన్నారు. అయితే ప్రధాన భాషలు, తెలుగు, మహారాష్ట్ర, కన్నడం. హైదరాబాద్ మహానగరం తెలుగు ప్రాంతంలో ఉన్నా అధికార భాష ఉర్దూ కావటం వల్ల అందరూ ఉర్దూ మాట్లాడటానికే అలవాటు పడ్డారు. అది అధికార భాష అందరికీ వాడుక భాష.

తెలుగు త్రిలింగ దేశాల భాష. అవి మూడు ప్రాంతాలు, అవి తీరప్రాంతం, రాయలసీమ ప్రాంతం. తెలంగాణా ప్రాంతంగా వున్నాయి. పూర్వం మూడు ప్రాంతాలు నిజాం ఏలుబడిలోనే. కాలక్రమేణా బ్రిటీషువారి హస్తగతమైనాయి.

నిజాం సంస్థానం సరిహద్దులలో తెలుగు ప్రాంతాలున్నచోట నాటక ప్రభావం



ఉంది. నాటి వరంగల్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలలో నాటక ప్రభావం ఉంది. బెజవాడ,మైలవరం కంపెనీలోగాని, దుర్గా కళామందిరంలో గాని నాటకం ఉందని తెలిస్తే హైదరాబాద్ సంపన్నులు, నాటకాభిమానులు రైలు మీద అక్కడికి వెళ్లి చూసి వచ్చేవారు. రెండవ ప్రపంచ సంగ్రామ సమయంలో బ్రిటీషువారు 'వార్‌ఫండ్'కోసం తెలుగు నాటకాలు అన్ని ప్రాంతాలలో ఆడించి ధనం వసూలు చేసేవారు. ఆ రకంగా కొంత నాటక కళాపోషణ జరిగింది. ఆనాడు నిజాం సంస్థానం తెలుగు ప్రాంతాలలో కలెక్టర్లు, తహసీల్దారుల పలుకుబడి ఉపయోగించి నాటకాలు వేయించి ధనం ఆర్జించేవారు. ఆ కారణంగా నాటకాలు చూడటం వల్ల కొంత అభిరుచి కలిగి యువనటులు సమాజాలు ఏర్పాటు చేసి నాటకాలు ప్రదర్శించి, నాటి వరంగల్ జిల్లా మధిర ప్రాంతంలో రామదాసు, పాండవోద్యోగ విజయాలు నాటకాలు ఆడేవారు. ఎర్రుపాలెం సమీపంలో ఉన్న గ్రామాలలో మామునూరు నాగభూషణరావు రామదాసుగా, కృష్ణుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు.

మామునూరు కిషన్‌రావుకు కృష్ణుడిగా మంచిపేరు ఉంది. బనిగెండ్ల పాటి నారాయణరావు కర్ణు డిగా, శీలం వెంకటరెడ్డి అర్జునుడిగా పేరుపొందారు. వారికి దేవరకొండ సీతారామయ్య అనే ఉపాధ్యాయుడు గొప్పగా హార్మోనియం వాయించేవాడు. అయితే ఆహార్యం బెజవాడ నుంచి తెచ్చుకోవలసి వచ్చేది. ఆ నాటకాలు గొడ్లపాకల్లో వేసేవారు.

ఆరోజుల్లో బెజవాడ మైలవరం కంపెనీలో సతీసావిత్రి, సతీ సక్కుబాయి, హరిశ్చంద్ర, చింతా మణి, పాండవోద్యోగ విజయాలు, రంగూన్‌రౌడీ మొదలైన నాటకాలు ఆడుతూ ఉండేవారు.

హైదరాబాద్ బ్యాంక్ స్ట్రీటులో డాక్టర్ కూచిభట్ల శివరామకృష్ణయ్య అనే మంచి నటుడుండేవారు. ఆయన తరువాత సినిమాలకు వెళ్లారు. ఆయన రామదాసు, కర్ణుడు, పాత్రలు ధరిస్తూ ఉండేవాడు. ఆర్.టి.సి.లో సతీసావిత్రి నాటకకర్త శ్రీరాముల సచ్చిదానంద శాస్త్రిగారి కుమారుడు ఉండేవారు. ఆయన కబీరు, సక్కుబాయిలో యోగి వేషం వేసేవారు. వి.వి. స్వామి అనే అతను సత్యభామ, చింతామణి వంటి స్త్రీ పాత్రలకు,కాళిదాసులో కాళుడి పాత్రకు పెట్టింది పేరు. అభినయం సంగీతంలో అందెసిన చేయి, సూరిబాబు అనే నటుడు ఉండేవాడు. అతని కృష్ణ పాత్ర ప్రశంసనీయంగా ఉండేది. రాయప్రోలు సుబ్బయ్య శ్రీకృష్ణతులాభారంలో, సతీసక్కు బాయిలో శ్రీకృష్ణ పాత్రకు పెట్టింది పేరు. అందంగా ఉండేవాడు. ఆడి, పాడి అందరినీ మెప్పించే వాడు. ఆర్.టి.సి. యూనియన్ లీడర్ వై.వి.రావు., ఎస్.రామస్వామి మంచి నటులు. భాగి నారాయణమూర్తిగారు అధికారి అయి వుండి కూడా నటనలో ఆసక్తి చూపించి ఎంతో నాటకసేవ చేశారు.

మారెళ్ల ప్రసాదరావు 'రామదాసు'కు పెట్టింది పేరు. తరువాత ఆయన కబీరు, ధర్మరాజు, కర్ణుడు మొదలైన పాత్రలు ధరించేవాడు. రైల్వేలో బాబూరావు కృష్ణపాత్రకు ప్రసిద్ధి. పెంటయ్య భీముడు, ములుగు రామలింగం అర్జునుడు, శ్రీపతిరావు, కర్ణుడు, శివలెంక రాజేశ్వరరావు (స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్) ధర్మరాజు పాత్రకు పెట్టింది పేరు. ఆయన హార్మోనియం కూడా వాయించేవాడు.

కాచిగూడలో పెద్ద ఇల్లు, ఖాళీస్థలము కూడా ఉండి కొత్త నల్లకుంట వాస్తవ్యులైన ఎమ్మే.బి.ఇడి చేసి విద్యాధికులైన తిరుమల శేషాచార్యుల వారు నటుడు, ప్రయోక్త దర్శకుడు, వీరి కాచిగూడ ఇల్లు నాట్యకళామందిరం. సాయంత్రానికల్లా నాటక



కళాభిమానులు ఆయన కాచిగూడ ఇంటికి వచ్చేవారు. ఆయన జననం 1914 సం. అందరికన్నా పెద్దవాడు. ఆరోజుల్లో ఆయన మాటకు చాలా విలువ వుండేది. నటులను ఆదరించి అభిమానించేవాడు. శేషాచార్యుల వారు తమ బృందంతో పాండవోద్యోగ విజయాలు (కృష్ణుడు) శ్రీకృష్ణతులాభారం(నారదుడు) వరవిక్రయం (సింగరాజు లింగరాజు) గయోపాఖ్యానం(కృష్ణుడు) కాళిదాసు (కాళిదాసు) ఇందులో వి.వి.స్వామి కాళుడు వేసేవారు. ఈ మహనీయుడు తెలంగాణాలో చాలా ప్రాంతాల్లో అనేక నాటకాలు వేయించేవారు. శేషాచార్యుల వారికి 'బందా', 'సియస్సార్' 'అబ్బూరి' మొదలైనవారంటే వల్లమాలిన అభిమానం. ఆయన వద్ద కృష్ణఅనే గొప్ప హార్మోనిస్టు, భుజంగ్ అనే గొప్ప తబలిస్టు, నటుడు వి.వి.స్వామి ఆయనను అంటిపెట్టుకొని ఉండేవారు. వీరందరికీ మేకప్ చేయటం వచ్చు. శేషాచార్యుల వారు ఒకసారి నాటకానికి గుంటూరు గుళ్లపల్లి ఆదిశేషయ్యగారిని మేకప్‌కు పంపించమని అడుగగా అది సకాలంలో అందని కారణంగా ఆయన వెంటనే మదరాసు నాదముని కంపెనీకి వెళ్లి మంచి కిరీటాలు, ఆభరణాలు, డ్రస్సులు తీసుకొని వచ్చారు. దానికి ఆయన ఆదర్శ డ్రెస్ ప్యాలెస్, అని తన నాట్యమండలికి ఆదర్శ నాట్య కళాపరిషత్ అని నామకరణం చేశారు.

(తరువాయి భాగం వచ్చేవారం)

- అయ్యదేవర పురుషోత్తమరావు
9290448444

కన్యాశుల్కం ప్రదర్శనకు 125 ఏళ్లు

తెలుగు సాహిత్యంలో అగ్రభాగాన నిలిచేది 'కన్యాశుల్కం' నాటకం. అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ అప్పారావు రచన 'కన్యాశుల్కం' నాటక ప్రదర్శన 125 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రప్రభుత్వం జాతీయ ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈనెల 26న ప్రారంభమైన ఈ ఉత్సవాలు నేడు కూడా కొనసాగుతాయి. ఈ ఉత్సవాలకు విశాఖపట్నం వేదిక కానుంది. ఈ నాటికను తొలిసారి 1892లో ప్రదర్శించారు. ఈ ఏడాదికి సరిగ్గా 125 ఏళ్లు పూర్తి చేసుకుంది. కన్యాశుల్కం ఉత్సవాలకు భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకారం అందిస్తుండగా మోజాయిక్ సాహిత్య సంస్థ సమన్వయం చేయనుంది. కన్యాశుల్కం జాతీయ ఉత్సవాల ప్రారంభానికి ముందురోజు 25న విజయనగరంలోని గురజాడ నివాసంలో రజత ఫలకం ఏర్పాటు చేస్తారు. ఉత్సవాలు జరిగే రెండు రోజులు విశాఖపట్నంలో సదస్సు నిర్వహిస్తారు. సదస్సులలో ఒడిషా, బెంగాల్, అసోం నుంచి వక్తలు ఆయా భాషల్లో 'కన్యాశుల్కం' సమకాలీన రచనలపై ప్రసంగిస్తారు. తెలుగు సాహితీ ప్రముఖులతో కలిసి ఒకే వేదికను పంచుకుంటారు. ఈ నాటకం, అందులోని పాత్రల గురించి ప్రతి ఒక్క తెలుగువారికి తెలుసు అని చెప్పడంలో అతిశయోక్తి ఏమీ ఉండదనుకుంటాను. స్త్రీ విద్య ఆవశ్యకతను వివరిస్తూ బాల్యవివాహాలను నిరసిస్తూ గురజాడ తన పదునైన కాలాన్ని ఆనాడే ఎక్కుపెట్టారు. అప్పటి సాంఘిక దురాచారాలను తరిమికొట్టేందుకు రచనలనే ఆయుధంగా చేసుకుని నవ చైతన్యాన్ని తీసుకు వచ్చారు. తెలుగువారి గుండెల్లో చెరగని ముద్రవేశారు. ఇందులో తెలుగు వాతావరణ మానవ స్వభావాలు, ముఖ్యంగా తెలుగు జీవితం ఉంది. విలువలకు భ్రష్టుపట్టిన తీరును చక్కగా ఆవిష్కరించారు. నాటి సమాజాన్ని పట్టిపీడిస్తున్న కన్యాశుల్కం అంశం లోతులను సృజించిన నాటకం ఇది. హేయమైన మానవ నైజాలూ-వేశ్యల జీవితాలు-న్యాయవాదుల వ్యవహారశైలి-కుహనా మేధావులు-గిరీశం లాంటి మోసగాళ్ళు-చిన్నపిల్లను ముసలివారికి ఇచ్చి పెళ్లి చేయడంలో కొద్దిరోజులు, నెలలకే వారు చనిపోవడంతో జీవచ్ఛవాల్లా జీవించే బాలవితంతువుల బతుకు చిత్రం, అప్పటి సామాజిక స్థితిగతులకు దర్పణం ఇది. కథలోని వస్తువు, పాత్రల చిత్రీకరణ, భాష, సంభాషణా చాతుర్యం వల్ల ఇది ఆధునిక నాటక సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. రైతుల



కడగండ్లను చిత్రిస్తూ దీనబంధు మిత్రా బెంగాలీలో రాసిన నీల్ దర్పన్ ఆధునిక భారతీయ నాటకాల్లో తొలినాటకం కాగా, రెండో ఆధునిక నాటకం కన్యాశుల్కం. సమాజం నుంచి కన్యాశుల్కం దురాచారం పోయినా ఆ పేరుతో గురజాడ వారి నాటకం మిగిలింది. ఆ పాత్రలు తెలుగువారు మరచిపోలేనివి. భారతీయ నాటకరంగంలో ఇన్నేళ్లు మనుగడ సాగించిన నాటకం ఇది ఒక్కటే. 125ఏళ్లు చరిత్ర కలిగిన ఏకైక నాటకం కన్యాశుల్కం కావడం తెలుగువారిగా మనం గర్వించదగ్గ అంశం. సాధారణంగా తొమ్మిది గంటల నిడివి గల కన్యాశుల్కం నాటక రూపాకాన్ని మూడున్నర గంటలకు సంక్షిప్తం చేసి తొలిసారిగా విశాఖ వుడా ఆడిటోరియంలో పదర్శించనున్నారు. కన్యాశుల్కం సావనీర్‌ను ప్రచురిస్తారు. అలాగే ఈ ఉత్సవాలలో లఘు సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు సాహిత్య, నాటకరంగ కృషీవలురకు గౌరవ సన్మానాలు చేస్తారు.

-శిరందాసు నాగార్జున

తార్కికులలో తార్కికుడు ఆదిభట్ల నారాయణ దాసు



31ఆదిభట్ల నారాయణదాసు జయంతి

'సంగీత సాహిత్య సార్వభౌమ', 'లయబ్రహ్మ' 'పంచముఖీ పరమేశ్వర', 'పుంభావ సరస్వతి' ఆట, పాట మాట, మీటలమేటి 'హరికథా పితామహ' ఇత్యాది బిరుదులెన్నో ఆదిభట్ల నారాయణ దాసు కీర్తి కిరీటంలో వెలకట్ట లేని రత్నాలుగా పొదగబడ్డాయి.

నారాయణదాసు ఒక అపూర్వ, మహోన్నత వ్యక్తి.

సంస్కృతాంధ్ర భాషలలోనే కాక ఆంగ్లం, పారశీకం, అరబిక్ భాషల లో కూడా అసమాన పాండిత్యం గడిం చారు.

దాసుగారు అచ్చతెనుగుకు అశ్వత్థ వృక్షం. గంధర్వ గాయకుడు. సకల కళా పారం గతుడు. క్రాంత దర్శికుడు. మహా తాత్వికుడు, తార్కి కులలో తార్కి కుడు. వైయాకరుణులలో వైయాకరణి. కవులలో కవి. గాయకులలో గాయకుడు. నటులలో నటుడు. ప్రధానంగా హరిభక్తుడు. ఇలా ఎన్నో దాసుగారి ధీదితి గురించి చెప్పుకోవచ్చును.

నారాయణదాసు గారికి తెలుగు భాషంటే అపరిమిత మైన అభిమానము. తెలుగు భాష గొప్పతనాన్ని గురించి చెబుతూ ''మొలక లేతదనము తవిరుల నవకంబు/ మొగ్గ సోగదనము పూవుతావి/తేనె తీయదనము తెనుగనకే గాక/ పరుష సంస్కృతాఖ్య భాషకేది?'' అని తీర్పు చెప్పారు.

ఇన్ని భాషలు, ఇన్ని కళలు సొంతం చేసుకున్నా ఎవరి వద్దా పట్టుమని పదిరోజులు విద్యనభ్యసించలేదు. అనితర సాధ్యమైన ఈ పాండిత్యాన్నంతా ఎలా గడిం చారో దాసుగారి మాటల్లోనే 'నాల్గేండ్ల యీడున నాకెల్ల చదువులబ్బె తమంతనే నరసిన కొలది, నే బొట్టు లయకాడ, నే మాటకాడ, నాటపాటల మేటిన నిపిం చుకొంటి నాకెదురులేదిక నేనాడునైన, వేల మందికి విన్పించు నాగొంతు''అంటూ తన వ్యక్తిత్వ విశిష్టతను నిర్ద్వందంగా చాటి చెప్పారు.

పలురంగాలలో మేటియైన దాసుగారి ప్రధాన కర్మక్షేత్రం హరికథాగానం. ఆదిభట్ల నారాయణ దాసుగారు విజయన గరం జిల్లా బొబ్బిలి సమీపాన అజ్జాడ గ్రామంలో ఆగస్టు31, 1864న లక్ష్మీ నరసమాంబ, వెంకట చయనులకు జన్మిం చారు. పూవు వికసించగానే పరిమళాలు వెదజల్లుతుం దన్న ట్లు,దాసుగారు పిన్న వయస్సులోనే మహామేధావిగా గుర్తింపు పొందారు. దాసుగారి సంగీత సాహిత్య గరిమను అవలోకిస్తే వారు త్యాగరాజును సంగీత సాహిత్యాలలో తలన్నే వారనిపి స్తుందం టారు విజ్ఞులు. అలాగే సాహిత్యంలో, కథా కథనంలో కాళిదాసుకు దీటైన వారంటారు సంస్కృత పండితులు. అయినా దాసుగారు హరిభక్తినే నమ్ముకున్నారు. తమ జీవితాన్ని హరిగుణగానానికే అంకితం చేశారు. ఒక సందర్భంలో చెళ్ళపిళ్ల వేంకటశాస్త్రిగారు దాసుగారి గురించి చెబుతూ ''వారు పరమభక్తులు. ప్రహ్లాద, నారద, పరాశర, పుండ రీక, వ్యాస, అంబరీష, శుక, శౌనకాది పరమభాగవతులు శ్రేణికి చెందిన వార'' న్నారు. సంగీత, సాహిత్య, నృత్యములలో ఇంత టి వ్యుత్పత్తిని స్వాధీనము చేసుకున్న వారుం డరన్నది వాస్తవం. తమ సర్వశక్తులను భగవ దర్పణం చేసిన పరమ భాగవతోత్తములు దాసుగారు. భగవంతునికంటే వేరే గురువెవ్వరూలేరని తన అంతరంగాన్ని తాము రచించిన భక్తమార్కండేయ హరికథ లో స్పష్టంగా చెప్పారు. నారాయణ దాసుగారి పేరు తలచగానే 'హరికథ' గుర్తుకు వస్తుంది. ముఖ్యంగా ఆంధ్రదేశంలో హరికథకు సుస్థిరస్థానం, గౌరవాన్ని నెలకొల్పి సత్సంప్రదాయాన్ని స్థాపించిన ఘనత నారాయణ దాసుగారికే చెందుతుంది. ఒకప్పుడు సినీమాలు లేని కాలంలో మైకులు సంగతే తెలియని రోజుల్లో నవరసాలను జోడిస్తూ, పండుగలలో, పర్వదినాలలో నవరాత్రి ఉత్సవాలలో సాయంత్రపు సమయాలలో సుమారు మూడు, నాలుగు గంటల కాలం పాటలతో, పద్యాలతో, నృత్యంతో కథలో వచ్చే ఆయా సన్నివేశాలలో, ఆయా పాత్రల కనుగుణంగా హావ,భావ నటనాచా తుర్యాన్ని ప్రదర్శిస్తూ చెప్పిన హరికథాగానాన్ని ఒక అపూర్వమైన దృశ్యనాటకంగా నాటి శ్రోతలు పరిగణించేవారని చెబుతారు.

నారాయణదాసుగారు ఆజానుబాహుడు. పచ్చని మేనిఛాయ. 'శంభో' అని గళం విప్పితే ఆమడదూరం వినిపించేదట. ఉత్తమ సంగీత, సాహిత్య శాస్త్రవిజ్ఞానము, లలిత కళా కౌశలమును ప్రదర్శిస్తూ, గంభీర గాత్రం, కాలిగజ్జెల ఘలంఘలలు, గంగాతరంగాల శబ్దాలకు వలె ఆంధ్రదేశంలోనే కాక, యావద్భారత దేశ రసజ్ఞులను ఉఱ్ఱూతలూగించింది. దాసుగారు చిన్ననాటనే హరికథా రచనకు శ్రీకారం చుట్టి 'ధృవ విజయం' రచించి, విజయనగరంలో వేణుగోపాలస్వామి మఠం లో హరికథాగానం చేసి, తన ఆట,పాట, మాటలతో ఆకట్టుకు న్నారు. తదాదిగ నారాయణ దాసుగారు యదార్ధ రామాయణం లోని ఇతివృత్తాలను ఆధారంగా చేసుకుని రాసిన కథలు, రుక్మిణీ కళ్యాణం, భక్త అంబరీష, భక్తమార్కండేయ, ప్రహ్లాద చరిత్ర, భీషమ్మ చరితం, గజేంద్రమోక్షం, శ్రీకృష్ణకథామృతం (సంస్కృతం లో రాసిన హరికథ) ఇలా ఎన్నో హరికథలను తెలుగు సంస్కృత భాషలలో రచించారు. అచ్చతెనుగు భాషలో దాసుగారు రచించిన ''గౌరప్ప పెండ్లి'' పండితపామరులచే ఎంతగానో కొనియా డబడింది.

ఒకసారి, ఒకచోట హరికథను ప్రారంభిస్తూ ''నేనిప్పుడు చెప్పబోవు కథ'' అని దాసుగారన్నారో లేదో, ఒక కొంటె కుర్రాడు లేచి ''హరి కథా? గిరికథా?'' అని అరిచాడు. దాసుగారు ''నీకే కథ కావాలి?'' ఏదికావాలంటే అదే చెబుతాను. ఏ కథ చెప్పమంటావే?'' అని గద్దించారు. కొంటె కుర్రాడు దాసుగారిని ఏడిపిద్దామని 'గిరి కథ' కావాలన్నాడు. ''సరే! నీ కోరిక ప్రకారం గిరకథనే చెబుతాను'' అంటూ ప్రారంభించారు. హనుమంతుడి దగ్గర కుప్పిగంతులు? దాసుగారు గళం సవరించుకుని అప్పటికప్పుడు ఆశువుగా 'గోవర్ధనగిరి' కథను అత్యద్భుతంగా చెప్పి శ్రోతలను సంభ్రమా శ్చర్యాల లో ముంచెత్తారు. ఇది వారి ప్రతిభకు గీటురాయి.

నారాయణదాసుగారి హరికథాగానంతో సమ్మోహితులైన పలు సంస్థానాలు ఘనంగా సత్కరించాయి. బరంపురంతో ప్రారంభించి, రాష్ట్రంలోనే కాక, ఇతర రాష్ట్రాలలో కూడ ఘనసత్కా రాలను, బిరుదులను పొందేరు. దాసుగారి ప్రతిభమైసూరు రాజదర్బారుకు చేరింది. మైసూరు రాజాస్థానంలో వీరి ప్రతిభకు ముగ్ధులైన మైసూరు సంస్థానాధీశులు. వీరిని రాజాస్థానంలో విద్వాంసునిగా నియమించదలిచారు. దాసుగారు సున్నితంగా తిరస్కరించడంతో దాసుగారిని గజారోహణం చేయించి వీణను బహూకరించారు. ఈవార్త నాటి పత్రికలలో ప్రముఖంగా ప్రచురించడంతో, విజయనగర సంస్థానాధీవులు, అపరభోజులు ఆనందగజపతి మహారాజు తానప్పుడే నెలకొల్పిన మహారాజా గానకళాశాలలో ప్రధానాచార్యులుగా నియమించడంతో పాటు, తమ ఆస్థాన విద్వాంసునిగా నియమించి సత్కరించారు. 1919 నుంచి 1936 వరకు సంగీత కళాశాలను బహుముఖీనంగా తీర్చిదిద్దారు నారాయణ దాసుగారు. దక్షిణ భారతదేశంలో తమ హరికథా గానంతో వినువీధులలో ఎగురవేసిన జయపతాకం, కలకత్తాలో తిలకించిన రవీంద్రనాథ్ ఠాగూర్‌ను మురిపించింది. ఠాగూరు ఆహ్వానంపై అక్కడకు వెళ్లి ఆయన సమక్షంలో సంస్కృతంలో ''శ్రీకృష్ణజననం'' హరికథాగానం చేస్తూ తానే హిందీలో అనువదించగా విన్న ఠాగూరు ముగ్ధులై ''ఈ విలక్షణమైన గాన విధానాన్ని ఎక్కడ నేర్చుకున్నార''ని పస్తుతించారు. దాసుగారు మంత్ర, తంత్ర శాస్త్రాలలో, జ్యోతిషశాస్త్రంలో, వ్యాకరణంలో, ఆయుర్వేదంలో నిష్ణాతులు. కొన్నిటిపై అపూర్వ మైన శాస్త్రరచనలు చేశారు. ఇలా శ్రీనారాయణ దాసుగారి గురించి ఎంతైనా వ్రాయవచ్చు. ఆ మహామేధావి, సకల విద్యా పారంగతుడు. సరస్వతీ దరస్మిత చతురాశనుడు. సంగీత సార్వభౌముడు. సాహిత్య ద్రష్ట అన్తర్ద్రష్ట విశ్లేషించి హరికథా పితామహునికి కైమోడ్పులు.

ఎ.సీతారామారావు
8978799864

రొమేనియాలో స్పైడర్ చిత్రీకరణ


మహేష్‌బాబు

సూపర్‌స్టార్ మహేష్‌బాబు నటిస్తున్న తాజా చిత్రం స్పైడర్. ఎ.ఆర్. మురుగదాస్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఠాగూర్ మధు, ఎన్.వి.ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తిచేసుకున్న స్పైడర్ కోసం బ్యాలెన్స్ ఉన్న ఓ పాటని రొమేనియాలో చిత్రీకరిస్తున్నారు. ఈనెల 25న చిత్రీకరణ ప్రారంభించారు. ఆరు రోజుల పాటు చిత్రీకరిస్తారు. తెలుగు, తమిళ భాషల్లో సెప్టెంబర్ 27న విజయదశమి కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు.

మహేష్‌బాబు, రకుల్‌ప్రీత్ సింగ్, ఎస్.జె.సూర్య ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం హేరిస్ జైయరాజ్, ఛాయాగ్రహణం సంతోష్ శివన్, ఫైట్స్ పీటర్ హెయిన్స్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం ఎ.ఆర్.మురుగదాస్.

సోషియో ఫాంటసీ కథతో శరభ


జయప్రద
చిరంజీవి


ఏకేఎస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై దర్శకుడు యన్ నరసింహారావు రూపొందిస్తున్న చిత్రం 'శరభ'. ఆకాష్ కుమార్, మిస్త్రీ చక్రవర్తి జంటగా నటిస్తున్నారు. జయప్రద ప్రత్యేక పాత్రలో కనిపించనుంది. అశ్వనీ కుమార్ సహదేవ్ నిర్మాత. 'శరభ' మోషన్ పోస్టర్ ను మెగాస్టార్ చిరంజీవి విడుదల చేశారు. చిరంజీవి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. మోషన్ పోస్టర్ విడుదల అనంతరం చిరంజీవి మాట్లాడుతూ...' జయప్రద నాకు కుటుంబ సభ్యురాలు. పోస్టర్ విడుదలకు రావాలని అడిగింది. నేను మా ఇంటికే రండని ఆహ్వానించాను. 'శరభ' చిత్రంలో కొన్ని సన్నివేశాలు చూపించారు. చాలా బాగున్నాయి. సోషియో ఫాంటసీ కథ అని చెప్పారు. అలా చెప్పగానే నేను నటించిన 'జగదేక వీరుడు అతిలోక సుందరి' చిత్రం గుర్తొచ్చింది. జయప్రద తన నటనతో ఆకట్టుకుంది. ఆమె చేసిన కొన్ని సన్నివేశాలు ఆశ్చర్యపరిచాయి. యువ జంట ఆకాష్, మిస్త్రీ బాగున్నారు. దర్శకుడు తక్కువ మాట్లాడుతున్నాడు కాబట్టి...ఎక్కువ పనిచేసి ఉంటాడు. సాంకేతిక వర్గం తమ ప్రతిభ చూపించారు. సినిమా బాగుంటుందనే నమ్మకం కలిగింది. యూనిట్ అందరికీ శుభాకాంక్షలు.' అన్నారు. జయప్రద మాట్లాడుతూ...'చాలా విరామం తర్వాత తెలుగులో నటిస్తున్నాను. ఎన్నో కథలు విన్నాను. కానీ అవి ఆకట్టుకోలేదు. ఈ చిత్రంలో నటించాలి అనిపించింది. మెగాస్టార్‌ను ఇప్పటిదాకా ఏమీ అడగలేదు. పోస్టర్ విడుదలకు అడగ్గానే ఒప్పుకున్నారు. మేం కలిసి నటించాం. నేను ఆయన నాయికను. మాది చాలా దగ్గరి స్నేహం. 'శరభ' ప్రేక్షకులకు నచ్చే అన్ని అంశాలతో ఉంటుంది.' అన్నారు. దర్శకుడు నరసింహారావు మాట్లాడుతూ...'దైవశక్తికీ, దుష్టశక్తికీ మధ్య జరిగే పోరాటమే ఈ కథ. మెగాస్టార్ అభిమానిని. ఆయన తన సినిమా 'జగదేక వీరుడు అతిలోక సుందరి' తో మా చిత్రాన్ని పోల్చడం గర్వంగా అనిపిస్తోంది. సోషియో ఫాంటసీతో చిత్రం సాగుతుంటుంది. చిత్రం పూర్తయింది. త్వరలో విడుదల చేస్తాం.' అన్నారు. హీరో ఆకాష్ కుమార్, నాయిక మిస్త్రీ చిరంజీవికి కృతజ్ఞతలు తెలిపారు. నెపోలియన్, నాజర్, పునీత్ ఇస్సార్, తనికెళ్ల భరణి, ఎల్బీ శ్రీరామ్, షాయాజీ షిండే, పృథ్వీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ - రమణ సాల్వ, ఎడిటింగ్ - కోటగిరి వెంకటేశ్వరరావు, సంగీతం - కోటి, ఆర్ట్ - కిరణ్ కుమార్, ఫైట్స్ - రామ్ లక్ష్మణ్

పౌరాణిక చిత్రంలో వెంకటేష్!

తెలుగు సినిమా ముఖచిత్రం మారింది. రెగ్యులర్ కథా చిత్రాలకు కాలం చెల్లింది. ప్రయోగాలు, ఫాంటసీ, గ్రాఫిక్స్ వంటి సాంకేతిక సహకారంతో కొత్త కొత్త కథలు తెరమీద ఆవిష్కరమవుతున్నాయి. బాహుబలితో జానపద, గౌతమిపుత్ర శాతకర్ణి, రుద్రమదేవి చిత్రాల ద్వారా చారిత్రక కథా చిత్రాల నిర్మాణానికి మళ్ళీ ఊతం వచ్చింది.

చిరంజీవి తన 151వ చిత్రంగా స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితకథతో సినిమా చేస్తున్నారు. మహానటి సావిత్రి జీవిత చరిత్ర తెరకెక్కుతోంది.

మరోవైపు కాకతీయ వీరనారి రుద్రమదేవి చిత్రాన్ని అందించిన దర్శకుడు గుణశేఖర్ తన కొత్తచిత్రం కోసం కసరత్తు చేస్తున్నారు. హిరణ్యకశిపుడు చిత్రాన్ని తీసే యత్నంలో ఉన్నట్టు తెలిసింది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఏకకాలంలో నిర్మించతలపెట్టే ఈ భారీ చిత్రంలో రానా టైటిల్ పాత్రని చేస్తారని సమాచారం. ఇదే చిత్రంలో సీనియర్ హీరో వెంకటేష్ ఓ ప్రధాన పాత్రని చేస్తున్నారని తెలిసింది. మూడు పదుల కెరీర్ పూర్తిచేసుకున్న వెంకటేష్ ఇంతవరకు పౌరాణిక పాత్ర చేయలేదు. ఈ కారణంగా ఆయన అంగీకరించినట్టు ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ సినిమా సంబంధించి అధికారిక సమాచారం రావాల్సి ఉంది.



దారి మార్చి చేసిన చిత్రమిది


అల్లరి నరేష్
నిఖిలా విమల్

అల్లరి నరేష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మేడమీద అబ్బాయి'. నిఖిలా విమల్ నాయికగా నటించింది. ప్రజిత్ దర్శకత్వం వహించారు. జాహ్నవి ఫిలింస్ పతాకంపై బొప్పన చంద్ర శేఖర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. 'మేడమీద అబ్బాయి' ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా అల్లరి నరేష్ మాట్లాడుతూ...'ఇన్నాళ్లూ నేను వెళ్తున్న దారిని మార్చుకుని చేసిన చిత్రమిది. కొత్త కథతో వినూత్నంగా కనిపించేలా ప్రయత్నించాను. ఏళ్లపాటు ఒకే తరహా చిత్రాలు చేసి నాకూ విసుగొచ్చింది. మరోసారి కెరీర్ ప్రారంభించాలి అనే భావం కలిగింది. దానికి రూపమే ఈ చిత్రం. వాస్తవానికి ఈ నిర్మాత చంద్రశేఖర్ తొలి చిత్రం సమయంలోనే మీతో సాధారణ సినిమా వద్దు...ఏదైనా భిన్నంగా ప్రయత్నిద్దాం అన్నారు. ఆయనకు తొలి సినిమా కాబట్టి సాహసం చేయొద్దని నేనే చెప్పాను. కామెడీ థ్రిల్లర్ అంశాలు జోడించిన చిత్రమిది. మంచి సినిమా చేశామని నమ్మకంగా చెబుతున్నాను. సెప్టెంబర్ 8న మీ ముందుకొస్తున్నాం.' అన్నారు. నిర్మాత బొప్పన చంద్ర శేఖర్ మాట్లాడుతూ...'నరేష్ నటించిన అల్లరి,ప్రాణం, గమ్యం, శంభో శివ శంభో, ఈ నాలుగు సినిమాలు కలిస్తే ఎలా ఉంటుందో...మేడమీద అబ్బాయి అలా ఉంటుంది. తప్పకుండా అన్ని రకాల ప్రేక్షకులను అలరిస్తుంది.' అన్నారు.

ఈ కార్యక్రమంలో గేయ రచయిత విజయ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత ఎంఎస్ కుమార్, హాస్య నటుడు హైపర్ ఆది పాల్గొన్నారు.



విడాకులు మంజూరు చేయాలని కోరారు. రెండు సంవత్సరాలుగా విచారణకు హాజరుకానీ సుదీప్ కొద్ది రోజుల క్రితం తన మనసు మార్చుకున్నారు. కూతురు శాన్వి కోసం భార్యతో కలిసి ఉంటడానికి అంగీకరించారు.

కూతురు కోసం మనసుమార్చుకున్న సుదీప్

విడిపోవాలనుకున్న జంట మనసు మార్చుకుంది. కూతురు కోసం కలిసి ఉండాలని నిర్ణయించుకున్నారు. ఈగ ఫేమ్ సుదీప్ తెలుగువారికి సుపరిచితుడే. కన్నడ భాషలో స్టార్ హీరో హోదా ఉన్న సుదీప్‌కు 14 సంవత్సరాల క్రితం ప్రియ అనే మలయాళ యువతితో వివాహం జరిగింది. వీరికి కూతురు పేరు శాన్వి.

రెండేళ్ళ క్రితం సుదీప్, ప్రియ మధ్య మనస్పర్థలు తలెత్తాయి. దాంతో 2015లో బెంగళూరు ఫ్యామిలీ కోర్టు మెట్లు ఎక్కారు. తమ వివాహాన్ని రద్దు చేసి, దీనికి ప్రియ సైతం సమ్మతించింది. ఈ నిర్ణయాన్ని ఫ్యామిలీ కోర్టుకు తెలియజేశారు. వారి నిర్ణయాన్ని కోర్టు స్వాగతించింది. పిటీషన్ కొట్టివేసింది. ఈ విషయాన్ని గురువారం ఇరువురి లాయర్ మీడియాకు వెల్లడించారు. సుదీప్, ప్రియ తమ వైవాహిక బంధాన్ని కొనసాగించడానికి నిర్ణయించుకున్నట్టు తెలిపారు. కొద్ది నెలల క్రితం నటి రంభ విషయంలో కూడా ఇలాగే జరిగింది. తొలుత భర్త నుండి విడాకులు కోరిన రంభ ఆ తర్వాత మనసు మార్చుకుని, భర్తతో ఉండడానికి సమ్మతించడం జరిగింది.

ప్రేమిక పాటల విడుదల



తనీష్, శృతి యుగళ్

తనీష్, శృతి యుగళ్ జంటగా నటించిన చిత్రం 'ప్రేమిక'. దేశాల లక్ష్మయ్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మహేంద్ర దర్శకుడు. దిలీప్ బండారి సంగీతాన్ని అందించిన 'ప్రేమిక' పాటల విడుదల కార్యక్రమం హైదరాబాద్ రావినారాయణ రెడ్డి ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి పలు వురు సినీ రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఆడియో విడుదల అనంతరం చిత్ర సమర్పకులు ఎస్వీఎన్ రావు మాట్లాడుతూ...'గ్రామీణ నేపథ్యంలో సాగే ప్రేమ కథ ఇది. అమ్మాయిలతో ఉండాలంటే ప్రేమిస్తే సరిపోద్దని కొందరు యువకులు భావిస్తుంటారు. కానీ పోషించాలంటే డబ్బు కావాలనే విషయం తెలుసుకున్నాక..వాళ్ల ఆలోచనలు మార్పులు వస్తాయి. ప్రేమలో, జీవితంలో ఈ యువత ఎలా గెలిచారన్నది కథలో చూపిస్తున్నాం.' అన్నారు. చిత్ర దర్శకుడు మహేంద్ర మాట్లాడుతూ...'ఇది నా మొదటి చిత్రం. మంచి కథతో మీ ముందుకొస్తున్నాను. నిర్మాత సహకారం మర్చిపోలేను. మొత్తం యూనిట్ అందరికీ కృతజ్ఞతలు.' అన్నారు. నిర్మాత దేశాల లక్ష్మయ్య మాట్లాడుతూ....'చిన్న చిత్రంగా కాదు పెద్ద సినిమాగానే భావించి నిర్మించాం. రాత్రి పగలు తేడా లేకుండా కష్టపడి సినిమాను పూర్తి చేశాం. సెప్టెంబర్ 8న తెరపైకి తీసుకొస్తాం.' అన్నారు. కథానాయకుడు తనీష్ మాట్లాడుతూ...'మహేందర్ కథ చెప్పినప్పుడు ఇంత మంచి కథ చెప్పినట్లు చేయగలడా అని సందేహం కలిగింది. నా కెరీర్‌లో గొప్ప కథను అందించిన దర్శకుడికి కృతజ్ఞతలు. సాంకేతిక వర్గం, నటీనటులు ఒక్కటిగా శ్రమించి సినిమా చేశాం.' అన్నారు.

దర్పణం షూటింగ్ ప్రారంభం

తనిష్క్ రెడ్డి, అలెక్సియస్, సుభాంగి పంత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'దర్పణం'. శ్రీ సిద్ధి వినాయక ప్రొడక్షన్స్ పతాకంపై ప్రవీణ్ కుమార్ యాదవ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రామకృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. 'దర్పణం' షూటింగ్ ప్రారంభోత్సవం హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో జరిగింది. ఈ కార్యక్రమానికి రచయిత శివ శక్తిదత్తా, దర్శకులు శ్రీనివాస రెడ్డి, ఎన్ శంకర్, నటుడు కాదంబరి కిరణ్ కుమార్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు తొలి సన్నివేశానికి క్లాప్ నిచ్చారు. చిత్ర ప్రారంభోత్సవ అనంతరం నిర్మాత ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ...'దర్పణం నా మొదటి చిత్రం. కథ ఎంతగానో నచ్చింది. మంచి ప్రేమ కథ. ప్రతి యువతీ యువకులు తమను కథలో చూసుకుంటారు. సింగిల్ షెడ్యూల్‌లో చిత్రాన్ని పూర్తి చేయాలని అనుకుంటున్నాం.' అన్నారు.

ఈ చిత్రానికి సంగీతం - సిద్ధార్థ్ సదాశివుని, సినిమాటోగ్రఫీ - సతీష్ ముత్యాల, స్టంట్స్ - మల్లేష్, ఎడిటర్ - ఈఎస్ ఈశ్వర్, సహ నిర్మాతలు - కేశవ్ దేశాయ్, క్రాంతి కిరణ్ వెల్లంకి.


తనిష్క్ రెడ్డి, అలెక్సియస్, సుభాంగీ పంత్

మహిళా శక్తిని చాటేలా అనగనగా ఒక దుర్గ


ప్రియాంకా

ప్రియాంకా నాయుడు ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'అనగనగా ఒక దుర్గ'. ప్రకాష్ పులిజాల ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. గడ్డంపల్లి రవీందర్ రెడ్డి సమర్పణలో రాంబాబు నాయక్ 'అనగనగా ఒక దుర్గ' సినిమాను నిర్మించారు. సమాజంలో మహిళలపై చూపుతున్న అసమానతలను ప్రశ్నించనుందీ చిత్రం. అమ్మాయిలపై జరుగుతున్న దాడులను ఎదిరించే యువతి కథే 'అనగనగా ఒక దుర్గ'. ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు 'అనగనగా ఒక దుర్గ' ప్రీమియర్ షో లకు హాజరవుతున్నారు. రామానాయుడు స్టూడియోలో జరిగిన ప్రదర్శనకు మంత్రి జగదీశ్వర్ రెడ్డి అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్ర నాయక్, దర్శకుడు ఎన్ శంకర్, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. దర్శకుడు ప్రకాష్ పులిజాల మాట్లాడుతూ...'ప్రతిఘటన, ఒసేయ్ రాములమ్మ లాంటి చిత్రాల స్ఫూర్తితో 'అనగనగా ఒక దుర్గ' సినిమాను తెరకెక్కించాను. ఎంత అభివృద్ధి జరుగుతున్నా..సమాజంలో స్త్రీల పట్ల అసమానతలు తొలగడం లేదు. ఆడపిల్ల పుడితే అమ్ముకునే పరిస్థితులు ఇంకా చూస్తున్నాం. అసలు తప్పు ఎక్కడ జరుగుతుందనే అంశాన్ని ఈ చిత్రంలో ప్రశ్నిస్తున్నాం. మహిళలపై జరిగే దాడులను ఎదిరించే శక్తిలా దుర్గ పాత్ర ఉంటుంది.' అన్నారు. నిర్మాత రాంబాబు నాయక్ మాట్లాడుతూ...'చిన్నప్పటి నుంచి కళలంటే ఇష్టం. సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవాడిని. జాతీయ స్థాయిలో పలు ఛారిటీ కార్యక్రమాలు చేశాం. ఈ క్రమంలో సామాజిక అంశాలతో చిత్రాలను నిర్మించాలని భావించాను. మహిళా సమస్యలపై 'అనగనగా ఒక దుర్గ' రూపకల్పన చేశాం. ప్రదర్శనకు వచ్చిన మంత్రి జగదీశ్వర్ రెడ్డి గారికి కృతజ్ఞతలు. త్వరలో మా చిత్రాన్ని తెరపైకి తీసుకొస్తాం.' అన్నారు. మంత్రి జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...'సందేశాత్మక చిత్రాలు చేయడం ఒక సాహసం. అలాంటి సాహసం ఈ చిత్ర దర్శక నిర్మాతలు చేస్తున్నారు. సినిమాను వినోదంగా చూసే ప్రేక్షకులను సందేశంతో మెప్పించాలి. అలా చేసిన చిత్రాలకే ఆదరణ దక్కుతుంది. 'అనగనగా ఒక దుర్గ' చూశాను. బాగుంది. ప్రేక్షకులను ఆలోచింపజేస్తుంది. దర్శకులు ఇలాంటి స్ఫూర్తివంతమైన సినిమాలు చేయాలని కోరుకుంటున్నా.' అన్నారు.